
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 17 | సంచిక: 210

సోమవారం 21-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శభాష్ రిత్విక్

కెరీర్‌లో తొలి ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్ నెగ్గిన హైదరాబాద్ ప్లేయర్ -14లో



కుటుంబానికి బీమా ధీమా..

టర్మ్‌ప్లాన్‌తో మెరుగైన రక్షణ. ఇందులో కూడా పలు రకాలు, రైడర్లు -15లో



71 మంది సిట్టింగ్‌లకు చాన్స్

మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం 99 మంది అభ్యర్థులతో బీజేపీ ఆదివారం తొలి జాబితా విడుదల చేసింది.

వివరాలు 6లో ▸



బంధుప్రీతి, బుజ్జగింపు

బంధుప్రీతి రాజకీయాలే ప్రతిపక్షాల విధానం అని ప్రధాని మండిపడ్డారు. వారణాసిలో పలు ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.

వివరాలు 6లో ▸



యుద్ధానికి సిద్ధంగా ఉండండి

తైవాన్ ఆక్రమణకు చైనా సిద్ధమవుతోంది. యుద్ధానికి సిద్ధంగా ఉండాలని సైన్యానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో ▸



ముష్కరుల కాల్పుల్లో ఏడుగురి మృతి

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై ఒక వైద్యుడు, ఆరుగురు కార్మికులను ఉగ్రవాదులు కాల్చి చంపారు.

వివరాలు 6లో ▸

ఆదుర్దా.. ఆందోళన..

గ్రూప్–1 మెయిన్స్‌పై పట్టువీడని సర్కారు, అభ్యర్థులు

- వాయిదా కోసం అభ్యర్థులు, నిరుద్యోగుల డిమాండ్.. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం
- తమకు అన్యాయం జరుగుతుందంటూ మళ్లీ రోడ్డెక్కిన అభ్యర్థులు
- అశోక్‌నగర్ చౌరస్తాలో ఆందోళన.. వారు ప్రెస్‌మీట్ పెట్టకుండా అడ్డుకున్న పోలీసులు
- గాంధీభవన్ ముట్టడికి అభ్యర్థుల ప్రయత్నం.. అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- అభ్యర్థులకు బాసటగా ప్రతిపక్షాలు.. వాయిదా వేస్తే నష్టమేంటనే ప్రశ్నలు



- అన్యాయం జరగకపోతే ఆందోళనలను ఎందుకు అణచివేస్తున్నారన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- భేషజాలకు పోకుండా వాయిదా వేయాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్
- ఎవరికీ నష్టం జరగదని టీపీసీసీ చీఫ్‌గా భరోసా ఇస్తున్నానన్న మహేశ్‌గౌడ్
- పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన టీజీపీఎస్సీ
- పరీక్షల వాయిదాపై పిటిషన్‌ను నేడు విచారించనున్న సుప్రీంకోర్టు

"మేం రాజకీయాలకు అతీతం.. మా చివరి అవకాశాన్ని వృథా చేయకండి. ఆర్థికంగా, మానసికంగా నష్టపోయి ఉన్న మా బాధ వినండి. పరీక్షలు వాయిదా వేయండి"..

– ఇదీ నిరుద్యోగ అభ్యర్థుల ఆవేదన

"అంతా సవ్యంగానే ఉంది. జీవో 29 విషయంలో గానీ, మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థుల విషయంలోగానీ నిరుద్యోగులకు ఎలాంటి నష్టం లేదు. అపోహలకు పోకుండా పరీక్షలు రాయండి. అన్ని ఏర్పాట్లు చేశాం"..

– ఇదీ పరీక్షలు నిర్వహించేయాలన్న ఆదుర్దాలో రాష్ట్ర ప్రభుత్వం సూచన.

సాక్షి, హైదరాబాద్: .. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల విషయంలో ఇరుపక్షాలు పట్టువీడని పరిస్థితి. పరీక్షలను వాయిదా వేయాల్సిందే నంటూ నిరుద్యోగులు, అభ్యర్థులు ఓ వైపు ఆందోళనలను కొనసాగిస్తుండగానే.. మరో వైపు పరీక్షల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసేసింది. జీవో 29 కారణంగా రిజర్వుడ్ కేటగిరీల వారికి నష్టం జరుగుతుందని అభ్యర్థులు మొత్తుకుంటుంటే.. అలాంటిదేమీ లేదంటూ ప్రభుత్వం ముందుకెళుతోంది. ఎట్టి పరిస్థితుల్లో పరీక్షలు వాయిదా వేయాల్సిందేనంటూ ఆదివారం నిరుద్యోగులు, అభ్యర్థులు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ చౌరస్తాలో బైఠాయించినా.. గాంధీభవన్ ముట్టడికి ప్రయత్నించినా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఆందోళన చేస్తున్నవారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. కనీసం అభ్యర్థులు ప్రెస్‌మీట్ పెట్టి తమ ఆవేదన చెప్పుకొనేందుకు కూడా అనుమతించలేదు.

ప్రతిపక్షాల మద్దతుతో..

ఆందోళన తెలుపుతున్న అభ్యర్థులు, నిరుద్యోగులకు ప్రతిపక్షాలు

మిగతా 2వ పేజీలో ▶

నిరుద్యోగులు రోడ్డెక్కితే.. అణచివేస్తారా?

- జీవో 29పై అనుమానాలున్నాయి.. వాటిని నివృత్తి చేయాల్సిందే
- కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందేంటి? ఇప్పుడు చేస్తున్నదేంటి?

2లో

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

రిజర్వుడ్ కేటగిరీలకు నష్టం జరగదు

- విద్యార్థుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలను ప్రతిపక్షాలు మానుకోవాలి
- బీఆర్‌ఎస్ హయాంలో ఎన్ని గ్రూప్–1 ఉద్యోగాలిచ్చారో చెప్పాలి

2లో

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

నేటి నుంచి గ్రూప్–1 మెయిన్స్

- 27వ తేదీ వరకు వరుసగా నిర్వహణ
- పోస్టులు 563, హాజరుకానున్న 31,383 మంది అభ్యర్థులు

2లో

అశోక్‌నగర్‌లో మళ్లీ ఉద్రిక్తత

గొప్ప పనుల కోసం రిస్క్ తీసుకోవాలి

లేకుంటే కొన్ని సాధించలేం.. ఐఎస్‌బీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

- ధైర్యం, త్యాగంతోనే గొప్ప నాయకులు తయారవుతారు
- ప్రజలతో నేరుగా సంబంధం ఉంటేనే సేవ చేయగలుగుతారు
- ప్రభుత్వంలో రెండు మూడేళ్లు పనిచేయాలని ఐఎస్‌బీ విద్యార్థులకు పిలుపు
- గొప్ప జీతాలు ఇవ్వలేక పోయినా లక్ష్యాలు, సవాళ్లు ఇస్తానని వ్యాఖ్య



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఎంత గొప్ప నాయకుడికైనా ధైర్యం ముఖ్యం. తెలివి తేటలు, నైపుణ్యం, కష్టపడి పనిచేసే తత్వంతో పాటు కొన్నిసార్లు అదృష్టం కలసి రావాలి. గొప్ప పనులు చేయడానికి రిస్క్ తీసుకోవాలి. రిస్క్ తీసుకోకుండా కొన్ని సాధించలేం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో లీడర్‌షిప్ ఇన్ ఇండియా అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రేవంత్ మాట్లాడారు. తాను రాజకీయాలు, జీవితం ద్వారా నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నానని చెప్పారు. కాంగ్రెస్ అద్భుత రాజకీయ వారసత్వాన్ని కలిగి ఉందని.. ప్రధానంగా మహాత్మా గాంధీ, పండిట్ నెహ్రూ, పటేల్, ఇందిరా గాంధీ, పీవీ, మన్మోహన్‌ల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. 'గొప్ప నాయకులు త్యాగాలకు సిద్ధంగా ఉంటారు. ధైర్యం, త్యాగంతోనే గొప్ప నాయకులుగా తయారవుతారు. విజయం సాధిస్తారు. ఈ పోరాటంలో

మిగతా 3వ పేజీలో ▶

సమీక్షలు పూర్తి.. నిర్ణయమే తరువాయి

- జీవో 317పై సీఎంకు తుది నివేదిక ఇచ్చిన మంత్రివర్గ ఉపసంఘం.. స్థానికత ఆధారంగా ఉద్యోగుల కేటాయింపుపై కీలక సూచనలు
- స్పౌజ్, మ్యూచువల్, అనారోగ్య సమస్యల కేటగిరీ దరఖాస్తులకు త్వరలో మోక్షం!

- వివరాలు 2లో



న్యూస్‌రీల్

ఫోర్ బ్రదర్స్ కోసమే ఫ్యూచర్ సిటీ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన నలుగురు సోదరుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫ్యూచర్ సిటీ నాటకం ఆడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

- వివరాలు 3లో▶

ఇందిరమ్మ ఇళ్ల అర్హులను తేల్చనున్న యాప్



ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తుదారుల్లో ఎవరు అర్హులు..ఎవరు కాదు అన్న విషయాన్ని ఓ యాప్ తేల్చనుంది. అర్హత ఉంటే దరఖాస్తు ప్రాసెస్ ముందుకు సాగుతుంది..లేకుంటే డిలీట్ అవుతుంది.

- వివరాలు 5లో▶


హైదరాబాద్–వరంగల్ మధ్య ఎలక్ట్రిక్ బస్సులు



రాష్ట్రంలో త్వరలో దశలవారీగా 86 ఎలక్ట్రిక్ బస్సులను వరంగల్–హైదరాబాద్ మధ్య నడపనున్నారు. అందులో దాదాపు 50 వరకు ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులు ఉండనుండగా మిగతావి డీలక్స్, సెమీ డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉండనున్నాయి.

- వివరాలు 5లో▶

గతి తప్పుతున్న రుతుపవనాలు



వర్షపాతం, ఉష్ణోగ్రతలపై వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లో ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌పై వీటి ప్రభావం ఎలా ఉందన్న దానిపై క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ సమగ్ర అధ్యయనం చేసింది.

- వివరాలు 6లో▶

ఇదండీ సంగతి



సార్! మా విమానానికి ఇంకా బెదిరింపు రాలేదు! వచ్చేదాకా ఉండాల్నా.. వెళ్లాలా!!

ఈవీఎంల హ్యాకింగ్ చాలా సులభం

ఫిలడెల్ఫియా ఎన్నికల సభలో టెక్ దిగ్గజం ఎలన్ మస్క్ పునరుద్ఘాటన

- ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ వాడుతుంటే అది మరింత సులభం.. ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్లు మాత్రమే వినియోగించాలి
- టెక్నాలజీని ఇష్టపడే సాంకేతిక నిపుణుడిగా ఈ మాట చెబుతున్నానని వ్యాఖ్య



సాక్షి, అమరావతి: ఈవీఎంలను (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు) చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చని టెక్ దిగ్గజం, టెస్లా అధినేత ఎలన్ మస్క్ పునరుద్ఘాటించారు. పారదర్శకత కోసం బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని మరోసారి గట్టిగా సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంతో ఇష్టపడే నిపుణుడిగా తాను ఈ మాట చెబుతున్నట్లు స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ తరఫున ప్రచారం నిర్వహిస్తున్న ఎలన్ మస్క్ రెండు రోజుల క్రితం

మిగతా 12వ పేజీలో ▶

ఇదేమి రాజ్యం బాబూ?

చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్

శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు దారుణ వైఫల్యం

బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు

రాష్ట్రంలో రోజూ ఏదో ఒకచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు



- బద్వేలులో విద్యార్థినిపై పెట్రోలు పోసి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం.. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉంది

- 12లో

ఇదేం కమిషన్?

విద్యా కమిషన్ సలహా మండలి సభ్యుల అసంతృప్తి

- అసలు విధులేమిటో చెప్పనేలేదు.. సమాచారమే లేదు..
- ఎవరికి సలహాలివ్వాలి? ఏమివ్వాలి?
- కమిటీలో చేరబోమని చెప్పేందుకు సిద్ధమైన సలహాదారులు.. అధికారాల్లేని కమిషన్‌లో ఒరగబెట్టేది ఏమిటనే అభిప్రాయం
- విద్యా కమిషన్ చైర్మన్‌లోనూ అసంతృప్తి!



సాక్షి, హైదరాబాద్: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ తొలిదశలోనే వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయాల్సిన కమిషన్‌ను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి. విద్యా కమిషన్ కోసం ఏర్పాటు చేసిన సలహా మండలి సభ్యులు ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు ఎలాంటి హేతుబద్ధత లేకుండా, తమను సంప్రదించకుండానే సభ్యులుగా చేర్చారని కొందరు సభ్యులు మండిపడుతున్నారు. సలహా మండలిలో చేరేదే లేదని ఇప్పటికే ఇద్దరు సీనియర్

మిగతా 3వ పేజీలో ▶

'విద్యుత్' కమిషన్ దూకుడు

కరెంటు చార్జీల పెంపు దిశగా అడుగులు

- విద్యుత్ సంస్థల పిటిషన్లపై నేటి నుంచి బహిరంగ విచారణలు షురూ
- రూ.963 కోట్ల జెన్‌కో ట్రూఅప్ చార్జీలపై నేడు, రూ.16,346 కోట్ల ట్రాన్స్‌కో ఏఆర్‌ఆర్ ప్రతిపాదనలపై రేపు విచారణ
- ఈ ఏడాది రూ.1,200 కోట్ల మేర చార్జీల పెంపుపై 23, 24న విచారణ.. ఈ నెల 29న ఈఆర్సీ పదవీకాలం ముగింపు ముందే వెలువడనున్న కీలక నిర్ణయాలు



సాక్షి, హైదరాబాద్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేలా రాష్ట్ర విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన 9 వేర్వేరు పిటిషన్లపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) సోమవారం నుంచి వరుసగా ఐదు రోజుల పాటు బహిరంగ విచారణలు నిర్వహించనుంది. మండలి చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్యల ఐదేళ్ల పదవీకాలం ఈ నెల 29తో ముగియనుండగా, ఈలోపే ఆయా పిటిషన్లపై ఈఆర్సీ కీలక నిర్ణయాలను తీసుకోనుంది. నిర్దేశిత గడువుకి

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

పరీక్షలను రీషెడ్యూల్ చేయండి

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ఉద్యోగాల కోసం ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు నష్టం కలిగేలా రూపొందించిన జీవో 29ను వెంటనే ఉపసంహరించుకోవాలని, గ్రూప్–1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెల్లవారితే పరీక్ష అని తెలిసి కూడా అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారంటే.. వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని లేఖలో కోరారు. నిరుద్యోగులను కుటుంబ సభ్యులుగా భావించి, వారి డిమాండ్ మేరకు మార్పులు చేయాలన్నారు. జీవో 29 వల్ల 5,003 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు అనర్హులయ్యారని.. 563 పోస్టులకు గుండుగుత్తగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడం అన్యాయమని సంజయ్ పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో అర్హత సాధించిన రిజర్వ్‌డ్ అభ్యర్థులను.. రిజర్వ్ కేటగిరీలో చేర్చడం అన్యాయమని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని స్పష్టం చేశారు. పరీక్షలను రీషెడ్యూల్ చేయని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తుండటాన్ని గుర్తించాలని లేఖలో కోరారు. అసలు రిజర్వేషన్లనే రద్దు చేస్తున్నారన్న చర్చకు ఈ జీవో దారితీసిందని పేర్కొన్నారు.

నేడు రాష్ట్రానికి జస్టిస్ ఘోష్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. నెలాఖరు వరకు ఆయన హైదరాబాద్‌లో ఉండి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను కొనసాగించనున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, రిటైర్డ్ అధికారుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఈ దఫా ఆయన పూర్తిచేసే అవకాశం ఉంది. తర్వాతి దఫాలో ఆయన గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులను విచారించే అవకాశం ఉంది. మరోవైపు కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించే అవకాశం ఉంది.

ముగిసిన భారత్ ప్రైడ్ ఎక్స్‌పో



అవార్డు అందుకుంటున్న నాగరత్న

సాక్షి, హైదరాబాద్: దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి స్మారక పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న భారత్ ప్రైడ్–2024 నేషనల్ సైన్స్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. ఈ సైన్స్ ఎక్స్‌పోలో వంద స్టాళ్లు ఏర్పాటు చేయగా, దాదాపు 50 వేల మంది విద్యార్థులు వీటిని సందర్శించారు. పలు కేంద్ర సంస్థలు ఇందులో భాగస్వామ్యమయ్యాయి. ఈ ఎక్స్‌పోలో సీఎస్ఐఆర్, ఐఎండీ సంయుక్తంగా నిర్వహించిన స్టాల్‌కు ఉత్తమ ప్రదర్శన అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జి.పుల్లారెడ్డి స్మారక పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ నుంచి ఐఎండీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న అవార్డును అందుకున్నారు.

వీసీగా బాధ్యతలు స్వీకరించిన 'వెలుదండ'



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 12వ వైస్ చాన్స్‌లర్‌గా ఆచార్య వెలుదండ నిత్యానంద రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నాంపల్లిలోని వర్సిటీ ఉపాధ్యక్షుల చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి గురుస్థానంలో ఉన్న ఎందరో ప్రముఖులు ఉపాధ్యక్షులుగా పనిచేశారని, వారి సరసన తాను చేరడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం ఆయనకు చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య సూర్య ధనుంజయ శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, ఆచార్య రెడ్డి శ్యామల, ఆచార్య బుక్యా బాబురావు, ఆచార్య కోట్ల హనుమంతరావు, ఎ.ఎస్.జగదీశ్, డాక్టర్ రత్నశ్రీ, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్జన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మోహన్‌దాస్



ఎంజీఎం: సర్జన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మోహన్‌దాస్ ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర 10వ కాన్ఫరెన్స్ హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన డాక్టర్ మోహన్‌దాస్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన ప్రస్తుతం నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

సమీక్షలు పూర్తి.. నిర్ణయమే తరువాయి

జీవో 317పై సీఎంకు తుది నివేదిక ఇచ్చిన మంత్రివర్గ ఉపసంఘం

స్థానికత ఆధారంగా ఉద్యోగుల కేటాయింపుపై కీలక సూచనలు

స్పౌజ్, మ్యూచువల్, అనారోగ్య సమస్యల కేటగిరీ దరఖాస్తులకు త్వరలో మోక్షం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానం మేరకు ఉద్యోగుల కేటాయింపులపై వచ్చిన వినతుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన పూర్తయింది. వినతులపై పలుమార్లు సమీక్షలు నిర్వహించడంతో పాటు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి సూచనలు పరిగణనలోకి తీసుకుని రూపొందించిన నివేదికను ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి సమర్పించింది. రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం ఉద్యోగుల కేటాయింపులు జరిపేందుకు జీవో 317ను తీసుకొచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు ఉద్యోగుల కేటాయింపులు జరిపాయి. జిల్లా, జోనల్, మల్టీజోనల్ కేడర్లలోని ఉద్యోగులను జీవో 317 ప్రకారం కేటాయించారు. అయితే స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా కేటాయింపులు జరపడంతో తీవ్రంగా నష్టపోయామనే భావనతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు న్యాయపోరాటానికి దిగారు. దీంతో గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో జీవో 317 బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. తర్వాత అధికారంలోకి రావడంతో దీనిపై ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రభుత్వ శాఖలతో పలుమార్లు సమావేశమైంది. అదేవిధంగా ప్రత్యేక వెబ్ పోర్టల్ ద్వారా ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించింది. వాటిని ఆయా శాఖలకు పంపడంతో పాటు, సమస్యాత్మకంగా లేని వాటిని పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయాలు తీసుకోవాల్సినవి, కొన్ని ఇతర స్థాయిలోనివి మినహా మిగిలిన దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలతో నివేదిక ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలతో రూపొందించిన నివేదికను దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు.. ముఖ్యమంత్రికి సమర్పించారు.



నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు

ఆ మూడు కేటగిరీలకు ఉపశమనం!

ముడు కేటగిరీల్లోని ఉద్యోగులకు సత్వర ఉపశమనం కల్పించాలని కమిటీ ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. స్పౌజ్, పరస్పరం (మ్యూచువల్), అనారోగ్య సమస్యల కేటగిరీలకు సంబంధించినవి దాదాపు 4 వేల వరకు దరఖాస్తులు ఉండగా.. వాటన్నింటినీ పరిష్కరించాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వారం, పదిరోజుల్లో ఈ మూడు కేటగిరీల వారికి ఉపశమనం లభించనుంది. ఇక స్థానికత విషయంలో పలు అభ్యంతరాలు వచ్చాయి. అయితే కొత్త జిల్లాల నేపథ్యంలో జరిగిన మార్పులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, వారి స్థానికతను కూడా నిర్ధారించాలని సూచించినట్లు తెలిసింది. మిగిలిన కేటగిరీలకు సంబంధించి పలు సూచనలు కూడా చేసినట్లు సమాచారం. వెబ్‌పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులన్నీ సంబంధిత ప్రభుత్వ శాఖలకు అందగా.. వాటిని ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించి కేటగిరీల వారీగా విభజించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. కాగా ఈ నెల 26న జరిగే కేబినెట్ భేటీలో ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నేటి నుంచే గ్రూప్–1 మెయిన్స్

మధ్యాహ్నం 12.30 నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతి

1.30 గంటలకు గేట్లు బంద్.. 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష

తొలి పరీక్ష హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలి

పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

మొత్తం పోస్టులు 563

హాజరుకానున్న అభ్యర్థులు 31,383

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సివిల్ సర్వీస్ ఉద్యోగాలుగా పేర్కొనే గ్రూప్–1 కొలువుల భర్తీకి సంబంధించిన మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమవుతున్నాయి. ఈనెల 27వ తేదీ వరకు వరుసగా జరిగే ఈ పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలు కలిపి.. మొత్తం 46 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 563 గ్రూప్–1 పోస్టుల కోసం 31,383 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు పరీక్షల నిర్వహణ, భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పరీక్ష హాల్, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి నేరుగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. సహాయకుల (స్క్రైబ్) ద్వారా పరీక్ష రాసే దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక గంట అదనంగా కేటాయిస్తారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.



ఏడు రోజులు... ఏడు పరీక్షలు..

సోమవారం నుంచి 27వ తేదీ వరకు ఏడు రోజులు.. ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్షకు 3గంటల సమయం ఉంటుంది. ప్రతి పరీక్షకు గరిష్ఠ మార్కులు 150. జనరల్ ఇంగ్లిష్ మినహా మిగతా పరీక్షలను ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఏదో ఒక దానిలో రాయవచ్చు. అయితే అన్ని పరీక్షలను ఒకే భాషలో రాయాలి. అభ్యర్థులు అన్ని పరీక్షలకు తప్పకుండా హాజరుకావాలి. అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 1.30 గంటలకు పరీక్షా కేంద్రాన్ని మూసివేస్తారు. తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అభ్యర్థులను లోనికి అనుమతించరు. అభ్యర్థి తొలి పరీక్షకు వినియోగించిన హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలి. డూప్లికేట్ హాల్‌టికెట్ జారీ చేసే అవకాశం ఉండదు.

23న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో

తుపాను



రాష్ట్రంలో రెండు రోజులు తక్కువ ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ–మధ్య బంగాళాఖాతంలో ఈనెల 23న తుపాను ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ చెప్పింది. ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఎగువ గాలులతో ఏర్పడిన చక్రవాతపు ఆవర్తనం ప్రభావం వల్ల సోమవారం ఉదయానికి తూర్పు–మధ్య బంగాళాఖాతం, పరిసర ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ మరింత బలపడి ఈ నెల 22వ తేదీ ఉదయం కల్లా వాయుగుండంగా మార్పు చెందుతుందని వెల్లడించింది. ఆ తర్వాత వాయుగుండం బలపడి ఈనెల 23న పశ్చిమ–మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని వివరించింది. ఇది వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 24వ తేదీ ఉదయం కల్లా ఒడిశా–పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. మరోవైపు ఉత్తర తమిళనాడు తీరానికి ఆనుకుని నైరుతి, పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో చక్రవాతపు ఆవర్తనం కొనసాగుతోంది. ఇది బలపడి అల్పపీడనం, ఆ తర్వాత వాయుగుండంగా మార్పు చెందే క్రమంలో రాష్ట్రంలో చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగుడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కావొచ్చని వివరించింది. రానున్న రెండు రోజులు రాష్ట్రంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది.

మరోసారి ఉద్రిక్తత

- అశోక్‌నగర్‌లో అభ్యర్థుల ఆందోళన.. భారీగా పోలీసుల మోహరింపు
- తమకు పార్టీలతో సంబంధం లేదని, చివరి అవకాశాన్ని చేజార్చొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి



అశోక్‌నగర్‌లో అభ్యర్థులు ఆందోళన చేయకుండా నివారిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి (హైదరాబాద్): గ్రూప్–1 అభ్యర్థుల ఆందోళనలు, నిరసనలు, పోలీసుల అరెస్టులతో అశోక్‌నగర్ ఆదివారం మరోసారి దద్దరిల్లింది. మీడియాతో మాట్లాడేందుకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. దీంతో పరిసర ప్రాంతాలలో ఉద్రిక్తత నెలకొంది. అభ్యర్థులు ప్రెస్‌మీట్ ప్రారంభిస్తుండగానే.. పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ఈ పరిస్థితిలో పరీక్ష ఎలా రాయాలి?

తొలుత కొందరు అభ్యర్థులు మాట్లాడుతూ.. తాము ప్రజాసేవ చేయాలనే ఆలోచనతోనే గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యామని చెప్పారు. కానీ ప్రభుత్వం 29 జీవోను తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించడం, హాల్‌టికెట్ల మార్పుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రూప్స్ అభ్యర్థులు అయోమయంలో, ఆవేదనలో ఉన్నారని.. ఈ పరిస్థితిలో పరీక్షలు ఎలా రాయాలని ప్రశ్నించారు. తాము ఏ పార్టీకి మద్దతు తెలపడం లేదని, తమకున్న చివరి అవకాశాన్ని చేజార్చొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సీఎం తమతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నంత మాత్రాన అంతా పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నట్టు కాదని చెప్పారు. లాఠీచార్జి చేయొద్దని సీఎం చెప్పినా.. శాంతియుతంగా ప్రెస్‌మీట్ పెట్టిన తమను పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేసి, జీవో 29ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే అభ్యర్థుల ఎంపిక జరగాలని, పరీక్షలకు ఏ పుస్తకాలు ప్రామాణికమో స్పష్టత ఇవ్వాలని కోరారు. మరోవైపు గ్రూప్–1 అభ్యర్థుల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వహిస్తోందంటూ డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో జీవో 29 ప్రతులను దహనం చేశారు.

ఎస్ఎస్‌సీ కానిస్టేబుల్ ఉద్యోగాలు.. టీశాట్ ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా భర్తీ చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తున్నట్లు టీ–శాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి జనవరి 31 వరకు టీ–శాట్ నెట్‌వర్క్ చానళ్ల ద్వారా కంటెంట్ ఇస్తామన్నారు. 39,481 జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ఎస్ఎస్‌సీ గతనెల 6న నోటిఫికేషన్ విడుదల చేయగా, తెలంగాణకు 718, ఏపీకి 908 పోస్టులు కేటాయించిందన్నారు. అరగంట నిడివితో 448 ఎపిసోడ్స్, 112 రోజులు టీ–శాట్ చానళ్లు, యూట్యూబ్, యాప్ ద్వారా కంటెంట్ ప్రసారం చేస్తామన్నారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్, ఎలిమెంటరీ మేథమెటిక్స్ లను ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. ప్రసారాలు టీ–శాట్ నిపుణ చానల్ లో సోమవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు, మరుసటి రోజు ఉదయం విద్య చానల్‌లో 5 గంటల నుంచి 7 వరకు ప్రసారమవుతాయన్నారు.

గ్రూప్–3 పరీక్షలకు మరో రెండు గంటలు

టీజీపీఎస్సీ భర్తీ చేస్తున్న 1,388 గ్రూప్–3 పోస్టుల పరీక్షలకు కంటెంట్‌ను మరో రెండు గంటలు అదనంగా ఇవ్వనున్నట్లు సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రెండు గంటల కంటెంట్ ప్రసారం చేస్తుండగా అక్టోబర్ 21 నుంచి నవంబర్ 16 వరకు రోజూ 4 గంటల పాటు ప్రసారం చేయనున్నట్లు చెప్పారు.

ఆదుర్దా.. ఆందోళన..

▶ మొదటి పేజీ తరువాయి

బాసటగా నిలిచాయి. గ్రూప్–1 పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమిటని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రశ్నించారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ నిరుద్యోగ యువతకు చెప్పిందేమిటి? కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పుడు చేస్తోందేమిటని నిలదీశారు. ఇక బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ కూడా ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం భేషజాలకు పోవడం ఎందుకని, పరీక్షలను వాయిదా వేసి తప్పులను సరిదిద్దితే వచ్చిన నష్టమేంటని నిలదీశారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికలో ఏ ఒక్క వర్గానికీ నష్టం జరగలేదని, భవిష్యత్తులోనూ నష్టం జరగకుండా చూస్తానని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో భరోసా ఇస్తున్నానని ప్రకటించారు. ఇక నిరుద్యోగుల ఆందోళనలను పట్టించుకోకుండా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సోమవారం నుంచి గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో.. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకంటూ పరీక్షా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు సుప్రీంకోర్టులో విచారణ

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు, అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపనుంది. అటు విద్యార్థుల ఆందోళన, ఇటు రాష్ట్ర ప్రభుత్వ పట్టుదల మధ్య.. కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుందన్నది ఉత్కంఠగా మారింది.

రోజుకు 474 మంది..

దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద మృతులు..

- గతేడాది ప్రమాదాల్లో 1.73 లక్షల మంది కన్నుమూత
- తెలంగాణలో పెరిగిన ప్రమాద మృతుల సంఖ్య.. హెల్మెట్ ధరించని కారణంగా 70% మరణాలు



సాక్షి, న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో సగటున రోజుకు 474 మంది చనిపోయారని, ప్రతీ మూడు నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలపై కేంద్ర ప్రభుత్వం డేటా సేకరణలో ఆందోళనకరమైన గణాంకాలు వెలుగు చూశాయి. కాగా, గతేడాది రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తెలంగాణలో బాగా పెరిగిపోయింది. ఇదిలా ఉండగా..2023 ఏడాది దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.73 లక్షలకు పైగా మరణించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం (హెల్మెట్) ధరించకపోవడం వల్ల 70% మరణాలు సంభవిస్తున్నాయి. రాష్ట్రాలు ఈ గణాంకాలను కేంద్ర ప్రభుత్వానికి అందించాయి. రోడ్డు ప్రమాదాల కారణాలు, తీవ్రతను అర్థం చేసుకోవడానికి కేంద్రం డేటాను సేకరించడం ప్రారంభించినప్పటి నుంచి ఈ ఏడాదే అత్యధిక మరణాలు సంభవించాయి.

గతేడాది క్షతగాత్రులు 4.63 లక్షలు

గతేడాది దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 4.63 లక్షల మంది గాయపడ్డారు. దీంతో రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల సంఖ్య పెరుగుతున్నట్లు అర్థమవుతోంది. ఇది 2022 కంటే 4% ఎక్కువ. 2022లో రోడ్డు ప్రమాదాల్లో 1.68 లక్షల మంది చనిపోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ నివేదికలో పేర్కొన్నారు. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 2022లో రోడ్డు ప్రమాదాల్లో 1.71 లక్షలమంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ రెండు ఏజెన్సీలు 2023కి సంబంధించిన గణాంకాలను విడుదల చేయలేదు.

ప్రమాద మరణాల్లో తొలిస్థానంలో ఉత్తరప్రదేశ్..

యూపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, అస్సాం, తెలంగాణ సహా 21 రాష్ట్రాల్లో 2022తో పోలిస్తే 2023లో రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య పెరిగింది. అయితే ఆంధ్రప్రదేశ్, బిహార్, ఢిల్లీ, కేరళ, చండీగఢ్ వంటి రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. కాగా గతేడాది రోడ్డు ప్రమాదాల్లో ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 23,652 మరణాలు నమోదయ్యాయి. ఆ తర్వాత తమిళనాడులో 18,347మంది, మహారాష్ట్రలో 15,366 మంది మరణించారు.

క్షతగాత్రుల్లో తమిళనాడు తొలిస్థానం

రోడ్డు ప్రమాదాల్లో గాయపడినవారిలో తమిళనాడు అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ రోడ్డు ప్రమాదాల్లో 72,292 మంది గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లో 55,769 మంది, కేరళలో 54,320 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడ్డారు. కాగా, గతేడాది మరణించిన వారిలో 44% మంది ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. అలాగే గతేడాది మరణించిన ద్విచక్ర వాహనదారుల్లో 70% మంది హెల్మెట్ ధరించని కారణంగా మృత్యువాతపడ్డారు.

నిరుద్యోగులు రోడ్డెక్కితే.. దురహంకారంతో అణచివేస్తారా?

జీవో 29పై అనేక అనుమానాలున్నాయి.. వాటిని నివృత్తి చేయాల్సిందే: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నియామక పరీక్షలను కూడా సరిగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. గ్రూప్–1 పరీక్షల రీషెడ్యూల్ కోరుతూ అభ్యర్థులు రోడ్డెక్కితే వారిపై లాఠీలు ఝుళిపించి, దురహంకారంతో అణచివేయాలని చూడటం దారుణమని వ్యాఖ్యానించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "గ్రూప్–1 ఉద్యోగాల ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఒకే తరహా నిబంధనలుండాలి. ఆ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఒకే హాల్‌టికెట్ ఉండాలి. కానీ టీజీపీఎస్సీ రెండుసార్లు జారీ చేయడం ఏమిటి? పరీక్షలన్నీ హైదరాబాద్ పరిసరాల్లోనే నిర్వహించడానికి కారణాలు ఏమిటి? ఇలా ఒకేచోట పరీక్షల నిర్వహణపై పలు అనుమానాలు వస్తున్నాయి. గ్రూప్–1 మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపికలో అమలు చేసిన జీవో 29 విషయంలో అభ్యర్థులకు అనేక అనుమానాలు ఉన్నాయి. ఇందులో ఎలాంటి దాపరికం లేకపోతే స్పష్టత ఎందుకు ఇవ్వడం లేదు?" అని కిషన్‌రెడ్డి నిలదీశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలసి అశోక్‌నగర్‌లో నిరుద్యోగులతో మాట్లాడిన మాటలేమిటి? ఇప్పుడు చేస్తున్న పనులేమిటి? ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలని సీఎం రేవంత్‌కు సూచించారు.

హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నాలు

న్యాయం కావాలని రోడ్డెక్కిన నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం, నిరసనలను అణచివేసే ప్రయత్నం చేయడం, అరెస్టులకు దిగడం దారుణమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా పేదల ఇళ్లను కూల్చివేస్తూ కాలం గడిపే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. హామీలు అమలు చేసే సత్తా, శక్తి, లేకనే.. కొత్త సమస్యలు సృష్టించి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ పూర్తిగా హిందూ వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. వినాయక చవితి, బోనాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా అనేక మందిపై కేసులు పెట్టించారని.. డీజే సౌండ్ పెట్టారంటూ మండపాల నిర్వాహకులను వేధించారని పేర్కొన్నారు. ఇతర వర్గాల ప్రార్థన కేంద్రాల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వస్తున్న శబ్దాలు పోలీసులకు, ముఖ్యమంత్రికి వినబడవా? కనబడవా? అని ప్రశ్నించారు. ముత్యాలమ్మ గుడి వద్ద నిరసనకారులపై అత్యంత పాశవికంగా దాడి చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఒక కార్యకర్తకు తీవ్రగాయాలు అయ్యాయని, పోలీసులు అతడిని ఇంట్లో వదిలివెళ్లారని.. కానీ అతడి పరిస్థితి విషమిస్తుండటంతో తాము ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించి చికిత్స అందేలా చూశామని చెప్పారు.

రిజర్వ్‌డ్ కేటగిరీలకు నష్టం జరగదు

పీసీసీ అధ్యక్షుడిగా భరోసా ఇస్తున్నా..: మహేశ్‌గౌడ్ ప్రకటన

- ప్రతిపక్షాలు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకోవాలి



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 పరీక్షల విషయంలో నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని.. రిజర్వ్‌డ్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్న వాదన పచ్చి అబద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా తాను భరోసా ఇస్తున్నానని, మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి నష్టం జరగలేదని, భవిష్యత్తులో కూడా ఎలాంటి నష్టం జరగదని చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, ఇతర నేతలతో కలసి మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు గ్రూప్–1 మెయిన్స్ విషయంలో నిరుద్యోగులను రెచ్చగొడుతూ.. లేనిపోని అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

అపోహలు వద్దు

'పీసీసీ అధ్యక్షుడిగా, బీసీ వర్గాలకు చెందిన వ్యక్తిగా గ్రూప్–1 అభ్యర్థులందరికీ భరోసా ఇస్తున్నా. మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు అన్యాయం జరగదు. ఇది పార్టీ, ప్రభుత్వ పక్షాన మేమిస్తున్న భరోసా. అన్ రిజర్వ్‌డ్ మెరిట్ జాబితాలోకి వచ్చిన అభ్యర్థులను మళ్లీ రిజర్వ్‌డ్ కేటగిరీలో లెక్కించరు. మెరిట్ జాబితాలో ఎంపికైన రిజర్వ్‌డ్ అభ్యర్థులు ఓపెన్ కేటగిరీలోనే కొనసాగుతారు. రిజర్వ్‌డ్ పోస్టుల్లో తక్కువ పడితేనే ఇతర అభ్యర్థులను తీసుకుంటారు. అందుకే సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. అసలు నష్టమే జరగదు. అర్థం చేసుకోవాలి' అని మహేశ్‌గౌడ్ వివరించారు.

విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయి

గాంధీభవన్ సేకరించిన సమాచారం ప్రకారం.. మొత్తం అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులే 75 శాతం ఉంటారని మహేశ్‌గౌడ్ చెప్పారు. కానీ బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై, పరీక్షల విషయంలో లేనిపోని అనుమానాలు సృష్టిస్తున్నాయని, విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. పదేళ్లలో ఎన్ని గ్రూప్–1 ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన బీఆర్ఎస్‌ది చిత్తశుద్ధా? పది నెలల్లో 50వేల ఉద్యోగాలిచ్చిన కాంగ్రెస్‌ది చిత్తశుద్ధా అన్నది నిరుద్యోగులు ఆలోచించాలన్నారు. ఇంటర్ ఫలితాలను కూడా సక్రమంగా ఇవ్వలేని బీఆర్ఎస్ తమకు బుద్ధులు చెప్పాల్సిన పనిలేదని వ్యాఖ్యానించారు. దేశంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ.. ఎన్ని ఉద్యోగాలిచ్చిందో బండి సంజయ్ చెప్పాలని, ఏ ముఖం పెట్టుకుని బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారో చెప్పాలని విమర్శించారు.

క్లుప్తంగా...

నల్లగొండ జిల్లాను నాశనం చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వం

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాను నాశనం చేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని ఆ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రకుమార్ మాట్లాడుతూ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏనాడూ నల్లగొండను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో అధ్వానంగా మారిన మూసీని కాలుష్యం లేకుండా చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లిచ్చిందని చెప్పారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రస్తుతం పంటలు పండుతున్నాయన్నారు. కోమటిరెడ్డి సోదరులు నల్లగొండ జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వదిలేసిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తి చేసిందని, నల్లగొండకు మెడికల్ కాలేజ్ ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. మంత్రి పదవిని కాపాడుకోవడానికి కోమటిరెడ్డి రేవంత్‌రెడ్డి భజన చేస్తున్నారని, పేదల ఇళ్లు కూలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం కావడం ఖాయమని చెప్పారు. చంద్రబాబు సూచనలతోనే రేవంత్‌రెడ్డి మూసీ అంచనాలు పెంచారన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ఆరోపణ
- కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీలు పేదల భుజాలపై తుపాకులు పెట్టి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. రెండు పార్టీల చీకటి ఒప్పందంలో భాగంగా ఒకరిని ఒకరు విమర్శించుకుంటున్నట్లుగా నాటకమాడుతూ కృత్రిమ అలజడి సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను సృష్టించి అశాంతి వాతావరణాన్ని నెలకొల్పడం ద్వారా కేంద్రం జోక్యం చేసుకునేలా చేసి ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైడ్రా అత్యుత్సాహంతో అనాలోచితంగా పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్ళు కూల్చుతోందని, దీన్ని ఆసరాగా చేసుకున్న బడాబాబులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కూనంనేని అన్నారు. దీనిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు హైడ్రా నిర్ణయాలు కూడా బీఆర్ఎస్‌కు కలిసి వచ్చే విధంగా ఉంటున్నాయని, దీనిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని అన్నారు. హైడ్రా పేదల జోలికి వస్తే తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. హైడ్రా అధికారులు ముందు బడా బాబులు ఆక్రమించుకుని నిర్మించుకున్న భవంతులను నేలమట్టం చేయాలని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భూములు, అన్యాక్రాంతం, కబ్జాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ 58, 59 జీవోల ప్రకారం క్రమబద్ధీకరించాలని కోరారు.

ఫోర్ బ్రదర్స్ కోసమే ఫ్యూచర్‌సిటీ

సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై కేటీఆర్ ధ్వజం

- వారి 'రియల్'వ్యాపారం కోసమే ఈ ఎత్తుగడ
- ఫార్మా సిటీ రద్దు చేస్తే రైతుల భూములు తిరిగివ్వాలి



దసరా సమ్మేళనంలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో సబిత తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన నలుగురు సోదరుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫ్యూచర్ సిటీ నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రీన్ ఫార్మా ఏర్పాటు కోసం 14 వేల ఎకరాలు సేకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా సిటీ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్ సిటీ అని చెప్పుకొని రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొంగ్లూర్ సమీపంలో ఆదివారం నిర్వహించిన అలయ్‌బలయ్ (దసరా సమ్మేళనం) కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఫార్మా సిటీని రద్దు చేస్తే రైతుల నుంచి తీసుకున్న భూములు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఫార్మాలో భూములు కోల్పోయిన 9 గ్రామాల్లో పర్యటించి రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసాలను ప్రజలకు విడమరిచి చెబుతామన్నారు.

పండుగలన్నీ కల తప్పాయి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ పండుగకు చీరలు లేవని, దసరా పండుగ కళ తప్పిందని, వినాయక చవితి కూడా పండుగలా లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వంలోకి రాక ముందు రేవంత్‌రెడ్డి మూడు పంటలకు రైతుబంధు ఇస్తానని చెప్పాడని, అయితే, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాత్రం ఖరీఫ్‌కు పైసలు లేవని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ అంటేనే భారత రైతు సమితి అని అభివర్ణించారు. చిట్టినాయుడు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంతోనే సరిపోయిందని ఎద్దేవా చేశారు.కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎనుముల ఇంటెలిజెన్స్'టెక్నిక్!

తెలంగాణలో 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో పెట్టిన పోస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ చేసినట్టు ఇచ్చిన ప్రకటనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించిన చిత్రాన్ని వాడిన రీతిలోనే రుణమాఫీ జరిగిన రైతుల లెక్క విషయంలోనూ ముఖ్యమంత్రి ఏఐ టెక్నిక్ వాడారంటూ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 40 లక్షల మంది రైతులు అనే సంఖ్య ఏఐ (ఎనుముల ఇంటెలిజెన్స్)తో రేవంత్‌రెడ్డి రూపొందించిందేనని ఎద్దేవా చేశారు.

మలేషియా తెలంగాణ ఉత్సవాలకు ఆహ్వానం

"మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ అసోసియేషన్ ఆహ్వానించింది. నవంబర్ 9వ తేదీన మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగే ఈ ఉత్సవాలకు అక్కడి తెలంగాణవాసులు పెద్దఎత్తున హాజరవుతారని తెలిపింది. కేటీఆర్‌ను ఆయన నివాసంలో మలేషియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, మాజీఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసింది.

'మూసీ' బాధితులకు గచ్చిబౌలిలో ఇళ్లు కట్టివ్వాలి

- కేసీఆర్ నిర్మించిన ఇళ్లలోకి పంపి.. రేవంత్ గొప్పలు చెప్పుకుంటారా?: హరీశ్‌రావు
- మల్లన్నసాగర్ నిర్వాసితులకు విశాలమైన ఇళ్లు నిర్మించి ఇచ్చాం..
- పునరావాస కాలనీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాం
- మేం చేసిన తరహాలో 'మూసీ' నిర్వాసితులకు సాయం చేయగలరా? అని ప్రశ్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: "మల్లన్నసాగర్ నిర్వాసితులకు కేసీఆర్ దేశంలోనే ఎక్కడా లేనట్టుగా సకల సౌకర్యాలతో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించి ఇచ్చారు. మేం చేసిన దాంట్లో పదో వంతైనా మూసీ నిర్వాసితులకు న్యాయం చేయగలరా? బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలోకి నిర్వాసితులను పంపి, ఖర్చులకు రూ.25 వేలు ఇచ్చి తానేదో గొప్ప పనిచేసినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించుకోవడం సిగ్గుచేటు"అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు పాత ఇళ్లు కోల్పోయినందుకు పరిహారం కింద రూ.694 కోట్లు అందజేశామని హరీశ్‌రావు చెప్పారు. అదేవిధంగా ఇంటి యజమానికి రూ.7.5 లక్షలు, పెళ్లికాని యువతీయువకులకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున ప్యాకేజీలు ఇచ్చామని.. ఇళ్లు కావాలన్న వారికి 250 గజాల స్థలంలో కొత్త ఇంటిని నిర్మించి ఇచ్చామని గుర్తు చేశారు. పునరావాస కాలనీల్లో దేశంలో ఎక్కడాలేని విధంగా విశాలమైన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీరు, గుడి, బడి, అంగన్‌వాడీ, రేషన్‌షాపులు వంటి సౌకర్యాలను సమకూర్చామని చెప్పారు. వ్యవసాయ భూములకు కూడా పరిహారం ఇచ్చామని వివరించారు. వీటన్నింటితో పాటు ఖర్చుల కింద రూ.30 వేల నుంచి రూ.50 వేలు అందించామని వివరించారు.

రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే ఇళ్లు కట్టివ్వాలి

మల్లన్నసాగర్ నిర్వాసితులకు 2,270, కొండపోచమ్మసాగర్‌కు సంబంధించి 1,141 ఇళ్లు నిర్మించి ఇచ్చామని హరీశ్‌రావు వివరించారు. 2013 భూసేకరణ చట్టంలో చెప్పినదానికంటే మెరుగైన సహాయ, పునరావాస కార్యక్రమాలను చేపట్టామన్నారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మల్లన్నసాగర్ నిర్వాసితుల తరహాలోనే మూసీ నిర్వాసితులకు గచ్చిబౌలిలోని 500 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు సాంకేతిక కారణాలతో మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు పది శాతం ప్యాకేజీలు, పరిహారాలు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటికి వెంటనే నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయం పెంచి ఇస్తే తానే స్వయంగా వచ్చి సీఎం రేవంత్‌కు పూలదండ వేసి సన్మానం చేస్తానని హరీశ్‌రావు చెప్పారు. నిర్వాసితులపై కాంగ్రెస్ నేతలకు ఏమాత్రం ప్రేమ లేదని హరీశ్‌రావు మండిపడ్డారు.

చీఫ్ మినిస్టర్ కాదు.. చీటింగ్ మ్యాన్

తిమ్మాపూర్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు ఏమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. "సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి, చీఫ్ మినిస్టర్ కాదు.. చీటింగ్ మ్యాన్" అని విమర్శించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. దేవుడి మీద ఒట్టుపెట్టి రాజకీయం చేసే నాయకుడిని తాను ఇప్పటివరకు చూడలేదని.. రేవంత్ చేసిన పాపాల నుంచి ప్రజలను కాపాడాలంటూ తాను యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళితే అక్రమ కేసు పెట్టారని మండిపడ్డారు. ప్రజలను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు మరో ఉద్యమం రావాలన్నారు.

విద్యార్థుల జీవితాలతో రేవంత్ ఆటలు: దాసోజు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మొండితనం, మూర్ఖత్వంతో గ్రూప్–1 అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుతున్నారని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఇద్దరూ కలిసి గ్రూప్–1 అభ్యర్థులను మోసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవో 29తో బీసీ,ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నోట్లో మట్టికొడుతున్నారన్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని దాసోజు ఆరోపించారు. 60 ఉద్యోగాలు యాడ్ చేసి 563 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, 28,150 మందిని మాత్రమే షార్ట్‌లిస్ట్ చేయాల్సి ఉండగా, రేవంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి కలిసి తప్పుడు జీవో తెచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేలోపు జీవోను రద్దుచేసి పరీక్షలు వాయిదా వేయాలన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసే జీవో 55ను అమలు చేయాలన్నారు.

పంచాయతీ ఎన్నికల్లోపు కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వానికి టీపీఎస్ఏ వినతి

సాక్షి, హైదరాబాద్: గ్రామ కార్యదర్శుల సమస్యలను పంచాయతీ ఎన్నికల్లోపు పరిష్కరించాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం ఖైరతాబాద్‌లో టీపీఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జీవో 317 ద్వారా నష్టపోయిన కార్యదర్శులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలన్నారు.

ఇదేం విద్యా కమిషన్?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రొఫెసర్లు ప్రభుత్వానికి స్పష్టం చేశారని.. మరో ఇద్దరు ఇదే బాటలో ఉన్నారని తెలిసింది. మరోవైపు కమిషన్ చైర్మన్ కూడా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. కమిటీ ఏర్పాటు చేసినా.. ఎలాంటి మౌలిక సదుపాయాలు ఇవ్వకపోవడం, సలహాదారుల ఎంపికలో తనకు ప్రమేయమే లేకపోవడాన్ని ఆయన జీర్ణించుకోవడం లేదని తెలిసింది. విద్యాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి అన్నీ తానే అయి నడిపిస్తుండటమే దీనికి కారణమని విద్యాశాఖ వర్గాలు చెప్తుండటం గమనార్హం.

ఇవేం నియామకాలు?


విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించింది. చాలా రోజుల తర్వాత కమిషన్‌కు ముగ్గురు సభ్యులను నియమించింది. వాస్తవానికి విద్యా రంగంలోని వివిధ విభాగాల నుంచి సభ్యుల నియామకం జరగాలని కొన్ని నెలల క్రితం జరిగిన మేధావుల సమావేశంలో సీఎంకు పలువురు సూచించారు. కానీ ఒక కార్పొరేటర్, అధికార పార్టీకి చెందిన ఓ స్కాలర్ సహా మరో వ్యక్తిని సభ్యులుగా నియమించడంపై విమర్శలు వచ్చాయి. దీనివల్ల సభ్యులు రాజకీయ కోణంలో ఆలోచించే అవకాశం ఉంటుందని.. విద్యా రంగంలో పారదర్శకంగా సంస్కరణలు చేపట్టలేమనే అభిప్రాయాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే విద్యా కమిషన్‌కు సలహా కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ హరగోపాల్ సహా పలువురు ప్రొఫెసర్లను నియమించారు. అయితే ఈ నియామకాలు విద్యా కమిషన్ పరిధిలో జరిగి ఉంటే బాగుండేవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కేవలం కొందరి సూచనల మేరకు సలహా కమిటీని సీఎం వేశారని అంటున్నారు. సలహా కమిటీ కేవలం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉంటుందని.. అలాంటప్పుడు విద్యా కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.

సంస్కరణలు సాధ్యమేనా?

విద్యా కమిషన్‌పై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని.. విద్యా రంగంలో సంస్కరణల దిశగా అడుగులు వేయడం లేదని సలహా కమిటీలో నియమితులైన సభ్యుడొకరు మండిపడ్డారు. కర్ణాటకలోనూ విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని, ఆ కమిషన్ మొత్తం 14 సబ్ కమిటీలను వేసుకుందని.. వాటి ద్వారా మార్పులకు శ్రీకారం చుడుతోందని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ రాజకీయ, సామాజిక కోణంలోని వారినే ఈ కమిషన్ పరిధిలోకి తెచ్చారని.. సాంకేతిక విద్య, అంగన్‌వాడీ, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యలో నిపుణులను భాగస్వామ్యం చేసే పరిస్థితి కనిపించడం లేదన్నారు. అంతేగాకుండా అసలు విధులేమిటో చెప్పలేదని, ఏం సలహాలివ్వాలి, ఎవరికి ఇవ్వాలనే స్పష్టత లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో విద్యా కమిషన్‌కు ఆదిలోనే తలపోట్లు తప్పేలా లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాపాలనను ఓర్వలేకే తప్పుడు ప్రచారం

దుర్వినియోగం కావొద్దనే రైతుభరోసా ఆలస్యం : మంత్రి జూపల్లి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ప్రజాపాలనను చూసి ఓర్వలేకనే తప్పుడు ప్రచారాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.7.15 లక్షల కోట్ల అప్పులు చేశారని, వారు చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 40 వేల మంది ఉద్యోగులను బదిలీ చేశామని, 10 వేల మందికి ప్రమోషన్లు ఇచ్చామని మంత్రి చెప్పారు. పంట రుణాల మాఫీ ఇప్పటికే 80 శాతం పూర్తి చేశామని, మరో 4 లక్షల మందికి దీపావళిలోపు మాఫీ చేస్తామని తెలిపారు. రైతుబంధు పేరుతో రూ.25 వేల కోట్లు గుట్టలు, రాళ్ల భూములకు పంచి పెట్టి దుర్వినియోగం చేశారంటూ కేసీఆర్ పాలన తీరును దుయ్యబట్టారు. దాన్ని సరిచేసి పంటలు పండించే రైతులకు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నామని, అందుకే రైతు భరోసా ఆలస్యమైందని పేర్కొన్నారు. ఎవరెన్ని మాట్లాడినా రైతుభరోసా ఇచ్చి తీరుతామన్నారు. సభలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పనుల కోసం రిస్క్ తీసుకోవాలి

▶ మొదటి పేజీ తరువాయి

మనం చాలా కోల్పోవాల్సి రావచ్చు. ప్రజలతో నేరుగా సంబంధం పెట్టుకోవాలి. అప్పుడే ప్రజలకు, రాష్ట్రానికి, దేశానికి సేవ చేయగలుగుతారు. పేద, ధనిక, చిన్నాపెద్దా అనే తేడా లేకుండా, సమాన గౌరవమిస్తూ స్నేహభావంతో అందరినీ కలుపుకొనిపోవాలి'అని సీఎం రేవంత్ సూచించారు.

ప్రభుత్వంలో పనిచేయండి..

'అసాధారణ ప్రతిభ ఉన్న యువ ఐఎస్‌బీ విద్యార్థులు హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రంతోపాటు న్యూ ఇండియాకు బ్రాండ్ అంబాసిడర్లు. రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మా లక్ష్యానికి చేరుకోవాలంటే హైదరాబాద్‌ను 600 బిలియన్ డాలర్ల నగరంగా మార్చాల్సి ఉంటుంది. తెలంగాణను ప్రపంచంలోని ప్రతి భాగానికి తీసుకెళ్లడానికి నాకు సహకారం అందించండి'అని ఐఎస్‌బీ విద్యార్థులను సీఎం రేవంత్ కోరారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు, సామాన్య ప్రజలతో తెలంగాణ, హైదరాబాద్ గురించి మాట్లాడాలని సూచించారు. దేశంలోని ఇతర నగరాలతో హైదరాబాద్ పోటీపడాలని తాను కోరుకోవడం లేదని.. న్యూయార్క్, లండన్, పారిస్, టోక్యో, సియోల్ వంటి నగరాలతో హైదరాబాద్ పోటీపడాలని కోరుకుంటున్నానని చెప్పారు. ప్రపంచంలో భారతదేశం, హైదరాబాద్ అత్యుత్తమంగా మారాలన్నది భారీ లక్ష్యమే అయినా అసాధ్యం కాదన్నారు. తమ ప్రభుత్వంతో రెండు, మూడేళ్లు కలిసి పని చేయాలని విద్యార్థులను కోరారు. కార్పొరేట్ల తరహాలో ప్రభుత్వం భారీ జీతాలను ఇవ్వలేకపోయినా మంచి అవకాశాలు, లక్ష్యాలు, సవాళ్లను ఇస్తామని చెప్పారు.



ఐఎస్‌బీలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

దేశానికి ఆదర్శంగా తెలంగాణ ఉండేలా..

హైదరాబాద్‌ను దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తన ఆలోచనని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ, గచ్చిబౌలిలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దక్షిణ కొరియాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించానని.. చిన్న దేశమైనా ఒలింపిక్స్‌లో చాలా పతకాలు గెలిచిందని చెప్పారు. మన దేశం ఒక్క బంగారు పతకం సాధించలేకపోయిందన్నారు. ఒలింపిక్స్ పతకాలు సాధించడం తమ లక్ష్యమని చెప్పారు.

గ్లోబల్ పవర్‌గా భారత్..



సాక్షి, హైదరాబాద్/చందానగర్: భారత్ గ్లోబల్ పవర్‌గా ఎదిగేందుకు పటిష్ట నాయకత్వం అవసరమని ఐఎస్‌బీ లీడర్‌షిప్ సమ్మిట్–2024లో వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఏడాది 'లీడర్ షిప్ ఇన్ న్యూ ఇండియా' థీమ్‌తో ఈ సదస్సు జరిగింది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలను పంచుకున్నారు. "మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, మార్పులకు తగ్గట్టు యువతలో శక్తియుక్తులను వెలికి తీసి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఐఎస్‌బీ కూడా భాగస్వామ్యం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాం. అవసరమైన చేయూత అందిస్తాం. ప్రభుత్వ లక్ష్యంలో పాలుపంచుకుంటాం.."అని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల తెలిపారు.

ఐఎస్‌బీ ఎంతో నేర్పిస్తోంది



విభిన్న వర్గాలకు చెందిన వారమంతా ఐఎస్‌బీలో చేరాం. ఐఎస్‌బీ మాలాంటి వారికి ఎంతో నేర్పిస్తోంది. డాక్టర్లు, లాయర్లు, ఐటీ, మేనేజ్‌మెంట్, రియల్‌ఎస్టేట్ రంగాలకు చెందినవారిని ఒక్కచోటికి చేర్చింది. మంచి నాయకత్వ లక్షణాలను ఇక్కడ అలవర్చుకున్నాను. మేనేజ్‌మెంట్ రంగంలో పటిష్టమైన నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతాననే నమ్మకం ఏర్పడింది.

– లలిత్, పీజీపీప్రో కోర్సు విద్యార్థి, ఐఎస్‌బీ

బిజినెస్ రంగంలో స్థిరపడేలా..



నిరంతరం చదువుకుంటుంటే ఎన్నో కొత్తఅంశాలను నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఢిల్లీలో ఫోన్ చార్జర్లను ఉత్పత్తి చేసే కంపెనీకి చెందిన కుటుంబం నుంచి వచ్చాను. ఆ వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వీలుగా నాయకత్వం అలవర్చుకునే అవకాశం ఇక్కడ కలిగింది.

– అనన్య, ఎంబీఏ విద్యార్థిని



“ నువ్వు ఎల్లప్పుడూ దేనికి భయపడతావో అదే చెయ్యి!
- రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 21 అక్టోబర్ 2024

మేధకు ‘కృత్రిమ’ గ్రహణం

మేధ మనిషికి ఒక వరం; అది ఒక్కోసారి గంద్రగోళంతో నిండడం ఒక శాపం. మేధ సవ్యంగా, స్పష్టంగా పనిచేసినప్పుడు మనిషి ఎన్నో అద్భుతాలు సృష్టించగలడు; అది అయోమయపు డొంకలా, బంకలా మారి వెర్రితలలు వేసినప్పుడు వాటిని తనే కూలదోసుకుని, తనూ పడిపోగలడు. కృత్రిమ మేధగా మనం అనువదించుకునే ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్’ మనిషి మేధ సృష్టించిన మహాద్భుతాలలో ఒకటి. ఆ కృత్రిమ మేధ తన సృష్టికి మూలమైన మనిషిలోని సహజ మేధను హరించి, తనే అసలు మేధగా మారబోతోందా!? ప్రస్తుతం మానవాళి ముఖాన వేలాడే ఓ ఆసక్తికరమైన ప్రశ్న ఇది.

‘కృత్రిమ మేధ’ ఈరోజున సర్వత్రా చర్చనీయమవుతున్న సాంకేతికాద్భుతం. ఆశాభావాన్ని మించి అది ఆందోళనను రేపడం చూస్తున్నాం. ఇంకోవైపు, అది ఆవిష్కరించే ఫలితాలకు ఆశ్చర్య చకితులమూ అవుతున్నాం. సృష్టికి ప్రతిసృష్టి అనే పౌరాణిక ఊహకు అత్యధునాతన ఉదాహరణ ఇదే. ఇది కృత్రిమమైన కాలో, చెయ్యో అమర్చుకోవడం కాదు, ఏకంగా కృత్రిమ మేధనే తెచ్చి అతికించుకోవడం. మనిషి తన మేధతో చేసే పనులన్నీ కృత్రిమ మేధతో చేయిస్తున్నాడు. సాహిత్య రంగంలోనే చూడండి... ఓ నాలుగైదు వాక్యాల కవితనిచ్చి దానిని కథగా మార్చమని అడిగితే కృత్రిమ మేధ క్షణాలలో మార్చి చూపిస్తోంది. గహనమైన ఓ బృహద్గ్రంథం పేరు మాత్రం ఇచ్చి అందులోని సారాంశాన్ని నాలుగైదు పేరాలలో చెప్పమని అడిగితే చటుక్కున చెబుతోంది. అంతే అవలీలగా, అవ్యవధిగా ఒక భాష నుంచి ఇంకో భాషకు తర్జుమా చేసి అందిస్తోంది. ఆకాశమే హద్దుగా ఏదైనా చేయగలుగుతోంది. అదింకా పూర్తిగా నిర్దుష్టతను, నిర్దిష్టతను తెచ్చుకుని ఉండకపోవచ్చు. కానీ, తెచ్చుకునే రోజు ఎంతో దూరంలో లేదనిపిస్తోంది. అదే జరిగి, మనిషి కృత్రిమ మేధకు పూర్తిగా దాసోహమై క్రమంగా తన సహజ మేధను కోల్పోయే పరిస్థితి వస్తుందా; కృత్రిమ మేధే సహజ మేధగా మారుతుందా? ఆసక్తి కన్నా ఎక్కువగా భయాన్ని రేపుతున్న ప్రశ్నలివి.

కృత్రిమ మేధే సహజ మేధ కన్నా నాణ్యమైనదయ్యే అవకాశమూ లేకపోలేదు. ఎందుకంటే, సహజ మేధలో ఉండే గంద్రగోళం అందులో ఉండదు. అది ఎల్లవేళలా సూటిగా, స్పష్టంగానే కాదు; సహజ మేధకు సాధ్యం కానంత సత్వరంగా పనిచేస్తుంది. సహజ మేధలా అది అలసిపోవడం, మందగించడం లాంటివి ఉండవు. మనిషి అటువంటి కృత్రిమ మేధపై మరీ ఎక్కువగా ఆధారపడితే ఏమవుతుంది? లక్షల సంవత్సరాల మానవ అస్తిత్వంలో నిరుపయోగాలుగా మిగిలిన అపెండిక్స్, తోకఎముక లాంటి తొమ్మిది శరీర భాగాల సరసనే అతని సహజ మేధ కూడా చేరుతుందా?! ఇది మరీ విపరీత ఊహ అనుకున్నా, సహజ మేధ పదును తగ్గే ప్రమాదం మాత్రం తప్పకుండా ఉంటుంది. వివిధ సాంకేతిక సాధనాల వినియోగం దరిమిలా ఇతర శరీరభాగాల విషయంలో ఇప్పటికే మనకది అనుభవంలోకి వచ్చింది కూడా!

ఇటీవలి మరో సాంకేతికాద్భుతమైన ఇంటర్నెట్ ఆధారిత సామాజిక మాధ్యమాలనే చూడండి; సహజ మేధకు పనీ, పదునూ తగ్గుతున్న ఆనవాళ్ళు వాటిలో ఇప్పటికే కనిపిస్తున్నాయి. నేటి శాస్త్రవిజ్ఞాన ఆవిష్కరణలన్నీ యూరప్ వేదికగా మతనిర్బంధాల నుంచి సహజ మేధ బయటపడి సాంస్కృతిక పునరుజ్జీవన రూపంలో సంపూర్ణ వికాసం చెందుతూ వచ్చిన ఫలితాలేనని మనకు తెలుసు. మన దగ్గర ఉపనిషత్తుల కాలం అలాంటి వికాసాన్ని చూసింది. ఏదైనా ఒక అంశాన్ని అన్ని కోణాల నుంచీ కూలంకషంగా, సవిమర్శకంగా పరిశీలించడం, చర్చించడం, వ్యక్తీకరించడం అనే క్రమశిక్షణ అలా పాదుకుంటూ వచ్చింది. శ్రద్ధతోపాటు, తీరికా అందుకు అవకాశమిచ్చింది. పత్రికల వంటి ఆధునిక మాధ్యమాలలో స్థలకాల పరిమితులు ఆ క్రమశిక్షణను కొంత పలుచన చేసినా, గ్రంథముద్రణ ఆ లోటును చాలావరకూ పూరించగలిగింది. అదే సామాజిక మాధ్యమాలకు వస్తే, భావప్రకటన అనూహ్యమైన ప్రవాహవేగాన్ని తెచ్చుకోవడంతో ఆ క్రమశిక్షణ గణనీయంగా కొడిగట్టడం చూస్తున్నాం. వాటిలో అణువు నుంచి బ్రహ్మాండం వరకూ చర్చకు రాని అంశమే ఉండదు. కాకపోతే... లోతైన అధ్యయనమూ, అవగాహన, బహుముఖ పరిశీలనలకు బదులు రెండు, మూడు వాక్యాల అలవోక వ్యాఖ్యలకూ, పాక్షిక తీర్మానాలకూ, అపరిపక్వ నిర్ధారణలకూ అవి పరిమితమవుతున్నాయి. సహజ మేధలో తప్పిన ఆ క్రమశిక్షణను కృత్రిమమేధ అందిపుచ్చుకుంటున్నందుకు సంతోషించాలా, సహజ మేధ మొద్దుబారుతున్నందుకు విచారించాలా?!

సామాజిక మాధ్యమాలు భావప్రకటనను అందరికీ అందుబాటులోకి తేవడం గొప్ప మేలే కానీ; సహజ మేధకు అది చేస్తున్న కీడు సంగతేమిటి? ఎలక్ట్రానిక్ మీడియా సహా అధునాతన మాధ్యమాలు ప్రజాస్వామికమైన చర్చనూ, అధ్యయనాన్నీ పలుచన చేస్తున్న తీరును నీల్ పోస్ట్‌మన్ అనే అమెరికన్ రచయిత ఎప్పుడో నలభై ఏళ్ల క్రితమే ఎత్తిచూపాడు. అబ్రహాం లింకన్ కాలం నుంచీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో గంటల తరబడి ఎంత కూలంకషంగా వాగ్వాదాలు జరిగేవో; ఎలక్ట్రానిక్ మీడియా వచ్చాక వాటి సమయం ఎలా హరించుకుపోయిందో ‘ఎమ్యూజింగ్ అవర్ సెల్వ్స్ టు డెత్’ అనే పుస్తకంలో ఆయన వివరిస్తాడు. ఆయన ప్రభావం మరెందరి మీదో పడి ప్రచార మాధ్యమాలు సహా అత్యాధునిక సాంకేతిక విజ్ఞాన దుష్ప్రభావాల వైపు చూపు మళ్లించింది. ఆ క్రమంలోనే క్రిస్ హెడ్జెస్ అనే అమెరికా రచయిత ‘ఎంపైర్ ఆఫ్ ఇల్యూజన్’ అనే పుస్తకం వెలువరించాడు. మనం కూడా ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం తోసుకువచ్చిందా?!

భారత రత్న ఇవ్వాల్సిన మనిషి

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల మరణించిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారత రత్న’కు అన్ని విధాలుగా అర్హుడు. ఆయన సమర్థుడైన వ్యాపారవేత్త. దార్శనిక దృక్పథమున్న పారిశ్రామికవేత్త మాత్రమే కాదు... మనుషుల పట్ల సహానుభూతి, ఆప్యాయతలు కలిగిన మంచి మనిషి. రతన్ టాటాను చాలామంది కేవలం ఆరాధించలేదు; హీరోగా భావించారు. ఇప్పటికీ సమయం మించిపోలేదు. మరణానంతరమైనా ఆయనకు భారత రత్న ఇవ్వడం ద్వారా మనల్ని మనం గౌరవించుకునే పని మొదలు కావాలి. వేర్వేరు రంగాల్లో అర్హులైన వాళ్లు ఇంకా చాలామందే ఉన్నారు. వాళ్లకూ ఈ పురస్కారం దక్కి ఉంటే బాగుండేది. భారత రత్న విషయంలో రాజకీయ అనుకూలతల కంటే, అర్హతలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా ‘భారత రత్న’కు అన్ని విధాలుగా అర్హుడే. అయితే బతికున్న రోజుల్లోనే అవార్డు ఇచ్చి ఉంటే బాగుండేది. ఇటీవలే రతన్ టాటా మరణించిన నేపథ్యంలో మరణానంతరం ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇస్తారా?

మరణానంతరమైనా సరే... రతన్ టాటాకు భారత రత్న పురస్కారాన్ని ఇవ్వాలి అనేందుకు బోలెడు కారణాలు కనిపిస్తాయి. వాటిల్లో ఒకటి, ఆయన సమర్థుడైన వ్యాపారవేత్త. దార్శనిక దృక్పథమున్న పారిశ్రామికవేత్త కూడా. మనుషుల పట్ల సహానుభూతి, ఆప్యాయతలు కలిగిన మంచి మనిషి. అయితే ఇలాంటి లక్షణాలు కలిగిన వాళ్లు చాలామందే ఉన్నారు. టాటాను వీరందరి నుంచి వేరు చేసే లక్షణం ఏదైనా ఉందీ అంటే... అది ఆయన అందరి నుండి పొందిన గౌరవం, మర్యాద, మన్ననలు. రతన్ టాటాను చాలా మంది కేవలం ఆరాధించలేదు; హీరోగా భావించారు. ఒకరకంగా చెప్పాలంటే పూజించారు అనాలి! ఇలాంటి వాళ్లు కొందరే కొందరు ఉంటారు. వారిలో రతన్ టాటా ఒకరు!

రెండో విషయం... మనం ఆదర్శంగా భావించే వ్యక్తికి లభించే గుర్తింపు కూడా ఆ స్థాయిలోనే ఉండాలని ఆశిస్తాం. ఎందుకంటే వీళ్లు కేవలం సాధకులు మాత్రమే కాదు... చాలా ప్రత్యేకమైన వాళ్లు. అందుకే దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారం అలాంటి వారికి దక్కడం ఎంతైనా ఆహ్వానించదగ్గ విషయం.

దేశంలో ఇప్పటివరకూ 53 మందికి భారత రత్న పురస్కారం లభించింది. టాటా వీరందరిలోనూ ఉన్నతుడిగానే నిలుస్తారు. బి.సి. రాయ్, పి.డి. టండన్, కె. కామరాజ్, వి.వి. గిరి, ఎం.జి. రామచంద్రన్, రాజీవ్ గాంధీ, అరుణా అసఫ్ అలీ, గుల్జారీలాల్ నందా, గోపీనాథ్ బోర్డోలోయి, కర్పూరీ ఠాకూర్, చౌధురీ చరణ్‌సింగ్... లాంటి రాజకీయ నాయకుల విషయంలో అది నిజం కాదా?

ఇంకోలా చెబుతాను. మదర్ థెరీసా, ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, అమర్త్య సేన్, పండిట్ రవిశంకర్, లతా మంగేష్కర్, బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ జోషీ, సచిన్ టెండూల్కర్... అందరూ భారత రత్నకు అర్హుల నుకుంటే, రతన్ టాటాకు ఎలా కాదనగలం?



రతన్ నవల్ టాటా (28 డిసెంబర్ 1937 - 9 అక్టోబర్ 2024)

వాస్తవం ఏమిటంటే... ఈ అవార్డు ఇచ్చేది రాజకీయ నాయకులు. వాళ్లు ఎక్కువగా రాజకీయ నాయకులకే ఇస్తుంటారు. ఇప్పటివరకూ అందుకున్న 53 మందిలో 18 మంది మాత్రమే ఇతర రంగాల్లో అత్యున్నత ప్రతిభను కనబరిచినవారు. 1954 నుంచి తొలిసారిగా భారత రత్న పురస్కారం ప్రదానం చేయడం మొదలుపెట్టినప్పటి నుంచీ ఇప్పటి వరకూ ఒకే ఒక్క పారిశ్రామిక వేత్త, అత్యంత అర్హుడైన జేఆర్‌డీ టాటాకు మాత్రమే ఆ అవార్డు దక్కింది. అంతే!

వేర్వేరు రంగాల్లో అర్హులైన వాళ్లు ఇంకా చాలామందే ఉన్నారు. వాళ్లకూ ఈ పురస్కారం దక్కి ఉంటే బాగుండేదని నేను అనుకుంటూ ఉంటాను. బాలీవుడ్ నటుడు దిలీప్‌కుమార్, అమితాబ్ బచ్చన్, ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా, సల్మాన్ రుష్దీ, జూబిన్ మెహతా వంటి వాళ్లు ఒక్కొక్కరూ తమ వైయక్తిక ప్రతిభతో ఆ యా రంగాల్లో అత్యున్నత శిఖరాలను అందుకున్న వారే. ప్రపంచం వీరి ప్రతిభను గుర్తించింది, కీర్తించింది. దురదృష్టవశాత్తూ మనం ఆ పని చేయలేకపోయాం.

ఇప్పటికీ సమయం మించిపోలేదు. రతన్ టాటాకు భారత రత్న ఇవ్వడం ద్వారా మనల్ని మనం గౌరవించుకునే పని మొదలు కావాలి. బి.ఆర్.అంబేడ్కర్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, అబుల్ కలామ్ ఆజాద్, మదన్‌మోహన్ మాలవీయా వంటి వారికి మరణానంతరం దశాబ్దాల తరువాత భారత రత్న ఇవ్వగలిగినప్పుడు... 2008లో మరణించిన ఫీల్డ్ మార్షల్ మానెక్‌షాకు, 2021లోనే కన్ను మూసిన దిలీప్‌కుమార్‌తోపాటు మనతోనే ఉన్న అమితాబ్ బచ్చన్, సల్మాన్ రుష్దీ, జూబిన్ మెహతా వంటి వారిని భారత రత్నతో సత్కరించడం సాధ్యమే!

అయితే ఇక్కడ మనం ఇంకో నిష్ఠుర సత్యాన్ని అర్థం చేసుకోవాలి. భారత రత్న విషయంలో రాజకీయ అనుకూలతల కంటే అర్హతలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. పేర్లు అవసరం లేదు. వారి భేషజాలను దెబ్బతీయాలన్న ఆలోచన కూడా నాకు లేదు. కానీ, వారందరూ రాజకీయ నేతలే. జవహర్‌లాల్ నెహ్రూతో మొదలుపెట్టి... నరేంద్ర మోదీ వరకూ అన్ని ప్రభుత్వాలూ ఈ పని చేశాయి.

విషాదం ఏమిటంటే... మనం తరచూ కొంతమంది అనర్హులకు భారత రత్న ఇచ్చాం. ఇంకోలా చెప్పాలంటే అర్హులకు నిరాకరించాం. ఎలాగైతేనేం, ఆ అవార్డు గౌరవమైతే మసకబారింది.

అర్హులకు ఇవ్వలేదు, అనర్హులకు ఇచ్చారన్న వాదాన్ని కాసేపు పక్కనపెట్టి... జరిగిన దానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిన సమయం ఇదే. దేశమాత అసలు ఆణిముత్యాలను ప్రజలెప్పుడూ గుర్తుంచుకుంటారు. సందేహం ఏమీ లేదు. రతన్ టాటా అంత్యక్రియలకు హాజరైన వేలాది మంది సామాన్యులు ఈ విషయాన్ని మరోసారి నిర్ధరించారు. వార్తాపత్రికల్లో పేజీలకు పేజీ కథనాలు, టెలివిజన్ ఛానళ్లలో గంటల లైవ్ కవరేజీలన్నీ రతన్ టాటాపై ఈ దేశ ప్రజలకు ఉన్న అభిమానాన్ని చాటేవే! ఎవరూ కాదనలేని సత్యమిది. అలాగని రాజ్యం ఆయనను గుర్తించదంటే మాత్రం సరికాదు. నన్నడిగితే అలా చేయడం క్షమించలేనిది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పేదల కోసం కాదు!



నగరీకరణ అనేది ధనవంతుల కోసం, ధనవంతుల చేత జరిగేది మాత్రమే! భారత నగరీకరణ గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఇంతే!

- హెన్రీ ఫాంథోమ్, ఆర్కిటెక్ట్

విశ్వాసమే బ్రాండ్



ఇంతకుముందు ఒక ‘బ్రాండ్’ను నిర్మించడం అంటే ‘విశ్వాసాన్ని’ నిర్మించడం! కానీ ఇప్పుడు దానర్థం ఒక పెద్ద కంపెనీని నిర్మించడంగా మారిపోయింది.

- రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

నవల రాస్తారా?



ఈ సంవత్సరంలో కొత్త నవల ఎలా మొదలుపెట్టాలి? 1. మీ పాత్రలేమిటో తేల్చుకోండి. 2. వాటికేం జరుగుతుందో ఆలోచించండి – అది మీ ఇతివృత్తం. 3. అది ఎక్కడ జరుగుతుందో ఆలోచించండి– అది మీ నేపథ్యం. 4. అది ఎందుకు ముఖ్యమో ఆలోచించండి– అది మీ థీమ్. 5. అది ఎలా మొదలై, ఎలా ముగుస్తుందో ఆలోచించండి– అది మీ నిర్మాణం. సింపుల్!

- మేరు గోఖలే, పబ్లిషర్

ఒపీనియన్ పోల్



కావాలంటే రాసిస్తాను. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలవనుంది. నా మాటను గుర్తు పెట్టుకోండి.

- టెంజింగ్ లామ్‌సాంగ్, భూటాన్ సంపాదకుడు

తెలియాల్సిన మథనం



భారత గణితశాస్త్రజ్ఞులు తత్వశాస్త్రం రాయకపోవడం విచారకరం. రుణ సంఖ్యలు రాస్తున్నప్పుడు బ్రహ్మగుప్తుడి మనసులో ఏం జరుగుతోంది? ఒకటిని అనంతంతో భాగిస్తున్నప్పుడు భాస్కరుడు ఏం ఆలోచిస్తున్నాడు? కలన గణితానికి దారులు వేస్తున్నప్పుడు మాధవుడి ఆలోచనలేమిటి? సున్నా సత్యానికి ప్రాతినిధ్యమని రామానుజుడు ఎందుకు అభిప్రాయపడ్డాడు?

- జోసెఫ్ టి. నూనీ, థింకర్

చిన్నవే పెద్దవి



జీవితం మనల్ని మరింత అణకువగా మార్చుతుంటుంది. మనం పెద్దవాళ్లం అవుతున్నకొద్దీ, పెద్ద విషయాల వెంట పడటం మాని చిన్న విషయాలకు విలువ ఇవ్వడం మొదలుపెడతాం. ఏకాంత సమయం, సరిపోయేంత నిద్ర, మంచి పోషణ, స్నేహాలు, దీర్ఘ నడకలు, ప్రియమైనవాళ్లతో నాణ్యమైన సమయం గడపడం... మనశ్శాంతే నిజమైన సంపద అవుతుంది. సింపుల్‌గా ఉండటమే అత్యున్నత లక్ష్యం అవుతుంది.

- వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

దేశ ద్రోహం



మీరు వెర్రిగా కాంగ్రెస్‌నో, బీజేపీనో సమర్థిస్తూ ఉండవచ్చు; లేదా ఒక ప్రాంతీయ పార్టీ మీద అలాంటి అభిమానమే ఉండవచ్చు. అవన్నీ అనవసరం. కానీ మీరు ‘రా’నో, సైన్యాన్నో, ‘ఎన్ఐఏ’నో, ‘ఏటీఎస్’నో వ్యతిరేకిస్తున్నారంటే మాత్రం మీరు మీ మాతృదేశానికి ద్రోహం చేస్తున్నట్లే!

- ఖాలిద్ బేగ్, యూట్యూబర్

ఇన్‌బాక్స్

ఆ స్ఫూర్తితో...

గత నెలలో 57 వ ఇంజనీర్స్ డే (మోక్ష గుండం విశ్వేశ్వరయ్య 163 వ జయంతి) సందర్భంగా దేశమంతా ఆయన చేసిన గొప్ప పనులు తలుచుకున్నది. శతాబ్ద కాలం జీవించిన ఆయన పనులు కూడా చిర కాలం గుర్తుంచుకోవాల్సినవే. ఖడక్ వాసలలో ఆటోమేటిక్ ఫ్లడ్ గేట్స్ నిర్మించారు. కర్ణాటకలో భద్రావతి ఉక్కు కర్మాగారం నిర్మించారు. ఈనాటికీ నూతన వధూవరులు హనీమూన్ యాత్రకి చాలా ఇష్టపడే బృందావన్ గార్డెన్స్‌ని కావేరినదిపై నిర్మించిన కృష్ణరాజసాగర్ అనకట్ట దిగువన సృష్టించారు. పూనాలో దక్కన్ క్లబ్, కర్ణాటకలో మైసూర్ బ్యాంకు ఏర్పాటు చేశారు. బ్రిటిష్ వారు ‘సర్’ బిరుదు నిచ్చి గౌరవించారు. ఆయన గొప్పతనం గుర్తించి, నెహ్రూ 1955లో ఆయనను ‘భారతరత్న’తో సత్కరించారు.

మనకు విజయవాడలో బుడమేరు వరదల లాగా, 1908లో హైదరాబాదులో మూసీ నది వరదలొచ్చాయి. హైదరాబాద్‌లో వేల కొలది మనుషులు, పశువుల ప్రాణాలు పోయాయి. చాలా ఆస్తి నష్టం జరిగింది. అప్పుడు హైదరాబాద్ నిజాం విశ్వేశ్వరయ్యను నగరాన్ని రక్షించడానికి ఆహ్వానించారు. వరద నివారణ చర్యలలో భాగంగా మూసీ బెడ్ లోతు చేశారు. నది ప్రవాహంలో ఇరుకు ప్రాంతాలు వెడల్పు చేశారు. ఇరుపక్కల కట్టలు బలిష్ఠం చేశారు. ఉస్మాన్ సాగర్, నిజాంసాగర్ మంచినీళ్ళ చెరువులు తవ్వించి, వరదనీటిని ఆ చెరువులలోకి మళ్ళించారు. దాంతో ఒక బాణానికి రెండు పిట్టల్లా నగరానికి వరద ముంపు, మంచినీళ్ళ సమస్య తీరిపోయాయి. దశాబ్దం కిందటి వరకు ఆ చెరువుల నీళ్లు హైదరాబాద్ నగరానికి సరిపోయాయి.

మరి బుడమేరు వరద విజయవాడ నగరాన్ని ముంచింది. తీవ్ర నష్టం కలుగచేసింది. మనం కూడా విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో విజయవాడను కాపాడలేమా? బుడమేరు నీటిని వాడగలిగితే వరద నివారణ, సాగు/తాగు నీరు సమస్యలు తీరడం, ఫ్లోరోసిస్ నుండి రక్షణ కలగడం... ఇలా మూడు అవసరాలు తీరతాయి.

- శ్రీరామ । 83095 77123

తొలి నిఘంటుకర్త - సంస్కరణవాది

సందర్భం




గౌరవ్

మామిడి వెంకటార్యగా ప్రసిద్ధి చెందిన మామిడి వెంకయ్య స్వస్థలం పాలకొల్లు. నేటికి రెండు శతాబ్దాల క్రితం యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి అకారాది తెలుగు నిఘంటువును రూపొందించిన మహావ్యక్తి వెంకయ్య. ‘ఆంధ్ర దీపిక’ పేరిట వెంకయ్య కూర్చిన ఈ నిఘంటువును ఆ రోజుల్లో వెయ్యి వరహాలిచ్చి చెన్నై కళాశాల తరపున బ్రిటిష్‌వారు తీసుకున్నారని ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో రాశారు. ఆయన సంస్కృతాంధ్ర పండితుడు. పండితరాయ, సాహిత్యరత్న వంటి బిరుదులు కలిగిన మామిడి వెంకయ్య భాషావేత్త మాత్రమే కాదు; దేశంలోనే తొలితరం భావోద్యమ (సాంఘిక విప్లవ) చింతనాపరుల్లో ఒకరనే విషయం చాలా మందికి తెలియదు. ఆ రోజుల్లో బ్రాహ్మణులకు మాత్రమే కలదనే యాజకత్వ పౌరోహిత్య హక్కులను ప్రశ్నిస్తూ స్వయంగా వేదవేదాంగ ఉపనిషత్తుల్ని అధ్యయనం చేశారాయన. కొడుకు ఉపనయనం తానే శాస్త్రోక్తంగా జరిపించారు. అందువల్ల ఎదురైన పర్యవసానాల్ని కూడా ధైర్యంగా ఎదుర్కొన్నారు. జిల్లా కోర్టుల సంగతలా ఉంచితే, రెండొందల ఏళ్ళ క్రితమే ఏకంగా ఇంగ్లాండు ప్రివీ కౌన్సిల్ వరకూ వెళ్ళి పోరాటం చేసిన ప్రజాపక్ష బుద్ధిజీవి.

తెలుగునాట తిరుగులేని హేతువాదిగా ఖ్యాతినొందిన రావిపూడి వెంకటాద్రి మూడు దశాబ్దాల క్రితం కొద్దిమంది భావోద్యమ కారుల్ని పరిచయం చేస్తూ ‘అడుగుజాడలు’ అనే పుస్తకం రాశారు. అందులో మొట్టమొదటి ప్రకరణాన్నే, ‘మామిడి వెంకయ్య మానవ హక్కుల పోరాటం’ అని పేర్కొన్నారు. అందులో ‘పురోహితవర్గం మీద ఈ దేశంలో ఆధునిక యుగంలో జరిగిన తొలి తిరుగుబాటు చేసిన వారు వైశ్యులు. వారికి నాయకత్వం వహించిన పండితుడు మామిడి వెంకయ్య’ అంటారు. అఖిల భారత హేతువాద సంఘానికి ఛైర్మన్‌గా సుదీర్ఘ కాలం ఉన్న ప్రముఖ భావోద్యమ నేత వెంకయ్యకి సమర్పించిన సగౌరవ నివాళి అది.

ప్రపంచంలోనే విశిష్టమైన మానవ హక్కుల పత్రంగా పేరొందిన థామస్ పెయినే ‘రైట్స్ ఆఫ్ మేన్’ (1791) కానీ, కార్ల్‌మార్క్స్, ఏంగిల్స్‌ల ‘కమ్యూనిస్టు ప్రణాళిక’ (1848) కానీ మామిడి వెంకయ్య పోరాటం నాటికి ఇంకా వెలువడలేదు. ఆయన మరణించిన వందేళ్లకు డా॥ బీఆర్ అంబేడ్కర్ ‘కుల నిర్మూలన’ (1935) వెలువడింది. ఆయన జీవితాంతం సకల న్యాయస్థానాల్లోనూ చేసిన సుదీర్ఘమైన పోరు కూడా ఆయన బతికుండగా ముగియలేదు. మరణించిన దశాబ్దం తరువాత ప్రివీ కౌన్సిల్ బ్రాహ్మణులకు అనుకూలంగా తన తీర్పు ప్రకటించింది. ఈ దేశంలోని కులాహంకారాన్ని ఎదిరించడానికి ఆధిపత్య వర్గాలతో తలపడి చట్టబద్ధమైన ఉద్యమాన్ని ఏకవ్యక్తి సైన్యంగా చేసిన మామిడి వెంకయ్య కృషి మాత్రం మరుగున పడిపోయింది. ఆయన జీవించిన కాలం నాటికి (1764– 1834) అసలు దేశంలోని భావోద్యమాలేవీ ప్రారంభమే కాలేదు. రాజా రామ్మోహన్ రాయ్, జ్యోతీరావు పూలేలు ఇంకా రంగ ప్రవేశం చేయలేదు సరికదా దయానందులు పుట్టనే లేదంటారు రావిపూడి వెంకటాద్రి. తెలుగు నేల మీద రెండు వందల సంవత్సరాల క్రితం కులాధిక్యతను ప్రశ్నించిన పోరాటం ఎందుకనో విస్మరణకు లోనై వెలుగులోకి రాలేదు.





మామిడి వెంకయ్య

తెలుగు భాషా ఉద్ధారకుడైన సీపీ బ్రౌన్ వంటి ఎందరో ఔత్సాహిక పరిశోధకులకు మామిడి వెంకయ్య చేసిన కృషి, వేసిన అడుగులే మార్గదర్శకమయ్యాయని వారే స్వయంగా చెప్పుకున్నారు. బళ్ళారి కలెక్టరుగా పనిచేసి, ‘గ్రామర్ ఆఫ్ ది తెలుగు లాంగ్వేజ్’ అనే విశిష్ట వ్యాకరణ గ్రంథం రచించిన క్యాంప్‌బెల్ పండితుడు ఆ పుస్తకం పీఠికలో వెంకయ్య కృషిని శ్లాఘించారు. 1965లో మచిలీపట్నం నుండి ముద్రించిన ‘ఆంధ్రదీపిక’ మలిప్రచురణకు ముందుమాట రాసిన శుద్ధ చైతన్యస్వామి, ‘అన్ని నిఘంటువులకూ ఆంధ్ర దీపిక తల్లి యనవలెను’ అన్నారని పేర్కొంటారు డా॥ జీవీ పూర్ణచందు ‘ఆంధ్ర దీపిక ప్రశస్తి’ అనే పరిశోధనాత్మక వ్యాసంలో.


ఇంతటి ప్రతిభాశాలి కనుకనే వెంకయ్య యాజ్ఞవల్క్యుని ‘పరాశర సంహిత’ను తెలుగులోకి అనువదించడమే కాక, ‘ఆంధ్రలక్షణం’, ‘పర్యాయ పదాల రత్నమాల’, ‘శకట రేఫ లక్షణం’, ‘విశేష లబ్ధ చింతామణి’, ‘తెలుగు వ్యాకరణం’ వంటి గ్రంథాల్ని రచించారు. దురదృష్టవశాత్తూ భాషాభిమానులు, వ్యాకరణవేత్తలే తప్ప భావోద్యమ సంస్థలేవీ వెంకయ్య జీవితం, కృషిపై పరిశోధన చేయలేదు. ఆ కారణంగా ప్రస్తుతం లభిస్తున్న వివరాలు పరిమితమైనవే. గ్రంధి వెంకట సుబ్బారాయ శర్మ (గుప్తా) 1930 లోనూ, పి. లక్ష్మీకాంతం శ్రేష్ఠి 60వ దశకంలోనూ రచించిన చిరు పొత్తాలే కానీ ఔత్సాహికులు ఎవరూ పూనుకుని సమగ్ర శోధన చేసినట్టు లేదు.

మానవాళి మనుగడకి భావన... ప్రజాతంత్ర వారధి అయితే, భాష... సాంస్కృతిక సారథి. ఆధునిక మానవుడి చరిత్రకి భావోద్యమాలు ప్రాణమైతే, వాటి విస్తృతికి భాష అర్థవంతమైన పునాది. అలాంటి వాడుక భాషలోని ఎన్నో పదాల్ని రేయింబవళ్ళు కష్టపడి చదువరులకి సులువుగా అందేలా కూర్చిన ఘనత మామిడి వెంకయ్యది. అలాగే, భావోద్యమశీలిగా కూడా ఎదిగిన ఆయన జనన మరణ వివరాల్లో ఎన్నో వివాదాలు ఉన్నప్పటికీ, ఆధునికాంధ్ర జగత్తులో నవోదయానికి నాంది పలుకుతూ ఆయన రూపొందించిన ‘ఆంధ్రదీపిక’ నిఘంటువు నాటి నుండి ఎందరెందరికో దారిదీపమై ప్రవర్ధిల్లుతోంది. యావత్ దేశంలోనే తొలి నిఘంటు కర్తగా భాసించిన మామిడి వెంకటాచార్యను అరుదైన భావోద్యమ కారుడిగా కూడా గుర్తించడం సబబు. జాతి ఉన్నతి కోసం ఉద్యమించిన ప్రతి స్వరాన్నీ అదే తరంలోనైనా ఆ మేరకు గుర్తించి గౌరవించడమే మామిడి వెంకయ్య వంటి ధీరోదాత్తులకు మనం ఇవ్వదగిన కనీస నివాళి.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త । 90320 94492

మందు లేని రోగం!

అవంతీపురాన్ని పాలించే రాజు విక్రమాదిత్యుడు. సంవత్సరంలో ఆరు నెలలు తమ్ముడైన భట్టికి రాజ్య సంరక్షణ భారం అప్పగించి మారువేషంలో దేశాటనం చేసేవాడు. అలాంటి ఒక సందర్భంలో, ఒక బిచ్చగాడి వేషంలో ఒక పాడుబడిన గుడిలో పడుకుని ఉండగా, ఒక పేద బ్రాహ్మణుడు అటుగా వెళుతూ తాను కూడా సేదదీరుదామని వచ్చి, విక్రమాదిత్యుడిని చూసి, సందేహపడి వివరం అడిగాడు. ‘నీవు ఊహించినది నిజమే! అవంతిని పాలించే విక్రమాదిత్యుడిని నేను. మిగతా ప్రదేశాలలో వింతలు విశేషాలను చూడాలన్న కోరికతో మారు వేషంలో ఇలా దేశాటనం చేస్తుంటాను!’ అని నిజాన్ని దాచకుండా చెప్పాడు విక్రమాదిత్యుడు. విక్రమాదిత్యుడి మాటలకు ఆశ్చర్యపోయిన ఆ పేద బ్రాహ్మణుడు ‘పట్టుబట్టలు కట్టుకోవాల్సిన శరీరాన్ని కష్టపెడుతూ, జోగివై చినుగుల బొంతను ఎందుకు ధరించడం? హంసతూలికా తల్పం మీద హాయిగా నిద్రించాల్సి ఉండగా, బూడిద నిండి ఉన్న నేల మీద పడుకుని దొర్లడం ఏమంత గొప్ప పని? ప్రసిద్ధి వహించిన రాజ్యానికి ప్రభువు ఊరూరా తిరుగుతూ తిరిపెమెత్తి భుజించడం ఏమిటి? అష్టైశ్వర్యాలను అనుభవించాల్సి ఉండగా, అష్టకష్టాలను కొని తెచ్చుకుని మరీ అనుభవించడం ఎందుకు?’ అని తన ఆశ్చర్యాన్ని దాచుకోకుండా ప్రకటించి, ఇంకా ఇలా అన్నాడు:



జ్యోతిర్మయం

కం. ననుబోటి పేదయైనను
ధనమించుక కలిగెనేని దనమది ద్రక్కం
దన వనితాది సుఖంబుల
మనగోరుం బసరమైన మరగడె సుఖముల్.

‘నాలాంటి పేదవాడు కూడా అదనంగా డబ్బు సమకూరితే, తాను నిత్యం అనుభవించలేని భోగాలను పొందడం కోసం ఆ డబ్బు మొత్తాన్నీ ఖర్చు పెడతాడు. కాయకష్టం చేసే పశువు కూడా అవకాశం వస్తే సోమరిదై సుఖించడం మానదు కదా!’ అని ‘సింహాసన ద్వాత్రింశిక’ నవమాశ్వాసంలోని పై పద్యం భావం. సోమరితనం మనుషులనే కాదు, పశువులను కూడా పీడిస్తుందని కథలోని పేదబ్రాహ్మణుడి మాటల ద్వారా నర్మగర్భంగా చెప్పాడు కొఱవి గోపరాజు. మనిషి కష్టపడాలి. అది శారీరకమా లేక బుద్ధితో చేసే కష్టమా అన్నది ఆయా వ్యక్తుల జీవిత విధానానికి సంబంధించినది. వందేళ్ళు ఆరోగ్యంగా బతకాలని కోరుకునే మనిషి, అదే వందేళ్ళు కష్టపడి బతికే అవసరం తనకు ఉండాలని కోరుకోవడం విజ్ఞత అనిపించుకుంటుంది. సోమరి తనం వదిలించుకోలేని జాడ్యం. ఎంత డబ్బు వెచ్చించినా ఆ జాడ్యానికి మందు దొరకదు.

- భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.58 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** రోహిణి ప.12.12 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** సా.5.40 నుండి 7.12 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.10 నుండి 12.58 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.17 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.06 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.57, **సూర్యాస్తమయం:** 5.33.

క్లుప్తంగా...

షార్ట్‌సర్క్యూట్‌తో ఆస్పత్రిలో చెలరేగిన మంటలు

- భయంతో రోగుల పరుగులు.. నిర్మల్ జిల్లాలో ఘటన


ఆస్పత్రి వార్డులో మంటలు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని జనరల్ ఆసుపత్రిలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులోని శానిటేషన్ సామగ్రి భద్రపర్చే గదిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నిమిషాల్లో మంటలు, పొగ అన్ని వార్డులను చుట్టుముట్టాయి. దీంతో రోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. నడవలేనివారిని బంధువులు, ఆస్పత్రి సిబ్బంది బయటకు తీసుకెళ్లారు. ప్రమాదంలో రెండో వార్డులోని ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. అధికారుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఆస్పత్రికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రివర్గాలు, పోలీసులు చెబుతున్నారు. రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

పరిగి/రామన్నపేట: విద్యుదాఘాతంలో ఇద్దరు రైతులు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగంపల్లి గ్రామానికి చెందిన ఎల్చెర్ల బాలరాజ్(34) పొలం పనులు ముగించుకొని తల్లి పార్వతమ్మ, అన్న రాములుతో కలిసి శనివారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి పొలాన్ని వెంకటయ్య కౌలుకు తీసుకొని వేరుశనగ సాగు చేశారు. అడవి పందుల బెడద అధికంగా ఉండటంతో పంట చుట్టూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో బాలరాజ్ ముందు నడుచుకుంటూ వస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు విద్యుత్ కంచెకు ఆయన కాలు తగిలి షాక్‌తో అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. కళ్లెదుటే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

- యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం) గ్రామానికి చెందిన మహిళారైతు ఆవుల పద్మ(56) ఆదివారం ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లింది. దారిలో సింగారపు అశోక్ పొలంవద్ద శనివారం రాత్రి పిడుగుపాటు వల్ల తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.


ఆవుల పద్మ

పనుల్లేక.. అప్పులు తీర్చలేక..

- నేతకార్మికుడి బలవన్మరణం


సంపత్

సిరిసిల్లటౌన్: పది నెలలుగా పనుల్లేక, చేసిన అప్పులు చెల్లించలేక కుటుంబ బాధ్యతలు మోయలేని పరిస్థితుల్లో సిరిసిల్లలో ఓ నేతకార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కార్మికక్షేత్రం సిరిసిల్లలో ఈ విషాద సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఆడెపు సంపత్ (51) సాంచాలు నడిపే కార్మికుడు. భార్య భాగ్య బీడీలు చుడుతుంటుంది. ఇటీవలే దివ్యాంగురాలైన కూతురు కవిత గర్భందాల్చింది. ప్రసవ సమయం కూడా దగ్గరపడుతోంది. పది నెలలుగా సాంచాల పనిలేక సంపత్ ఖాళీగానే ఉంటున్నాడు. సొంతిల్లు లేకపోవడం, అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో పాటు కుటుంబ నిర్వహణ కష్టమైన నేపథ్యంలో సంపత్ ఆదివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీ:180 గొర్రెలు మృతి

- 10 మేకలు కూడా..


మృతి చెందిన గొర్రెలు, మేకలు

సిర్పూర్(టి): ఓ రైలు ఢీకొని180 గొర్రెలు, 10 మేకలు మృతి చెందాయి. స్థానికులు, యజమాని తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం శీర్షా గ్రామానికి చెందిన జడ భీమయ్య తన 180 గొర్రెలు, 10 మేకలతో సంచారజీవనం సాగిస్తూ ఉపాధి పొందుతున్నాడు. రోజువారీ లాగానే శనివారం రాత్రి సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌కు సమీపంలోని అటవీప్రాంతానికి చేరుకున్నాడు. మందను నిలిపి సమీపంలో పడుకున్నాడు. రాత్రి ఒక్కసారిగా వర్షం కురవడంతో గొర్రెలు అక్కడి నుంచి రైల్వే ట్రాక్‌పైకి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఓ రైలు 180 గొర్రెలు, 10 మేకలను ఢీకొట్టింది. ఉదయం నిద్రలేచిన యజమాని గొర్రెల కోసం గాలించగా, ట్రాక్‌పై సుమారు కిలోమీటరు పొడవునా కళేబరాలు కనిపించాయి. దీంతో బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు రూ.15 లక్షల నష్టం జరిగిందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల అర్హులను తేల్చనున్న యాప్

- ఇప్పటికే ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు ఉపయోగిస్తున్న కేంద్రం
- ఆ యాప్‌నే వినియోగించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- పట్టణ ప్రాంత లబ్ధిదారుల ఎంపికకు మరో యాప్



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తుదారుల్లో ఎవరు అర్హులు..ఎవరు కాదు అన్న విషయాన్ని ఓ యాప్ తేల్చనుంది. అర్హత ఉంటే దరఖాస్తు ప్రాసెస్ ముందుకు సాగుతుంది..లేకుంటే డిలీట్ అవుతుంది. రాష్ట్ర అధికారులు ఈ యాప్ ఆధారంగా త్వరలో సర్వే ప్రారంభించబోతున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ కాదు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు దీన్ని తయారు చేసింది. దానినే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వినియోగించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు చొప్పున మంజూరు చేసి రాష్ట్రవ్యాప్తంగా 4.16 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటిదశలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది చివరలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించే కార్యక్రమం చేపట్టబోతున్నారు. దీనికి సంబంధించి దసరా ముందు రోజు ఇందిరమ్మ కమిటీ మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గ్రామ, పట్టణ స్థాయి కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ సభ్యులు ఇందిరమ్మ పథకానికి అర్హులను తేల్చటంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. ఇందులో ఈ కమిటీ సభ్యుల కంటే.. ఓ యాప్ మరింత క్రియాశీలంగా వ్యవహరించబోతోంది. నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్రం ఓ యాప్‌ను రూపొందించింది. అందులో ప్రభుత్వ ఇళ్లు పొందాలంటే ఉండాల్సిన అర్హతలను ఫీడ్ చేసి ఉంచారు. ఇప్పుడు అవే నిబంధనలను రాష్ట్రాలు కూడా కచ్చితంగా అనుసరించాలని, అప్పుడే ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులు పొందేందుకు అర్హత ఏర్పడుతుందని కేంద్రం స్పష్టం చేసింది. దీనికి అంగీకరిస్తే, ఆ యాప్ ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక జరగాలి. కేంద్రం నుంచి ఎక్కువ మొత్తంలో పీఎంఏవై నిధులు పొందాలని భావిస్తున్న తెలంగాణ ప్రభుత్వం..ఆ నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రం రూపొందించిన యాప్ ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టబోతోంది.

ముందుగా దరఖాస్తుల ఫీడ్

ప్రజాపాలన, ఇతర పద్ధతుల్లో అధికారులకు అందిన దరఖాస్తులను ఈ యాప్‌లో ఇప్పుడు ఫీడ్ చేయబోతున్నారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన వివరాలను యాప్‌లో ఫీడ్ చేయగానే, ఈ పథకానికి దరఖాస్తుదారుకు అర్హత ఉందా లేదా అన్నది అది తేల్చనుంది. అందులో అర్హత ఉందని తేలిన దరఖాస్తులనే ఇప్పుడు పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. వాటి ఆధారంగానే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యక్షంగా అర్హతను బేరీజు వేస్తారు. అలా అర్హుల జాబితా సిద్ధం కాగానే.. ఆ వివరాలను కూడా ఆ యాప్ ఆధారంగా కేంద్రం ముంగిట ఉంచుతారు. వాటిని కేంద్ర ప్రభుత్వ అధికారులు కూడా పరిశీలిస్తారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన యాప్‌ను మాత్రమే రూపొందించింది. దాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోనుంది. పట్టణ ప్రాంతాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో యాప్‌ను రూపొందించుకుంటోంది. దాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ యాప్‌తో అనుసంధానించనున్నారు. దీంతో ఈ రెండు యాప్‌ల వివరాలు కేంద్రం ముందు ఎప్పటికప్పుడు ప్రత్యక్షమవుతాయి. ఆ వివరాల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

హైదరాబాద్–వరంగల్ మధ్య ఎలక్ట్రిక్ బస్సులు

- రాష్ట్రంలో రెండో పెద్ద నగరానికి 82 బ్యాటరీ బస్సుల కేటాయింపు
- త్వరలో విడతల వారీగా ప్రారంభం
- వరంగల్ నుంచి కరీంనగర్, నిజామాబాద్‌లకూ సర్వీసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా విస్తరిస్తున్న వరంగల్‌కు భారీగా ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. త్వరలో ఇవి రాకపోకలు సాగించనుండగా, దశలవారీగా మొత్తం 82 ఎలక్ట్రిక్ బస్సులను వరంగల్–హైదరాబాద్ మధ్య నడపనున్నారు. ఇందులో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ (18), డీలక్స్ (14), సెమీ డీలక్స్ (21), ఎక్స్‌ప్రెస్ (29) కేటగిరీ బస్సులున్నాయి. ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ఈ బస్సులను నిర్వహిస్తుంది. తెలంగాణలో తొలిసారి ఒలెక్ట్రా కంపెనీ బ్యాటరీ బస్సులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ సంస్థ రెండు పర్యాయాలు బస్సులను సరఫరా చేసి నిర్వహిస్తోంది. మూడో ప్రయత్నంలో ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ టెండర్ దక్కించుకుంది. ఇటీవలే కొన్ని బస్సులను కరీంనగర్, నిజామాబాద్ నుంచి ప్రారంభించింది. కానీ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత జనాభా, విస్తీర్ణం పరంగా పెద్ద పట్టణమైన వరంగల్‌కు ఎక్కువ బస్సులు కేటాయించాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు 82 బస్సులు కేటాయించారు. వీటిని వరంగల్–2 డిపో ఆధ్వర్యంలో నడుపుతారు.

సింహభాగం బస్సులు హైదరాబాద్‌కే..

హైదరాబాద్–వరంగల్ మధ్య బస్సులు ఎక్కువగా ఉంటాయి. నిత్యం రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుండటంతో ఎక్కువ సర్వీసులు తిప్పుతారు. ఈ నేపథ్యంలోనే రెండు ప్రాంతాల మధ్య అదనంగా కొత్త బస్సులను తిప్పాలని సంస్థ నిర్ణయించింది. జేబీఎం సరఫరా చేసేవరకు కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ఎలక్ట్రిక్ బస్సులు తిప్పుతున్నారు. కాగా తొలిసారి హైదరాబాద్ వెలుపల (హైదరాబాద్–విజయవాడ కాకుండా) ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఇక వరంగల్‌కు సరఫరా చేసే ఎలక్ట్రిక్ బస్సుల్లో మూడొంతులు హైదరాబాద్ రూట్‌లోనే తిప్పనున్నారు. వరంగల్–2 డిపోలో సిద్ధం చేసిన సెంటర్‌లో బ్యాటరీ చార్జ్ చేసి పంపిన తర్వాత, తిరుగు ప్రయాణం కోసం మళ్లీ చార్జ్ చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లో చార్జింగ్ పాయింట్లు ఉన్నందున హైదరాబాద్‌కే ఎక్కువ బస్సులు తిప్పనున్నారు. కరీంనగర్, నిజామాబాద్‌ల్లో ఇప్పటికే చార్జింగ్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. దీంతో కొన్ని బస్సులను వరంగల్ నుంచి ఆ రెండు నగరాలకు కూడా నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్‌కు ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు తిప్పనున్నందున.. ప్రస్తుతం హైదరాబాద్–వరంగల్ మధ్య నడుస్తున్న డీజిల్ బస్సుల్లో కొన్నింటిని తప్పించి వరంగల్ నుంచి ఇతర ప్రాంతాల మధ్య నడపనున్నారు.

చదువు ఇష్టం లేదని గురుకుల విద్యార్థిని ఆత్మహత్య


నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

మిర్యాలగూడ అర్బన్/నల్లగొండ టౌన్: గడ్డిమందు తాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆదివారం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ పరిధిలోని సాత్‌తండాకు చెందిన ఆర్.శిరీష(15) మిర్యాలగూడలోని గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికెళ్లిన బాలిక సెలవులు ముగిసిన తరువాత ఈ నెల 18న మధ్యాహ్నం తన తండ్రితో కలిసి పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం 6 గంటల సమయంలో తనకు కళ్లు తిరుగుతున్నాయని తోటి విద్యార్థినులతో చెప్పగా.. వారు హాస్టల్లో ఉన్న స్టాఫ్‌నర్సు వద్దకు తీసుకెళ్లారు. నర్సు ఆరా తీయగా పాఠశాలకు వచ్చే ముందు ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగానని శిరీష చెప్పింది. దీంతో వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆ బాలికను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించి.. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లిదండ్రులు సొంతూరు సాత్‌తండాలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. తమ కూతురు చదువు ఇష్టంలేదని చెప్పినా బలవంతంగా హాస్టల్‌కు పంపామని, అందుకే ఆత్మహత్య చేసుకుందని బాలిక తల్లి స్వాతి టూ టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగార్జున పేర్కొన్నారు. కాగా, వైద్యుల నిర్లక్ష్యంతోనే విద్యార్థిని మృతి చెందిందని ఆరోపిస్తూ శిరీష బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు.

ఏఈఓలు పనిభారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

ఏఈఓల రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్


ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

శామీర్‌పేట: పనిభారంతో వ్యవసాయ విస్తరణ అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఈఓల రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ చైర్మన్ బదావత్ రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించుకున్నారు. పలువురు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ప్రస్తుతం పనిచేస్తున్న 2,600 మంది అధికారుల్లో 2017–18లో నియమితులైన 2,100 మంది అధికారులు ఏడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సూచనల ప్రకారం.. దేశంలో వ్యవసాయ విస్తరణ విజయవంతంగా పూర్తి చేసేందుకు వెయ్యి మంది రైతులకు ఒకరి చొప్పున అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారి ఉండాలని కమిటీ సిఫారసు చేసిందని గుర్తు చేశారు. కానీ రాష్ట్రంలో 6 నుంచి 8 గ్రామాలకు అంటే సుమారు 12 వేల మంది రైతులకు ఒక ఏఈఓను మాత్రమే ఉన్నారని చెప్పారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి ఏఈఓలకు అసిస్టెంట్‌లను నియమించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిజిటల్ క్రాప్ సర్వేపై పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పంజాల రాజు, పరుశురాం, సుమన్, కల్యాణిలతోపాటు 32 జిల్లాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

- క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లించలేకనే...


ప్రసాద్

దుగ్గొండి: క్రెడిట్ కార్డులపై తీసుకున్న రుణం చెల్లించాలని బ్యాంకర్లు వేధించడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నాచినపల్లిలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నాచినపల్లికి చెందిన దార ప్రసాద్ (35) కాకతీయ వర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం హైదరాబాద్‌లోని ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేశాడు. ఈ క్రమంలోనే వివిధ బ్యాంకులకు చెందిన 10 క్రెడిట్ కార్డులు తీసుకున్నాడు. వాటి ద్వారా రుణం తీసుకొని హైదరాబాద్‌లోనే చిట్టీ వేశాడు. చిట్‌ఫండ్ కంపెనీ దివాలా తీయడంతో ఆ డబ్బులు రాలేదు. దీంతో క్రెడిట్ కార్డుల కిస్తీలు చెల్లించలేక ఆరు నెలల క్రితం ఉద్యోగం మానేసి ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి ఆయా బ్యాంకుల రికవరీ బృందాలు నాచినపల్లికి వచ్చి ప్రసాద్‌ను నిలదీయగా, ఈ నెల 19న చెల్లిస్తానని చెప్పాడు. వాయిదా సమయం రావడం.. డబ్బు చేతిలో లేక భయపడి ఇంట్లో ఉరివేసుకున్నాడు. ప్రసాద్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'ఆత్మ' ద్వారా సాంకేతికత బదలాయింపు: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణ, రైతులందరికీ డ్రిప్ పరికరాలు, విత్తన సబ్సిడీ, అన్ని పంటలకు మద్దతు ధర, పంటల బీమా, శిక్షణ కార్యక్రమాలు, మట్టి నమూనా పరీక్షలు.. ఇలా అన్నింటినీ వరుసగా ప్రారంభిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆత్మ' ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని బదలాయించే కార్యక్రమాలు చేపడతామన్నారు. సాగు చేయని భూములకి కూడా రైతుబంధు ఇచ్చి ఐదేళ్లలో రూ.25,000 కోట్ల మేర ప్రజాధనం దుర్వినియోగం చేశారని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. రైతుల, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరించి, సబ్ కమిటీ వేసి, దాని నివేదిక ప్రకారం పెంచిన రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని మేమంటుంటే బీఆర్ఎస్ నాయకులు ఎందుకు గగ్గోలు పెడుతున్నారని తుమ్మల ప్రశ్నించారు.

'విద్యుత్' కమిషన్ దూకుడు!

▶ మొదటి పేజీ తరువాయి

చాలా ఆలస్యంగా విద్యుత్ సంస్థలు పిటిషన్లు చేయడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. నిబంధనల ప్రకారం గతేడాది నవంబర్‌లోపే విద్యుత్ సంస్థలు పిటిషన్లు దాఖలు చేయాల్సి ఉండగా, గత నెలలో దాఖలు చేశాయి. ఒకేసారి పెద్ద సంఖ్యలో దాఖలైన పిటిషన్లను చదివి రాతపూర్వకంగా అభ్యంతరాలను సమర్పించడానికి సమయం సరిపోదని, గడువు పొడిగించాలని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ)తో పాటు విద్యుత్ రంగ నిపుణులు ఎం.వేణుగోపాల్ రావు తదితరులు చేసిన విజ్ఞప్తులను ఈఆర్సీ తోసిపుచ్చింది. సోమవారం నుంచి ఈ నెల 25 వరకు వరుసగా ఐదు రోజుల పాటు హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో బహిరంగ విచారణలు నిర్వహించనుంది. ఆ తర్వాత 4 రోజుల పదవీకాలం మిగిలి ఉండగా కీలక ఉత్తర్వులు జారీ చేయనుంది. అయితే గడువులోగానే విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాలు, సాధారణ వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున రాతపూర్వక అభ్యంతరాలు ఈఆర్సీకి అందాయి. కాగా ఈఆర్సీ తీసుకోనున్న కీలక నిర్ణయాలు ఇలా ఉన్నాయి..

జెన్‌కో ట్రూఅప్ చార్జీల భారం రూ.963 కోట్లు

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.963.18 కోట్ల ట్రూఅప్ చార్జీల పిటిషన్‌తో పాటు 2024–29 మధ్యకాలానికి సంబంధించిన మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటీ) పిటిషన్‌ను గత నెల 21న దాఖలు చేసింది. వీటిపై సోమవారం ఈఆర్సీ బహిరంగ విచారణ జరపనుంది. జీటీఎస్ కాలనీలోని విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు ఇది ప్రారంభం కానుంది. ఈఆర్సీ ఆమోదించిన విద్యుత్ ధరలు/చార్జీలతో పోల్చితే వాస్తవ ఆదాయంలో వ్యత్యాసాన్ని ట్రూఅప్ చార్జీల రూపంలో విద్యుత్ సంస్థలు సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ఆదాయ లోటు ఉంటే భర్తీ చేసుకోవడానికి ఎంత మేరకు ట్రూఅప్ చార్జీలను వసూలు చేయాలో ఈఆర్సీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. జెన్‌కో విద్యుత్ కేంద్రాల నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు విద్యుత్ కొనుగోలు చేసి తమ వినియోగదారులకు సరఫరా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జెన్‌కో ప్రతిపాదించిన రూ.963.18 కోట్ల ట్రూఅప్ చార్జీలను డిస్కంల నుంచి వసూలు చేసుకోవడానికి జెన్‌కో అనుమతి కోరింది. విద్యుత్ చార్జీలను పెంచడం ద్వారా ఈ ట్రూప్ చార్జీల భారాన్ని డిస్కంలు విద్యుత్ వినియోగదారులపై మోపుతాయి.

ఐదేళ్లలో రూ.16,346 కోట్ల ఆదాయ అవసరాలు

తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) దాఖలు చేసిన 2024–29 మధ్యకాలానికి సంబంధించిన రెండు ఎంవైటీ పిటిషన్లపై మంగళవారం ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. వచ్చే ఐదేళ్లలో మొత్తం రూ.16,346.1 కోట్ల ఆదాయ అవసరాలున్నట్టు ట్రాన్స్‌కో అంచనా వేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో రాష్ట్రంలో రూ.1,200 కోట్ల మేర విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతి కోరుతూ దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎన్పీడీసీఎల్) దాఖలు చేసిన రెండు వేర్వేరు ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్) పిటిషన్లతో పాటు 2024–29 మధ్య కాలానికి సంబంధించిన మరో రెండు ఎంవైటీ పిటిషన్లపై బుధవారం హైదరాబాద్‌లో, గురువారం నిజామాబాద్‌లో ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. రాష్ట్రంలో హైటెన్షన్ (హెచ్‌టీ) కేటగిరీ విద్యుత్ చార్జీల పెంపు, లోటెన్షన్ (ఎల్టీ) కేటగిరీలో కూడా నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగించే వారికి ఫిక్స్‌డ్ చార్జీ (డిమాండ్ చార్జీ)ల పెంపును డిస్కంలు ప్రతిపాదించాయి. హెచ్‌టీ కేటగిరీకి చార్జీల పెంపుతో రూ.700 కోట్లు, ఫిక్స్‌డ్ చార్జీల పెంపుతో రూ.100 కోట్లు కలిపి రూ.800 కోట్ల భారం పడనుంది. మరో రూ.400 కోట్లను ఎల్టీ వినియోగదారుల నుంచి ఫిక్స్‌డ్ చార్జీల పెంపు ద్వారా రాబట్టుకుంటామని డిస్కంలు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. నవంబర్ 1 నుంచి చార్జీల పెంపు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

నవంబర్ 1 నుంచి పెరగనున్న చార్జీలు

ఇక సిరిసిల్ల జిల్లాకు విద్యుత్ సరఫరా చేసే కోఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై లిమిటెడ్ (సెస్) పరిధిలో రూ.5 కోట్ల విద్యుత్ చార్జీల పెంపునకు ప్రతిపాదిస్తూ దాఖలు చేసిన ఏఆర్ఆర్ 2024–25, 2024–29 ఎంవైటీ పిటిషన్‌పై ఈ నెల 25న సిరిసిల్లలో విచారణ జరగనుంది.

యాదాద్రి పరిసరాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్


ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పోస్టు చేసిన వీడియోలోని ఓ దృశ్యం

యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడవీధిలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు చేసిన పలు వీడియో రీల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నెల 3వ తేదీన నారసింహుడిని దర్శించుకున్న సందర్భంగా సంప్రదాయ దుస్తులతో పాడి కౌశిక్ రెడ్డి భార్య, కుమార్తెలతో కలిసి ఆలయ మాడ వీధిలో, ప్రాకార మండపంలో ఫొటోలు దిగడంతోపాటు తీసుకున్న వీడియోలను ఆదివారం తన ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సంప్రదాయ దుస్తులతో ఉన్న వీడియోలకు పలువురు అభినందనలు తెలపగా, మరికొందరు ఆలయ పరిసరాల్లో ఇలాంటి వీడియోలు ఏమిటని విమర్శిస్తున్నారు.

బాలసదన్‌లో బాలికపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి.. ఘటనను దాచిపెట్టిన అధికారులు

భువనగిరి క్రైం: అనాథలకు రక్షణ కల్పించాల్సిన మహిళా శిశు సంక్షేమ శాఖలోనే బాలికలకు రక్షణ లేకుండా పోయింది. అనాథ బాలికలకు ఆశ్రయం కల్పించాల్సిన బాలసదన్‌లోనే పదేళ్ల అనాథ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 14న ఒక కార్యక్రమం నిర్వహణ పేరుతో డీసీపీఓతోపాటు మరి కొంతమంది వ్యక్తులు రాత్రి 7 గంటల సమయంలో భువనగిరి బాలసదన్‌కు వచ్చారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ బాలిక బాత్‌రూంకు వెళ్లి వస్తున్న సమయంలో.. ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన బాలిక ఏడ్చుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది. గమనించిన బాలసదన్ సిబ్బంది ఆరా తీయగా ఓ వ్యక్తి తనపై లైంగిక దాడి చేశాడంటూ తన శరీరంపై గాయాలను చూపించింది. వెంటనే సిబ్బంది డీసీపీఓకు సమాచారం అందించారు. డీసీపీఓ సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టకపోగా విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని, చెబితే అందరి ఉద్యోగాలు పోతాయని ఉద్యోగుల ను బెదిరించినట్లు తెలిసింది. అదీగాక బాలికను వలిగొండలోని ప్రైవేట్ అనాథాశ్రమానికి తరలించినట్లు సమాచారం. కాగా ఆదివారం బాధితురాలు ఉన్న వలిగొండ శాంతి నిలయంలో డీసీపీఓ సైదులు, కౌన్సిలర్ వెళ్లి విచారణ జరపగా బాధితురాలు తనపై లైంగిక దాడి జరిగిన విషయాన్ని చెప్పినట్లు సమాచారం. కలెక్టర్ స్పందించి బాలికపై లైంగిక దాడి చేసిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్‌కు చెందిన అటెండర్‌ను అదుపులోకి తీసుకోవాలని బాలల హక్కుల సంఘం సామాజికవేత్తలు కోరారు. దాడి ఘటనను దాచిపెట్టిన బాలల సంరక్షణ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెళ్లింట విషాదం

- భార్యకు పురుగులమందు కలిపిన కూల్‌డ్రింక్ తాగించి.. భర్త ఆత్మహత్య
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య


వెంకటయ్య

గుర్రంపోడు: పెళ్లింట విషాదం చోటుచేసుకుంది. పురుగులమందు కలిపిన కూల్‌డ్రింక్‌ను భార్యకు తాగించి.. ఓ భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఏఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం మొసంగి గ్రామానికి చెందిన బడుగుల వెంకటయ్య(43)– జ్యోతి దంపతులు ఈనెల 16న కుమార్తె వివాహం జరిపించారు. ఆదివారం తమ కుమార్తెను అత్తగారి ఇంటి నుంచి తీసుకురావాల్సి ఉండగా, పురుగుల మందు కలిపిన కూల్ డ్రింక్‌ను భార్య జ్యోతికి ఇచ్చి, తాను గదిలోకి వెళ్లి తలుపులు వేసుకొని గడియ పెట్టుకున్నాడు. అప్పటికే కొంచెం కూల్‌డ్రింక్ తాగిన జ్యోతి పురుగుల మందు వాసన ఉండడంతో పారబోసింది. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు వచ్చి తలుపులు తెరిచారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హుటాహుటిన నల్లగొండకు తరలించారు. వెంకటయ్య మృతి చెందగా, జ్యోతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు అర్థం కావడంలేదని..

- కళాశాల హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- సూర్యాపేట జిల్లాలో ఘటన


వినయ్

చిలుకూరు: ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు అర్థం కావడం లేదని, దీంతో మార్కులు తక్కువ వస్తున్నాయని ఇంటర్ విద్యార్థి మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని కవిత జూనియర్ కళాశాలలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం సజ్జాపురానికి చెందిన బీమన శేఖర్ కుమారుడు బీమన వినయ్ (17) చిలుకూరు మండల పరిధిలోని కవిత జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో చేరాడు. 10వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన వినయ్.. ఇంటర్‌లో ఇంగ్లిష్ మీడియంలో సబ్జెక్టులు అర్థంకాక మార్కులు తక్కువగా వస్తున్నాయని కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన వినయ్ తిరిగి కళాశాలకు వెళ్లడానికి ఇష్టపడలేదు. దీంతో తల్లిదండ్రులు సర్ది చెప్పి ఆదివారం అతడిని మేనమామ, బంధువులు తీసుకొని వచ్చి కళాశాలలో విడిచి పెట్టి వెళ్లారు. ఆ సమయంలో స్టడీ అవర్స్ నడుస్తుండటంతో విద్యార్థులు, అధ్యాపకులు తరగతి గదుల్లో ఉన్నారు. హాస్టల్ గదిలో లగేజీ పెట్టి వస్తానని వెళ్లిన వినయ్ అక్కడున్న ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అరగంట తరువాత గమనించిన తోటి విద్యార్థులు, అధ్యాపకులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కోదాడలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వినయ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. దసరా సెలవులు ముగించుకుని తిరిగి వెళ్లిన రోజే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

గతి తప్పుతున్న రుతుపవనాలు

వాతావరణ మార్పులే ప్రధాన కారణం

క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ సమగ్ర అధ్యయనం ● తక్కువ సమయంలో అత్యధిక వర్షపాతం

వాతావరణ మార్పులు.. భూమిపై జీవుల మనుగడకే సవాలు విసురుతున్న విపరిణామం. ప్రధానంగా వర్షపాతం, ఉష్ణోగ్రతలపై వాతావరణ మార్పులు తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లో ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌పై వీటి ప్రభావం ఎలా ఉందన్న దానిపై క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ సమగ్ర అధ్యయనం చేసింది. రుతపవనాల సీజన్‌లో స్పష్టమైన మార్పులు కనిపించినట్లు తేల్చింది. వాతావరణ మార్పులు వర్షాల గతినే పూర్తిగా మార్చేస్తున్నట్లు వెల్లడైంది. సాధారణ వర్షాలు పడాల్సిన సమయంలో అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అసలు వర్షాలే లేకపోవడం వంటి విపరీత పరిణామాలకు వాతావరణ మార్పుల ప్రభావమే కారణమని పరిశోధకులు చెబుతున్నారు.

- దేశవ్యాప్తంగా 729 జిల్లాల్లో క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ అధ్యయనం నిర్వహించింది. 2024 రుతుపవనాల సీజన్‌లో ఆయా జిల్లాల్లో నమోదైన వర్షపాతంలో వైవిధ్యం కనిపించింది.
- 340 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.
- 158 జిల్లాల్లో భారీ వర్షాలు, 48 జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిశాయి. మరోవైపు 178 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వీటిలో 11 జిల్లాల్లో అత్యంత లోటు వర్షపాతం నమోదైంది.
- గత ఐదేళ్లలో చూస్తే ఈ ఏడాది తక్కువ సమయంలో అత్యధిక వర్షం కురిసిన సందర్భాలు అధికంగా ఉన్నాయి. వర్షపాతంలో మార్పులతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇది ఇంతో ళనకర పరిణామం అని చెబుతున్నారు. దీని వల్ల వరదలు, తద్వారా ఆస్తినష్టం, ప్రాణనష్టం వాటిల్లుతుందని అంటున్నారు.
- ఈ ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా 753 వాతావరణ కేంద్రాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. 2020 తర్వాత ఇదే అత్యధికం.
- భూమి ఉపరితలం, సముద్రాల ఉష్ణోగ్రతల్లో మధ్య వ్యత్యాసాలు రుతుపవనాలను ప్రభావితం చేస్తుంటాయి. సముద్రాలతో పోలిస్తే భూమిపై ఉష్ణోగ్రతలు వేగంగా మారుతుంటాయి. వాతావరణ మార్పులు, భూతాపం కారణంగా భూమి క్రమంగా వేడెక్కుతుండడంతో రుతుపవనాలు సైతం గతి తప్పుతున్నాయి. గత పదేళ్లలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.
- 2023లో దేశంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. 2024లో మాత్రం సాధారణం కంటే అధిక వర్షాలు కురిశాయి. భూమిపై సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల రుతుపవనాల్లో ప్రతికూల మార్పు మొదలైందని క్లైమేట్ ట్రెండ్స్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ ఆర్తి ఖోస్లా చెప్పారు.
- వ్యవసాయం, నీటి సరఫరా, పర్యావరణ సమతుల్యతకు రుతుపవనాలే అత్యంత కీలకం. కోట్లాది మంది ప్రజల జీవితాలు రుతుపవనాలపై ఆధారపడి ఉన్నాయి. రుతుపవనాలు పూర్తిగా గతి తప్పితే ఊహించని పరిణామాలు ఎదురవుతాయని పరిశోధకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అందుకే వాతవరణ మార్పులను అరికట్టాలని, పర్యావరణ పరిరక్షణపై తక్షణమే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.



- సాక్షి, నేషనల్ డెస్క్

మరో 25 విమానాలకు
బాంబు బెదిరింపు

ముంబై/న్యూఢిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఆదివారం దేశీయ విమానయాన సంస్థలకు చెందిన 25 సర్వీసులకు బాంబు పెట్టామనే హెచ్చరికలు అందాయి. దీంతో, ఈ వారంలో ఇప్పటి వరకు విమానాలకు అందిన బాంబు బెదిరింపుల సంఖ్య 90 దాటింది. అయితే ఇవన్నీ వట్టివేనని తేలిందని అధికారులు వివరించారు. ఆదివారం హెచ్చరికలు అందిన వాటిలో ఇండిగో, విస్తార, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా విమానాలున్నాయి. తమ జెడ్డా–ముంబై, కోజికోడ్–దమ్మమ్, ఢిల్లీ–ఇస్తాంబుల్, ముంబై–ఇస్తాంబుల్, పుణె–జోధ్‌పూర్ సర్వీసులకు ఆన్‌లైన్‌లో బెదిరింపులొచ్చాయని ఇండిగో తెలిపింది. ఢిల్లీ–ఫ్రాంక్‌ఫర్ట్, సింగపూర్–ముంబై, బాలి–ఢిల్లీ, సింగపూర్–ఢిల్లీ, సింగపూర్–పుణె విమానాలకు బెదిరింపులందాయని విస్తార వెల్లడించింది. అహ్మదాబాద్–ముంబై, ఢిల్లీ–గోవా, ముంబై–బగ్డోగ్రా, ఢిల్లీ–హైదరాబాద్, కొచ్చి–ముంబై, లక్నో–ముంబై విమాన సర్వీసులకు బాంబు పెట్టామనే హెచ్చరికలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఆన్‌లైన్‌లో వచ్చాయని ఆకాశ ఎయిర్ వివరించింది. అదేవిధంగా, ఎయిరిండియాకు చెందిన ఏడు విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. వీటిపై ఆ సంస్థ స్పందించలేదు.

ఉత్తర గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

87 మంది పాలస్తీనియన్ల మృతి ● 40 మందికి గాయాలు

డెయిర్ అల్–బలాహ్: ఉత్తర గాజాలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. బీట్ లాహియా పట్టణంపై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 87 మంది మరణించారు. 40 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. గాయపడిన వారితో ఉత్తర గాజాలోని ఆస్పత్రులు పోటెత్తాయని ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ మౌనిర్ అల్–బర్ష్ పేర్కొన్నారు.

ఆస్పత్రులపై దాడులు ఆపాలి: ఎంఎస్ఎఫ్

ఉత్తర గాజాలోని ఆసుపత్రులపై వారి దాడులను వెంటనే ఆపాలని అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ డాక్టర్స్ విథౌట్ బోర్డర్స్ (ఎంఎస్ఎఫ్)ఇజ్రాయెల్ దళాలకు పిలుపునిచ్చింది. ఉత్తర గాజాలో రెండు వారాలుగా కొనసాగుతున్న హింస, నిర్విరామ ఇజ్రాయెల్ సైనిక చర్యలు భయానక పరిణామాలను కలిగిస్తున్నాయని ఎంఎస్ఎఫ్ ఎమర్జెన్సీ కోఆర్డినేటర్ అన్నా హాల్ఫోర్డ్ తెలిపారు. ఉత్తర గాజాలో శనివారం అర్ధరాత్రి నుంచే ఇంటర్నెట్ కనెక్టివిటీ నిలిచిపోయింది. దీంతో దాడుల సమాచారమే కాదు సహాయక చర్యలు కష్టంగా మారాయని తెలిపారు.

రహస్య పత్రాలపై అమెరికా దర్యాప్తు

ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ ప్రణాళికలను అంచనా వేసే రహస్య పత్రాలు లీకవడం తెలిసిందే. ఈ విషయంపై అమెరికా దర్యాప్తు చేస్తోందని అధికారులు తెలిపారు. అక్టోబర్ 1న ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి దాడికి ప్రతిస్పందనగా దాడులను నిర్వహించడానికి ఇజ్రాయెల్ సైనిక ఆస్తులను తరలిస్తోందని యూఎస్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీకి చెందిన ఈ పత్రాలు సూచిస్తున్నాయి. సిన్వర్ హత్య తర్వాత గాజాలో కాల్పుల విరమించాలని అమెరికా ఇజ్రాయెల్‌ను కోరుతోంది. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ముగ్గురు సైనికులు మరణించారు. తమ వాహనంపై ఇజ్రాయెల్‌సైన్యం చేసిన దాడిలో ముగ్గురు మృతి చెందినట్లు లెబనాన్ సైన్యం తెలిపింది. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా దాడుల వల్ల లెబనాన్‌లో పౌరుల మరణాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, ముఖ్యంగా బీరుట్‌తోపాటు చుట్టుపక్కల కొన్ని దాడులను తగ్గించాలని అమెరికా రక్షణ మంత్రి ఇజ్రాయెల్‌ను కోరారు.

ఉత్తర గాజాలో భారీ ఆపరేషన్

ఉత్తర గాజాలోని జబాలియాలో ఇజ్రాయెల్ గత రెండు వారాలుగా భారీ ఆపరేషన్ నిర్వహిస్తోంది. అక్కడ తిరిగి చేరిన హమాస్ మిలిటెంట్లపై ఆపరేషన్ ప్రారంభించినట్లు సైన్యం తెలిపింది. యుద్ధ సమయంలో ఇజ్రాయిల్ దళాలు జబాలియాకు తిరిగి వచ్చాయి. ఇజ్రాయెల్ పై హమాస్ దాడి తర్వాత గత ఏడాది చివరి నుంచి ఇజ్రాయెల్ దళాలు చుట్టుముట్టిన ఉత్తర గాజా యుద్ధంలో భారీ విధ్వంసాన్ని చవిచూసింది.

తైవాన్‌పై డ్రాగన్ కన్ను...
యుద్ధానికి సిద్ధం కండి

సైన్యానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపు ● తైవాన్ సమీపంలో యుద్ధ విమానాలు, నౌకలు



జిన్‌పింగ్

బీజింగ్/తైపీ: చైనా, తైవాన్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. తైవాన్‌ను స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా డ్రాగన్ దేశం పావులు కదుపుతోంది. యుద్ధానికి సిద్ధంగా ఉండాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైన్యానికి పిలుపునిచ్చారు. యుద్ధ సన్నద్ధతను పూర్తిస్థాయిలో పెంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చైనా అధికారిక వార్తాసంస్థ 'సీసీటీవీ' ఆదివారం ఈ మేరకు వెల్లడించింది. జిన్‌పింగ్ తాజాగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ బ్రిగేడ్‌ను సందర్శించారు. ''రానున్న యుద్ధం కోసం శిక్షణ, సన్నద్ధతను పూర్తిస్థాయిలో బలోపేతం చేయండి. సేనలు పూర్తి సామర్థ్యంతో రణక్షేత్రంలోకి అడుగుపెట్టేలా చర్యలు చేపట్టండి. దేశ వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణకు సర్వసన్నద్ధంగా ఉండండి'' అని సైన్యానికి పిలుపునిచ్చారు. చైనా సైన్యం ఇటీవల తైవాన్ చుట్టూ పెద్ద సంఖ్యలో యుద్ధ విమానాలు, నౌకలను మోహరించి విన్యాసాలు చేపట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తైవాన్‌పై అతి త్వరలో డ్రాగన్ దురాక్రమణ తప్పదనేందుకు జిన్‌పింగ్ వ్యాఖ్యలు సంకేతాలన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చైనా యుద్ధ విమానాలు, డ్రోన్లు, యుద్ధ నౌకలు, తీర రక్షక దళం నౌకలు ఆదివారం తైవాన్‌ను చుట్టుముట్టాయి. గత రెండేళ్లలో తైవాన్, చైనా మధ్య ఈ స్థాయిలో యుద్ధ వాతావరణం నెలకొనడం ఇదే మొదటిసారి. తైవాన్‌ను విలీనం చేసుకోవడానికి బల ప్రయోగానికి సైతం వెనుకాడబోమని చైనా కమ్యూనిస్టు నాయకులు ఇటీవల తరచుగా ప్రకటనలు చేస్తున్నారు.

హద్దు మీరితే బదులిస్తాం: తైవాన్

చైనా దూకుడుపై తైవాన్ స్పందించింది. తమ భూభాగానికి సమీపంలో ఆరు చైనా యుద్ధ విమానాలు, ఏడు యుద్ధ నౌకలను గుర్తించినట్లు ఆ దేశ రక్షణ శాఖ ఆదివారం వెల్లడించింది. వాటిలో రెండు విమానాలు తమ ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్‌లోకి ప్రవేశించాయని తెలిపింది. ''తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాం. హద్దు మీరితే తగు రీతిలో బదులిస్తాం'' అని స్పష్టం చేసింది. యథాతథ స్థితికి కట్టుబడి ఉండాలని చైనాకు సూచించింది. ''రెచ్చగొట్టే చర్యలు ఆపండి. మా దేశాన్ని బలప్రయోగం ద్వారా అణచివేసే చర్యలకు పాల్పడొద్దు. స్వతంత్ర తైవాన్ ఉనికిని గుర్తించండి'' అని చైనాకు సూచించింది. ప్రాంతీయ భద్రత, శాంతి, సౌభాగ్యం కోసం చైనాతో పని చేయాలన్నదే తమ ఆకాంక్ష చెప్పింది. తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వం కొనసాగడం తైవాన్‌తోపాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అత్యంత కీలకమని తైవాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

తైవాన్‌కు ఆ దేశాల అండ

తైవాన్ 1949 నుంచి స్వతంత్ర దేశంగా కొనసాగుతోంది. అది తమ దేశంలో అంతర్భాగమని చైనా వాదిస్తోంది. ఎప్పటికైనా దాన్ని విలీనం చేసుకుని తీరతామని చెబుతోంది. ఇజ్రాయెల్–హమాస్, రష్యా–ఉక్రెయిన్... ఇలా ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో తైవాన్ ఆక్రమణకు ఇదే సరైన సమయమని చైనా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అమెరికా, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, లిథువేనియాతోపాటు మరో 30 దేశాలు తైవాన్‌కు అండగా నిలుస్తున్నాయి. తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలను అవి తీవ్రంగా ఖండించాయి.

అయోధ్య సమస్య పరిష్కారం కోసం
దేవుడిని ప్రార్థించా

సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వెల్లడి



పుణే: రామ జన్మ భూమి–బాబ్రీ మసీదు వివాదం పరిష్కారం కోసం భగవంతుడిని ప్రార్థించానని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పారు. భగవంతుడి పట్ల విశ్వాసం ఉంటే ఆయన కచ్చితంగా పరిష్కార మార్గం చూపిస్తాడని అన్నారు. జస్టిస్ చంద్రచూడ్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని ఖేడ్ తాలూకా కన్హేర్సార్. ఈ గ్రామ ప్రజలు ఆదివారం ఆయనను సత్కరించారు. కేసుల విచారణ సమయంలో న్యాయమూర్తులకు కొన్నిసార్లు పరిష్కార మార్గాలు కనిపించవని ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. అయోధ్య వ్యవహారంపై విచారణ జరుగుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితి తనకు ఎదురైందన్నారు. అప్పుడు భగవంతుడి సన్నిధిలో కూర్చొని ప్రార్థించానని, సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకున్నానని తెలిపారు. తాను తరచుగా దేవుడిని ప్రార్థిస్తుంటానని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి అనుకూలంగా 2019 నవంబర్ 9న అప్పటి సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ధర్మాసనంలో జస్టిస్ చంద్రచూడ్ కూడా ఒక సభ్యుడే.

రష్యాపైకి ఉక్రెయిన్ 100 డ్రోన్లు

కీవ్: ఉక్రెయిన్ శనివారం రాత్రి తమ పశ్చిమ ప్రాంతంపైకి 100కు పైగా డ్రోన్లను ప్రయోగించిందని రష్యా తెలిపింది.గగనతల రక్షణ వ్యవస్థలు వీటిని కూల్చేశాయని ప్రకటించింది. మొత్తం ఏడు ప్రాంతాల్లోకి 110 డ్రోన్లు చొచ్చుకురాగా, సరిహద్దుల్లోని ఒక్క కర్స్క్‌పైకే ఏకంగా 43 డ్రోన్లను పంపిందని రష్యా ఆర్మీ ప్రకటించింది. నిజ్నీ నొవ్‌గొరోడ్‌లోని పేలుడు పదార్థాల కర్మాగారానికి సమీపంలోకి వచ్చిన డ్రోన్‌ను గాల్లోనే ధ్వంసం చేశామని వివరించింది. ఈ ఘటనలో నలుగురు సైనికులు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇలా ఉండగా, శనివారం సాయంత్రం ఉక్రెయిన్‌లోని క్రివ్యి రిహ్‌లో రష్యా రెండు బాలిస్టిక్ క్షిపణులతో జరిపిన దాడిలో 17 మంది గాయపడ్డారని యంత్రాంగం తెలిపింది. పలు నివాసాలు, వ్యాపార సంస్థలకు నష్టం వాటిల్లిందని వెల్లడించింది. కాగా, వారం రోజుల వ్యవధిలో రష్యా 800 గైడెడ్ ఏరియల్ బాంబులు, 500కు పైగా డ్రోన్లతో దాడులు చేసిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తెలిపారు. నిత్యం తమ నగరాలు, పట్టణాలపై రష్యా దాడులు జరుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు.

బంధుప్రీతి, బుజ్జగింపు

విపక్షాలపై మోదీ ధ్వజం
- వారణాసిలో పర్యటన
- ఎన్డీఏ అంటే 'నరేంద్ర దామోదర్ దాస్ కా అనుశాసన్'
- కంచి కామకోటి పీఠాధిపతి ప్రశంసలు




ఆస్పత్రి ప్రారంభోత్సవంలో కళ్లద్దాలు అందిస్తున్న మోదీ

వారణాసి/కోల్‌కతా: బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలే ప్రతిపక్షాల విధానమని ప్రధాని మోదీ మండిపడ్డారు. తన సొంత లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసిలో ఆదివారం రూ.6,700 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారణాసి శివారులోని సీగ్రాలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలో పదేళ్ల క్రితం వరకు వందల కోట్ల రూపాయల కుంభకోణాల గురించి పత్రికల్లో నిత్యం వార్తలు వస్తుండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో వారణాసిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు తప్ప అభివృద్ధి అంటే ఏమిటో తెలియదని ఎద్దేవా చేశారు. వారణాసి అభివృద్ధిని అవి పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. 'సబ్‌కా వికాస్' సిద్ధాంతంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక గత 125 రోజులవ్యవధిలోనే దేశవ్యాప్తంగా రూ.15 లక్షల కోట్ల విలువైన పనులు ప్రారంభించామని చెప్పారు. అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమని ప్రకటించారు.

ఎయిర్‌పోర్టు విస్తరణ పనులకు శంకుస్థాపన

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సిలిగురి సమీపంలోని బాగ్‌డోగ్రా ఎయిర్‌పోర్టు విస్తరణ పనులకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.1,550 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఈ ఏడాది ఆగస్టులో ఆమోదం తెలిపింది.



మోదీకి కంచి పీఠాధిపతి ఆశీర్వచనం

శంకర కంటి ఆసుపత్రి ప్రారంభం

వారణాసిలో కంచి మఠం ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్‌జే శంకర కంటి ఆసుపత్రిని మోదీ ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో ఏటా 30 వేల కంటి శస్త్రచికిత్సలు ఉచితంగా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మఠం వర్గాలు తెలిపాయి. వారణాసికి రావడం ఆశీర్వచనంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా మోదీ అన్నారు. మత విశ్వాసాలకు, ఆధ్యాత్మికతకు కేంద్రమైన వారణాసి నగరం ఆరోగ్య కేంద్రంగానూ అభివృద్ధి చెందుతుండడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మోదీపై కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి ప్రశంసల వర్షం కురిపించారు. ఎన్డీఏ అంటే 'నరేంద్ర దామోదర్ దాస్ కా అనుశాసన్' అని అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోందని కితాబిచ్చారు. ఇది ప్రపంచంలోనే ఆదర్శవంతమైన ప్రభుత్వమని కొనియాడారు.

కశ్మీర్‌లో స్థానికేతరులపై ముష్కరుల కాల్పులు
ఏడుగురి దుర్మరణం

మృతుల్లో ఒక డాక్టర్, ఆరుగురు కార్మికులు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకలు మళ్లీ పేట్రేగిపోయాయి. శ్రీనగర్–లేహ్ జాతీయ రహదారిపై టన్నెల్ నిర్మాణ పనుల ప్రాంతంలో ఉన్న ఒక వైద్యుడు, ఐదుగురు స్థానికేతర కార్మికులను చంపేశారు. గందేర్‌బల్‌లోని గుండ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఘటన చోటుచేసుకుంది. పనులు చేస్తున్న స్థానిక, స్థానికేతర కార్మికులు, ఇతర సిబ్బందిపై ఇద్దరు ఉగ్రవాదులు యథేచ్ఛగా కాల్పులకు తెగబడినట్లు సమాచారం. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు అక్కడికక్కడే చనిపోగా, మరో ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. గాయపడిన మరో ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. మృతులను డాక్టర్ షెహనవాజ్, ఫహీమ్ నజీర్, కలీం, మహ్మద్ హనీఫ్, శశి అబ్రోల్, అనిల్ శుక్లా, గుర్మీత్ సింగ్‌లుగా గుర్తించారు. ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా బలగాలు ఆప్రాంతాన్ని దిగ్బంధించి, గాలింపు చేపట్టాయి. కశ్మీర్ ఐజీ వీకే బిర్ది తదితర అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. ఘటనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఖండించారు. ఉగ్రమూకలను వదిలేది లేదని స్పష్టం చేశారు. కాల్పుల ఘటనను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. ఘటనలో మృతుల సంఖ్య పెరగొచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, శుక్రవారం బుల్లెట్ గాయాలతో ఉన్న బిహార్‌కు చెందిన కార్మికుడి మృతదేహాన్ని షోపియాన్ జిల్లాలో గుర్తించామని అధికారులు తెలిపారు.



హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సీఆర్‌పీఎఫ్ వాహనం

71 మంది సిట్టింగ్‌లకు టికెట్లు

మహారాష్ట్రలో బీజేపీ మొదటి జాబితా విడుదల | 99 మంది అభ్యర్థుల ఖరారు | 3 చోట్ల సిట్టింగ్‌లకు మొండిచేయి

సాక్షి, న్యూఢిల్లీ: మహారాష్ట్రలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు గాను 99 మందితో బీజేపీ ఆదివారం మొదటి జాబితా విడుదల చేసింది. వీరిలో 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించింది. ఇందులో ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన అశోక్ చవాన్ కుమార్తె శ్రీజయ చవాన్‌కు చోటు దక్కింది. ఇంకా డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులె, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్, మంత్రులు గిరీశ్ మహాజన్, సుధీర్ ముంగంటివార్, చంద్రకాంత్ పాటిల్ వంటి ప్రముఖులు ఉన్నారు. జాబితాలో మొత్తం 13 మహిళల పేర్లున్నాయి. చించ్వాడ్, కల్యాణ్ ఈస్ట్, శ్రీగొండ స్థానాల్లో మాత్రం సిట్టింగ్‌లకు బదులు కొత్త వారికి అవకాశమిచ్చింది. ముంబైలోని పార్టీకి చెందిన 16 మంది ఎమ్మెల్యేల్లో 14 మందిని మళ్లీ నామినేట్ చేసింది. సుమారు 150 సీట్లలో పోటీ చేసేందుకు మిత్రపక్షాలతో బీజేపీ మంతనాలు సాగిస్తోంది. మహారాష్ట్ర అసెంబ్లీలోని 288 స్థానాలకు నవంబర్ 20న పోలింగ్ జరగనుంది.

బరిలో మరాఠా అభ్యర్థులు: జరంగే

ముంబై: మహారాష్ట్రలో మరాఠాలకు రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు, దీక్షలు చేపట్టిన ఉద్యమ నాయకుడు మనోజ్ జరంగే ఎన్నికల వేళ మరో సంచలన ప్రకటన చేశారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో మరాఠాలు మెజారిటీగా ఉన్న నియోజకవర్గాల్లో మరాఠా అభ్యర్థులను బరిలోకి దించుతానని ఆయన ప్రకటించారు. గెలుపునకు అవకాశం చోట మాత్రమే మరాఠా అభ్యర్థులను ప్రకటిస్తానని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోని మరాఠాల రిజర్వేషన్లకు మద్దతిచ్చే అభ్యర్థులకు పార్టీ, మతం, కులంతో సంబంధం లేకుండా తోడుంటామని ఆయన స్పష్టంచేశారు. తమ షరతులకు అంగీకరిస్తూ అభ్యర్థులు లిఖితపూర్వక హామీ ఇవ్వాల్సి ఉంటుందని జరంగే వెల్లడించారు.

ఢిల్లీలో సీఆర్పీఎఫ్ స్కూలు వద్ద పేలుడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ ప్రశాంత్ విహార్ ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ స్కూల్ వద్ద ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో ఆ ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కలకలం రేపిన ఈ ఘటనకు నాటు బాంబే కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ), సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)ల బృందాలు విచారణ చేపట్టాయి. అక్కడ లభించిన తెల్లటి పదార్థం అమోనియం నైట్రేట్, క్లోరైడ్‌ల మిశ్రమం కావచ్చని భావిస్తున్నారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. ఇంకా పేలుడు పదార్థాలుండొచ్చనే అనుమానంతో ఎన్ఎస్‌జీ కమాండోలు సమీప ప్రాంతాల్లో రోబోలతో గాలింపు జరిపారు. 'పేలుడు తీవ్రతకు స్కూలు ప్రహరీ, ఆ సమీపంలోని దుకాణాల అద్దాలు, ఒక కారు దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పేలుడుకు కొద్ది క్షణాల ముందే ఘటనాస్థలి మీదుగా కొన్ని ద్విచక్ర వాహనాలు వెళ్లాయని, లేకుంటే పెనుప్రమాదమే జరిగి ఉండేది' అని అధికారులు వివరించారు. పేలుడుతో మంటలు చెలరేగలేదని ఫైర్ అధికారులు తెలిపారు. రోహిణి ప్రాంతంలోని ప్రశాంత్ విహార్ పోలీసులు పేలుడు పదార్థాల చట్టం తదితర వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పండగ సీజన్‌లో ఇప్పటికే రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లున్నాయి. ఘటన నేపథ్యంలో మరింత అప్రమత్తత ప్రకటించారు.

ఇండోనేసియా అధ్యక్షుడిగా సుబియాంతో

ఉపాధ్యక్షుడిగా మాజీ అధ్యక్షుడు విడొడొ కుమారుడు రకా



సుబియాంతో

జకార్తా: ఇండోనేసియా నూతన అధ్యక్షుడిగా ప్రబొవో సుబియాంతో(73) ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన కార్యక్రమంలో సుబియాంతో తోపాటు ఉపాధ్యక్షుడిగా గిబ్రాన్ రకబుమింగ్ రకా(37) ప్రమాణం చేశారు. మాజీ అధ్యక్షుడు విడొడొ కుమారుడైన రకా సుకార్తా మేయర్‌గా సైతం పనిచేశారు. ప్రమాణ స్వీకారం ఓపెన్ టాప్ వ్యాన్‌లో వచ్చిన సుబియాంతోకు స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజలతో పార్లమెంట్ భవనం, అధ్యక్ష భవనం రహదారి కిక్కిరిసింది. ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఆయన ముందుకు సాగారు. సుబియాంతో ఖురాన్ సాక్షిగా ప్రమాణం చేశారు.

మళ్లీ డ్రోన్లు కనిపిస్తే యుద్ధమే

దక్షిణ కొరియాను హెచ్చరించిన ఉత్తరకొరియా

ప్యాంగాంగ్: ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. దక్షిణ కొరియా మిలిటరీ డ్రోన్ అవశేషాలు శనివారం తమ భూభాగంలో కనిపించాయని, మరోసారి కనిపిస్తే యుద్ధ ప్రకటన తప్పదని ఉత్తరకొరియా హెచ్చరించింది. దక్షిణ కొరియా ఈ నెలలో మూడు సార్లు ప్యాంగ్యాంగ్‌పై డ్రోన్లను ఎగురవేసిందని ఆరోపించిన ఉత్తర కొరియా, మరోసారి అదే జరిగితే బలప్రయోగంతో ప్రతిస్పందిస్తామంది.



విజయోత్సవ రన్

ఆదివారం శ్రీనగర్‌లో హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా. 21 కి.మీ. పరుగును ఆయన సునాయాసంగా పూర్తి చేయడం విశేషం



కిడ్స్.. క్రీడా లవర్స్..
చిన్ననాటి నుంచే పిల్లల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు నడుచుకుంటున్నారు. వారి భవిష్యత్‌పై శ్రద్ధ వహిస్తున్నారు. పాఠశాల వయసులోనే క్రీడల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు.- సిటీప్లస్‌లో



క్లౌడ్ ఫొటోగ్రఫీ.. ఓ మేఘ సందేశం
నగరానికి చెందిన ప్రముఖ క్లౌడ్ ఫొటోగ్రాఫర్ యూనస్ ఫర్హాన్‌కు మేఘంలో అమోఘం కనిపిస్తుంది. స్కై కన్వాస్‌పై నేచర్ చేసిన సిగ్నేచర్‌ను అతడి కెమెరా ఇట్టే బంధిస్తుంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

నగరమంతా తిప్పి.. సెల్‌ఫోన్‌తో ఉడాయించి..

– ర్యాపిడో యువకుడిని ఏమార్చిన మరో యువకుడు

బంజారాహిల్స్: కస్టమర్ బుక్ చేసిన మేరకు ర్యాపిడో డ్రైవర్ సదరు యువకుడిని గమ్యస్థానానికి చేర్చేందుకు యత్నించగా.. రకరకాల కారణాలతో నగరమంతా తిప్పి చివరకు బాధితుడి సెల్‌ఫోన్‌తో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో నివసించే సావనం చంద్ర మహేష్‌బాబు ర్యాపిడో నడుపుతూ పొట్టపోసుకుంటున్నాడు. ఈ నెల 18న రాత్రి 8 గంటల ప్రాంతంలో డెలాయిట్ ఆఫీసు గచ్చిబౌలిలో పని చేసే నితిన్ అనే యువకుడి నుంచి బుకింగ్ ఆర్డర్ వచ్చింది. కొండాపూర్ ఏఎంబీ మాల్ వద్ద తనను డ్రాప్ చేయాల్సిందిగా నితిన్ బుకింగ్ ఆర్డర్ పెట్టాడు. దీంతో మహేష్ బాబు ఆ యువకుడిని ఎక్కించుకుని ఏఎంబీ మాల్ వద్ద దింపాడు. తన స్నేహితుడి వద్ద డబ్బు తీసుకువస్తానని మాల్‌లోకి వెళ్లిన కొద్ది సేపటికే నితిన్ బయటకు వచ్చి తన స్నేహితుడు ఇక్కడ లేడని, కూకట్‌పల్లికి తీసుకువెళ్లాల్సిందిగా కోరాడు. ఇది నమ్మిన ర్యాపిడో డ్రైవర్ మహేష్ వెంటనే నితిన్‌ను కూకట్‌పల్లికి తీసుకువెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత కూడా తన స్నేహితుడు కృష్ణానగర్ వెళ్లాడని, అక్కడ దింపాలని కోరాడు. దీంతో బాధిత ర్యాపిడో డ్రైవర్ జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని అల్కజర్ మాల్ వద్ద అర్ధరాత్రి 1.30 గంటలకు దింపాడు. ఫోన్ పే చేయడానికి తన స్విచ్ఛాఫ్ చేసి ఉందని, ఒకసారి ఫోన్ ఇస్తే తన స్నేహితుడికి చెప్పి డబ్బులు తెప్పించుకుంటానని అడిగాడు. దీంతో నితిన్‌కు మహేష్ తన ఫోన్ ఇచ్చాడు. అక్కడి నుంచి ఓ గల్లీలోకి వెళ్లిన నితిన్ ఎంతకీ తిరిగిరాలేదు. రెండు గంటలు గడిచినా రాకపోయేసరికి అన్ని ప్రాంతాలు గాలించినా ఫలి తం లేకుండాపోయింది. తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 318, 303(2)ల కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు..

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

బంజారాహిల్స్: డ్రగ్స్‌ను తరిమివేద్దాం.. యువతను కాపాడదాం.. అంటూ షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. డ్రగ్స్ వద్దు.. జీవితమే ముద్దు నినాదంతో డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. డ్రగ్స్, మాదక ద్రవ్యాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా యువతను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసుపాదం థామస్, షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ సిబ్బంది వినోద్‌కుమార్, అశోక్, ఆర్‌పి హితేష్, సీహెచ్.సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను పెంపొందించాలి: కలెక్టర్ అనుదీప్


చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలను పెంపొందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చెకుముకి పరీక్షలో విద్యార్థులంతా పాల్గొనాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఏటా 10 లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు. హైదరాబాద్ నగరంలోనూ 20 వేల మంది విద్యార్థులు ప్రతి ఏటా చెకుముకి సైన్స్ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల వరప్రసాద్, సోషల్ సోషల్ మీడియా సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్పీ లింగస్వామి, రవీంద్రబాబు, శ్రీనివాస్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు

వైభవంగా పద్మశాలీ దసరా మేళా

నాగోలు: ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్‌లోని హరిణ వనస్థలి అనన్య ఎకో టూరిజం పార్కులో దసరా మేళాను ఘనంగా నిర్వహించారు. మేళాలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్సీ, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాష్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చైతన్యవంతులైన పద్మశాలీలు రాజకీయ రంగంలో ఎదిగి చట్టసభల్లో తమ గొంతును వినిపించాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులైన పద్మశాలీలకు రాజకీయాలను శాసించే స్థాయి ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పున్న గణేష్ నేత, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథ్, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, దసరా మేళా కమిటీ చైర్మన్ కొకుంట్ల రవితేజ, ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, ప్రతినిధులు సీత ఆంజనేయులు, మేముల రాము, రాపోలు సుధాకర్, బురుగు తులసీ దాస్, గుర్రం శ్రావణ్‌నేత, రావిరాల సంధ్యారాణి, కర్నాటి శ్రీనివాస్, కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.




తాము వేసిన డ్రాయింగ్‌ను చూపిస్తున్న చిన్నారులు











చిన్నా పెద్దా ఏకమై.. ప్రకృతితో మమేకమై..

ఉత్సాహంగా ప్రజా సంబరాలు


ఆటపాటల్లో ఆబాల గోపాలం



'ప్రకృతితోనే మనం.. ప్రకృతిలోనే మనం.. ప్రకృతి ఉంటేనే మనం' అంటూ నగరవాసులు చిన్నా పెద్దా తేడా లేకుండా కేబీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన ప్రజా సంబరాలు రెజువినేట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పచ్చని చెట్ల మధ్య జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన భిన్న రకాల ఈవెంట్స్‌లో ఉల్లాసంగా గడిపారు. ఆదివారం కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో ఏర్పాటు చేసిన ప్రజా సంబరాలు కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమాన్ని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పర్యవేక్షించారు. చిన్నారులకు ఆర్ట్ కాంపిటీషన్, హాబీ సెంటర్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్లే జోన్, యువతను అలరించేందుకు లైవ్ మ్యూజిక్ కన్సర్ట్, ఫొటో బూత్, గృహిణులు ఇంటి వద్ద ఏర్పాటు చేసుకునేందుకు టెర్రస్ గార్డెన్ స్టాల్స్, అడ్వెంచర్ గేమ్స్ ఏర్పాటు చేశారు. పార్కు వాక్‌వే పరిసరాలు జాతరను తలపించేలా అధికారులు చేసిన ఏర్పాట్లు అదిరిపోయాయి. కళలు, చిత్ర లేఖనం, వీనుల విందుగా సాగిన సంగీతం తదితర కార్యక్రమాలు ఆబాల గోపాలన్ని ఆనంద డోలికల్లో ముంచెత్తాయి. -బంజారాహిల్స్

నవ్వి పోదురు గాక..!

డీఎస్సీ- 2024 కౌన్సెలింగ్‌లో అధికారుల గిమ్మిక్కులు

- పోస్టులు ఖాళీగా ఉన్నా వేకెన్సీ చూపని వైనం
- అవసరం లేని చోట అదనపు పోస్టింగులు
- ఇష్టారాజ్యంగా హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ వ్యవహారం
- అవకతవకలు జరిగాయంటున్న ఉపాధ్యాయ సంఘాలు

డీఎస్సీ- 2024కు ఎంపికైన కొత్త టీచర్ల పోస్టింగ్ కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో హైదరాబాద్ విద్యాశాఖ అధికారులు గిమ్మిక్కులకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు పాఠశాలల్లో ఖాళీగా పోస్టులను కౌన్సెలింగ్‌లో చూపించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన పాఠశాలల్లో ఖాళీల భర్తీకి పోస్టింగ్ ఇవ్వకుండా.. అవసరం లేని పాఠశాలల్లో అదనపు పోస్టింగ్ కేటాయించినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 878 పోస్టులకు 584 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగతావాటికి అభ్యర్థుల ఎంపిక వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉంది. కౌన్సెలింగ్‌లో విద్యాశాఖ వ్యవహరించిన తీరును పరిశీలిస్తే డొల్లతనం వెల్లడైంది. -సాక్షి, సిటీబ్యూరో

ఉదాహరణలివిగో..

- అమీర్‌పేట నంబర్- 1 (జవహర్ నగర్) పాఠశాలలో 452 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ హిందీ టీచరు లేరు. రెండు హిందీ పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా కేటాయించలేదు. 245 మంది విద్యార్థులు ఉన్న సెయింట్ పీటర్స్ పాఠశాలకు మాత్రం ఒక హిందీ టీచర్ ఉన్నప్పటికీ మరో టీచర్‌ను కేటాయించడం గమనార్హం.
- గత పదోన్నతుల సందర్భంగా అవసరం లేకపోయినా ప్రాక్టీసింగ్ పాఠశాలకు రెండు హిందీ పోస్టులు కేటాయించి, చింతల్ గూడ పాఠశాలకు ఒక్క హిందీ టీచర్ కూడా లేకుండా చేశారు.
- ఎల్లారెడ్డి గూడ జీపీఎస్‌లో 176 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం ఇద్దరు టీచర్స్ పని చేస్తున్నారు. జీఓ 25 ప్రకారం ముగ్గురు టీచర్స్ అవసరం ఉన్నప్పటికీ ఒక్క వేకెన్సీ కూడా చూపలేదు.
- వేకెన్సీ చూపకపోవడతో వెంగళ్ రావు నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ కూడా లేని పరిస్థితి నెలకొంది.
- బహదూర్‌పురా- 2 మండలంలోని నంది ముసలాయి గూడ జీపీఎస్‌లో 68 మంది విద్యార్థులు ఉండగా త్వరలో రిటైర్ కాబోయే ఒక్క టీచర్ మాత్రమే పని చేస్తున్నారు. ఇక్కడ ఇద్దరు టీచర్స్ అవసరం ఉండగా ఒక్క పోస్ట్ కూడా కౌన్సెలింగ్‌లో చూపించలేదు.
- ముషీరాబాద్ 2 మండలంలోని మైలార్ గూడ జీపీఎస్‌లో 140 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ అయిదుగురు టీచర్లు అవసరం ఉండగా ముగ్గురు పని చేస్తున్నారు. మరో 2 పోస్టులు అవసరం ఉన్నా చూపించలేదు.

ఈ పాఠశాలలకు సైతం..

- వేకెన్సీ చూపకపోవడంతో ఆసిఫ్ నగర్ మండలంలోని బౌలి గులాబ్ సింగ్ జీపీఎస్‌లో 40 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదు.
- ఇమామ్‌పురాలో జీపీఎస్‌లో 34 మంది విద్యార్థులకు ఒక్క టీచర్‌ను కూడా ఇవ్వలేదు జీఓ 25 ప్రకారం ఇక్కడ ఇద్దరు టీచర్లు అవసరం ఉంది.



- ఖైరతాబాద్‌లోని వినాయక నగర్ జీపీఎస్‌లో 120 మందికి పైగా విద్యార్థులు ఉండగా.. ఇద్దరు టీచర్లు మాత్రమే పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మరో ముగ్గురు ఉపాధ్యాయులు అవసరం ఉన్నప్పటికీ కేవలం ఒక్క పోస్ట్ మాత్రమే చూపించారు.
- సాయిబాబా నగర్ జీపీఎస్‌లో 160 విద్యార్థులకు ఒక హెచ్ఎం, అయిదుగురు ఎస్‌జీటీలు ఉన్నప్పటికీ అవసరం లేకపోయినా అదనపు పోస్ట్ చూపించారు.
- ఎర్రమంజిల్ జీపీఎస్‌లో 109 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, ఒక ఎస్‌జీటీ ఉండగా ఇక్కడ మరో రెండు పోస్టులు అవసరం. అయితే.. ఒకటి అదనంగా 3 పోస్టులు చూపించారు.
- ఆసిఫ్ నగర్ మండలంలోని రహీంపుర పాఠశాలలో 22 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఒక టీచర్ పని చేస్తున్నారు. మరో టీచర్ మాత్రమే అవసరం ఉండగా ఇద్దరిని కేటాయించారు.

అత్యధికంగా..

- బండ్లగూడ మండలంలోని లలితా బాగ్ జీపీఎస్‌లో ఆరుగురు విద్యార్థులకు ఒక హెచ్ఎం, ఒక ఎస్‌జీటీ పని చేస్తుండగా అవసరం లేకపోయినా మరో వేకెన్సీ చూపించారు. పార్వతీనగర్‌లో 16 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, ఒక టీచర్ ఉండగా మరో టీచర్‌ను అదనంగా కేటాయించారు. శివాజీనగర్ లో 50 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, ఇద్దరు టీచర్స్ ఉండగా అవసరం లేకపోయినా మరో ఇద్దరు టీచర్లను కేటాయించారు. అయోధ్య నగర్ లో 45 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉండగా మరో టీచర్‌ను కేటాయించారు. ఇందిరా నగర్ లో 120 మందిపైగా విద్యార్థులుండగా ముగ్గురు టీచర్లు పని చేస్తున్నారు. మరో ఇద్దరు టీచర్లు అవసరం ఉన్నప్పటికీ ఒక్క వేకెన్సీ కూడా చూపలేదు.
- షేక్‌పేట ఇందిరా నగర్‌లో 166 మంది విద్యార్థులకు ఒక హెచ్ఎం, ఒక ఎస్‌జీటీ పని చేస్తున్నారు. మరో నలుగురు టీచర్లు అవసరం కాగా.. 3 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు.
- నాంపల్లి మండలం రాంకోఠి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఒక టీచర్ ఉండగా మరో టీచర్ అవసరం అయితే ఇద్దరిని ఇచ్చారు.

అవకతవకలపై చర్యలు తీసుకోండి

డీఎస్సీ-2024 కౌన్సెలింగ్‌లో అవకతవకలకు పాల్పడిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.రాజారావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్యామ్ సుందర్ డిమాండ్ చేశారు. శనివారం వారు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. విద్యాశాఖ అధికారులు కౌన్సెలింగ్‌లో అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.


పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న నివాసితులు

మూసీ దడ ముగిసేనా!

నివాసితులను వెంటాడుతున్న కూల్చివేతల భయం

- ఇళ్లను కాపాడుకునేందుకు కోర్టు బాటలో కొందరు
- సామాజిక కమిషన్‌ల దారిలో మరికొందరు..
- మరోవైపు పోస్టు కార్డు ఉద్యమం
- మేమున్నామంటూ భరోసా ఇస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పక్షాలు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ నది నివాసితులను కూల్చివేతల దడ వెంటాడుతూనే ఉంది. నదీ ప్రక్షాళన రాజకీయ కేంద్ర బిందువుగా మారి తాత్కాలికంగా కూల్చివేతల ప్రక్రియ నిలిచినా.. భవిష్యత్తులో మళ్లీ వీటి బెడద తప్పదనే హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో నివాసితులు తమ ఇళ్లను రక్షించుకునేందుకు అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకుంటుండగా.. మరి కొందరు సామాజిక కమిషన్లను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు పోరాటం ఆందోళనలు సైతం ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకోవైపు అధికారేతర రాజకీయ పక్షాలు అండగా తామున్నామంటూ పరీవాహక ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేయిస్తున్నాయి. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల పర్యటనలు మరింత వేడిని పుట్టిస్తున్నాయి.

కోర్టును ఆశ్రయించిన నివాసితులు

మూసీ పరీవాహక ప్రాంతంలోని తమ ఇళ్లను కూల్చివేయొద్దంటూ హైకోర్టును ఆశ్రయించారు. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 2,166 నివాసాలు నదీ గర్భంలో ఉన్నట్లు డ్రోన్ సర్వే ద్వారా అధికారులు గుర్తించారు. రెవెన్యూ అధికారుల బృందం ఇప్పటి వరకు గుర్తించిన వాటిలో 68 శాతం ఇళ్లకు మార్కింగ్ చేశారు. కొన్ని గృహాలను కూలీల సహకారంతో కూల్చివేశారు. దీంతో కొందరు మూసీ నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. చైతన్యపురి, కొత్తపేటలోని దాదాపు 620 కుటుంబాలు కోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, వారిలో 400 నివాసాలకు స్టే వచ్చింది. మరోవైపు ఇటీవల వేసిన ఆర్‌బీ మార్క్‌ను సైతం ఇళ్ల యజమానులు తొలగిస్తున్నారు. తమ ఇళ్లను కూల్చివేయద్దంటూ ఇళ్ల ముందు హైకోర్టు స్టే బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఎస్సీ కమిషన్‌కు దళిత కుటుంబాలు

మూసీ పరివాహకంలో నివాసాలు కూల్చకుండా ఆదేశాలు జారీ చేయాలని ఎస్సీ కమిషన్‌ను దళిత కుటుంబాలు ఆశ్రయించాయి. కూలిపనులు చేసుకొని జీవనం సాగించే తమ ఇళ్లను అర్థాంతరంగా కూల్చివేస్తే రోడ్డున పడతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. చాదర్‌ఘాట్, శంకర్ నగర్, చైతన్యపురి, కొత్తపేట తదితర ప్రాంతాలకు చెందిన దళితులు ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించి తమ గోడును వెళ్లబోసుకుంటున్నారు.

మరోవైపు పోస్టుకార్డు ఉద్యమం

మూసీరివర్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రపతి, గవర్నర్‌తో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌లకు పోస్టు కార్డులు రాసి పంపించారు. గతంలో చేపట్టిన డ్రోన్ సర్వేపై ఆధారపడకుండా తిరిగి భౌతికంగా సర్వే చేస్తే మూసీకి దగ్గరలో ఎంతమంది ఉన్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మూసీ సుందరీకరణ కోసం తమ ఇళ్లను వదిలే ప్రసక్తిలేదని నివాసితులు తేల్చి చెబుతున్నారు. న్యాయపోరాటం చేయడానికి సిద్ధమని పేర్కొంటున్నారు.

పక్కా నిర్మాణాలతోనే సమస్య..

మూసీ పరీవాహక పరిధిలోకి వచ్చే హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 30 శాతం మంది నిర్వాసితులు.. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా.. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో మెజారిటీ సంఖ్యలో శాశ్వత నిర్మాణాలతో సమస్య తీవ్రమైంది. రూ.లక్షలు ఖర్చు చేసి నివాసాలు ఏర్పాటు చేసుకున్న కారణంగా ఇళ్లను ఖాళీ చేసే ప్రసక్తే లేదని తేల్చి చేబుతున్నారు. దీంతో నిర్వాసితులను తరలించడం రెవెన్యూ అధికారులకు కొంత తలనొప్పిగా మారింది.

తాకట్టుతో కనికట్టు

- బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.4.51 కోట్లకు టోకరా
- నకిలీ బంగారం కుదువపెట్టి రుణాలు పొందిన 27 మంది

సాక్షి, సిటీబ్యూరో: బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖైరతాబాద్ బ్రాంచ్‌లో 'పసిడి కుంభకోణం' చోటుచేసుకుంది. నకిలీ బంగారాన్ని కుదువపెట్టి 27 మంది గోల్డ్ లోన్లు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో బ్యాంకు అధికారిక అప్రైజర్‌తో పాటు ఇద్దరు ఉద్యోగులు సహకరించారు. బ్యాంక్ ఉన్నతాధికారులు శనివారం సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి..

దరఖాస్తుదారులతో కలిసి పథక రచన..

- అంబర్‌పేట గోల్నాక ప్రాంతానికి చెందిన డి.భానుచందర్ ఖైరతాబాద్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌కు అధికారిక అప్రైజర్‌గా పని చేస్తున్నారు. కుదువపెట్టడానికి వచ్చిన బంగారాన్ని పరిశీలించే ఈయన దాని నాణ్యత, బరువు తదితరాలను నిర్ధారిస్తారు. వీటి ఆధారంగానే బ్యాంకు అధికారులు దరఖాస్తుదారుకు రుణం మంజూరు చేస్తారు. తార్నాకకు చెందిన మహ్మద్ కలీం బేగ్, అలీజాపూర్‌కు చెందిన ఆరిఫ్ అహ్మద్ సయీద్ ఇదే బ్యాంకులో రుణాల మంజూరు ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఈ ముగ్గురూ సూత్రధారులుగా కొందరు కస్టమర్లు, గోల్డ్‌లోన్ దరఖాస్తుదారులతో కలిసి భారీ స్కెచ్ వేశారు. నకిలీ బంగారు ఆభరణాలు కుదువపెట్టి రుణాలు తీసుకున్నారు.
- బంగారం నాణ్యతను భానుచందర్ ధ్రువీకరించగా.. మిగిలిన ఇద్దరూ ఆ లోన్లు ప్రాసెస్ చేశారు. ఇలా ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య మొత్తం 27 మంది 44 గోల్డ్‌లోన్స్ తీసుకున్నారు. ఇది ప్రస్తుతం అసలు-వడ్డీతో కలిపి రూ.4.51 కోట్లకు చేరింది. ఈ ఏడాది జూలై 26న కలీం బేగ్ ఖైరతాబాద్‌లోని క్రెడిట్ డిపార్ట్‌మెంట్ నుంచి సిద్దిపేట బ్రాంచ్‌కు మేనేజర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ ఆగస్టు 14-20 తేదీల మధ్యలో వహీదాభాను, హమీద్ సయీద్, సయ్యద్ ఖాదర్, షేక్ రేష్మా పేర్లతో అయిదు గోల్డ్‌లోన్లు మంజూరు చేశారు. వీరు కుదువపెట్టిన బంగారం నాణ్యత, బరువులను భానుచందర్ ధ్రువీకరించారు. అప్పు తీసుకున్న వాళ్లు, బంగారం నాణ్యతను ఖరారు చేసిన అప్రైజర్ హైదరాబాద్‌కు చెందిన వాళ్లు కావడం, సిద్దిపేట వరకు వచ్చి రుణం తీసుకోవడం, గతంలో కలీం బేగ్ హైదరాబాద్‌లో పని చేసి ఉండటం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న బ్యాంకు ఉన్నతాధికారులు అనుమానించారు.



వెలుగు చూసిందిలా..

అదే బ్యాంక్‌నకు చెందిన మరో అప్రైజర్‌తో అయిదు లోన్ ఖాతాలకు సంబంధించిన బంగారానికి పరీక్షలు చేయించారు. ఈ నేపథ్యంలో అది నకిలీ బంగారంగా బయటపడింది. ఈ విషయం వెలుగులోకి రావడంతోనే కలీం బేగ్ రుణాలు చెల్లించి, లోన్ ఖాతాలు క్లోజ్ చేయడంతో బ్యాంకునకు ఎలాంటి ఆర్థిక నష్టం రాలేదు. భానుచందర్‌తో పాటు కలీం బేగ్ వ్యవహారాలను అనుమానించిన అధికారులు ఖైరతాబాద్ బ్రాంచ్ నుంచి ఇటీవల కాలంలో మంజూరైన గోల్డ్‌లోన్లపై దృష్టి పెట్టారు. వేరే అప్రైజర్లతో తనిఖీలు చేయించగా... 44 గోల్డ్‌లోన్లకు సంబంధించి 27 మంది ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారం నకిలీదిగా తేలింది. ఖైరతాబాద్, బషీర్‌బాగ్ బ్రాంచ్‌ల నుంచి వీళ్లు తీసుకున్న రుణం, దాని వడ్డీ రూ.4.51 కోట్లుగా లెక్కతేలింది. ఖైరతాబాద్ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.బాలగోపాలన్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

కట్నం వేధింపులు..గృహిణి ఆత్మహత్యాయత్నం

◆ ఎన్‌ఆర్‌ఐ భర్త, అత్త మామల దుర్మార్గంపై పోలీసులకు ఫిర్యాదు

నాగోలు: ఎన్‌ఆర్‌ఐ భర్త, అత్తమామల వేధింపులు తట్టుకోలేక ఓ గృహిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎల్‌బీనగర్ పోలీసులు, బాధితురాలి కుటుంబ సభ్యులు తెల్పిన వివరాల మేరకు...రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గడ్డం మల్లయ్య గూడ గ్రామానికి చెందిన బత్తుల వాసుదేవ రెడ్డి కుమారుడు పవన్‌కుమార్‌కు తిప్పాయిగూడకు చెందిన వింజమూరి విఠల్‌రెడ్డి కూతురు నిఖితను ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం జరిపించారు. కట్నం కింద 55 తులాల బంగారం, రూ.5 లక్షలు నగదు, వెండి సామాను ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే మామ వాసుదేవరెడ్డి, అత్త అలివేలు, భర్త పవన్‌కుమార్‌లు అదనపు కట్నం కోసం వేధించారు. పెళ్లయ్యాక పవన్‌కుమార్ ఒక్కడే మొదట అమెరికాకు వెళ్లిపోయాడు. నిఖితను అమెరికాకు తీసుకెళ్లాలని ఎన్నిమార్లు కోరినా సరిగా స్పందించ లేదు. అదనంగా కట్నం ఇస్తేనే తీసుకెళ్తానని కరాకండిగా చెప్పడంతో ఇంట్లో ఉన్న బంగారం కుదవబెట్టి మరో రూ.7 లక్షల రూపాయలు పవన్‌కుమార్‌కు ఇచ్చారు. దీంతో నిఖితను అమెరికాకు తీసుకెళ్లిన పవన్‌కుమార్ అక్కడ కూడా వేధించడంతో ఆ బాధలు భరించలేక తిరిగి ఇండియాకు వచ్చేసింది. ఇక్కడ అత్తామామలు వేధించడంతోపాటు ఇటీవల నిఖితను పుట్టింట్లో వదిలేసి వెళ్లిపోయారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన నిఖిత ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిఖితను హాస్పిటల్‌కు తరలించారు. తన కూతుర్ని వరకట్నం కోసం వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్త, అత్తమామలపై విఠల్‌రెడ్డి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీకెండ్స్‌లో బైక్ రేసింగ్ హంగామా!

- టీ హబ్ పరిసరాల్లో రోడ్లపై ప్రయాణికులకు ఇక్కట్లు
- 10 బైక్‌లు సీజ్...కేసు నమోదు

గచ్చిబౌలి: వీకెండ్స్ వస్తే చాలు నగరం నుంచి హైదరాబాద్ నాలెడ్జి సిటీ పరిసరాల్లోకి వచ్చి బైక్‌లతో విన్యాసాలు చేస్తూ, రేసింగ్‌కు పాల్పడడం పరిపాటిగా మారిపోయింది. శనివారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు బైక్‌లతో యువకులు రేసింగ్‌లకు పాల్పడడం, ఇతర ప్రయాణికులకు ఇక్కట్లు సృష్టించడం జరుగుతూనే ఉంది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయి. వీటిని పూర్తిగా అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాయదుర్గం పోలీసులు శనివారం రాత్రి పది బైక్‌లను సీజ్ చేసి, పది మంది యువకులపై కేసు నమోదు చేశారు. ఆదివారం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన యువకులు పది బైక్‌లపై వచ్చి హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రధాన రోడ్లపై మితిమీరి న వేగంతో రేసింగ్‌కు పాల్పడుతున్నట్లు సమాచారం అందిందని, దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పది బైక్‌లను సీజ్ చేశామని, పది మంది యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



పోలీసులు సీజ్ చేసిన బైక్‌లు ఇవే..

దత్తాత్రేయ కాన్వాయ్‌కి రోడ్డు ప్రమాదం

సడన్ బ్రేక్ వేయడంతో ఒకదానికొకటి ఢీకొన్న మూడు కార్లు

శంషాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కాన్వాయ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి హైదరాబాద్ నుంచి ఢిల్లీ తిరుగు ప్రయాణం అవుతున్న దత్తాత్రేయ కాన్వాయ్‌తో ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. వీరు ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారి వైపు వస్తుండగా..ముందు కారులో ప్రయాణిస్తున్న సర్ఫరాజ్ అనే వ్యక్తి మలుపు వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న గవర్నర్ ఎస్కార్ట్ వాహనం ఢీకొంది. దీంతో దాని వెంటనే ఉన్న కాన్వాయ్‌లోని మరో మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఇందులో కార్లు దెబ్బతిన్నా ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సంఘటనకు కారణమైన వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. ముందు కారు నడుపుతున్న వ్యక్తి పేరు సర్ఫరాజ్ అని తెలిసింది.



'వింటేజ్' వాహనాల సంగతేంటో?

స్పష్టత లేని స్క్రాప్ పాలసీ
- 15 ఏళ్లు దాటితే కాలపరిమితి ముగిసినట్లే...
- సిటీలో వందేళ్ల నాటి వాహనాలు
- వింటేజ్ వాహనాలకు హైదరాబాద్ హబ్



సాక్షి, సిటీబ్యూరో: వింటేజ్ వాహనాలకు హైదరాబాద్ కేంద్రబిందువు. వందేళ్ల నాటి కార్లు, జీపులు నగరంలో ఉన్నాయి. నిజాం కాలం నాటి నవాబులు మొదలుకొని ఉన్నత, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలు తమ పూర్వీకులు వినియోగించిన వాహనాలను గత వైభవానికి ప్రతీకగా కాపాడుకుంటున్నారు. కొన్ని బ్రాండ్‌లకు చెందిన కార్లు, బైక్‌లు ప్రస్తుతం అలంకారప్రాయంగా ఉన్నప్పటికీ మరికొన్ని కేటగిరీలకు చెందిన వాహనాలు మాత్రం ఇప్పటికీ వినియోగంలో ఉన్నాయి. అన్ని వర్గాలను విశేషంగా ఆకట్టుకున్న అంబాసిడర్ కారు అక్కడక్కడా హైదరాబాద్ రహదారులపైన పరుగులు తీస్తూనే ఉంది. కొత్త మోడళ్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ పాతవాటిపైన ప్రేమకొద్దీ చాలామంది వాటినే వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో రవాణాశాఖ తాజాగా తెచ్చిన స్క్రాప్ పాలసీ ప్రకారం వింటేజ్ వాహనాలను కాలం చెల్లిన వాటిగా పరిగణిస్తారా లేక, వాటి అనుమతులను ఎప్పటికప్పుడు పునరుద్ధరిస్తారా అనే అంశంపైన స్పష్టత కొరవడింది. మరోవైపు కేంద్రం రూపొందించిన స్క్రాప్ విధానంలోనే వింటేజ్ వాహనాల ప్రస్తావన లేకపోవడంతో ప్రభుత్వం ఈ వాహనాలపైన ఎలా ముందుకెళ్లనుందనేది చర్చనీయాంశంగా మారింది.

'కాలపరిమితి' లెక్కల చిక్కులు.....

వాహన కాలుష్యాన్ని అరికట్టే లక్ష్యంతో రూపొందించిన స్క్రాప్ పాలసీ ప్రకారం 15 ఏళ్ల దాటిన రవాణా వాహనాలను తుక్కుగా మార్చవచ్చు. వ్యక్తిగత వాహనాలకు 15 ఏళ్ల దాటిన తరువాత ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి అనుమతులను పునరుద్ధరించుకొనే అవకాశం ఉన్నప్పటికీ వాహన యజమానులు వాటిని స్వచ్ఛందంగా తుక్కుగా మార్చేందుకు ముందుకు వస్తే కొత్తగా కొనుగోలు చేసే వాహనం జీవితకాల పన్నులో ప్రభుత్వం రాయితీనిస్తుంది. ఈ రెండు కేటగిరీలకు చెందిన వాహనాల విషయంలో తుక్కు విధానం స్పష్టంగానే ఉంది. ఈ లెక్కన గ్రేటర్ హైదరాబాద్‌లో 15 ఏళ్లు పైబడిన సుమారు 18 లక్షలకు పైగా వాహన యజమానులు వాటి అనుమతులను పునరుద్ధరించుకోవచ్చు. లేదా తుక్కుగా మార్చుకోవచ్చు. కానీ వింటేజ్ వాహనాలపైన మాత్రం ఆర్టీఏ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతను ఇవ్వకపోవడం గమనార్హం. నగరంలో 50 ఏళ్ల నుంచి 100 ఏళ్లు దాటిన వాహనాలు కూడా ఉన్నాయి. ఈ వాహనాలను వినియోగించడం వల్ల స్క్రాప్ విధానాన్ని ఉల్లంఘించినట్లవుతుందా లేక, వాటికి మినహాయింపునిస్తారా అనే అంశంపైన ఆర్టీఏ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టతను ఇవ్వకపోవడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు చెందిన కాలపరిమితి ముగిసిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు 3 ప్రాంతాల్లో స్క్రాప్ యూనిట్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు తాజాగా సన్నాహాలు చేపట్టారు. శంషాబాద్,వర్గల్, తూప్రాన్‌లలో ఈ కేంద్రాలు రానున్నాయి. నవంబర్ నుంచి తుక్కు విధానం అమల్లోకి రానుంది. ఈ క్రమంలో 'కాల పరిమితి ముగిసిన' జాబితా నుంచి వింటేజ్ వాహనాలకు మినహాయింపునిస్తారా లేదా అనేది తేలవలసి ఉంది.

మినహాయింపు ఉండొచ్చు

"వింటేజ్ వాహనాల అంశాన్ని స్క్రాప్ పాలసీలో ప్రస్తావించకపోయినా వాటికి తప్పనిసరిగా మినహాయింపు ఉంటుంది. రహదారి భద్రతా చట్టంలో భాగంగా కేంద్రం స్క్రాప్ పాలసీని అమల్లోకి తెచ్చింది. వింటేజ్ వాహనాలపైన కేంద్రం నుంచి త్వరలోనే స్పష్టత లభిస్తుందని భావిస్తున్నాం.

– సి.రమేష్, జేటీసీ, హైదరాబాద్

వింటేజ్ రాజ్ హైదరాబాద్

ఢిల్లీ,ముంబయి, పుణె వంటి పలు నగరాల్లో వింటేజ్ వాహనాలు ఉన్నప్పటికీ హైదరాబాద్‌లోనే వాటి సంఖ్య, పునర్వినియోగం ఎక్కువగా ఉన్నట్లు అంచనా. ఆర్టీఏ లెక్కల ప్రకారం సుమారు 10 వేల వరకు వింటేజ్ కార్లు, బైక్‌లు ఉన్నాయి. 30 నుంచి 40 ఏళ్ల కాలపరిమితిని తీసుకుంటే ఈ వాహనాల సంఖ్య 50 వేల కంటే ఎక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నిజాం కాలం నాటి వాహనాలు మొదలుకొని 1970 కాలానికి చెందినవి కూడా ఉన్నాయి. సాధారణ,మధ్యతరగతి వర్గాలు విరివిగా వినియోగించే బుల్లెట్, జావా, ఎస్‌డీ వంటి వాహనాలు (పాత మోడల్స్) వాహనప్రియులను ఇప్పటికీ విశేషంగా ఆకట్టుకుంటూనే ఉన్నాయి. నేపియర్ (1903), రోల్స్‌రాయిల్ (1913), ఓల్స్లే (1915),ఆప్టిన్ (1920), అంబాసిడర్ (1955), హెరాల్డ్ (1965), ప్రీమియర్ ప్రెసిడెంట్, ప్రీమియర్ పద్మిని (1973, 1974) కార్లు, ఫోర్డ్ (1941), విల్స్, సీజే 3ఏ, మహీంద్ర (1949) వంటి జీప్‌లు నగరంలో ఉన్నాయి.కొన్ని గతకాలపు వైభవ చిహ్నాలుగా ఉంటే మరికొన్నింటిని మార్పులు, చేర్పులతో పునర్వినియోగిస్తున్నారు. మరోవైపు ఈ వాహనాల సహజత్వం ఏ మాత్రం దెబ్బతినకుండా పరిరక్షించే ఇంజనీరింగ్ నైపుణ్యం కూడా హైదరాబాద్‌లో పుష్కలంగా ఉంది.



అలనాటి స్నేహితుల కలయిక!

సాక్షి, సిటీబ్యూరో: 50వ దశకంలో పాఠాలు నేర్చుకున్న వారంతా ఒక్కచోట చేరారు. ఇన్నేళ్ల తర్వాత అలనాటి స్నేహితులతో కలిసి ముచ్చటించారు. కృష్ణా జిల్లా తాడంకి జడ్పీ హైస్కూల్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆ స్కూల్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ తబలా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి 1953–54 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన ప్రభాకరరావు, ప్రకాశరావు, రిటైర్డ్ డీఎస్పీ శాంత రామారావు, అనంత లక్ష్మి, వెంకటేశ్వరావు, పి.తిరుమల ప్రసాద్, వై.మస్తాన్‌రావు తదితరులు హాజరయ్యారు.

అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్: ఒప్పందం ప్రకారం తమకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు కోట్లాది రూపాయలు తీసుకున్న తర్వాత కూడా ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజ్‌కుమార్ రాయ్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో ఉన్న హెచ్‌ఎస్‌ఆర్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దూరెడ్డి ధీరజ్ 2018లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో 34 ఎకరాల 25 గుంటల స్థలాన్ని అనన్య ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కొనుగోలు చేశాడు. ఇందుకు గాను రూ.8.37 కోట్లు అనన్య ప్రాజెక్ట్స్ ఎండీ రాజ్‌కుమార్‌రాయ్‌కు చెల్లించాడు. అయితే ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకపోగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని, అసాంఘిక పద్ధతుల్లో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధీరజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజ్‌కుమార్‌రాయ్ అక్రమాలకు, చట్టవిరుద్ధమైన కార్యక్రమాలతో పాల్పడడమే కాకుండా ఈ విషయాన్ని దాటవేస్తూ వస్తున్నాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్‌రాయ్‌పై ఐపీసీ 406, 420, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే'



మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బొంగ్లూర్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన అలయ్‌బలయ్ (దసరా సమ్మేళనం) కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సబితారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అద్దంలా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్, కేటీఆర్‌దేనని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సకల జనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను తిట్టుడు తప్ప అభివృద్ధిపై చిత్తశుద్ధి లే దని విమర్శించారు. ఫార్మాపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రజలపై ఉందన్నారు.

కలెక్టరేట్‌ను తరలించే కుట్ర

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ రంగారెడ్డి కలెక్టరేట్‌ను చేవెళ్ల, రాజేంద్రనగర్‌కు తరలించాలని చూస్తున్నారని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధిపై సోయి లేదన్నారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని ఆగం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం ఫాక్స్‌కాన్‌కు వచ్చి చేసింది, చూసింది ఏమీ లేదన్నారు. కక్ష సాధింపు తప్ప కాంగ్రెస్ చేసేదేమీ లేదన్నారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కృపేష్, చంద్రయ్య, అంజిరెడ్డి, కిషన్‌గౌడ్, రమేష్‌గౌడ్, మందా సురేష్, ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భారత్ ప్రైడ్ సైన్స్ ఎక్స్‌పో



సాక్షి, సిటీబ్యూరో: మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగిన భారత్ ప్రైడ్-2024 నేషనల్ సైన్స్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జి.పుల్లారెడ్డి మెమోరియల్ స్కూల్‌లో జరిగిన ఈ ఎక్స్‌పోలో ఇస్రో, ఎన్‌ఆర్‌ఎస్‌సీ, సీఎస్‌ఐఆర్, ఎన్‌జీఆర్‌ఐ, ఎన్‌ఎంఎల్, ఎస్‌ఈఆర్‌సీ, ఐఎంఎంటీ, ఐఎండీ తదితర సంస్థలకు చెందిన దాదాపు 100 స్టాళ్లను ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులు, ప్రజలు ఈ ఎక్స్‌పోను సందర్శించి, శాస్త్రవేత్తలతో ఇంటరాక్ట్ అయ్యారు. సీఎస్‌ఐఆర్, ఐఎండీ స్టాళ్లు ఉత్తమ అవార్డును అందుకున్నాయి. ఈ అవార్డులను ఐఎండీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న, స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీ తదితరులు అందజేశారు.

సీఎం చెప్పినా స్పందన లేదు!

- ట్రాన్స్‌జెండర్స్ సేవలు వినియోగించాలన్న ముఖ్యమంత్రి
- ట్రాఫిక్ విభాగంలో వలంటీర్లుగా తీసుకోవాలని సూచన
- గత నెల 13న ప్రకటన, ఇప్పటికీ పట్టించుకోని అధికారులు
- ఇప్పటికే తమిళనాడు, కర్ణాటకల్లో ఈ ప్రయోగాలు అమలు



సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి వాళ్లు ఎలాంటి ఆదేశాలు జారీ చేసినా.. క్షణాల్లో అమలులోకి వస్తాయి. సుదీర్ఘమైన కసరత్తు అవసరమైతే ఆ చర్యలు మొదలవుతాయి. అవసరమైతే కమిటీలు, కమీషన్లు ఏర్పాటవుతాయి. అధికారులంతా ఆఘమేఘాల మీద ఉరుకులుపరుగులు పెడతారు. అయితే సీఎం ఎ.రేవంత్‌రెడ్డి 'ట్రాఫిక్–ట్రాన్స్‌జెండర్ల సేవలు' విషయంలో గత నెల 13న కీలక ప్రకటన చేశారు. దీనికి సంబంధించి అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఉన్నతమైన ఆలోచన చేసిన ముఖ్యమంత్రి.

ట్రాన్స్‌జెండర్స్ వల్ల సామాన్యులకు ఎదురవుతున్న సమస్యల తొలగింపుతో పాటు వారికి గౌరవప్రదమైన జీవితం అందించడం కోసం ట్రాఫిక్ వాలంటీర్లుగా నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతల్లో వారికీ భాగస్వామ్యం కల్పించాలని యోచించారు. ట్రాఫిక్ ఇక్కట్లు తప్పించడం కోసం పోలీసులు, హోంగార్డ్స్ తరహాలోనే ట్రాన్స్‌జెండర్లనూ వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగావకాశాలు తగ్గాయని, ఇలా చేస్తూ ప్రతి నెలా నిర్ణీత మొత్తం అందిస్తే వారికి కొంత ఉపాధి కల్పించనట్లవుతుందని భావించారు.

ప్రత్యేక శిక్షణ, యూనిఫామ్ ఉండాలంటూ...

ఈ ప్రతిపాదనల్ని అమలులో పెట్టడానికి తక్షణం చర్యలు తీసుకోవాలంటూ గత నెల 13న అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా సీఎం ఈ విషయం స్పష్టం చేశారు. ట్రాఫిక్ వాలంటీర్ల నియామకం కోసం ఆసక్తి ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలు సేకరించాలని, వారం నుంచి పది రోజుల పాటు అవసరమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ వాలంటీర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా అందించాలన్న ముఖ్యమంత్రి కొన్ని నమూనాలను పరిశీలించారు. సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ట్రాఫిక్ విభాగానికి ఈ ప్రయోగం సక్సెస్ అయితే పెద్ద ఉపశమనమే లభిస్తుంది.

ఇప్పటికే ఆ రెండు నగరాల్లో అమలు...

ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్ల సేవలు వినియోగం అనేది దేశంలో సరికొత్త విధానమేమీ కాదు. తమిళనాడు రాజధాని చెన్నై ట్రాఫిక్ పోలీసులు 2013లోనే ఈ తరహా ప్రయోగం చేశారు. వన్ ఇండియా రోడ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సహాయంతో పది మంది ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ ఇచ్చి ట్రాఫిక్ వాలంటీర్లుగా మార్చారు. వారికి నెలకు రూ.9 వేల పారితోషికం అందించారు. 2018లో కర్ణాటకలోని టుమ్కూరు పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రద్దీ వేళల్లో ట్రాఫిక్ నియంత్రణతో పాటు రహదారి నిబంధనలు, రోడ్డు భద్రతా అంశాలపై అవగాహన కల్పించడానికి ట్రాన్స్‌జెండర్లతో ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. వాలంటీర్ల మాదిరిగా వీరికీ పారితోషికం అందిస్తూ రహదారులపై సేవలు వినియోగించుకున్నారు. కొచ్చిన్ మెట్రో రైల్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ ట్రాన్స్‌జెండర్లను వాలంటీర్లుగా వినియోగించిన సందర్భాలు ఉన్నాయి.

ఒక్క అడుగూ వేయని అధికారులు...

ట్రాన్స్‌జెండర్ల సేవలు వినియోగం విషయంలో ముఖ్యమంత్రి ఆదేశాలను అమలులో పెట్టే దిశలో అధికారులు కనీసం ఒక్క అడుగు కూడా వేయలేదు. దేశంలో ప్రస్తుతం ఎక్కడెక్కడ అమలులో ఉంది? ఫలితాలు ఏంటి? ఎలాంటి సవాళ్లు ఎదురవుతున్నాయి? తదితరాలు అధ్యయనం పైనా దృష్టి పెట్టలేదు. వీరి ఎంపికకు సంబంధించి ట్రాఫిక్ విభాగాలు, ట్రాన్స్‌జెండర్ల సంఘాలతోనూ సంప్రదింపులు జరపలేదు. ముఖ్యమంత్రి జారీ చేసిన ఆదేశాలకు సంబంధించిన ఆచరణ విధివిధానాలను ఏ అధికారీ సమీక్షించలేదు. కనీసం ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) సైతం ఈ కోణంలో చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయి అధికారులు అసలు పట్టించుకోవట్లేదు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలి ఆంధ్రాకు వెళ్లిపోవడం, ప్రస్తుతం బల్దియాకు ఇన్‌చార్జ్ కమిషనర్ ఉండటంతో 'ట్రాఫిక్ వాలంటీర్ల' ప్రతిపాదన పట్టాలెక్కే పరిస్థితి కనిపించట్లేదు.

వాకర్లను వేధిస్తున్న పార్కింగ్ సమస్య

అధికారులతో చర్చించి పరిష్కరిస్తాం : విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు వాకర్లను నిత్యం పార్కింగ్ సమస్య వేధిస్తున్నదని త్వరలోనే ఈ సమస్యపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని కేబీఆర్ నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరిగపుడి విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జింఖానా క్లబ్‌లో నేచర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాకర్లు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. పార్కులో కొన్ని కమర్షియల్ యాక్టివిటీస్ జరుగుతున్నాయని వాటిని అరికట్టాలని సూచించారు. అదే విధంగా వాకర్లకు వాకింగ్ ట్రాక్‌లో ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే వారిని ప్రధాన గేటు వద్దకు తీసుకొచ్చే విధంగా ఓ బ్యాటరీ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వాకర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా పార్కులో సీనియర్ సిటిజన్లు కూర్చునేందుకు అవసరమైన చోట్ల బెంచీలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ లక్ష్మారెడ్డి, కోశాధికారి సురేష్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ వైఈపీ రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవాలయ ప్రారంభోత్సవం

కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్, రాజమొహల్లా బస్తీలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, బీఆర్ఎస్ నేతలు గోవర్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు



వెంగళరావునగర్: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, అదే సీపీఎం ప్రధాన ఎజెండా అని ఆ పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు తెలియజేశారు. హైదరాబాద్ నగర 23వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం ఆదివారం స్థానిక వెంగళరావునగర్‌కాలనీలోని బ్రహ్మం టాలెంట్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 23వ మహాసభలు ఈనెల 30 నుంచి మూడు రోజులపాటు వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో జరగనున్నట్లు తెలియజేశారు. ప్రజా సమస్యలపై పోరాడి పరిష్కరించేది సీపీఎం ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. ఈ మహాసభలకు నగర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు కదిలి రావాలని సూచించారు. అనంతరం హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా సీహెచ్.చంద్రశేఖర్‌రావు, పాట్రన్స్‌గా పోసాని సుబ్బారావు, రాజేష్, ఉపాధ్యక్షులుగా శ్యామల రాజన్‌బాబు, టి.సాయిశేషగిరిరావు, జె.స్వామి, లింగయ్య, ప్రసాద్, కార్యదర్శిగా రాపర్తి అశోక్, పాపారావు, యాదగిరిలను ఎన్నుకున్నారు.

డిమాండ్లు నెరవేర్చేలా ఉద్యమాలు చేయాలి

ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్

పంజగుట్ట: ప్రభుత్వంలో ఉన్న వారికి ముదిరాజ్‌ల సమస్యలు తీర్చడం ఒక తప్పనిసరి అవసరంగా మారేలా మన ఉద్యమాలు ఉండాలని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముదిరాజ్ ఇంటలెక్చువల్ కన్వెన్షన్, ముదిరాజ్ కుల మహనీయులు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్‌పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, జనసమితి నాయకుడు నిజ్జన రమేష్, సంపాదకుడు ఉప్పరి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ ముదిరాజ్ రచించిన 'ముదిరాజ్ కుల మహనీయులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలోకి మారుస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇప్పటి వరకు హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నోటిఫికేషన్లు పడ్డ ఉద్యోగాల్లో, విద్యలో ముదిరాజ్‌లు ఎంతో నష్టపోయారన్నారు. వెంటనే ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ నాయకులు శ్రీకాంత్, వెంకటేష్, మహిళా నాయకులు ఆశాప్రియ, రమాదేవి, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మిద్దె తోటలతో ఎంతో ఉపయోగం


మిద్దెతోటల స్టాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: నగర ప్రజలు తమకున్న కొద్దిపాటి స్థలంలోనే మిద్దెతోటలు ఏర్పాటు చేసుకొని రకరకాల కూరగాయలు, ఆకు కూరలు సాగు చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. ఆదివారం కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో మిద్దెతోటల ఏర్పాటు, వినియోగంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆమె అభినందించారు. ప్రతి ఒక్కరూ మిద్దె తోటల సాగుపై దృష్టిసారించాలని సూచించారు.

సమాజ్‌వాది పార్టీని బలోపేతం చేయాలి



బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్‌లో సమాజ్‌వాది పార్టీ బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాడాలని ఏపీ సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు పాశం వెంకటేష్ సూచించారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ సమాజ్‌వాది పార్టీ నేత, సామాజిక కార్యకర్త దండుబోయిన కళ్యాణ్ యాదవ్, తెలంగాణ మాదిగ దండోరా అధ్యక్షుడు మదిరె నర్సింగ్‌రావుతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పార్టీలో చేరిన నేతలు వారివారి ప్రాంతాల్లో శ్రేణులను ఐక్యం చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడాలని తీర్మానించారు. త్వరలోనే సమాజ్‌వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ సూచనలతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థాయిల్లో కమిటీలు వేస్తామని పెద్దఎత్తున పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహిస్తామని తెలిపారు. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో యూపీలో ఏ విధంగా అయితే సమాజ్‌వాది విజయం సాధించిందో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అదే తరహా ఫలితాలు రాబట్టి యూపీలో అఖిలేష్ యాదవ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అన్నారు.

రాంసుందర్‌రెడ్డికి నివాళి


రాంసుందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్: బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ భర్త పాదూరి రాంసుందర్‌రెడ్డి సంతాప సభ ఆదివారం జూబ్లీహిల్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ దత్తాత్రేయతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని రాంసుందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రముఖ వ్యాపారవేత్తగా, సామాజికవేత్తగా రాంసుందర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

పోలీస్ డ్యూటీ మీట్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు మూడు గోల్డ్‌మెడల్స్


ఇన్‌స్పెక్టర్ వెన్నమళ్ల శ్రీనివాసరావుకు అవార్డులు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అబిడ్స్: తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్‌లో సౌత్‌వెస్ట్‌జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెన్నమళ్ల శ్రీనివాసరావు ప్రతిభ కనబరిచారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో మూడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించారు. ఉత్తమ ప్రతిభకు స్టార్ ఆఫ్ ఇయ్యర్ అవార్డు దక్కించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ వెన్నమళ్ల శ్రీనివాసరావుకు పతకాలు, స్టార్ ఆఫ్ ది ఇయ్యర్ అవార్డు అందజేసి అభినందించారు.

'వగరు జ్ఞాపకాల నవ్వు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ పాత్రికేయులు శ్రీనివాస్

కాచిగూడ: కవిత్వం, కథ ప్రక్రియల్లో తనదైన గొంతుకను వినిపిస్తూ దీర్ఘకాలంగా రచనలు చేస్తున్న విమల తెలుగు సాహిత్య లోకానికి సుపరిచితురాలని సీనియర్ పాత్రికేయులు కె. శ్రీనివాస్ అన్నారు. కాలం గుండె చప్పుడు నిర్వహణలో ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విమల కవిత్వం 'వగరు జ్ఞాపకాల నవ్వు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరి వగరు జ్ఞాపకాల నవ్వును ఈ పుస్తకంలో తెలియజేస్తున్నాయని చెప్పారు. ఈ పుస్తకం చదువుతుంటే ఒక ధ్యాసలోకి వెళ్లినట్టు ఉంటుందని, ఇందులో బాధ, విచారం, కరుణ స్పష్టమవుతున్నాయన్నారు. ప్రజా ఉద్యమాలు ప్రజల పట్ల భవిష్యత్తు పట్ల ఆమె కరుణ, దయతో కవిత్వం రాశారని, కానీ ఆమె ఎందుకు మెత్తబడ్డారో తెలియడం లేదన్నారు. విమల ప్రజా జీవితంలో జరిగిన ఒడిదుడుకులు ఈ కవిత్వంలో ఉన్నాయన్నారు. వగరు జ్ఞాపకాల నవ్వు అందరి జ్ఞాపకాలను గుర్తు చేస్తుందన్నారు. అందరూ ఈ పుస్తకంతో మమేకం అవుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పుస్తకంలోని పలు కవితలను చదివారు.కార్యక్రమంలో రచయిత్రి విమల, ప్రముఖ రచయిత్రులు కాత్యాయని, ఊర్మిళ, సుధాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో పేషెంట్లతో వాకథాన్


వాకథాన్‌ను ప్రారంభిస్తున్న యశోద హాస్పిటల్ డైరెక్టర్ తదితరులు

ఖైరతాబాద్: ప్రపంచ ఆర్థరైటిస్ డే సందర్భంగా యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జాయింట్ రీప్లేస్‌మెంట్ చేసుకున్న పేషెంట్లతో ఆదివారం నెక్లెస్ రోడ్డులో వాకథాన్ నిర్వహించారు. వాకథాన్‌ను యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి జెండా ఊపి ప్రారంభించారు. వాకథాన్‌లో వంద మందికి పైగా జాయింట్ రీ ప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేసుకున్న పేషెంట్లు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి మాట్లాడుతూ కీళ్లను ప్రభావితం చేసే ఆర్థరైటిస్ వ్యాధిపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. ఆర్థరైటిస్ ముదిరి శస్త్రచికిత్స వరకు రాకుండా మోకాళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బోన్ సాంద్రత పెంచి ఆస్టియోపోరోసిస్‌కు దారి తీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పంచవృత్తిదారులను విశ్వకర్మలుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

కాచిగూడ: కులగణనలో పంచవృత్తిదారులను విశ్వకర్మలుగా గుర్తించాలని అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్నాథం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయంలో త్వరలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కమ్మరి, వడ్రంగీ, కంచరి, శిల్పి, స్వర్ణకారులను విశ్వకర్మలుగా పిలుస్తారని, కులగణనలో వృత్తులకు ప్రాధాన్యం ఇవ్వకుండా కులానికే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దాని వల్ల రాష్ట్రంలో విశ్వకర్మల జనాభా ఎంత ఉందో వెల్లడవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసి అయిదు వృత్తిదారులను విశ్వకర్మలుగా పేర్కొనాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు ఎస్.లింగాచారి, మురళీధర్‌చారి, కాతోజు రామాచారి, సతీష్ చారి, కృష్ణమా చారి, నారాయణదాసు, జ్యోతి, తేజస్వి, మంజుల, అభిషేక్, గంగాధర్ చారి, సావిత్ర, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

'బాధ్యులను కఠినంగా శిక్షించాలి'

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో చోటు చేసుకుంటున్న మతపరమైన ఘటనలపై అఖిల భారత మిల్లీ కౌన్సిల్ తెలంగాణ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవల సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని అపవిత్రం చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ, ఈ దుర్మార్గమైన చర్యను కౌన్సిల్ ఖండించింది. మత సామరస్యానికి విఘాతం కలిగించే లక్ష్యంతో జరుగుతున్న ఇలాంటి ఘటనలను కట్టడి చేయాలని, విచారణను వేగంవంతం చేసి బాధ్యులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని కౌన్సిల్ తెలంగాణ జనరల్ సెక్రటరీ ముఫ్తీ ఒమర్ అబిదీన్ డిమాండ్ చేశారు.

9 నిమిషాల్లోనే..

రాచకొండలో డయల్ 100 రెస్పాన్స్ టైం ఇదీ

- నిరంతరం 75 పెట్రోలింగ్ వాహనాలు రోడ్లపైనే
- 200లకు పైగా సైకిళ్లతో ప్రతి గల్లీలో గస్తీ
- దీంతో నేరాల తగ్గుదల, గూఢచారి వ్యవస్థ బలోపేతం
- 'సాక్షి'తో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు





సాక్షి, సిటీబ్యూరో: 'టెన్ మినిట్స్' డెలివరీ కోసం ఈ–కామర్స్ రంగంలో సంస్థలు ఎలాగైతే పోటీ పడుతున్నాయో.. అదే తరహాలో గ్రేటర్ హైదరాబాద్‌లోని ట్రై కమిషనరేట్‌లో డయల్ 100 రెస్పాన్స్ టైం కోసం రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ పోలీసులు పోటీపడుతున్నారు. బాధితులు డయల్ 100కు ఫోన్ చేసిన సమయం నుంచి కేవలం 9.4 నిమిషాల్లోనే రాచకొండ పోలీసులు సంఘటనా స్థలంలో వాలిపోతున్నారు. ఈ ఏడాది జులైలో డయల్ 100 రెస్పాన్స్ టైం 25 నిమిషాలకు పైగా పట్టేదని, పోలీసు వ్యవస్థను పటిష్టపర్చడం, నిఘా వాహనాల సంఖ్య పెంచడంతో వేగవంతంగా ఘటనా స్థలికి చేరుకోగలుగుతున్నామని రాచకొండ పోలీసు కమిషనర్ జీ సుధీర్ బాబు 'సాక్షి'కి వెల్లడించారు.

సైకిల్‌తో గస్తీ..

రాచకొండలో సైకిల్ పెట్రోలింగ్‌ను ప్రారంభించాం. 200లకు పైగా సైకిళ్లను కొనుగోలు చేశాం. ప్రతి స్టేషన్‌కు 3–5 సైకిళ్లను అందించాం. ప్రతి రోజు సాయంత్రం పురుషులతో పాటు మహిళా పోలీసు సిబ్బంది సైకిళ్లపై ప్రతీ గల్లీలో తిరుగుతూ గస్తీ కాస్తుంటారు. స్థానిక మహిళలు, రైతులు, యువతతో పాటు గేటెడ్ కమ్యూనిటీ సంఘాలతో గూఢచారి వ్యవస్థను బలోపేతం చేసుకోవడం సైకిల్ ప్యాట్రోలింగ్ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. దీంతో నేరాలు తగ్గడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఆధారాలు సేకరించడం సులువు అవుతుంది అన్నారు.

75 పెట్రోలింగ్ వాహనాలు..

రాచకొండ పోలీసు కమిషనరేట్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో మిళితమై ఉంటుంది. పట్టణ ప్రాంతాలకు పోలీసులు చేరుకోవడం కాస్త సులువే అయినా, శివార్లలోని గ్రామీణ ప్రాంతాలకు చేరుకోవడం కష్టమే. కానీ, పెట్రోలింగ్ వాహనాలను, బ్లూ కోల్ట్ సిబ్బందిని పెంచడంతో భువనగిరి, మంచాల్, ఇబ్రహీంపట్నం తదితర గ్రామీణ ప్రాంతాలకు సైతం వేగవంతంగా చేరుకోగలుగుతున్నాం. ప్రస్తుతం రాచకొండలో 75 పెట్రోలింగ్ వాహనాలున్నాయి. 2–3 నెలల క్రితం రోజుకు 2,475 బ్లూ కోల్ట్ ఆపరేషన్స్ జరగుతుండగా.. ఇప్పుడు 3,195లకు పెరిగాయి. దీంతో వేగవంతంగా రెస్పాన్స్ అయ్యేందుకు వీలు కలుగుతుంది.

ఉమెన్ పెట్రోలింగ్ వాహనాలు..

సాధారణంగా నిర్మానుష్య ప్రాంతాలు, గల్లీల్లో పెట్రోలింగ్ వాహనాల్లో పోలీసులు నిరంతరం తిరుగుతూ గస్తీ కాస్తుంటారు. అయితే 24/7 మహిళలకు భద్రత, రక్షణ కల్పించాలనే లక్ష్యంతో బ్లూ కోల్ట్, పెట్రోలింగ్ వాహనాల్లోను మహిళా సిబ్బందిని నియమించాం. బ్లూ కోల్ట్ అనేది అత్యవసర సమయంలో స్పందించే బృందం. 24/7 బైక్‌లపై తిరుగుతూ వేధింపులు, చెయిన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాల వంటి నేరాలు జరిగినప్పుడు వేగంగా స్పందించి, ఘటనా స్థలికి చేరుకుంటారు.

చికెన్ బిర్యానీలో కప్ప

- ట్రిపుల్ ఐటీ మెస్‌లో ఘటన
- అవాక్కయిన విద్యార్థులు

రాయదుర్గం: చికెన్ బిర్యానీలో కప్ప కనిపించడంతో విద్యార్థులు కంగుతిన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే. బుధవారం ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లోని కదంబా మెస్‌లో విద్యార్థులకు వడ్డించిన చికెన్ బిర్యానీలో కప్ప కనిపించడంతో విద్యార్థులు అవాక్కయ్యారు. వెంటనే ఈ విషయాన్ని మెస్ సిబ్బందికి, ఇన్‌చార్జికి ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే వండిన బిర్యానీ మొత్తాన్ని బయట పడేశారు. మెస్‌లో శుభ్రత పాటించడం లేదని, ఆహారంలో పురుగులు, కప్పలు వస్తున్నాయని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరలయ్యింది. ఈ ఘటనపై ట్రిపుల్‌ఐటీ అధికారులను వివరణ కోరగా ఈ అంశంపై విచారణ చేపట్టామని, ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుంటామని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగేలా చూస్తామని స్పష్టం చేశారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇలాంటివి గతంలో ఎప్పుడూ చోటు చేసుకోలేదని, ఇది ఎలా జరిగిందో, ఎందుకు వైరల్ అయిందో అర్థం కావడంలేదని కొందరు పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ పోస్టుమెన్ అండ్ ఎంపీఎస్‌జీఆర్–సీ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న సర్కిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పి. విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ... 8వ వేతన సవరణ కమిటీని వేసి ఇప్పుడున్న ఆర్థిక విధానానికి అనుగుణంగా వేతనాలను పెంచాలని, కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖను ప్రైవేటు పరం చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌యూపీఈ సర్కిల్ సెక్రెటరీ ఎం. కృష్ణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ నాయకులు జి. హైమావతి, వాసిరెడ్డి శివాజీ, జానాబ్‌నిసార్ ముజ్వార్, టీఎస్ రహేత్, బి. కృష్ణారావు, శంకర్‌గౌడ్, రిసప్షన్‌కమిటీ చైర్మన్ సిహెచ్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ యు. హనుమంతరావు, కార్యదర్శి ఎన్ శ్రీకాంత్, కోశాధికారి కె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'విదేశీ విద్యానిధి' నిధులు విడుదల చేయండి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘాల నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: మహాత్మా జ్యోతి రావు పూలే విదేశీ విద్యా నిధి పథకానికి నిధులు విడుదల చేయాలని బీసీ నేతలు అన్నారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విదేశీ విద్యానిధి పథకానికి విద్యార్థుల సంఖ్యను 300 నుంచి 3000 పెంచాలని కోరామన్నారు. గత రెండు విడుతల్లో దరఖాస్తు చేసుకున్న నిధులు మంజూకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి, ఆగస్టు మధ్యలో 5 వేల దరఖాస్తులను స్వీకరించినా ఇంతవరకు అభ్యర్థులను ఎంపిక చేయలేదన్నారు. మంత్రి వెంటనే స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు లింగంగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్, రవీందర్ పాల్గొన్నారు.

పేద జంటలకు సామూహిక వివాహాలు


అఖిల భారత సగర మహాసభ దసరా సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సగర (ఉప్పర)కులంలో పేదలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించినట్లు అఖిల భారత సగర మహాసభ చైర్మన్ గణపతి ఎస్ ప్రభాకర్‌రావు, సగర వైస్ చైర్మన్ ముత్యాల హరికిషన్ సగర తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సగర క్షత్రియ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, అఖిల భారత సగర మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో వధువరుల ఉచిత వివాహ పరిచయ వేదిక జరిగింది. ఈ సందర్భంగా సుమారు 200 మంది జంటలు పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా వివాహాలు నిర్వహించడంతో పాటు సగరుల అభివృద్ధి కోసం ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏటా 10 మందికి ఉచితంగా వివాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దసరా సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సగర మహాసభ ప్రధాన కార్యదర్శి కొండల అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులు శ్రీరాల శ్రీరాములు, కోశాధికారి కమటం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు తంగెడపల్లి శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పర శేఖర్ సగర తదితరులు పాల్గొన్నారు.

కీపిటప్ కృష్ణారావు..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు మాజీ సీఎం కేసీఆర్ అభినందనలు



కూకట్‌పల్లి: హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడేందుకు బీఆర్ఎస్ కొనసాగిస్తున్న పోరాటంలో తనదైన పాత్ర పోషిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభినందించారు. ఆదివారం మాధవరం కృష్ణారావు కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పనితీరును ప్రశంసించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం, హైద్రాబాద్ నగర ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న విధానం బాగుందన్నారు. హైద్రాబాద్ నగరానికి ఉన్న ఇమేజ్‌ను తక్కువ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధిచెప్పాలన్నారు. నిరంతరం ప్రజల పక్షన ఉంటూ చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని, పోరాటాలతోనే తెలంగాణను కాపాడుకోవాలని తెలిపారన్నారు.

ఆర్యవైశ్యులు ఉన్నతంగా జీవిస్తారు


రమేష్ గుప్తాను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: ఆర్యవైశ్యులు ఎక్కడ ఉన్నా ఉన్నతంగా జీవిస్తారని పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కీసరలోని కేబీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. సమాజంలో ఆర్య వైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇతరులకు మేలు చేసే గుణం వీరిలో మెండుగా ఉంటుందన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించి ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య కుటుంబాలకు చేయూత నివ్వాలని సూచించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సహాయ సహకారాలతో ప్రతి గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఉంటూ రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. అనంతరం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన బెల్డి రమేష్ గుప్తాను మల్లారెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా కార్యదర్శి బచ్చు నగేష్ గుప్తా, పూర్వ అధ్యక్షుడు పార్శి ప్రకాష్ గుప్తా, సంఘ ప్రతినిధులు నేతి రాములు, రేణిగుంట్ల గణేష్, చింతల రవికుమార్, ఉప్పల శారద, అర్థం లక్ష్మయ్య, బచ్చు విలాస్, కొండే మల్లిఖార్జున, ఇరుకుల రామకృష్ణ, అగిర్ వెంకటేశ్, తాళ్లపల్లి బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పోస్టులు @ బ్యాక్‌లాగ్!

- రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు కరువు
- భర్తీ కాకుండా మిగిలిపోయిన 666 పోస్టులు
- జనరల్ కేటగిరికి మార్చాలని డిమాండ్
- సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ఉర్దూ మీడియం పోస్టుల భర్తీలో విచిత్ర పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అవుతున్నా.. ప్రతిసారీ రిజర్వేషన్ కేటగిరీ కారణంగా అర్హులైన అభ్యర్థులు లేక పోస్టులు బ్యాక్‌లాగ్ కింద పడిపోతున్నాయి. ఫలితంగా ఉర్దూ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ కాక విద్యాబోధన అధ్వానంగా తయారైంది. ఎప్పటి మాదిరిగానే ఈసారి డీఎస్సీ–2024 లోనూ సగానికి పైగా పోస్టులు భర్తీ కాలేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియలో రిజర్వేషన్ల ప్రకారం పోస్టులు కేటాయిస్తూ వస్తోంది. ఉర్దూ మీడియంలో సైతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ఆధారంగా పోస్టులు కేటాయిస్తున్నా..సుమారు దశాబ్దకాలంగా ఆయా రిజర్వేషన్ కేటగిరీలో అభ్యర్థుల కొరత వెంటాడుతోంది. జనరల్ కేటగిరీలో అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ రిజర్వేషన్ల మెలికతో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కాకుండా బ్యాక్‌లాగ్‌గా మారుతున్నాయి. అర్హులైన జనరల్ అభ్యర్థులకు ఉద్యోగాల దక్కకపోవడంతో పాటు పోస్టులన్నీ ఖాళీగానే వెక్కిరిస్తున్నాయి. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ వ్యక్తమవుతున్నా..ఉర్దూ మీడియానికి మాత్రం తీవ్ర నిరాశ మిగులుతోంది.

ఇదీ పరిస్థితి..

డీఎస్సీ–2024లో ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల 1183 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. డీఎస్సీ ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి కేవలం 517 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కేటగిరీలో గల సుమారు 666 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేక భర్తీని పెండింగ్‌లో పడేసింది. గతంలో 2000, 2001, 2002, 2017లో సైతం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేక పోస్టులు బ్యాక్‌లాగ్‌లా మిగిలిపోయాయి.

ఈ సారి పోస్టులు పెరిగినా..

డీఎస్సీ–24లో ఉర్దూమీడియం పోస్టులు పెరిగినా..రిజర్వేషన్ కేటగిరీతో పాత పరిస్థితే పునరావృతమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉర్దూ మీడియంలో 670 పోస్టులు ప్రకటించింది. అందులో కేవలం జనరల్ కేటగిరీ కింద 190 పోస్టులు మినహాయించి దాదాపు 480 పోస్టులు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసింది. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఉర్దూ మీడియం పోస్టులు పెంచాలన్న డిమాండ్ వ్యక్తమైంది. దీంతో డీఎస్సీ–2024లో పోస్టులు పెరిగినప్పటికీ రిజర్వేషన్ల కేటగిరీ సగాని కిపైగా ఉండటంతో ఫలితం లేకుండా పోయింది.

› గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ–2017 నోటిఫికేషన్‌లో ఉర్దూ కోసం 900 పోస్టులు కేటాయించగా, అందులో కేవలం 3865 పోస్టులను భర్తీ కాగా, మిగిలిన 535 ఖాళీలు బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోయాయి.

సీఎం దృష్టికి సమస్య..

డీఎస్సీ–2024 ద్వారా ఉర్దూ మీడియంలో మిగిలిన పోయిన రిజర్వేషన్ కేటగిరీ పోస్టులను తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి జనరల్ కేటగిరీలో భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు నష్టపోతున్నారని వివరించారు. రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఖాళీ పోస్టుల్లో డీఎస్సీ ద్వారా సగం పోస్టులు కూడా భర్తీ కాలేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కేటరిగిలో అర్హత సాధించిన అభ్యర్థులు లేక మిగిలిన పోస్టులు భర్తీకి కాలేదన్నారు. ఆయా పోస్టుల భర్తీకి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చి జనరల్ కేటగిరి వారితో భర్తీ చేయాలని ఆయన లేఖలో కోరారు.

నేడు చలో గాంధీభవన్

కాగా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉర్దూ ట్రైన్ టీచర్స్ సోమవారం చలో గాంధీభవన్‌కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు భావిస్తున్నారు.

జనరల్ కేటగిరీకి మార్చండి: సబీనా యాస్మీన్

డీఎస్సీ–2024లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అర్హులైన అభ్యర్థులు లేక మిగిలిపోయిన పోస్టులను జనరల్ కేటగిరీకి కేటాయించి తిరిగి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉర్దూ ట్రైన్ టీచర్స్ ఫోరం కన్వీనర్ సబీనా యాస్మీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం ఖాళీలను డి–రిజర్వ్ చేసి జనరల్ కేటగిరీ కిందకు మార్చాలన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉర్దూ మాట్లాడేవారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం,
21, అక్టోబర్, 2024



• క్రొకొడైల్



• ఈగల్ క్లౌడ్

హ్యాపీనెస్.. నా గ్లామర్ సీక్రెట్

నగరంలో సినీతార శ్రద్ధాదాస్ సందడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీతార శ్రద్ధాదాస్ ఆదివారం నగరంలో తళుక్కుమంది. నల్లగండ్ల వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన అమ్జద్ హబీబ్ సెలూన్స్‌ను ఆమె ప్రారంభించింది. 'ఎల్లప్పుడూ ఆనందంగా ఉండటమే నా గ్లామర్ రహస్యం'అని శ్రద్ధాదాస్ తెలిపింది. ఈ సందర్భంగా సెలూన్స్ వ్యవస్థాపకుడు అమ్జద్ హబీబ్ మాట్లాడుతూ వందేళ్ల సుదీర్ఘ చరిత్రతో రెండు తెలుగు రాష్ట్రాల్లో సౌందర్య సేవలందించడం గర్వంగా ఉందన్నారు. వినూత్నంగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైల్లో ఖైదీలకు ట్రైనింగ్ ఇస్తున్నామని తెలిపారు. బిజినెస్ హెడ్ ఆపరేషన్స్ నిర్వాహకులు మహేష్ మాట్లాడుతూ సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ అమ్జద్ హబీబ్ 16 సంవత్సరాలపాటు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్‌గా సేవలందించారని పేర్కొన్నారు. బాలీవుడ్ సెలబ్రిటీల కూడా తన సేవలందించారన్నారు. ఈ సందర్భంగా శ్రద్ధాదాస్ తన హెయిర్ స్టైల్స్ మార్చుకుంటూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

లియోనియోలో యమహా ట్రాక్ డే



శామీర్‌పేట్: యమహా ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం శామీర్‌పేటలోని లియోనియాలో ట్రాక్ డే నిర్వహించారు. లియోనియో చిక్యాన్ సర్క్యూట్‌లో జరిగిన ట్రాక్ డేలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన బైక్ రైడర్లు పాల్గొని రయ్ రయ్ మంటూ యమహా బైక్‌లతో ట్రాక్‌పై అద్భుత విన్యాసాలు చేశారు. కొత్తగా బైక్ రైడింగ్ చేసేవారికి యమహా టెక్నికల్ టీం మెళకువలు నేర్పించారు. అత్యాధునిక టెక్నాలజీతో పాటు ప్రయాణికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని బైక్‌లను యమహా అందుబాటులోకి తెస్తోందన్నారు నిర్వాహకులు.



మిల్లెట్ ఫుడ్స్‌కు అవార్డు

బంజారాహిల్స్: మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తులుసహా పౌష్టికాహారాన్ని తయారు చేయడం, ప్రోత్సహించడంలో నిబద్ధతకుగాను మంగ శ్రీనివాస ఫుడ్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు పోషక్ అనాజ్ అవార్డ్స్–2024లో 'యంగ్ మిల్లెట్ ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్'అవార్డు వరించింది. న్యూట్రి హబ్, ఐసీఏఆర్–ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 19న జరిగిన ఇంటర్నేషనల్ న్యూట్రి–సెరియల్ కన్వెన్షన్(ఐఎన్‌సీసీ) 6.0లో కర్ణాటక వ్యవసాయ మంత్రి చలువరాయస్వామి ఆ సంస్థ సీఈఓ మణిదీప్ కావలికు అందజేశారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ మిల్లెట్స్ ఉత్పత్తి, ప్రచారంలో సంస్థ అంకితభావాన్ని గుర్తించి ఈ అవార్డు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

క్లౌడ్ ఫొటోగ్రఫీ.. ఓ మేఘ సందేశం

కళల్లో క్లౌడ్ ఫొటోగ్రఫీ అద్భుత కళ అని నిరూపిస్తున్న యూనస్ ఫర్హాన్

భారత్‌ను క్రికెట్ వరల్డ్ కప్ వరిస్తుందని ముందే జోస్యం చెప్పిన వైనం

నగరంతోపాటు మైసూర్, బెంగళూరు యూనివర్సిటీల్లో ఎగ్జిబిషన్లు

ఇప్పటి వరకు తీసిన క్లౌడ్ ఫొటోలు 9 వేలు

'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న ప్రముఖ క్లౌడ్ ఫొటోగ్రాఫర్



• తెలంగాణ మేఘం

ఎల్లప్పుడూ నిశ్శబ్దంగా ఉండే మేఘాన్ని ఎప్పుడైనా పలకరించారా..?? ఒంటరిగా ఉండే ఆకాశంతో ఫ్రెండ్‌షిప్ చేశారా..?? అసలు ఆకాశం మేఘాల ఆకారంలో మనతో మాట్లాడుతుందని మీకు తెలుసా..? ప్రకృతి పంపిన సందేశం మేఘాలని మీకసలు తెలుసా...?? అయితే ఇవన్నీ నాకు తెలుసు అంటున్నారు నగరానికి చెందిన ప్రముఖ క్లౌడ్ ఫొటోగ్రాఫర్ యూనస్ ఫర్హాన్. మేఘంలో అమోఘం కనిపిస్తుంది అతడికి. స్కై కాన్వాస్‌పై నేచర్ చేసిన సిగ్నేచర్‌ను అతడి కెమెరా ఇట్టే బంధిస్తుంది. తను క్లిక్‌మనిపించే మేఘాల ఫొటోల్లో ఓ సందేశం ఉంటుంది. ఆత్మీయత, పర్యావరణం, సమానత్వం, జంతువులు, వింతలు, విశేషాలు.. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. అతడి క్లౌడ్ ఫొటోగ్రఫీలో నిక్షిప్తమై ఉంటాయి. 2011లో మన భారత దేశానికి క్రికెట్ వరల్డ్ కప్ వస్తుందనే మేఘ సందేశాన్ని 3 నెలల ముందే క్లిక్‌మనిపించి అందరితో ఔరా అని అనిపించుకున్నారు. స్కూల్ కిటికీ లోంచి కనిపించిన మేఘంతో మొదలైన తన ఫ్రెండిషిప్ ప్రకృతి సందేశానికి మేఘాలు వారధులని నిరూపించే వరకు వచ్చిందని యూనస్ ఫర్హాన్ అంటున్నారు. ఇప్పుడు అతడి మనసంతా మేఘావృతమైంది. అసలు అతని ప్రయాణమేంటో.. ఆయన చెప్పే మేఘ సందేశమేంటో ఆయన మాటల్లోనే తెలుసుకుందామా..!?

\- సాక్షి, సిటీబ్యూరో

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చేరాలి

2009 నుంచి ఇప్పటి వరకు దాదాపు 9 వేల సందేశపు మేఘాలను నా కెమెరాలో బంధించాను. నేను ఫొటోగ్రఫీలో ఎలాంటి కోర్సులు చేయలేదు. ప్రకృతి తన సందేశాన్ని సమాజానికి అందించడానికి నన్నొక వారధిలా మార్చుకుందని నమ్ముతాను. ప్రస్తుతం మాస్టర్స్ హిస్టరీ చేస్తున్నాను. తెలంగాణతోపాటు అరబ్ దేశాలు, అమెరికా వంటి దేశాలను పర్యటించి క్లౌడ్ ఫొటోలను తీయాలి. ఈ మేఘసందేశాన్ని ఒక సబ్జెక్ట్ లేదా థియరీలా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆవిష్కృతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను. - యూనస్ ఫర్హాన్ క్లౌడ్ ఫొటోగ్రాఫర్



• వరల్డ్ కప్

స్కై కాన్వాస్‌పై నేచర్ సిగ్నేచర్.. పరిచయం చేస్తున్న యూనస్ ఫర్హాన్

మేఘంతో నా సాన్నిహిత్యం

చిన్నతనంలో 3 నుంచి 7వ తరగతి వరకు నల్లగొండలోని ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకున్నాను. అప్పుడు నాకున్న ఏకైక ఫ్రెండ్ మేఘం. అలా కదులుతూ వెళ్లే మేఘాలు నన్ను ఆకర్షించేవి. వాటి ప్రయాణంలో ఏదో అర్థం ఉందనిపించేది. వాటితో అలా మొదలైన నా స్నేహం 8వ తరగతిలో నాన్నకు ఉన్న చిన్న కీప్యాడ్ ఫోన్‌తో ఫొటోలు తీయడం నుంచి మరింత పెరిగింది. హాబీగా మొదలైన క్లౌడ్ ఫొటోగ్రఫీ కెరీర్‌గా మారింది. మొదట్లో మేఘాల్లో దాగి ఉన్న జంతువుల ఆకారాలను గుర్తించి క్లిక్‌మనిపించేవాడిని. అనంతరం అవే మేఘాలు నాకు చెప్పే కథలను ఫొటోలు తీయడం వరకూ సాగింది. ముఖ్యంగా 2011లో భారత్ వరల్డ్ కప్ గెలిచే కన్నా 3 నెలల ముందే.. వరల్డ్ కప్ ఆకారమున్న మేఘాలు నాకు ఆకాశంలో కనిపించాయి. వాటిని క్లిక్‌మనిపించాను. ఆ తరువాత అదే నిజమైంది. భారత్ వరల్డ్ కప్ గెలిచింది. అప్పుడు నా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి నాకు గుర్తింపునిచ్చాయి. ఆ సమయంలో నన్ను మొదట గుర్తించింది 'సాక్షి'దినపత్రికనే. సాక్షి టీవీ స్టూడియోకు ఆహ్వానించి నా అభిరుచిని అభినందించింది. అనంతరం తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమం కొనసాగుతున్న సమయంలో, 2013 జూన్ 27న ఆకాశంలో తెలంగాణ రాష్ట్రాన్ని పోలిన మేఘం కనిపిస్తే, ఫొటో తీశాను. నాకు ముందే అందించిన మేఘ సందేశంలా దానిని భావించాను. ఇలా ఎన్నో విషయాలను నేను మేఘంలోనే వెతుక్కుంటాను.



• యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ పోస్టర్

నార్కోటిక్స్ డే ప్రచారంగా..

నేను మొదటిసారి ఫ్లైట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు ప్రకృతిలోని ప్రతీ జీవి సమానం అనే సందేశాత్మకంగా ఉన్న మేఘాన్ని బంధించాను. ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని సందేశమున్న క్లౌడ్ షేప్‌ను కూడా ఫొటో తీశాను. వరల్డ్ నార్కోటిక్స్ డే రోజు నేను తీసిన ఫొటోను సంబంధిత శాఖ అధికారులు అధికారికంగా ఆవిష్కరించారు. అంతే కాకుండా పోలీసు శాఖకు చెందిన వీసీ సజ్జనార్, సీవీ ఆనంద్, మహేష్ భగత్ వంటి అధికారులు ఈ ఫొటో పోస్టర్‌లను ప్రత్యేకంగా ఆవిష్కరించి అభినందించారు. బయోడైవర్సిటీ, పర్యావరణం, జంతువులకు సంబంధించి నేను తీసిన పలు మేఘాల ఫొటోలు నన్ను ప్రపంచానికి పరిచయం చేశాయి.

భాషా సాంస్కృతిక శాఖ ప్రోత్సాహం

సోషల్ మీడియాలో నా క్లౌడ్ ఫొటోగ్రఫీ గురించి తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ నా ఫొటోలకు సముచిత స్థానాన్ని కల్పించారు. రవీంద్ర భారతిలో మొదటి క్లౌడ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు ప్రోత్సాహం అందించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లిటరరీ ఫెస్టివల్‌లో, ఇతర కాలేజీల్లో ఫొటో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాను. మేఘాల్లో దాగి ఉన్న జంతువుల ఫొటోలు నచ్చి నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ జులాజికల్ పార్క్ వారు ఆహ్వానించగా అక్కడ కూడా ప్రదర్శించాను. మైసూర్ యూనివర్సిటీ, బెంగుళూరు యూనివర్సిటీలో కూడా క్లౌడ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశాను.



యూనస్ ఫర్హాన్



కిడ్స్.. క్రీడా లవర్స్..

చిన్న వయసులో క్రీడల పట్ల మక్కువ

- ఉదయం 5 గంటలకే ప్రాక్టీస్..
- క్రికెట్‌పై ఎక్కువ మంది గురి

సాక్షి, సిటీబ్యూరో: చిన్ననాటి నుంచే పిల్లల అభిరుచులకు అనుగుణంగా తల్లిదండ్రులు నడుచుకుంటున్నారు. వారి భవిష్యత్తు పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. పాఠశాలకు వెళ్లే వయసులోనే క్రీడల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. ఫలితంగా సూర్యోదయానికి ముందే లేచి మంచు పొరలు ఉండగానే నెట్స్‌లో విద్యార్థులు ప్రత్యక్షమైపోతున్నారు. క్రీడా కిట్ బ్యాగ్స్ తెరిచి, యూనిఫాం ధరించి ప్రాక్టీస్‌కు సిద్ధమైపోతున్నారు. శిక్షణ అనంతరం పాఠశాలకు పయనమవుతున్నారు. పట్టుమని పదేళ్లు కూడా నిండకుండానే ఆటల్లో మెరికల్లా తయారవుతున్నారు. నగరంలోని చాలా మంది విద్యార్థుల దినచర్య ఇక్కడి నుంచే ప్రారంభమవుతోంది. దీంతో చిన్న కాలనీల్లో సైతం క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటవుతున్నాయి. అత్యధిక సంఖ్యలో క్రికెట్ ఆడుతుండగా, టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి ఇతర ఆటలకు నెట్స్ ఏర్పాటు చేసి, పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. నెలకు రూ. 2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఫోన్‌కు దూరం..

ప్రస్తుత రోజుల్లో ఫోన్‌తో పిల్లలకు విడదీయలేని సంబంధం. టిఫిన్ చేయడం మొదలుకొని పాఠశాలకు వెళ్లడం, వచ్చిన తరువాత హోం వర్క్ చేయడం, ఇంకా ఏ సందర్భమైనా ఫోన్ ఇస్తావా అని అడుగుతున్నారు. లేదంటే అల్లరి చేస్తున్నారు. బుజ్జగించో, భయపెట్టో ఒక్కోసారి ఫోన్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నా.. కొన్ని సందర్భాల్లో ఇవ్వడం తప్పడం లేదు. ఎక్కువ సమయం ఫోన్ చూడటం వల్ల కళ్ల సంబంధమైన జబ్బులు వస్తున్నాయి. ఆన్‌లైన్ గేమ్స్, రీల్స్, గ్యాడ్జెట్స్, సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. క్రీడల్లో శిక్షణ పొందే పిల్లల్లో ఫోన్ చాలావరకు దూరంగా ఉంటుంది. ఎప్పుడైనా రోజులో కొద్ది సమయం మాత్రమే చూస్తున్నారని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

రెండేళ్ల నుంచి వెళ్తున్నా..



రెండేళ్ల నుంచి క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. రోజూ ఉదయం గంటన్నర నెట్ ప్రాక్టీస్ ఉంటుంది. ప్రారంభంలో బేసిక్స్ మాత్రమే నేర్పించారు. రెండు మూడు నెలల తరువాత జట్టులోకి చేర్పించారు. మా కోచింగ్ సెంటర్‌లో 70 మంది వరకు ఉంటారు. అందరినీ టీంలుగా ఏర్పాటు చేసి అంతర్గతంగా మ్యాచ్‌లు ఆడిస్తారు. మెరుగ్గా ప్రదర్శన ఇచ్చే వారిని ఇతర ట్రైనింగ్ సెంటర్ల జట్లతో పోటీ పడేందుకు ఎంపిక చేస్తారు.

\- వివాన్, 8వ తరగతి, వనస్థలిపురం



శారీరక, మానసిక ఫిట్‌నెస్..

విద్యార్థి దశలో చాలామంది ఉదయాన్నే లేచి పాఠశాలకు వెళ్లాలంటే మారాం చేస్తారు. రోజు తల్లిదండ్రులకు ఇదో పెద్ద టాస్క్‌గానే కనిపిస్తుంది. ఆటలు అనే సరికి విద్యార్థుల్లో మాత్రం ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తుంది. ఫలితంగా ఉదయం 5 గంటలకే నెట్స్‌కి వెళ్లడానికి సిద్ధమైపోతున్నారని, అక్కడి నుంచి వచ్చిన తర్వాత నేరుగా పాఠశాలకు సిద్ధమవుతున్నారు. పాఠశాల నుంచి వచ్చి హోంవర్క్ పూర్తి చేసుకుని ఆదివారం ఉదయం వేగంగా మేల్కొనాలని ముందు రోజు రాత్రి త్వరగా నిద్రకు ఉపక్రమిస్తున్నారట. ఫలితంగా ఫోన్, టీవీల బెడద తప్పిపోయిందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఎదుటి వ్యక్తులతో ఎలా మెలగాలనే మానసిక ఎదుగుదల ఎక్కువ కనిపిస్తోందని చెబుతున్నారు. శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉంటున్నారు. ఆరోగ్య సమస్యలు తక్కువ, చదువులో షార్ప్‌గా తయారవుతున్నారని పేర్కొంటున్నారు.



ఉదయం 5 గంటలకే సిద్ధం



క్రికెట్ అంటే ఇష్టం. కోచింగ్ సెంటర్‌లో చేరి ఏడాది దాటింది. అంతకుముందు పాఠశాలకు సిద్ధం కావడానికి నిద్ర మత్తుగా ఉండేది. గ్రౌండ్‌కు వెళ్లినప్పటి నుంచి యాక్టివ్‌గా ఉంటున్నాను. మా స్నేహితులు క్రికెట్ నేర్చుకోవడానికి వెళ్తున్నారు. నేను నేర్చుకుంటా అని మా నాన్నని అడిగాను. సరే అని కోచింగ్‌కు చేర్పించారు. ఉదయం 5 గంటలకే నెట్ ప్రాక్టీస్‌కు సిద్ధమైపోతున్నా.

\- శ్రీజ, 5వ తరగతి, షిర్డీసాయినగర్ కాలనీ

న్యూరోనర్చర్

ఆటిజం కిడ్స్.. పేరెంట్స్‌కు గైడెన్స్...

అందుబాటులోకి వచ్చిన వినూత్న పరిష్కారం

చికిత్స వాతావరణం.. ఇంటికీ అంతరం తగ్గించేందుకే..

ఓ ఆటిజం చిన్నారి తల్లి రూపుదిద్దిన ఉచితసేవ



ఆటిజం... ఒకప్పుడు అరకొరగా మాత్రమే తెలిసిన సమస్య. ఇప్పుడు ఎక్కడ చూసినా అది కనిపిస్తోంది. ఫలితంగా నగరవ్యాప్తంగా ఆటిజం చికిత్సాకేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. అయితే ఈ థెరపీలు చాలా సందర్భాల్లో విఫలమవుతున్నాయి. దీనికి తల్లిదండ్రుల్లో అవగాహనాలోపమే కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన ఓ ఆటిజం చిన్నారి తల్లి ఆ సమస్యకు ఓ పరిష్కారాన్ని న్యూరోనర్చర్ పేరుతో అందుబాటులోకి తెచ్చింది. అదేమిటో తెలుసుకుందామా..! - సాక్షి, సిటీబ్యూరో

ఓ గంటో, రెండు గంటలో మాత్రమే ఆటిజం బాధిత చిన్నారి థెరపీ సెంటర్‌లో ఉంటుంది. అయితే 20 గంటలకు పైగా తాను ఉండే ఇంటి వాతావరణం ఆ థెరపీకి కొనసాగింపుగా ఉండకపోవడం వల్ల చికిత్స ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిని అధిగమించి, ఆటిజం చిన్నారులకు అందించే క్లినికల్ థెరపీకి, ఇంటి వాతావరణానికి మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో న్యూరోనర్చర్ అనే ఉచిత హోం సపోర్ట్ ఫోకస్ గ్రూప్ ఏర్పాటైంది.

కన్నబిడ్డకు థెరపిస్ట్‌గా...

'26 ఏళ్ల వయసున్న ఆటిజం చిన్నారి తల్లిగా సమస్యను లోతుగా అర్థం చేసుకుని ఈ సపోర్ట్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాను'అని అంటున్నారు నగరానికి చెందిన అనన్య చైల్డ్ డెవలప్‌మెంట్ – ఎర్లీ ఇంటర్‌వెన్షన్ క్లినిక్ నిర్వాహకురాలు మాధవి ఆదిమూలం. యూకేకు చెందిన ప్రముఖ పీడియాట్రిక్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్ సియాన్ విల్సన్‌తో ఒప్పందం కుదుర్చుకుని మరీ ప్రత్యేక అవసరాలు (ఆటిజం) ఉన్న పిల్లల తల్లిదండ్రులకు మద్దతు ఇవ్వడానికి ఏర్పాటైన ఈ ఉచిత హోమ్ సపోర్ట్ ఫోకస్ గ్రూప్ సేవలను అవసరం ఉన్న తల్లితండ్రులు దేశంలో ఎక్కడి నుంచి అయినా దీని ద్వారా పొందవచ్చు.

ఏం చేస్తుందంటే...

ప్రత్యేక అవసరాలపై లోతైన అవగాహనతో అత్యాధునిక చికిత్సలను ఈ న్యూరోనర్చర్ మిళితం చేస్తుంది. ప్రత్యేక అవసరాల పిల్లల ఎదుగుదల, సామర్థ్యానికి మద్దతుగా స్పష్టత, దిశలతోపాటు వ్యక్తిగతీకరించిన రోడ్‌మ్యాప్‌ను రెగ్యులర్‌గా అందిస్తుంది. ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సరీ ఇంటిగ్రేషన్, స్పీచ్ థెరపీ, రొటీన్ మెయింటెనెన్స్, రియల్ లైఫ్ అప్లికేషన్ ఆఫ్ స్కిల్స్, పేరెంట్ ఎడ్యుకేషన్ ఆన్ ఆటిజం అండ్ థెరపీ, సోషల్ ఇంటరాక్షన్ పీర్ ప్లేపై తల్లిదండ్రులకు శిక్షణ కూడా ఇస్తుంది. తల్లిదండ్రుల కోసం వర్క్‌షాప్‌లు, ఇంటి దగ్గర పేరెంట్ సపోర్ట్ నెట్‌వర్క్‌లు, గృహ సందర్శనలు పరిశీలనలతో కూడిన టైలర్డ్ ప్రోగ్రామ్‌లు కూడా ఈ కార్యక్రమంలో భాగం.

అంతర్జాతీయ నిపుణుల సంప్రదింపులు

చిన్నారుల్ని ఒక దగ్గర స్థిమితంగా కూర్చోబెట్టే ఉపాయాల్లో తల్లిదండ్రులు ఎక్కువగా చేసే పని ఫోన్స్ వారి చేతికి ఇవ్వడం. ఇది ఏ చిన్నారికీ మంచిది కాదు. ఆటిజం బాధిత చిన్నారికైతే మరింత నష్టదాయకం. ఇలాంటి చిన్న చిన్న విషయాల నుంచీ అంతర్జాతీయ చికిత్స విధానాలను అందించే నిపుణుల సూచనల దాకా తల్లిదండ్రులను అనుక్షణం జాగృతం చేసేందుకే ఈ న్యూరోనర్చర్ ప్రోగ్రామ్ డిజైన్ చేశాం. ఎక్కువ మంది ఉపయోగించుకునేలా దీన్ని ఉచితంగా ఆన్‌లైన్ వేదికగా అందిస్తున్నాం. తల్లిదండ్రులు మరింత సమాచారం కోసం + 98485 13192కు ఫోన్ చేసి లేదా www.asap.org.in ద్వారా తెలుసుకోవచ్చు.

–మాధవి ఆదిమూలం



ఇదేమి రాజ్యం బాబూ?

ఎక్స్ వేదికగా నిలదీసిన వైఎస్ జగన్ ● శాంతి భద్రతల పరిరక్షణలో కూటమి సర్కారు దారుణ వైఫల్యం



- బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు
- రాష్ట్రంలో రోజూ ఏదో ఒకచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు
- బద్వేలులో విద్యార్థినిపై పెట్రోలు పోసి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం
- ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉంది
- బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ దిశ యాప్ తెచ్చి 31,607 మందికి రక్షణ కల్పించాం
- బటన్ నొక్కినా, ఫోన్‌ను ఐదుసార్లు కదిపినా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం.. పోలీసులు నిమిషాల్లో చేరుకునేలా చర్యలు తీసుకున్నాం
- 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు?

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌లో కాలేజీ విద్యార్థినిపై పెట్రో లు పోసి నిప్పంటించి ప్రాణాలు తీసిన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, అరాచక శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా వైఎస్ జగన్ కూటమి ప్రభుత్వాన్ని ఆదివారం కడిగిపారేశారు.

ఈ దుర్యోధన దుశ్శాసన.. దుర్వినీతి లోకంలో

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను కాపాడలేకపోతున్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కూడా ఇవ్వలేకపోతున్నారు. ఇదేమి రాజ్యం చంద్రబాబూ? రోజూ ఏదోచోట హత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వసాధారణమైపోయాయి. బద్వేలులో కాలేజీ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పు అంటించి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నా. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం కూడా ఉంది. ఒక పాలకుడు ఉన్నాడంటే ప్రజలు ధైర్యంగా ఉండాల్సిందిపోయి నిరంతరం భయపడే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ మీద కక్షకొద్దీ మా పథకాలను, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజలమీద చంద్రబాబు కక్ష సాధిస్తున్నారు. ఇది అన్యాయం కాదా? వైఎస్సార్‌సీపీ హయాంలో మహిళలు, బాలికల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన విప్లవాత్మక ''దిశ''కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా నీరుగార్చడం దీనికి నిదర్శనం కాదా? తద్వారా మహిళలు భద్రతను ప్రశ్నార్థకం చేసిన మాట వాస్తవం కాదా? ''దిశ''యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కినా, చేతిలో ఉన్న ఫోన్‌ను ఐదుసార్లు అటూ ఇటూ ఊపినా వెంటనే కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, అక్కడ నుంచి దగ్గర్లో ఉన్న పోలీసులకు సమాచారం వెళ్తుంది. వెంటనే పోలీసులు వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తకపోయినా లేదా ఆపదలో ఉన్నట్లు ఫోన్లో చెప్పినా ఘటనాస్థలానికి నిమిషాల్లో చేరుకుని రక్షణ కల్పించే పటిష్ట వ్యవస్థను మీరు (చంద్రబాబు) ఉద్దేశపూర్వకంగా నీరుగార్చలేదా? ''దిశ''ప్రారంభం నుంచి 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబూ? 1.56 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకుని భరోసా పొందుతున్న 'దిశ'పై రాజకీయ కక్ష ఎందుకు? దిశ కార్యక్రమాన్ని బలోపేతం చేయడానికి ప్రత్యేకంగా 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశాం. ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాం. 900 బైక్‌లు, 163 బొలేరో వాహనాలను ''దిశ''కార్యక్రమం కోసమే పోలీసులకు అందించి పెట్రోలింగ్‌ను పటిష్టపరిచాం. 18 'దిశ'పోలీస్‌స్టేషన్లను నెలకొల్పి 18 క్రైమ్ మేనేజ్‌మెంట్ వాహనాలను సమకూర్చాం. వీటిని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేశాం. మా హయాంలో శాంతి భద్రతలపై నేను నిర్వహించిన సమీక్షల్లో 'దిశ'కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. దీంతో పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండేవారు. వీటన్నింటినీ నిర్వీర్యంచేసి ఏం సాధించాలనుకుంటున్నారు చంద్రబాబూ? ఇవాళ మీరు చేస్తున్నదల్లా మహిళల రక్షణ, సాధికారత కోసం అమలవుతున్న కార్యక్రమాలను, స్కీమ్‌లను ఎత్తివేయడం! ఇసుక, లిక్కర్ లాంటి స్కామ్‌లకు పాల్పడుతూ పేకాట క్లబ్బులు నిర్వహించడం! పోలీసు వ్యవస్థ కూడా అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రతిపక్షంపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధింపులకు దిగడమే పనిగా పెట్టుకుంది. మహిళలు, బాలికలు, చిన్నారుల రక్షణ బాధ్యతలను విస్మరించింది. ఇదేమి రాజ్యం చంద్రబాబూ?.

తెనాలిలో యువతిపై పెమ్మసాని అనుచరుడి పాశవిక దాడి

- కుమార్తెను బతికించుకునేందుకు ఆస్పత్రుల చుట్టూ తిరిగిన కుటుంబ సభ్యులు
- గుంటూరు సమగ్ర వైద్యశాలలో వెంటిలేటర్‌పై బాధితురాలు



పెమ్మసానితో నిందితుడు నవీన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/తెనాలి రూరల్: టీడీపీకి చెందిన రౌడీషీటర్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడి పాశవిక దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువతి చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఆదివారం తెనాలిలో ఈ దారుణం చోటు చేసుకుంది. తెనాలి అయితానగర్‌కు చెందిన 26 ఏళ్ల మధిర సహానా ఓ స్పీచ్ అండ్ హియరింగ్ థెరపీ సెంటర్‌లో పనిచేస్తోంది. శనివారం సాయంత్రం డ్యూటీకి వెళ్లిన బాధితురాలిని కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన రౌడీషీటర్ రాగి నవీన్ (కొంతకాలంగా తెనాలిలో నివాసం ఉంటున్నాడు) తన పుట్టిన రోజు అని నమ్మించి వెంట తీసుకువెళ్లాడు. కొద్ది గంటల అనంతరం తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి పరారయ్యాడు. అనంతరం అక్కడకు చేరుకున్న యువతి తల్లిదండ్రులు వైద్యుల సూచనల మేరకు మంగళగిరి, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఎయిమ్స్ సహా పలు ప్రైవేటు వైద్యశాలలకు తరలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం తెల్లవారుజామున తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తీసుకురాగా అక్కడి వైద్యులు గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వెంటిలేటర్‌పై ఉన్న బాధితురాలి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలు..

తమ కుమార్తెపై నిందితుడు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఒంటిపై పలు చోట్ల గాయాలున్నాయని.. మెడ, తల కమిలిపోయిందని, దాడి చేసి గాయపర్చినట్లు నల్ల మచ్చలు శరీరంపై ఉన్నాయని బాధితురాలి తల్లి విలపించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భారత్‌లో ఉగ్ర చర్యలకు విదేశీ నిధులు

- డొనేషన్లు, హవాలా రూపంలో రూ.కోట్లు సేకరించిన పీఎఫ్‌ఐ
- దర్యాప్తులో కీలక అంశాలు గుర్తించిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ) సంస్థ దేశంలో ఉగ్రవాద దాడులకు పాల్పడేందుకు అవసరమైన డబ్బును సర్దుబాటు చేస్తున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. భారత్‌తోపాటు విదేశాల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్టు ఈడీ అధికారులు తమ దర్యాప్తులో తేల్చారు. హవాలా, డొనేషన్ల రూపంలో పలు బ్యాంకు ఖాతాల్లోకి కోట్ల రూపాయల సొమ్మును మళ్లించినట్టు ఆధారాలు లభించాయి. పీఎఫ్‌ఐపై దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎన్‌ఐఏ నమోదు చేసిన కేసుల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికారులు.. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈనెల 16న మొత్తం రూ.56.56 కోట్ల విలువైన 35 స్థిరాస్తులను జప్తు చేశారు. అదేవిధంగా పీఎఫ్‌ఐ సభ్యులు, ఆఫీసర్ బేరర్స్ అధీనంలో ఉన్న బ్యాంకు ఖాతాల్లోంచి రూ.5 కోట్ల నగదును జప్తు చేశారు. మొత్తంగా ఈ కేసులో ఇప్పటివరకు రూ.61 కోట్లకు జప్తు అయినట్టు ఈడీ ఇటీవల వెల్లడించింది. కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ, రాజస్తాన్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, జమ్మూకశ్మీర్, మణిపూర్‌లలో కలిపి మొత్తం 29 బ్యాంకు ఖాతాలు పీఎఫ్‌ఐ అధీనంలో పనిచేస్తున్నాయి. వీటిని పీఎఫ్‌ఐ సభ్యులు తమ వివరాలు బయటికి రాకుండా పలు ట్రస్ట్‌లు, కంపెనీలు, కొందరు వ్యక్తుల పేరిట నడుపుతున్నట్టు అధికారులు ఆధారాలు సేకరించారు. డమ్మీ డోనర్ల నుంచి పెద్ద మొత్తంలో విరాళాల రూపంలో నగదు లావాదేవీలు జరిపినట్టు గుర్తించారు. ఇలా అన్ని బ్యాంకు ఖాతాల్లో రూ.94 కోట్ల నగదు ఉన్నట్టు గుర్తించారు. పలు దేశాల నుంచి నిధులు సేకరిస్తూ దేశంలో ఉగ్ర కార్యకలాపాలకు వాటిని వినియోగిస్తున్న పీఎఫ్‌ఐ కేసులో ఈడీ అధికారులు మరింత లోతుగా ఆరా తీస్తున్నారు.

ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్‌కు దసరా బోనస్!

- మాజీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మొండిచెయ్యి

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేసిన కంచర్ల రామకృష్ణారెడ్డికి దసరా బోనస్ కింద రూ.1.40 లక్షలు ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రామకృష్ణారెడ్డి పదవి నుంచి వైదొలిగారు. కొత్త చైర్మన్‌గా జంగా రాఘవరెడ్డిని ప్రభుత్వం నియమించింది. అయితే మాజీ చైర్మన్‌కు బోనస్ ఇచ్చిన ఆయిల్‌ఫెడ్ అధికారులు, అదే సమయంలో అందులో పనిచేసి బయటకు వెళ్లిపోయిన కొందరు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం బోనస్ ఇవ్వలేదు. అలాగే ఇప్పుడు పనిచేస్తున్న కొందరికి గతంలో ఇచ్చి కూడా.. ఇప్పుడు సాంకేతిక కారణాలు చూపించి బోనస్ ఆపినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆయిల్‌ఫెడ్ ఎండీకి విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని బయటకు వెళ్లిపోయిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 'సాక్షి'ప్రతినిధి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ అందిన విషయంపై రామకృష్ణారెడ్డిని వివరణ కోరగా, 2022–23కి సంబంధించి ఆయిల్‌ఫెడ్ బోనస్ ఇచ్చినట్లు తెలిపారు. 2023–24కి చెందిన బోనస్ కూడా ఇస్తారని చెప్పారు.

'డీఏ, పీఆర్‌లను వెంటనే ప్రకటించాలి'

సాక్షి, హైదరాబాద్ : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏ, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు నవాత్ సురేష్‌లు మాట్లాడుతూ ఈ నెల 22న పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన, 29న తహసీల్‌ల వద్ద నిరసన, నవంబర్ 5న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, నవంబర్ 23న ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో అయిలినేని నరేందర్‌రావు, అలుగుబెల్లి పాపిరెడ్డి, బెండి ఉష, బండి రమేష్, తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, భాస్కర్‌దేశ్ పాల్గొన్నారు.

పిల్లలపైనా మైగ్రేన్ దాడి

- తేలిగ్గా తీసుకుంటున్న తల్లిదండ్రులు.. స్కూల్ ఎగ్గొట్టేందుకు కుంటిసాకులని భావన
- మైగ్రేన్ ప్రాణాంతకమే.. ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి మైగ్రేన్
- 'సాక్షి'తో అమెరికాకు చెందిన ప్రముఖ న్యూరో నిపుణురాలు డెబోరా



డెబోరా ఫ్రైడిమాన్

సాక్షి, విశాఖపట్నం: పిల్లల్లోనూ పార్శ్వపు (మైగ్రేన్ హెడేక్) తలనొప్పి విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని యూఎస్‌కు చెందిన అంతర్జాతీయ న్యూరో నిపుణురాలు డాక్టర్ డెబోరా ఫ్రెడిమాన్ అన్నారు. విశాఖలో జరుగుతున్న ఇండియన్ అకాడెమీ ఆఫ్ న్యూరాలజీ (ఐయాన్‌కాన్)–2024 సదస్సులో కీలకోపన్యాసం చేసేందుకు వచ్చిన ఆమె 'సాక్షి'తో మైగ్రేన్‌కు సంబంధించిన పరిశోధనలు, చికిత్సలపై ఆదివారం మాట్లాడారు. ఆమె ఏం చెప్పారంటే...

ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి..

15 నుంచి 40 ఏళ్లలోపు వారిలో మైగ్రేన్ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా న్యూరో సమస్యలతో వచ్చే వంద మందిలో 40 మంది మైగ్రేన్ అని చెబుతున్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉంటున్నారు. ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు, ప్రతి 10 మంది పురుషుల్లో ఒకరికి మైగ్రేన్ ఉంది. గడచిన పదేళ్లలో మైగ్రేన్‌తో బాధపడే వారి సంఖ్య దాదాపు 80 శాతం పెరిగింది. ఇది కలవరపాటుకు గురిచేసే అంశం.

'ఆరా' రావడం వల్లే..

ప్రపంచ జనాభాలో 10 శాతం మంది మైగ్రేన్‌తో బాధపడుతున్నారు. వీరిలో 4 శాతం మందికి తలనొప్పి వచ్చే ముందు 'ఆరా' అనే అనుభవం ఉంటోంది. కళ్లముందు మెరుపులు వచ్చినట్టు.. చుట్టూ బైర్లు కమ్మినట్టు, శరీరమంతా మొద్దుబారిన భావనకు గురవుతున్నారు. దీన్నే ఆరా అని పిలుస్తున్నాం. ఈ ఆరా ద్వారానే మైగ్రేన్‌కు మంచి చికిత్సల్ని తీసుకురాగలుగుతున్నాం. దాదాపు 20 ఏళ్లుగా మైగ్రేన్‌పై పరిశోధనలు చేస్తున్నాను. మెదడులో ఉండే సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్ (సీఎస్ఎఫ్) అనే ద్రవం అలల మాదిరిగా కదులుతూ మెదడులోని మలినాల్ని శుభ్రం చేస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో ఈ సీఎస్ఎఫ్‌లోకి సమస్యాత్మక ప్రోటీన్స్ వచ్చినప్పుడు ఆరా మొదలై.. మైగ్రేన్ అనుభవం ఏర్పడుతుంది. ఈ ఆరాకు కారణమవుతున్న ప్రోటీన్లను అడ్డుకునేలా మందులు కనిపెట్టాం. ఇంకా పరిశోధనలు చేస్తూనే ఉన్నాం.

చిన్నారులూ బాధితులే

మరో బాధాకరమైన విషయమేమిటంటే.. మైగ్రేన్‌కు చిన్నారులూ బాధితులుగా మారుతున్నారు. ప్రతి 100 మంది చిన్నారుల్లో 20 మంది దీనిబారిన పడుతున్నారు. బాలికలతో పోలిస్తే బాలురులో ఎక్కువగా ఇది కనిపిస్తోంది. తమకు తలనొప్పి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పినా.. వాళ్లు నమ్మడం లేదు. స్కూల్ ఎగ్గొట్టేందుకు చెబుతున్న కుంటిసాకులుగానే తీసుకుంటున్నారు. ఇదే ప్రమాదకరంగా మారుతోంది. తేలిగ్గా తీసుకుంటే మైగ్రేన్ ముప్పుగా మారుతుందన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. యుక్తవయసులో మాత్రం ఇది అమ్మాయిల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

మైగ్రేన్ లక్షణాలు అందరిలోనూ ఒకేలా కనిపించడం లేదు. 25 శాతం మంది మాత్రమే మైగ్రేన్‌ని ముందస్తుగా గుర్తించగలుగుతున్నారు. మైగ్రేన్ వచ్చినప్పుడు ప్రారంభంలోనే గుర్తించి వైద్యుల్ని సంప్రదిస్తే.. దానికి తగినట్లుగా మందులు వాడుతుంటే.. క్రమంగా నివారించగలం. మైగ్రేన్‌కు సరైన చికిత్స లేదు. కానీ.. ఇటీవల కాలంలో సీజీఆర్‌పీ వంటి కొత్త చికిత్సలతో పాటు లాస్మిడిటన్, ట్రిప్టాన్స్ వంటి మందులు అందుబాటులోకి రావడంతో మైగ్రేన్ అటాక్స్‌ని తగ్గించగలుగుతున్నాం. అయితే.. జీవనశైలిలో మార్పులు రావాలి. సమయానికి నిద్ర,మంచి ఆహారం, నీరు ఎక్కువగా తీసుకోవడం, ఒత్తిడి లేకుండా చూసుకోవడం ద్వారానే మైగ్రేన్‌ని నియంత్రించగలం.

ప్రేమోన్మాది దాడిలో గాయపడ్డ బాలిక మృతి

పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నందుకే ఘాతుకం..



దస్తగిరమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్/కడప కార్పొరేషన్/కడప రూరల్: వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గం గోపవరం మండలంలో ప్రేమోన్మాది లైంగిక దాడికి పాల్పడి పెట్రోల్ పోసి నిప్పంటించిన హత్యాయత్నం ఘటనలో తీవ్రగాయాలపాలై కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రొద్దుటూరు దస్తగిరమ్మ (16) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా సాయంత్రం బద్వేలులో అంత్యక్రియలు జరిగాయి. మరోవైపు.. 'నా బిడ్డ లేకలేక పుట్టింది. నిష్కారణంగా ఆమెను తగలబెట్టిన వాడిని నాకు అప్పగించండి'.. అని మృతురాలు దస్తగిరమ్మ తల్లి హుసేనమ్మ డిమాండ్ చేశారు. రిమ్స్ మార్చురీ వద్ద ఆమె మీడియా ఎదుట విలపిస్తూ.. ఉన్నత చదువులు చదివి పైకి ఎదగాల్సిన ఆమెను అన్యాయంగా చంపేసిన వాడిని అలాగే తాను మట్టుబెడతానన్నారు. కాగా, దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతున్నందున, ఆమెను అడ్డుతొలగించుకోడానికే విఘ్నేష్ ఈ హత్యచేశాడని, అతను విచారణలో కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నాడని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు.

క్లుప్తంగా...

31న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల: శ్రీవారి ఆలయంలో ఈ నెల 31న ఉదయం 'దీపావళి ఆస్థానం'కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఇందులో భాగంగా మలయప్పస్వామి దేవేరులతో కలిసి బంగారు వాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. విష్వక్సేనుల వారినీ స్వామివారి ఎడమ పక్కన మరొక పీఠంపై దక్షిణ అభిముఖంగా వేంచేపు చేసి స్వామివారికి ప్రత్యేక పూజ, హారతి, ప్రసాదాలను నివేదిస్తారు. దీంతో దీపావళి ఆస్థానం పూర్తవుతుంది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని మాడ వీధులలో విహరిస్తారు. ఈ కారణంగా 31న తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనుంది.

నన్ను చంపాలని చూస్తున్నారు.. భద్రత పెంచండి

ప్రధాని, హోం మంత్రులకు కేఏ పాల్ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: తనను కొందరు చంపాలని చూస్తున్నారని, భద్రత పెంచాలంటూ ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా లకు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ లేఖ రాశారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ, సహా మోదీ కూడా తనకు శత్రువులే అని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నన్ను చంపితే స్వర్గానికి పోతా..మీరు (చంపాలనుకున్నవారు) చస్తే నరకానికి పోతారు'అంటూ వ్యాఖ్యానించారు. పలు విషయాలపై తాను కేసులు వేస్తూ పోరాడుతున్నానని, ఎన్నో కేసుల్లో స్టే లు తీసుకువస్తున్నానని తెలిపారు. చంద్రబాబు, పవన్ సహా.. బీజేపీ,ఆర్ఎస్ఎస్, తీవ్రవాదుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలు కూడా ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయని తెలిపారు. పాలన చేతకాకపోతే సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని కేఏపాల్ డిమాండ్ చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వేలాది మంది గ్రూప్–1 అభ్యర్థులపై పోలీసులు దాడులు చేయడం అమానుషమన్నారు.

24 ఏళ్లుగా పనిచేస్తున్నాం

కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్లపై కనికరం చూపండి

సాక్షి, హైదరాబాద్: రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న తమ పట్ల పాలకులు ఏమాత్రం కనికరం చూపడం లేదని పలువురు కాంట్రాక్టు లెక్చరర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ చేస్తామని నేతలు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చడం లేదని వాపోయారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదని తెలిపారు. రాష్ట్రంలో 797 కాంట్రాక్టు లెక్చరర్లు ఉన్నారు. 2023 మేలో నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత ఆధారంగా 271 మందిని, రెండో దశలో 61 మందిని రెగ్యులర్ చేశారు. ఈ తరుణంలోనే మరికొందరు నెట్, సెట్ అర్హత సాధించారు. దీంతో వారిని రెగ్యులర్ చేయాలని కాలేజీల ప్రిన్సిపాల్స్ కాలేజియేట్ కమిషనర్‌కు ప్రతిపాదన పంపారు. ఈ సమయంలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. 24 ఏళ్లుగా కాంట్రాక్టు పోస్టుల్లోనే ఉన్నామని, ఇప్పటికైనా 466 మంది కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల రాష్ట్ర నాయకుడు జి వైకుంఠం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అంతులేని అఘాయిత్యాలు



ఏపీలో నాలుగు నెలల్లోనే 74 అత్యాచారాలు, లైంగిక వేధింపులు

వీరిలో ఏడుగురు దారుణంగా హత్య
వేధింపులు తట్టుకోలేక ఐదుగురు ఆత్మహత్య

కూటమి పాలనలో హడలిపోతున్న మహిళలు, బాలికలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అక్కడ అబలల ఆర్తనాదాలు.. ఇక్కడ బాబు, బాలకృష్ణ 'ఆహా' ఓహో!

- వరుస అత్యాచారాలు, హత్యలతో ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలం..
- బాలకృష్ణ 'షో' షూటింగ్‌లో థ్రిల్ అవుతున్న సీఎం చంద్రబాబు



ప్రోగ్రాంకి హాజరైన సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ

ఈవీఎంల హ్యాకింగ్ చాలా సులభం

▶ మొదటి పేజీ తరువాయి

పెన్సిల్వేనియాలోని ఫిలడెల్ఫియాలో జరిగిన బహిరంగ సభలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

ఈవీఎంల సాఫ్ట్‌వేర్ ఉత్తమం కాదు..

''ఈవీఎంలను చాలా సులభంగా హ్యాక్ చేయవచ్చు. ముఖ్యంగా ప్రభుత్వం ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌ను ఇకా చాలా తేలిగ్గా హ్యాక్ చేయవచ్చు. నాకు కంప్యూటర్ అంటే ఇష్టం. అయితే కంప్యూటర్లు ఓటింగ్ ట్యాబ్‌లేషన్‌ను కలిగి ఉండకూడదు. ఈవీఎంల్లో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉత్తమమైనది కాదు. ఎన్నికల్లో పేపరు బ్యాలెట్లు మాత్రమే ఉపయోగించాలి. ప్రతి వ్యక్తి నేరుగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి లైన్‌లో నిలబడి ఓటింగ్ హక్కు వినియోగించుకోవాలి''అని మస్క్ పేర్కొన్నారు. ఈవీఎంల ద్వారా భారత్‌లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజాగా ఎలన్ మస్క్ వ్యాఖలు మరోసారి చర్చకు దారి తీశాయి. ఈవీఎంల ద్వారా కాకుండా పారదర్శకత కోసం బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సైతం డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఓ అభ్యర్థి గెలిచేలా రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చు

ఈవీఎంల పనితీరుపై ఎలన్ మస్క్ తొలి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈవీఎంలో కాలం చెల్లిన మైక్రోసాఫ్ట్‌కు చెందిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారని, దీంతో వీటిని హ్యాక్ చేయడం అత్యంత సులభమని, ఈ విషయాన్ని ఒక టెక్నాలజీ నిపుణుడిగా చెబుతున్నట్లు జూలైలో మస్క్ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. 2017లో సెనేట్ ఇంటెలిజెన్స్ విచారణలో ఈ విషయం బయటపడిందని, ఓ అభ్యర్థి గెలిచే విధంగా ఓట్లను దొంగిలిస్తూ ఈవీఎంలను రీ ప్రోగ్రామింగ్ చేయవచ్చని స్పష్టం చేశారు. అమెరికా ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సహా మరే విధంగానూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతిని వినియోగించకూడదని మస్క్ గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- టీయూసీఐ ఆలిండియా ఉపాధ్యక్షుడు అలీక్ చక్రవర్తి
- టీయూసీఐలో విలీనమైన ఐఎఫ్‌టీయూ



విలీన సభలో మాట్లాడుతున్న అలీక్ చక్రవర్తి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం(హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఆలిండియా ఉపాధ్యక్షుడు అలీక్ చక్రవర్తి పిలుపునిచ్చారు. కనీస వేతనం 26,000, సామాజిక భద్రతకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అలీక్ చక్రవర్తి మాట్లాడుతూ కార్మిక చట్టాల నవీనకరణ పేరుతో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే చర్యలకు పాల్పడిందన్నారు. టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు ఉమాకాంత్ మాట్లాడుతూ తెలంగాణలో అనేక రంగాల్లో పనిచేస్తున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ టీయూసీఐలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా ఐఎఫ్‌టీయూ కార్మిక సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేస్తూ వస్తుందన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూఐ ఆలిండియా కార్యదర్శి దేవా బ్రిగశర్మ, టీయూసీఐ మహారాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ నట్కర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఎం. హన్మేష్, సి.వెంకటేష్, అరుణ్‌కుమార్, వి.ప్రవీణ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పూర్తయ్యేవరకు అప్రమత్తం

- అఖిలపక్ష పార్టీల సమావేశంలో వక్తల పిలుపు
- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భేటీ



అభివాదం చేస్తున్న బండ ప్రకాష్, మధుసూదనాచారి, హనుమంతరావు, శ్రీనివాస్ గౌడ్, జాజుల తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): కుల గణన జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు ఏవిధంగా ఉద్యమించాయో దాన్ని విజయవంతం చేసేందుకు కూడా అదే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని అఖిలపక్ష నేతలు అన్నారు. కులగణన పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రంలో సమగ్ర కుల గణనకు మద్దగా అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. బండ ప్రకాష్ మాట్లాడుతూ.. కులగణన పద్ధతిపై స్పష్టత ఉండాలని, కొంతమంది ఏ చిన్న అవకాశం దొరికినా దాన్ని చూపించి ప్రక్రియను ఆపే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ.. ప్రజలు ఉద్యమించినప్పుడు వారికి రావల్సిన హక్కులు తప్పకుండా వస్తాయని, ఇప్పుడు బీసీల్లో చైతన్యం వచ్చిందని అన్నారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీల హక్కులు సాధించుకునేందుకు ఇదే మంచి తరుణమని చెప్పారు. బీసీల్లో ఐకమత్యం వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలని జనాభాకు అనుగుణంగా వారి హక్కులు వారికి ఇవ్వాల్సిందేనని కూనంనేని డిమాండ్ చేశారు. కుల గణనలో ఒక్క బీసీలే కాకుండా ఎస్సీ, ఎస్టీ, అగ్రకులాల వారి లెక్కలు కూడా బయటకు వస్తాయని, కాబట్టి దీన్ని అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వీహెచ్ చెప్పారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ .. ఆరు నెలల బీసీల పోరాట ఫలితంగా ప్రభుత్వం జీవో 18 విడుదల చేసిందని అన్నారు. ఇప్పటికే కుల గణన ప్రారంభమయ్యిందని దీన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రజల్లో విస్తృతమైన ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమానికి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షత వహించగా పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

ఈ భూమి మీద విజయం సాధించిన వారంతా కేవలం తామొక్కరుగానే ఆ విజయాన్ని సాధించలేదు. వారందరికీ ఏదో సమయంలో అనేక మంది సహకరించడం వల్లనే ఆ విజయం సంప్రాప్తించిందన్నది జగమెరిగిన సత్యం. ఏ మనిషైనా ఎన్ని ప్రతిభా సామర్థ్యాలున్నప్పటికీ, ఎంతటి పండితులైనప్పటికీ, అపారమైన మేధో సంపత్తి ఉన్నప్పటికీ, ఆయా సామర్థ్యాలను సాధించడానికి వారు చేసిన కృషి ఒక ఎత్తయితే, ఆ కృషి చేయడానికి సహకరించిన చేతులు అనేకం అని చెప్పక తప్పదు.

మంచిమాట



కలసి ఉంటేనే కలదు విజయం

ఉన్నత శిఖరాలకు చేరుకున్న వ్యక్తి గురించి మాట్లాడినపుడు వారు పడిన శ్రమను, కష్టం గురించి మాట్లాడడం జరుగుతుంది తప్ప, వారికి అంతర్లీనంగా సహకరించిన పెద్దలను, మహనీయులను, గురువులను, స్నేహితులను, మిత్రులను గాలికి వదిలేస్తాం. నిజానికి వారందరి సహకారం లేనిదే ఆ వ్యక్తి అంతటి ఉన్నత శిఖరాలకు చేరుకుని ఉండేవారు కాదన్నది వాస్తవం. ఒకవేళ ఆ వ్యక్తి తనకు తానుగా గొప్పవాడిగా భావించుకుని అందరినీ దూరంగా జరిపితే ఆయా విజయాల దరిదాపుల్లోకి వెళ్ళేవాడు కాదన్నది అక్షరాల నిజం. అందుకే కలిసుంటే కలదు సుఖమే కాదు... అది జీవిత సత్యంగా కూడా ఆకళింపు చేసుకోవాలి.

ఐకమత్యమే మహాబలం, మహాభాగ్యం అన్నారు పెద్దలు. అవును నిజమే.. మన పెద్దలు చెప్పినట్టు ఐకమత్యంగా ఉంటే ఎన్నో పనులు చెయ్యొచ్చు.. శత్రువులను సైతం తరిమి తరిమి కొట్టొచ్చు. ఎలాంటి దుస్సాధ్యమైన పనైనా సునాయాసంగా చేయచ్చు. ఐకమత్యం బలాన్ని, ప్రేమను, అనురాగాలను పెంచుతుంది. ఇది నమ్మకాన్ని ఏర్పరుస్తుంది. ఏకత్వాన్ని సూచిస్తుంది. ఆనందాన్నిస్తుంది. కష్టాలలో పాలు పంచుకునే అవకాశాన్నిస్తుంది. శక్తిని, విశ్వాసాన్ని పెంచుతుంది. ఏకత్వాన్ని కలిగిస్తుంది. వ్యక్తుల మధ్య అంతరాలను తగ్గిస్తుంది. జీవితంలోని సంతోషకరమైన క్షణాలను ఆస్వాదించడానికి ఇది మనకు ఎంతగానో దోహదం చేస్తుంది.

మన పురాణాల్లో కానీ, ఇతిహాసాల్లో కానీ ఏ ఒక్క యుగ పురుషుడు కూడా ఐకమత్యం సాధించకుండా విజయ బావుటా ఎగురవేయలేదన్న విషయంలో ఎంత వాస్తవం ఉందో, ఐకమత్యం లేకపోతే ఆ విజయాలు సాధ్యం కావన్న విషయంలోనూ అంతే నిజం ఉంది.

అందువల్ల ఏదైనా ముఖ్యమైన విజయాన్ని సాధించడానికి, అత్యంత అవసరమైన అంశం ఐకమత్యం. మన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఐకమత్యం అండగా నిలుస్తుంది. కనుక మన భవిష్యత్ స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి అన్ని శక్తులు, సామర్థ్యాలు, వనరులు వాడుకోవాలి. ఇవన్నీ ఏ ఒక్కరిలోనో ఉండవు. సహాయం, సహకారం అవసరమున్నప్పుడు అర్థించడం బలహీనతకు సూచన కాదు. అది వివేకవంతుల లక్షణం కూడా.

దుష్టశిక్షణ శిష్ట రక్షణ చేయడానికి సాక్షాత్తు ఆ జగన్మాతే ఐకమత్యంతో అసురులపై విజయం సాధించింది. చండ, ముండాసురులను, మహిషాసురుని సంహరించి జగజ్జేతగా నిలిచింది. ఆ జగన్మాతకు విజయం దక్కడానికి ముక్కోటి దేవతలు ఒక్కటయ్యారు. తమకు కంటకంగా మారిన అసురులను సంహరించడానికి ఆ తల్లికి సహకరించారు. సృష్టి స్థితి, లయాలకు కారకులైన బ్రహ్మ విష్ణు పరమేశ్వరులతో పాటు, ముక్కోటి దేవతలు ఆ తల్లికి తమకున్న శక్తులన్నింటినీ ధారపోశారు. తమకున్న అపార యంత్ర, తంత్ర, అద్వితీయ శక్తులను జగన్మాతకు ఇచ్చి, ఆ తల్లిని శక్తి స్వరూపిణిగా నిలబెట్టారు. చివరకు అసుర సంహారం చేశారు.

అందువల్ల మన నిజమైన సామర్థ్యాలు మన ఒక్కరిలో ఉన్నవే కాదు. మన తోటి వాళ్ళందరితో కలిసి ఉంటేనే అవి సర్వశక్తిమంతులుగా మార్చుతాయి. ఇది ఐకమత్యంతోనే సాధ్యమవుతుందన్న వాస్తవాన్ని గుర్తెరిగి మసలుకుని విజయులమవుదాం.

– దాసరి దుర్గా ప్రసాద్

సన్నిధి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

ధర్మచక్రం

గృహస్థాశ్రమంలో నిత్యం జరిగే పంచ మహా యజ్ఞాలలో మూడవది – హోమోదైవో.. దేవ యజ్ఞం. వేదమంత్రాల పఠనంతో భగవంతుడిని ఉద్దేశించి హోమం చేస్తూ నైవేద్యాలను సమర్పించాలి – హుతో హోమః... అంటే యజ్ఞయాగాది క్రతువులు. మహాభారతంలో శాంతి పర్వంలో అంపశయ్యమీద పడుకుని భీష్మాచార్యుల వారంటారు..''అసలు ధర్మానికంతటికీ ఇరుసువంటివాడు గృహస్థు... ఓ ధర్మరాజా! గృహస్థులేని నాడు ఈ సృష్టే లేదు. గృహస్థులేని నాడు ఈ ధర్మ చక్రం తిరగనే తిరగదు.'' అని. అగ్ని ద్వారా దేవతలకు హవిస్సును గృహస్థే ఇస్తాడు. ఇతర ఆశ్రమాల వాళ్ళు ఇవ్వరు. గృహస్థు ఇచ్చిన హవిస్సును దేవతలు తిని సంతుష్టులై వర్షం కురిపిస్తారు... ఎక్కడ..? గృహస్థు ఇంట్లోకాదు, ఆ ప్రాంతమంతా కురిపిస్తారు. ''అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్న సంభవః/ యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞ కర్మసముద్భవః... ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః/ అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి''... అంటే ఇది ఒక చక్రం. తిరుగుతోంది. ప్రాణులు పుట్టాలి అంటే అన్నం (ఆహారం) తినాలి. అన్నసారం స్త్రీలో శోణితంగా, పురుషునిలో శుక్రంగా మారి రెండూ కలిసి సృష్టి జరగాలి. బిడ్డలు పుట్టాలి. దీనికంతటికీ మూలమైన అన్నం పుట్టాలంటే పంటలు పండాలి.. అంటే వర్షం పడాలి... వర్షం పడాలంటే... యజ్ఞం జరగాలి.

అన్నం, నీరు ఎంత కాలం దొరుకుతాయో అంతకాలమే ధర్మం ఉంటుంది. వాటిలో మొదట నీరు. ఇవి దొరకనపుడు ఎన్ని ధర్మాలు, నీతులు, ప్రవచనాలు చెప్పినా వినేవారు కానీ, పాటించేవారు కానీ లోకంలో ఉండరు. ధర్మం తప్పిపోతుంది. 'ఆపోవా ఇదగుం సర్వం...అమృతం వా ఆపః...'' నీరు అమృతం. ప్రాణులన్నీ ఆ నీటి మీదే ఆధారపడి ఉన్నాయి. అన్నం, నీరు కావాలంటే వర్షం పడాలి... అలా పడాలంటే యజ్ఞం చేయాలి. యజ్ఞ కర్మ సముద్భవమ్... కర్మ చేస్తే వస్తుంది. అదెవరు చేయాలి?... ఒక్క గృహస్థు మాత్రమే.. పక్కన ధర్మపత్నితో కూడుకుని ఉన్నవాడు మాత్రమే యజ్ఞాన్ని చేస్తాడు. అప్పుడు ఈ సృష్టి ఏర్పడుతుంది, నిలబడుతుంది, లయమవుతుంది. ప్రశాంతత కలుగుతుంది. అందరూ నిర్వర్తించాల్సిన ధర్మాన్ని అందరూ నిర్వర్తిస్తున్నారు. కాబట్టి ధర్మచక్రం సవ్యంగా తిరుగుతుంది.

ఎంత సంపన్న కుటుంబంలో పుట్టిన వాడయినా తల్లి పాలమీద ఆధారపడాల్సిందే. తల్లి లేకపోతే సృష్టి లేదు. అలాగే గృహస్థాశ్రమం మిగిలిన అన్ని ఆశ్రమాలకు తల్లిలాంటిది. ఆ గృహస్థులేని నాడు మిగిలిన ఆశ్రమాల




వాళ్ళకు భిక్ష లేనే లేదు... ఈ మాటలు నావి కావు.. మహాభారతంలో శాంతిపర్వంలో భీష్ముడు చెప్పినవి. రామాయణంలో అయోధ్యకాండలో భరతుడు కూడా ఇదే అంటాడు..''అన్నయ్యా ! నీకు తెలుసు కదా! గార్హస్థ్యం శ్రేష్ఠమాశ్రమం... నాలుగు ఆశ్రమాలలో గృహస్థాశ్రమమే గొప్పది.''

''హోమో దైవో బలిర్భౌతో...'' హవిస్సు ద్వారా దేవతలకు అన్నం పెట్టిన గృహస్థుకు సమస్త భూతములు, ప్రాణులను కూడా పోషించే కర్తవ్యం ఉంది. భీష్ముడు మరో మాట కూడా చెప్పాడు... గృహస్థాశ్రమంలో ఉన్నవారు ఎప్పుడూ సంసార లంపటంలో పడి ఉంటారు, వారు అగాధంలో పడిపోయారని అనుకుంటున్నావేమో ... గృహస్థుకు మోక్షం లేదని ఎవరన్నారు !!! దేవతలకు అన్నం పెడుతున్న గృహస్థుకు కూడా మోక్షం లభిస్తుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బ్రహ్మం అంటే..?



పూర్వం ఆరుణి అనే మహర్షి ఉండేవాడు. ఆయన మహాజ్ఞాని. ఆయన కుమారుడు శ్వేతకేతువు. అతనికి పన్నెండు సంవత్సరాలు నిండగానే తండ్రి అతన్ని పిలిచి: ''శ్వేతకేతూ! నువ్వు ఏదైనా గురుకుల ఆశ్రమానికి వెళ్ళి అధ్యయనం చేయవలసిన సమయం వచ్చింది. వెళ్ళి విద్యావంతుడివి కా'' అన్నాడు.

అప్పుడు శ్వేతకేతువు ఒక గురువును ఆశ్రయించి వేదాలన్నింటినీ కంఠస్థం చేశాడు. ఈ చదువుకే తనకు సర్వం తెలుసును అన్న అహంకారంతో, దర్పంతో ఇంటికి తిరిగి వచ్చాడు. తండ్రి అతని అవివేకాన్నీ, ఆత్మ వంచననూ గుర్తించి–''శ్వేతకేతూ! ఆత్మ తత్త్వాన్ని గురించి మీ గురువు గారు ఏమి బోధించారు?' అని అడిగాడు.

''నాన్నగారూ! నా గురువర్యులకు మీరు చెబుతున్న జ్ఞానాన్ని గురించి తెలియదనుకుంటాను. ఒకవేళ వారికి తెలిస్తే నాకు చెప్పి ఉండేవారే. కాబట్టి మీరే నాకు ఆ జ్ఞానబోధ చేయండి'' అని అడిగాడు.

తండ్రి సరేనని ఇలా ప్రారంభించాడు: ''చెబుతున్నాను విను శ్వేతకేతూ! అన్నింటికన్నా పూర్వమైనది, మొదటగా ఉన్నది, రెండు కానిది, ఏకైకమైనది అయిన బ్రహ్మం తన ఏకైక తత్త్వం అనేకం కావాలని సంకల్పించింది. అదే రకరకాల వస్తువులుగా చిత్ర విచిత్ర సమ్మేళనాలతో రూపుదాల్చింది. ద్రవపదార్థాలు, ఘనపదార్థాలు, వాయుపదార్థాలు – ఇలా ఎన్నో రకాలుగా మార్పులు చెంది, చిన్నచిన్న రూపాలతో ఈ సృష్టి ఆకారాన్ని పొందింది. జీవరాశులు ఉత్పన్నం అయినాయి. ఆదిలో ఉన్న ఒక్కదానిలో నుంచే ఈ అన్నీ ఉద్భవించాయన్నమాట'' అని చెప్పాడు.

అప్పుడు శ్వేతకేతువు ''నాన్నగారూ! నిద్రపోతున్నప్పుడు మనిషి ఎక్కడికి పోతాడు ?'' అని అడిగాడు.

అందుకు ఉద్దాలకుడు, ''నిద్రపోతున్నప్పుడు మనిషి తాత్కాలికంగా ఆత్మతో తాదాత్మ్యం పొందుతాడు.

ఆ స్థితిలో గతాన్ని గురించి గానీ, వర్తమానాన్ని గురించి గానీ తెలియదు. అంతా అజ్ఞానం ఆవరించి ఉంటుంది. అజ్ఞానం వల్ల యథార్థాన్ని గుర్తించడం జరగదు!! మరణ కాలంలో అతని వాక్కులు మనస్సునందు లీనమవుతాయి. అతని మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో కలిసిపోతుంది. చిట్టచివరకు అది పరమశక్తిలో లీనమవుతుంది. ఆ శక్తి అతిసూక్ష్మమైనది. అది విశ్వంలో అంతటా వ్యాపించి ఉన్నది. అదే సత్యం. అదే ఆత్మ. దే నీవు!! అది సింహం రూపంలో ఉండనీ! పెద్దపులిగా ఉండనీ! ఏ జంతువైనా కానీ! మనిషి ఐనా కానీ అది అనంత చైతన్యమనే సముద్రంలో కలిసిపోయిన తరువాత తన రూపాన్ని పోగొట్టుకుంటుంది. వాటి రూపాలూ, వాటి నామాలూ ఎగరగొట్టుకుపోతాయి'' అని వివరించాడు ఉద్దాలకుడు.

బ్రహ్మం అంటే ఏమిటి నాన్నగారూ అని అడిగాడు శ్వేతకేతువు. అందుకు సమాధానంగా ''సర్వవ్యాపకంగా ఉండే ఏ తత్త్వంలో సర్వమూ కలిసిపోతాయో అది బ్రహ్మం. అది అద్వితీయం. అది సూక్ష్మం. అది సర్వవ్యాపకం. అదే ఆత్మ. అదే నీవు తత్త్వమసిహేశ్వేతకేతో!'' అని వివరించాడు.


కొడుకు ద్విగుణీకృత ఉత్సాహంతో, ''ఆ ఆత్మతత్త్వాన్ని గురించి ఇంకా వివరించండి నాన్నగారూ!'' అని అడిగాడు.!!

''నదులు అన్నీ సముద్రంలోకే ప్రవేశిస్తాయి. ఒక సముద్రం నుండి మరో సముద్రానికి ఆ నీరు ప్రయాణిస్తూ పోతుంది. సూర్యరశ్మి ఆ నీటిని ఆవిరిగా మార్చి మేఘంగా తయారు చేస్తుంది. ఆ మేఘం వర్షించి మరల లోకానికి బలాన్ని ప్రసాదిస్తుంది. నదులు సముద్రంలోకి ప్రవేశించగానే ఈ నీళ్ళు ఫలానా నదిలోనివి అని విడదీయడం అసాధ్యం. అలాగే భిన్నభిన్నంగా కనిపించే ఈ జీవరాశులు బ్రహ్మంలో అంతర్లీనమైతే వాటిని విడదీసి అర్థం చేసుకోవడం కష్టం. అన్ని జీవాత్మలూ ఆ పరమాత్మలో అంతర్భాగాలే. అదే సత్యం. అదే నీవు.''!! అన్న తండ్రి వివరణతో శ్వేతకేతువులో జ్ఞాననేత్రం తెరచుకుంది. పితృభక్తికి గురుభక్తి తోడై వినమ్రతతో నమస్కరించాడు.

– డి.వి.ఆర్. భాస్కర్

(ఛాందోగ్యోపనిషత్తులోని ఉద్దాలక – శ్వేతకేతు సంవాదం ఆధారంగా)

సినిమా



వరుణ్ తేజ్

కౌంట్‌డౌన్ స్టార్ట్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'మట్కా'. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. 1958 నుంచి 1982 మధ్య జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో వరుణ్ తేజ్ నాలుగు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు. కరుణ కుమార్ దర్శకత్వంలో డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 14న విడుదల కానుంది. కాగా ఆదివారం 'మట్కా' సినిమా రిలీజ్ 25 రోజుల కౌంట్‌డౌన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, 'కన్నడ' కిషోర్, రవీంద్ర విజయ్ ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించారు.

ఊ అన్నారా?

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ చిత్రంలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ టైటిల్ రోల్ చేస్తుండగా, హీరోయిన్ శ్రీవల్లి పాత్రలో రష్మికా మందన్నా నటిస్తున్నారు. ఈ సినిమా టాకీ పార్టు చిత్రీకరణ దాదాపు తుది దశకు చేరుకుంది. అలాగే మిగిలి ఉన్న పాటలను చిత్రీకరించే పనిలో ఉంది టీమ్. ఈ నెలాఖర్లో స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో మెరిసే హీరోయిన్ల పేర్లలో జాన్వీ కపూర్, మృణాళినీ ఠాకూర్, శ్రద్ధా కపూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే శ్రద్ధా కపూర్‌ను యూనిట్ సంప్రదించిందని, ఆమే నటించనున్నారని భోగట్టా. మరి... శ్రద్ధా కపూర్ ఊ అన్నారా? అనే విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమా డిసెంబరు 6న విడుదల కానుంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 'పుష్ప' సినిమా తొలి భాగం 'పుష్ప : ది రైజ్'లోని స్పెషల్ సాంగ్ 'ఊ అంటావా మామ..'లో సమంత మెరిశారు. ఈ సాంగ్ 'పుష్ప: ది రైజ్' సినిమాకు ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో 'పుష్ప 2'లోని స్పెషల్ సాంగ్ ఎలా ఉండబోతుందన్న చర్చ జరుగుతోంది. తొలి భాగానికి సంగీతదర్శకత్వం వహించిన దేవిశ్రీ ప్రసాద్ 'పుష్ప: ది రూల్'కూ సంగీతం అందిస్తున్నారు.



శ్రద్ధా కపూర్

మాస్ మెకానిక్



రామ్ తాళ్లూరి, విశ్వక్ సేన్, శ్రద్ధా శ్రీనాథ్, రవితేజ


'ఓ నటుడిగా నేనింత దూరం వచ్చానంటే ఇద్దరే కారణం. ఒకటి నేను... రెండు... మీరు (అభిమానులు, ప్రేక్షకులను ఉద్దేశించి). 'మెకానిక్ రాకీ' సినిమా చూసుకున్నాను. చాలా బాగా వచ్చింది. రెండోసారి కూడా చూడాలనుకునేలా ఈ సినిమా ఉంటుంది.'' అని విశ్వక్ సేన్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం నవంబరు 22న విడుదల కానుంది. ఈ సినిమా తొలి ట్రైలర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. మాస్ యాక్షన్, లవ్, సెంటిమెంట్ అంశాలతో ఈ సినిమా ఉంటుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''రిలీజ్ సమయంలో మరో ట్రైలర్‌ను విడుదల చేస్తాం. అలాగే ఒక రోజు ముందుగానే పెయిడ్ ప్రీమియర్స్ వేస్తాం. నిర్మాత రామ్ తాళ్లూరి బాగా సపోర్ట్ చేశారు'' అన్నారు. ''ఈ సినిమాను థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు రామ్ తాళ్లూరి, శ్రద్ధా శ్రీనాథ్, రవితేజ.

జై జై దుర్గమ్మ



చిన్నా

చిన్నా హీరోగా, మధు ప్రియ, రుచిత హీరోయిన్లుగా నటించిన చిత్రం 'జై జై దుర్గమ్మ'. సుభాని దర్శకత్వంలో ఎం. అనిత నిర్మించారు. ఈ సినిమా లోగోను దర్శకుడు వి. సముద్ర విడుదల చేయగా, ట్రైలర్‌ను నిర్మాతలు ప్రతాని రామకృష్ణ గౌడ్, సాయి వెంకట్ రిలీజ్ చేశారు. ''ఈ ట్రైలర్ చూస్తుంటే రోజాగారి 'దుర్గ' సినిమా గుర్తుకు వస్తోంది. ట్రైలర్ బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు సముద్ర. ''ఇంత మంచి గ్రాఫిక్స్ ఉన్న ట్రైలర్‌ను రీసెంట్ టైమ్స్‌లో నేను చూడలేదు'' అన్నారు రామకృష్ణ గౌడ్. ''ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ చిత్రం ఇది'' అన్నారు చిన్నా.



కియారా, సిద్ధార్థ్ మల్హోత్రా



సోనాక్షి సిన్హా



శిల్పా శెట్టి

భర్త క్షేమం కోసం...

డిజైనర్ చీరలు, చుడీదార్లు, గౌనులు, నగలు, నుదుట ఎర్రని సింధూరం, చేతులకు మెహిందీతో కొందరు బాలీవుడ్ తారలు చాలా అందంగా ముస్తాబయ్యారు. కర్వా చౌత్ పండగ సందర్భంగా ఈ తారలు ఇలా కళకళలాడారు. ఈ పండగకు భర్త ఆయురారోగ్యాల కోసం రోజంతా ఉపవాసం ఉండి, చంద్రుడు కనిపించాక, భర్త ముఖాన్ని జల్లెడలోంచి చూసిన తర్వాతే భోజనం చేస్తారు. ఉత్తరాదిన పాటించే ఆచారం ఇది. ఈ కర్వా చౌత్‌కి బాలీవుడ్‌లో ఇలా భర్త క్షేమం కోసం ఉపవాసం ఆచరించి, పూజ చేశారు కొందరు తారలు. ఆ విశేషాల్లోకి...

''నీ ఆయురారోగ్యాల కోసం ఈరోజు మాత్రమే కాదు.. ప్రతి రోజూ ఆ దేవుణ్ణి ప్రార్థిస్తుంటాను... కర్వా చౌత్ శుభాకాంక్షలు. మన శాశ్వతమైన ప్రేమకు, మన బలమైన బంధానికి చిహ్నంగా ఈ మంగళసూత్రం ఓ గుర్తు'' అంటూ భర్త జహీర్ ఇక్బాల్‌పై తనకున్న ప్రేమను వ్యక్తపరిచారు సోనాక్షీ సిన్హా. నటుడు జహీర్ ఇక్బాల్‌తో సోనాక్షీ వివాహం ఈ ఏడాది జూన్‌లో జరిగింది. తొలి కర్వా చౌత్‌ను ఇష్టంగా జరుపుకున్నారు సోనాక్షి. ఇక ఈ ఏడాది తొలి కర్వా చౌత్ జరుపుకున్న వారిలో రకుల్ ప్రీత్‌సింగ్ ఉన్నారు. నటుడు–నిర్మాత జాకీ భగ్నానీతో రకుల్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగింది. కాగా ఇటీవల వర్కౌట్ చేస్తుండగా రకుల్‌కి గాయమైంది. వెన్నెముకకు గాయం కావడంతో ఆమె బెడ్ రెస్ట్‌లో ఉన్నారు. అయితే కర్వా చౌత్ సందర్భంగా చేతికి భర్త పేరులోని 'జె' అక్షరం, ఒక పువ్వు డిజైన్‌తో మెహిందీ పెట్టించుకుని, 'బెడ్ రెస్ట్‌వాలా ఫస్ట్ కర్వా చౌత్' అంటూ ఆ ఫొటోను షేర్ చేశారు రకుల్. అలాగే అదితీ రావ్ హైదరీకి కూడా ఇది తొలి కర్వా చౌత్. నటుడు సిద్ధార్థ్‌తో అదితి వివాహం ఈ ఏడాది సెప్టెంబరులో జరిగింది. ఇంకా తొలి కర్వా చౌత్ జరుపుకున్న వారిలో కృతీ కర్బందా ఉన్నారు. నటుడు పుల్‌కిత్ సామ్రాట్‌తో ఆమె పెళ్లి ఈ ఏడాది మార్చిలో జరిగింది. ఇక కియారా అద్వానీకి ఇది రెండో కర్వా చౌత్. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో గత ఏడాది ఫిబ్రవరిలో ఆమె వివాహం జరిగింది. రెండో కర్వా చౌత్‌కి భర్త పేరులోని 'ఎస్‌ఎమ్' అక్షరాలను మెహిందీ డిజైన్‌గా పెట్టించుకుని, ఆ ఫొటోను, జల్లెడలోంచి భర్త ముఖాన్ని చూస్తున్న ఫొటోలను షేర్ చేశారు కియారా. పరిణీతీ చోప్రాకి కూడా ఇది రెండో కర్వా చౌత్. గత ఏడాది సెప్టెంబర్‌లో రాఘవ్ చద్దాతో ఆమె వివాహం జరిగింది. చేతి వెనకాల రెండు హార్ట్ సింబల్స్‌తో మెహిందీ పెట్టించుకున్న ఫొటోను షేర్ చేశారు పరిణీతి. మరోవైపు సోనమ్ కపూర్ కూడా భర్త ఆనంద్, కుమారుడు వాయు పేర్లను మెహిందీ డిజైన్‌గా పెట్టించుకుని, ఆ ఫొటోను షేర్ చేశారు. 2018లో ఆనంద్, సోనమ్‌ల వివాహం జరిగింది. అయితే ఫాస్టింగ్ ఉండనని, ఈ పండగ సందర్భంగా మెహిందీ పెట్టించుకోవడం, రుచికరమైన వంటకాలు తినడం ఇష్టం అని పేర్కొన్నారు సోనమ్. కాగా నటుడు అనిల్ కపూర్ భార్య సునీతా కపూర్ ప్రతి ఏడాదీ ఘనంగా కర్వా చౌత్ జరుపుకుంటారు. అందర్నీ ఆహ్వానిస్తుంటారు కూడా. ఈ ఏడాది శిల్పా శెట్టి, రవీనా టాండన్ వంటివారు సునీతతో కలిసి ఆమె ఇంట్లో పండగ చేసుకున్నారు. ఇలా కర్వా చౌత్ సందర్భంగా బాలీవుడ్ ప్రముఖుల సందడి జోరుగా కనిపించింది.



సోనమ్ కపూర్



పరిణీతీ చోప్రా



రకుల్



సునీతా కపూర్ ఇంటికి చేరుకున్న రవీనా టాండన్...

> 36 సంవత్సరాల తర్వాత భారత్‌లో టెస్టు మ్యాచ్ గెలవడం ఆనందంగా ఉంది. రెండో టెస్టులో టీమిండియా నుంచి గట్టి పోటీ ఎదురవుతుందని మాకు తెలుసు. రెండో ఇన్నింగ్స్‌లో రెండో కొత్త బంతి తీసుకున్న తర్వాతే తిరిగి పోటీలోకి వచ్చాం. మా పేసర్లు చక్కటి బంతులతో టీమిండియాను కట్టడి చేయడంతో ఛేదన సులువైంది. తొలి ఇన్నింగ్స్‌లో రచిన్ రవీంద్ర, టిమ్ సౌతీ మధ్య భాగస్వామ్యమే జట్టును గెలిపించింది.
>
> –టామ్ లాథమ్, న్యూజిలాండ్ కెప్టెన్



36 ఏళ్ల తర్వాత...

- భారత్‌లో టెస్టు మ్యాచ్ గెలిచిన న్యూజిలాండ్
- తొలి టెస్టులో టీమిండియా ఓటమి
- 8 వికెట్లతో న్యూజిలాండ్ విజయం
- మెరిసిన యంగ్, రచిన్ రవీంద్ర

అంచనాలు తప్పలేదు... అద్భుతాలు జరగలేదు! బుమ్రా ఆరంభ మెరుపులు తప్ప మన బౌలర్లు న్యూజిలాండ్ బ్యాటర్లను నిలువరించడంలో విఫలమయ్యారు. ఫలితంగా తొలి టెస్టులో భారత జట్టు పరాజయం పాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలి... ఆ తర్వాత అసమాన పోరాటంతో పోటీలోకి వచ్చిన టీమిండియా చివరి రోజు మ్యాజిక్ కొనసాగించలేకపోయింది. 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కివీస్ 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. 36 ఏళ్ల తర్వాత భారత్‌లో టెస్టు విజయం నమోదు చేసుకుంది.

బెంగళూరు: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు ఎలాంటి సంచలనాలకు తావివ్వకుండా తొలి టెస్టులో ఘనవిజయం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన తొలి టెస్టులో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో టీమిండియాపై గెలిచింది. భారత గడ్డపై న్యూజిలాండ్‌కు 36 ఏళ్ల తర్వాత ఇదే తొలి టెస్టు విజయం కావడం విశేషం. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0తో ముందంజ వేసింది. 107 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 0/0తో ఆదివారం ఐదో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 27.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసి గెలిచింది. విల్ యంగ్ (76 బంతుల్లో 48 నాటౌట్; 7 ఫోర్లు, ఒక సిక్సర్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (46 బంతుల్లో 39 నాటౌట్; 6 ఫోర్లు) రాణించారు. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి పుణెలో రెండో టెస్టు ప్రారంభం కానుంది.

ఆడుతూ పాడుతూ!

తొలి ఇన్నింగ్స్‌లో భారత స్టార్ ఆటగాళ్లు బ్యాటింగ్ చేసేందుకు ఇబ్బందిపడ్డ చోట... నాలుగో ఇన్నింగ్స్‌లో ఛేదన అంత సులువు కాదని అంతా భావించారు. అందుకు తగ్గట్టే ఇన్నింగ్స్ ఐదో బంతికే టామ్ లాథమ్ (0)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న బుమ్రా భారత శిబిరంలో ఆనందం నింపాడు. అయితే ఆ సంబరాలు ఎక్కువసేపు సాగలేదు. బుమ్రా, సిరాజ్ కట్టుదిట్టమైన బంతులు సంధించినా... న్యూజిలాండ్ బ్యాటర్లు సంయమనం కోల్పోలేదు. ఈ క్రమంలో కాన్వే (17) కూడా బుమ్రా బౌలింగ్‌లోనే వెనుదిరగ్గా... క్రీజులోకి వచ్చీ రాగానే రచిన్ రవీంద్ర ఎదురుదాడి ప్రారంభించాడు. మరో ఎండ్ నుంచి యంగ్ కూడా ధాటిగా ఆడటంతో లక్ష్యం సులువైపోయింది. మూడో స్పిన్నర్‌గా జట్టులోకి వచ్చిన కుల్దీప్ యాదవ్ ధారాళంగా పరుగులు ఇచ్చుకోగా... అదనపు పేసర్ ఆకాశ్‌దీప్ లోటు స్పష్టంగా కనిపించింది. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కాగా... తిరిగి వర్షం వచ్చి మ్యాచ్ నిలిచిపోతే బాగుండు అని సగటు భారత క్రీడాభిమాని ఆశించినా అది సాధ్యపడలేదు. క్లిష్టమైన బంతులను కాచుకుంటూనే వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదిన రచిన్, యంగ్ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 75 పరుగులు జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 46; న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 402; భారత్ రెండో ఇన్నింగ్స్ 462; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) బుమ్రా 0; కాన్వే (ఎల్బీ) బుమ్రా 17; యంగ్ (నాటౌట్) 48; రచిన్ రవీంద్ర (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (27.4 ఓవర్లలో 2 వికెట్లకు) 110. వికెట్ల పతనం: 1-0, 2–35. బౌలింగ్: బుమ్రా 8-1-29-2; సిరాజ్ 7–3–16–0; జడేజా 7.4–1–28–0; కుల్దీప్ 3-0–26–0, అశ్విన్ 2–0–6–0.

> ఈ మ్యాచ్ తొలి మూడు గంటలు తప్ప మేం మంచి ప్రదర్శనే చేశాం. అప్పుడప్పుడు ఇలాంటి ఫలితాలు వస్తుంటాయి. వాటిని దాటి ముందుకు వెళ్లాలి. ఈ ఒక్క పరాజయాన్ని బట్టి ప్లేయర్ల సామర్థ్యాన్ని అంచనా వేయకూడదు. తొలి ఇన్నింగ్స్‌లో మా బ్యాటింగ్ బాగా సాగలేదు. రెండో ఇన్నింగ్స్‌లో దాన్ని సరిదిద్దుకున్నాం. ఈ మ్యాచ్‌లో ఓటమి ఎదురైనా చాలా పాఠాలు నేర్చుకున్నాం. శుబ్‌మన్ గిల్ స్థానంలో జట్టులో చోటు దక్కించుకున్న సర్ఫరాజ్ బాధ్యత తీసుకొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఇది జట్టుకు శుభసూచకం. ఇంగ్లండ్‌పై ఇలాగే తొలి టెస్టు ఓడిన తర్వాత పుంజుకుని వరుసగా నాలుగు మ్యాచ్‌లు నెగ్గాం. ఒక మ్యాచ్ ఫలితంతోనో ఒక సిరీస్ ఫలితంతోనో జట్టు దృక్పథం మారదు.
>
> –రోహిత్ శర్మ, భారత కెప్టెన్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో




దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్ట్

కొత్త చాంపియన్ న్యూజిలాండ్

తొలిసారి మహిళల టి20 ప్రపంచకప్ టైటిల్ సొంతం

- వరుసగా రెండోసారి ఫైనల్లో ఓడిన దక్షిణాఫ్రికా జట్టు

ఒక జట్టు తలరాత మారలేదు. పురుషులు, మహిళల జట్టైనా కావొచ్చు కానీ... దక్షిణాఫ్రికా ఐసీసీ ప్రపంచకప్ భాగ్యానికి మాత్రం నోచుకోలేదు. మరో'సారీ' చోకర్స్‌గానే మిగిలారు. మరో జట్టు కొత్త చరిత్ర లిఖించింది. ఇన్నేళ్లయినా న్యూజిలాండ్ పురుషుల జట్టు సాధించలేకపోయిన వరల్డ్‌కప్ (వన్డే, టి20) టైటిల్స్‌ను న్యూజిలాండ్ మహిళల జట్టు (2000లో వన్డే) సాధించి ఔరా అనిపించింది.

దుబాయ్: దక్షిణాఫ్రికాను చూస్తే ఎవరైనా అయ్యో పాపం అనక మానరు! సరిగ్గా నాలుగు నెలల కిందట టీమిండియా చేతిలో పురుషుల జట్టు, ఇప్పుడేమో న్యూజిలాండ్ చేతిలో మహిళల దక్షిణాఫ్రికా టీమ్ ఫైనల్లో పరాజయంతో ప్రపంచకప్ కలను కలగానే మిగిల్చుకున్నాయి. సఫారీకిది తీరని వ్యథే! మరీ ముఖ్యంగా అమ్మాయిలకైతే గతేడాది సొంత గడ్డపై, ఇప్పుడు దుబాయ్‌లో వరుసగా రన్నరప్ ట్రోఫీనే దిక్కయింది. మహిళల టి20 ప్రపంచకప్‌లో ఆదివారం జరిగిన టైటిల్ పోరులో న్యూజిలాండ్ కొత్త విశ్వవిజేతగా అవతరించింది. అమీతుమీలో కివీస్ జట్టు 32 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. మూడో ప్రయత్నంలో టి20 ప్రపంచకప్‌ను దక్కించుకుంది. 2009, 2010లలో న్యూజిలాండ్ ఫైనల్లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. విజేత న్యూజిలాండ్ జట్టుకు 23 లక్షల 40 వేల (రూ. 19 కోట్ల 67 లక్షలు) డాలర్లు, రన్నరప్ దక్షిణాఫ్రికా జట్టుకు 11 లక్షల 70 వేల డాలర్లు (రూ. 9 కోట్ల 83 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్ అమెలియా కెర్ (43; 4 ఫోర్లు), ఓపెనర్ సుజీ బేట్స్ (32; 3 ఫోర్లు), మిడిలార్డర్‌లో బ్రూక్ హ్యాలిడే (28 బంతుల్లో 38; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. ప్రత్యర్థి బౌలర్లలో ఎమ్‌లాబా 2 వికెట్లు తీయగా, అయబొంగ, ట్రియాన్, డి క్లెర్క్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 126 పరుగులే చేసి ఓడిపోయింది. ఓపెనర్లు కెప్టెన్ లౌరా వోల్‌వార్ట్ (33; 5 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (17; 1 ఫోర్) 6.5 ఓవర్లలో 51 పరుగులు చేసి శుభారంభమిచ్చారు. ఇక మిగిలిన 13.1 ఓవర్లలో 108 పరుగులు చేస్తే కప్ గెలిచేసేది. కానీ అదే స్కోరుపై బ్రిట్స్, కాసేపటికి లౌరా అవుట్ కావడంతోనే అంతా మారిపోయింది. తర్వాత వచ్చిన అనెకె (9), మరిజాన్ (8), డి క్లెర్క్ (6), ట్రియాన్ (14), సునె లుస్ (8), డెర్క్‌సెన్ (10) కివీ బౌలర్ల ధాటికి బెంబేలెత్తారు. రోజ్‌మేరీ, అమెలియా కెర్ చెరో 3 వికెట్లు తీశారు. కెర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్' అవార్డులు దక్కాయి.

శభాష్ రిత్విక్

- కెరీర్‌లో తొలి ఏటీపీ టూర్ డబుల్స్ టైటిల్ సొంతం
- అర్జున్ ఖడేతో కలిసి అల్మాటీ ఓపెన్ కైవసం



సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ–అర్జున్ ఖడే (భారత్) ద్వయం తమ కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకుంది. కజకిస్తాన్‌లో ఆదివారం ముగిసిన అల్మాటీ ఓపెన్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)–250 టోర్నీలో రిత్విక్–అర్జున్ జోడీ డబుల్స్ టైటిల్‌ను దక్కించుకుంది. వీరిద్దరి కెరీర్‌లో ఇదే తొలి ఏటీపీ–250 టోర్నీ టైటిల్ కావడం విశేషం. ఒక గంటా 41 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రిత్విక్–అర్జున్ జంట 3–6, 7–6 (7/3), 14–12తో 'సూపర్ టైబ్రేక్'లో నికోలస్ బారింటోస్ (కొలంబియా)–స్కాండర్ మన్సూరి (ట్యూనిషియా) జోడీపై గెలిచింది. విజేతగా నిలిచిన రిత్విక్–అర్జున్‌లకు 54,780 డాలర్ల (రూ. 46 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

6–9తో వెనుకబడి...

తొలి సెట్‌ను కోల్పోయిన రిత్విక్–అర్జున్‌రెండో సెట్‌ను టైబ్రేక్‌లో నెగ్గి నిలిచింది. నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో ఒకదశలో రిత్విక్–అర్జున్ 6–9తో వెనుకబడి ఓటమి అంచుల్లో నిలిచారు. అయితే పట్టుదలతో పోరాడిన రిత్విక్–అర్జున్ స్కోరును సమం చేశారు. చివరకు 14–12తో విజయాన్ని అందుకున్నారు. సాధారణ టైబ్రేక్‌లో తొలుత ఏడు పాయింట్లు సాధించిన వారికి సెట్ లభిస్తుంది. 'సూపర్ టైబ్రేక్'లో మాత్రం తొలుత పది పాయింట్లు నెగ్గిన వారికి విజయం దక్కుతుంది. ఒకవేళ స్కోరు 9–9తో సమమైతే రెండు పాయింట్ల ఆధిక్యం లభించినపుడు గెలుపు ఖరారవుతుంది. 23 ఏళ్ల రిత్విక్ ఈ ఏడాది మూడు ఏటీపీ–250 టోర్నీల్లో (హాంగ్జౌ, అట్లాంటా, న్యూపోర్ట్) ఆడినా తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. అయితే నాలుగో ఏటీపీ–250 టోర్నీలో మాత్రం టైటిల్‌ను అందుకున్నాడు. ఇంతకుముందు రిత్విక్ 10 ఏటీపీ చాలెంజర్ టోర్నీల్లో డబుల్స్ విభాగంలో ఫైనల్‌కు చేరుకున్నాడు. మూడింటిలో టైటిల్స్ నెగ్గి, ఏడింటిలో రన్నరప్‌గా నిలిచాడు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూఐఐసీఎల్, చెన్నైలో 200 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్(యూఐఐసీ)..దేశవ్యాప్తంగా యూఐఐసీ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 200.
» **పోస్టుల వివరాలు:** స్పెషలిస్టులు–100, జనరలిస్టులు–100.
» **విభాగాలు:** రిస్క్ మేనేజ్‌మెంట్, లీగల్ డేటా అనలిటిక్స్,ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్,ఆటోమొబైల్,కెమికల్/మెకాట్రానిక్స్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో సీఏ/సీడబ్ల్యూఏ, డిగ్రీ(లా/బీకామ్), బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంకామ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.50,925 నుంచి రూ.96,765.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.11.2024
» **వెబ్‌సైట్:** https://uiic.co.in/en

ఏపీ మత్స్య శాఖలో డీపీఎం పోస్టులు

ఆంధ్రప్రదేశ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్(ఏపీ ఫిషరీస్) ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) స్కీమ్ కింద ఒప్పంద ప్రాతిపదికన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్(డీపీఎం) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఫిషరీస్ సైన్స్ /జువాలజీ/మెరైన్ సైన్స్/మెరైన్ బయాలజీ/ఫిషరీస్ ఎకనామిక్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.45,000.
» **పని ప్రదేశాలు:** డీఎఫ్‌వో కృష్ణా, బాపట్ల, కర్నూలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.10.2024
» **వెబ్‌సైట్:** https://fisheries.ap.gov.in

ఐఐటీ జమ్మూలో 11 పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జమ్మూ(ఐఐటీ జమ్మూ)లో వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** రిజిస్ట్రార్–01, అసిస్టెంట్ వర్క్‌షాప్ ఆఫీసర్–01, ల్యాబొరేటరీ అసిస్టెంట్–09.
» **విభాగాలు:** అడ్మినిస్ట్రేషన్, సెంట్రల్ వర్క్‌షాప్, టెక్నికల్ క్యాడర్ (సివిల్ /మెకానికల్ /ఎలక్ట్రికల్/కంప్యూటర్ సైన్స్).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** రిజిస్ట్రార్ పోస్టులకు 57 ఏళ్లు, అసిస్టెంట్ వర్క్‌షాప్ ఆఫీసర్ పోస్టులకు 45 ఏళ్లు, ల్యాబొరేటరీ అసిస్టెంట్ పోస్టులకు 33 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రిజిస్ట్రార్ పోస్టులకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసిస్టెంట్ వర్క్‌షాప్ ఆఫీసర్ పోస్టులకు రూ.56,100 నుంచి రూ.1,77,500, ల్యాబొరేటరీ అసిస్టెంట్ పోస్టులకు రూ.29,200 నుంచి రూ.92,300.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/కంప్యూటర్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.11.2024
» **వెబ్‌సైట్:** www.iitjammu.ac.in

ఐపీపీబీలో 344 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ) దేశవ్యాప్తంగా ఉన్న ఐపీపీబీ శాఖల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 344.
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామీణ్ డాక్ సేవక్(జీడీఎస్) ఉద్యోగిగా కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.09.2024 నాటికి 20 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2024
» **వెబ్‌సైట్:** www.ippbonline.com

ఇంటర్ + నీట్.. సక్సెస్‌కు మార్గం!

» 2025 మే నెలలో నీట్-2025 నిర్వహించే అవకాశం
» బోర్డ్, నీట్‌కు ఒకే సమయంలో సంసిద్ధత పొందే అవకాశం
» బేసిక్స్, ప్రాక్టీస్, రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్... నీట్-యూజీ! ఈ ఎంట్రన్స్‌లో ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సహా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది! ఇంటర్ బైపీసీలో చేరిన లక్షల మంది విద్యార్థులు తమ డాక్టర్ కలను నిజం చేసుకునేందుకు నీట్ యూజీకి ప్రిపరేషన్ సాగిస్తున్నారు. నీట్-2025ను మేలో నిర్వహించే అవకాశం ఉంది. దీంతో ఇంటర్మీడియెట్ బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.. ఇటు బోర్డ్ పరీక్షల తోపాటు అటు నీట్‌లో ఉత్తమ ర్యాంకు కోసం సన్నద్ధత కొనసాగించాల్సిన ఆవశ్యకత. ఈ నేపథ్యంలో.. ఇంటర్ + నీట్ యూజీలో విజయానికి మెలకువలు..



బైపీసీ విద్యార్థులు నీట్‌పై ఎక్కువగా దృష్టి పెట్టి.. బోర్డ్ పరీక్షలను తేలిగ్గా తీసుకుంటున్నారనే అభిప్రాయం ఉంది. అయితే ఇది ఎంతమాత్రం సరికాదని, విద్యార్థులు బోర్డ్ పరీక్షలతోపాటు నీట్‌లో స్కోర్ కోసం పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

సమయ పాలన

బోర్డ్ పరీక్షలు, నీట్ యూజీ, ఈఏపీసెట్‌ల ఉమ్మడి ప్రిపరేషన్‌లో అత్యంత ప్రధానమైంది.. సమయ పాలన. నీట్ సిలబస్, బోర్డ్ సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. నీట్, బోర్డ్ సిలబస్‌లో కొన్ని కామన్ టాపిక్స్ ఉన్నాయి. ఆయా అంశాలను బోర్డు పరీక్షల కోసం ప్రిపేరవ్వాలి. నీట్ సిలబస్‌లో మాత్రమే ఉన్న అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించాలి. కామన్ అంశాలకు ప్రిపరేషన్ కొనసాగిస్తూనే.. ప్రత్యేకంగా ఉన్న టాపిక్స్ కోసం నిర్దిష్ట సమయం కేటాయించుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రిపరేషన్ పరంగా రోజూ చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించాలి. టాపిక్స్‌ను విభజించుకొని.. ప్రతి రోజు అధ్యయనం సాగించాలి.

ప్రామాణిక పుస్తకాలు

బైపీసీ + నీట్‌కు ప్రిపేరయ్యే అభ్యర్థులు ప్రామాణిక మెటీరియల్ లేదా పుస్తకాలను అనుసరించాలి. ఫ్యాకల్టీ, నిపుణులు, సీనియర్లను సంప్రదించి మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలి. నీట్ పరీక్ష పూర్తిగా ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగా ఉంటుంది. కాబట్టి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవడం తప్పనిసరి. దీనివల్ల బోర్డ్ పరీక్షలకు కూడా సన్నద్ధత పూర్తవుతుంది

బోర్డ్ పరీక్షలతో సమన్వయం

ఇంటర్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు నీట్ ప్రిపరేషన్‌ను సమాంతరంగా కొనసాగించొచ్చు. ఇంటర్ పరీక్షలకు ఒక నెల సమయం ఉందనగా నీట్ ప్రిపరేషన్‌ను పూర్తిగా పక్కన పెట్టి బోర్డు పరీక్షలపై దృష్టిపెట్టాలి. ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రారంభానికి నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌ను సమన్వయం చేసుకుంటూ చదవాలి.

ఇంటర్ పరీక్షల తర్వాత

ఈ సమయంలో స్వీయ సామర్థ్యాలపై స్పష్టతతో వ్యవహరించాలి. వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువగా అడుగుతున్నారు. కాబట్టి మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్ సమయంలో షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్‌కు ఉపయుక్తంగా ఉంటుంది.

అప్లికేషన్ దృక్పథం

ఇంటర్ బోర్డు ప్రశ్నలకు, నీట్‌లో, ఈఏపీసెట్‌లో అడిగే ప్రశ్నల తీరుకు వ్యత్యాసం ఉంటుంది. నీట్‌లో ప్రశ్నలను అప్లికేషన్ విధానంలో అడుగుతారు. వీటికి సమాధానం గుర్తించాలంటే.. మోడల్ ప్రశ్నలను ఎక్కువ ప్రాక్టీసు చేయాలి. తద్వారా మెరుగైన స్కోరును సాధించవచ్చు. ప్రిపరేషన్ సమయంలో షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. దీన్నివల్ల సమయం ఆదా అవడంతోపాటు ముఖ్యమైన అంశాలపై ఏకాగ్రత నిలిపేందుకు అవకాశం ఉంటుంది. నీట్ బయాలజీ ప్రిపరేషన్‌కు సంబంధించి ఫ్లోచార్ట్‌లు, డయాగ్రామ్స్, షార్ట్ ట్రిక్స్‌ను ఉపయోగించాలి.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

బోర్డ్, నీట్, ఈఏపీసెట్‌ల అంశాలను చదవడం తోపాటు ప్రాక్టీస్ కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రాక్టీస్ సమయంలో.. నీట్, ఈఏపీసెట్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ప్రశ్నపత్రాల సాధనలో చేస్తున్న తప్పులను గుర్తించి విశ్లేషించుకోవాలి. క్లిష్టంగా అనిపించే ప్రశ్నలకు సంబంధించి రివిజన్ సమయంలో తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి.

మాక్ టెస్టులు

బైపీసీ+నీట్ అభ్యర్థులు డిసెంబర్ నుంచి కనీసం నెల రోజులు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. ఇలా చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు పరీక్ష పరంగా స్వీయ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేయొచ్చు. మాక్ టెస్టులో చూపిన ప్రతిభ ఆధారంగా ప్రిపరేషన్ వ్యూహాలను మార్చుకోవాలి. బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. పరీక్షల సమయంలో కొత్త చాప్టర్లు, కొత్త అంశాల జోలికి పోకూడదు. ఆ సమయంలో కేవలం చదివిన వాటినే మళ్లీ మళ్లీ రివిజన్ చేయాలి.

ప్రతి సబ్జెక్ట్ 130 టార్గెట్

నీట్‌లో మంచి స్కోర్ సాధించేందుకు ప్రతి సబ్జెక్ట్‌లో 180మార్కులకు గాను కనీసం 130మార్కులు పొందేలా ప్రిపరేషన్ సాగించాలి. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా కృషి చేయాలి. అదే విధంగా ఈఏపీసెట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 110 మార్కులు స్కోర్ చేసేలా ప్రయత్నించాలి.

ఈఏపీసెట్+నీట్

బోర్డ్ పరీక్షలు ముగిసిన తర్వాత నీట్, ఈఏపీసెట్‌లకు ఉమ్మడి ప్రిపరేషన్ సాగించాలి. నీట్‌కు, ఈఏపీసెట్‌కు మధ్య 20 నుంచి 30 రోజుల వ్యవధి ఉంటుంది. ముందుగా నిర్వహించనున్న పరీక్షపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

సబ్జెక్ట్ వారీగా ముఖ్యాంశాలు

బోటనీ.. కాన్సెప్ట్‌లపై పట్టు

బోటనీకి సంబంధించి ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్ చాప్టర్‌ల కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో.. ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన (సమ విభజన, క్షయకరణ విభజన) లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థను బాగా అధ్యయనం చేయాలి.

జువాలజీ.. ప్రీవియస్ పేపర్స్

జువాలజీలో హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై విద్యార్థులు ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతోపాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. గత ప్రశ్నపత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి.

ఫిజిక్స్

ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో అధ్యాయానికి చివర ఇచ్చిన ప్రశ్నలను సాధించాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. నీట్‌లో ఇంటర్ రెండు సంవత్సరాల సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

కెమిస్ట్రీ.. రివిజన్ ప్రధానంగా

కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీ, ధర్మాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు పునశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. కెమిస్ట్రీలో ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను, వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి మార్కులు పొందొచ్చు.

సాక్షి
ప్రాఫిట్ ప్లస్
సోమవారం
21-10-2024

స్టాక్ మార్కెట్లు

(శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	218	81,225
నిఫ్టీ ▲	104	24,854

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	18,490	▲	116
డోజోన్స్	43,276	▲	37
ఎఫ్‌టీఎస్ఈ 100	8,358	▼	27
డాక్స్	19,657	▲	74
షాంఘై	3,262	▲	92
నికాయ్	38,982	▲	71

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.66	84.68
£	బ్రిటన్ పౌండ్	108.18	111.05
€	యూరో	89.92	92.55
¥	జపాన్ ఎన్ (100)	55.44	56.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.36	57.56
S$	సింగపూర్ డాలర్	61.64	66.33
SAR	సౌదీ రియాల్	21.52	23.07
UAE D	యూఏఈ దిర్హామ్	22.00	23.78
¥	చైనా యువాన్	10.96	12.79

కుటుంబానికి బీమా ధీమా..



- ఆర్జించే వ్యక్తికి కవరేజీ ఎంత ఉండాలి?
- సమ్ అష్యూర్డ్, టర్మ్ ఎంపిక ఎంతో కీలకం
- ఇది అందరికీ ఒకే విధంగా ఉండదు
- తమ అవసరాలు, లక్ష్యాల ఆధారంగా నిర్ణయం
- టర్మ్‌ప్లాన్‌తో మెరుగైన రక్షణ
- ఇందులోనూ పలు రకాలు, రైడర్లు
- కోరుకున్నట్టుగా పరిహారం చెల్లింపులు

షణ్ముఖ్, నిత్య దంపతులకు ఇద్దరు పిల్లలు. షణ్ముఖ్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. నిత్య గృహిణి. ఎలాంటి ఆర్థిక ఇబ్బందుల్లేవు. సంతోషంగా ఉన్న ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం చిచ్చు పెట్టింది. షణ్ముఖ్ పేరిట లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు రెండున్నాయి. ఆ రెండింటి నుంచి వచ్చిన మొత్తం కేవలం రూ.15 లక్షలు. కుటుంబ జీవన అవసరాలకు ఈ మొత్తం చాలదని తెలియడంతో.. బాధను దిగమింగుకుని నిత్య ప్రైవేటు ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. జీవిత బీమా రక్షణ లేని వారు కొందరు అయితే.. ఉన్నా తగినంత కవరేజీతో సరైన ప్లాన్ తీసుకోని వారే ఎక్కువ. ఇలాంటి వారికి షణ్ముఖ్ కేసు కనువిప్పు కలిగిస్తుంది. సరైన బీమా పథకాన్ని, తగినంత కవరేజీతో తీసుకున్నప్పుడే దాని లక్ష్యం, ఉద్దేశం నెరవేరుతుంది. ఈ దిశగా అవగాహన కల్పించే కథనమే ఇది...

- సాక్షి, బిజినెస్ డెస్క్



తమపై ఎవరైనా ఆర్థికంగా ఆధారపడి ఉంటే, అలాంటి ప్రతి ఒక్కరూ జీవిత బీమా రక్షణను (పాలసీ) తప్పకుండా తీసుకోవాలి. ఆర్జించే వ్యక్తి దురదృష్టవశాత్తూ మరణించిన సందర్భాల్లో వారి కుటుంబం జీవన అవసరాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా జీవిత బీమా పరిహారం సాయంగా నిలుస్తుంది. కానీ, ఇదంతా సరైన, సరిపడా రక్షణ తీసుకున్నప్పుడే అని తప్పకుండా దృష్టిలో పెట్టుకోవాలి. తమ విలువైన జీవితంపై చేస్తున్న అసలైన పెట్టుబడిగా అర్థం చేసుకోవాలి.

కవరేజీ ఎంత?

ఏజెంట్ లేదా బ్రోకర్ చెప్పిన మేరకు లేదా ప్రీమియం తమకు సౌకర్యంగా అనిపించిన మేరకు జీవిత బీమా కవరేజీని ఎక్కువ మంది తీసుకుంటుంటారు. కానీ, ఇది సరైన విధానం కాదు. ఎంత లేదన్నా వార్షిక ఆదాయానికి కనీసం 10 రెట్ల మొత్తం జీవిత బీమా రక్షణగా తీసుకోవాలన్నది ప్రాథమిక సూత్రం. అలాగే, వార్షిక ఆదాయానికి 25 రెట్ల వరకు కవరేజీని ఎంపిక చేసుకోవచ్చు. 20 రెట్లు మధ్యస్థంగా ఉంటుంది. ఒకవేళ రుణాలు తీసుకుని ఉంటే ఆ మేరకు కవరేజీని అదనంగా ఎంపిక చేసుకోవాలి. ఉదాహరణకు వార్షికాదాయం రూ.12 లక్షలు ఉంటే, కనీసం రూ.1.2 కోట్ల సమ్ అష్యూర్డ్‌తో టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. ఇల్లు, కారు లేదా వ్యక్తిగత రుణాలు రూ.10 లక్షలు ఉన్నాయనుకుంటే.. అప్పుడు రూ.1.2 కోట్లకు బదులు రూ.1.3 కోట్లను ఎంపిక చేసుకోవాలి. దురదృష్టవశాత్తు పాలసీదారు మరణించినట్టయితే బీమా సంస్థ చెల్లించే పరిహారంతో అప్పులు తీర్చి, మిగిలిన మొత్తంతో కుటుంబం సాఫీగా జీవించడానికి అవకాశం ఉంటుంది.



సరిపోతుందా..?

ఇంతకు ముందు ఉదాహరణలో వార్షిక ఆదాయం రూ. 12 లక్షలకు పది రెట్లు అంటే రూ.1.2 కోట్లకు టర్మ్ లైఫ్ ప్లాన్ తీసుకున్న తర్వాత.. పాలసీదారు మరణించినట్టయితే వచ్చే పరిహారం కుటుంబానికి సరిపోతుందా..? ఇక్కడ రూ.1.2 కోట్ల డిపాజిట్‌పై 6 శాతం వార్షిక రేటు ఆధారంగా వచ్చే మొత్తం రూ.7.2 లక్షలు మించదు. అంటే అప్పటి వరకు వచ్చిన వార్షికాదాయం కంటే తక్కువ. తమకు ఏదైనా జరిగినా.. ఎప్పటి మాదిరే కుటుంబ జీవనం సాఫీగా సాగిపోవాలంటే ఇక్కడ రూ. 2.4 కోట్లకు బీమా రక్షణను (సమ్ అష్యూర్డ్) తీసుకోవాలి. ఉదాహరణకు షణ్ముఖ్ వయసు 30 ఏళ్లు. ప్రస్తుత వార్షికాదాయం రూ.12 లక్షలకు 20 రెట్ల చొప్పున రూ.2.4 కోట్లకు టర్మ్ లైఫ్ కవరేజీ తీసుకున్నాడని అనుకుందాం. 40 ఏళ్లకు వచ్చే సరికి షణ్ముఖ్ వార్షికాదాయం రూ.24 లక్షలకు పెరిగింది. ఈ ప్రకారం చూస్తే పదేళ్ల క్రితం తీసుకున్న టర్మ్ ప్లాన్‌లో రక్షణ వార్షిక ఆదాయానికి పది రెట్లకు తగ్గిపోయిందని తెలుస్తోంది. వయసు పెరిగే కొద్దీ జీవితంలో బాధ్యతలు, ఖర్చులు పెరుగుతాయని తెలిసిందే. కనుక పెరుగుతున్న ఆదాయానికి, జీవన వ్యయాలకు అనుగుణంగా బీమా కవరేజీ కూడా పెరిగేలా చూసుకోవాలి. సొంతిల్లు, పిల్లలకు మెరుగైన విద్య అన్నవి తల్లిదండ్రులకు ఎంతో ముఖ్యమైన లక్ష్యాలు. ఇంటికి ఆధారమైన వ్యక్తి మరణించినప్పుడు వచ్చే పరిహారం కేవలం ఆ కుటుంబ జీవన అవసరాలే కాదు, ముఖ్యమైన జీవిత లక్ష్యాల సాకారానికీ తోడ్పాటునివ్వాలి. అందుకని వాటికయ్యే వ్యయాలను కూడా కవరేజీని నిర్ణయించుకునే విషయంలో పరిగణనలోకి తీసుకోవాలి.



ఎప్పుడు తీసుకోవాలి..?

"వివాహం అయిన తర్వాత లేదా పిల్లలు కలిగిన తర్వాత టర్మ్ ప్లాన్ తీసుకోవాలనే ధోరణి సరికాదు. ఎంత వీలైతే అంత ముందుగా టర్మ్ ప్లాన్ కొనుగోలు చేయడం మంచిది. దీనివల్ల ప్రీమియం తక్కువగా ఉంటుంది. అంతేకాదు పాలసీ పూర్తి కాలానికి అదే కొనసాగుతుంది" అని ఆనంద్‌రాఠి ఇన్సూరెన్స్ బ్రోకర్స్‌కు చెందిన దినేష్ దిలీప్ భోయ్ సూచించారు. వీలైనంత ముందుగా అంటే.. సంపాదన మొదలు పెట్టిన వెంటనే అని అర్థం చేసుకోవచ్చు. జీవితంలో స్థిరపడడంలో ఆలస్యమైన వారు.. కనీసం తమ సంపాదన మొదలైన మొదటి 30 రోజుల్లో అయినా టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవడం మరిచిపోవద్దు. సాధారణంగా 18 సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయసు వారు టర్మ్ ప్లాన్ తీసుకోవచ్చు. ఆలస్యం చేసిన కొద్దీ వయసుతోపాటు ప్రీమియం పెరుగుతుంది. పైగా నేటి రోజుల్లో చిన్న వయసులోనే జీవనశైలి వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ తదితర సమస్యలు కనిపిస్తున్నాయి. ఆరోగ్యంగా ఉన్నప్పుడు జీవిత బీమా తీసుకోవడాన్ని నిర్లక్ష్యం చేసి, అనారోగ్య సమస్యలు పలకరించిన తర్వాత తీసుకోవాలంటే అధిక ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. ఆరోగ్య వంతులతో పోల్చితే ప్రీమియం 20–50 శాతం అధికంగా పడుతుంది. కొన్ని సందర్భాల్లో రిస్క్ మరీ ఎక్కువ ఉంటుందని బీమా సంస్థలు భావిస్తే బీమా కవరేజీని తిరస్కరించే అవకాశం కూడా లేకపోలేదు.



ఎంత కాలానికి?

జీవిత బీమా తీసుకోవడం ఎంత ముఖ్యమో, ఎంత వయసు వచ్చే వరకు ఈ రక్షణ ఉండాలన్నది కూడా ముఖ్యమైన అంశమే అవుతుంది. మనలో చాలా మంది ఇక్కడే తప్పు చేస్తుంటారు. ఎక్కువ మంది 20–25 ఏళ్ల కాలానికే రక్షణను ఎంపిక చేసుకుంటుంటారు. ఉదాహరణకు 25 ఏళ్ల వ్యక్తి 25 ఏళ్ల కాలానికి జీవిత బీమా కవరేజీ తీసుకున్నారని అనుకుంటే.. అతడికి/ఆమెకు 50 ఏళ్లు వచ్చే సరికి ఆ రక్షణ ముగిసిపోతుంది. దీంతో అక్కడి నుంచి మళ్లీ కొంత కాలానికి మరో పాలసీ కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీనివల్ల ప్రీమియం భారంగా మారుతుంది. ప్లాన్ తీసుకునే నాటికి తమ వయసు ఎంతన్నది పరిగణనలోకి తీసుకోవాలి. ఎంతలేదన్నా రిటైర్మెంట్ వరకు (60 ఏళ్లు) జీవిత బీమా కవరేజీ ఉండాలి. కొందరికి ఆలస్యంగా వివాహం కావచ్చు. అంటే 30–45 ఏళ్ల మధ్యలో వివాహం చేసుంటే.. 60 ఏళ్లు వచ్చినా పిల్లలకు సంబంధించి, కుటుంబ బాధ్యతలు ఇంకా మిగిలి ఉంటాయి. పిల్లలకు కనీసం 23–25 ఏళ్ల వయసు వచ్చే వరకు అయినా తమకు టర్మ్ కవరేజీ ఉండేలా చూసుకోవడం సరైనది. రిటైర్మెంట్ నాటికి లేదా జీవితంలో అన్ని ముఖ్యమైన బాధ్యతలు తీరే నాటికి బీమా కవరేజీ ఉంటే సరిపోతుంది.

టర్మ్ ప్లాన్ అంటే అచ్చమైన బీమా రక్షణతో కూడిన పాలసీ కదా? అన్న సందేహం రావచ్చు. అవును టర్మ్ ప్లాన్ ఉద్దేశంఅదే. కానీ, వినియోగదారుల ధోరణి, అంచనాలు, అవసరాలకు అనుగుణంగా ఇందులోనూ పలు రకాలు వచ్చాయి. సంప్రదాయ ఎండోమెంట్ ప్లాన్లలో బీమా రక్షణతోపాటు, పాలసీ గడువు ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉన్నా కానీ రాబడి ప్రయోజనం లభిస్తుంది. అంటే అది బీమా, పెట్టుబడి కలిసిన సాధనం. టర్మ్ ప్లాన్ ఎలాంటి రాబడి ఇవ్వని.. కేవలం మరణించిన సందర్భాల్లోనే (పాలసీ కాల వ్యవధిలో) పరిహారం చెల్లించేది. కానీ, పాలసీ గడువు ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం నుంచి జీఎస్టీ మినహాయించి మిగిలిన మొత్తాన్ని వెనక్కిచ్చే టర్మ్ ప్లాన్లు మార్కెట్లోకి ప్రవేశించాయి. టర్మ్ ఇన్సూరెన్స్ విత్ రిటర్న్ ఆఫ్ ప్రీమియం (టీఆర్‌వోపీ)గా దీన్ని పిలుస్తారు.

లెవల్ టర్మ్ ఇన్సూరెన్స్: ఇది అందరికీ తెలిసిన ప్లాన్. కాల వ్యవధి పూర్తయ్యే వరకు కవరేజీ స్థిరంగా ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల కాలానికి రూ.50 లక్షల కవరేజీతో ప్లాన్ తీసుకుంటే, కాల వ్యవధి ముగిసే వరకు రూ.50 లక్షల కవరేజీయే కొనసాగుతుంది.

ఎలాంటి టర్మ్ ప్లాన్?



ఇంక్రీజింగ్ టర్మ్ ఇన్సూరెన్స్: ఇందులో సమ్ అష్యూర్డ్ స్థిరంగా ఉండదు. నిర్ణీత కాలానికోసారి పెరుగుతూ పోతుంది. దీనివల్ల ద్రవ్యోల్బణం నుంచి పరిహారానికి హెడ్జింగ్ లభిస్తుంది. అంతేకాదు పెరిగే వయసుకు తగ్గట్టు బాధ్యతలు కూడా అధికమవుతుంటాయి. ఈ విధంగానూ అదనపు రక్షణ అక్కరకు వస్తుంది.

డిక్రీజింగ్ టర్మ్ ఇన్సూరెన్స్: ఇంక్రీజింగ్ ప్లాన్‌కు వ్యతిరేకంగా ఇది పనిచేస్తుంది. నిర్ణీత కాలానికోసారి కవరేజీ తగ్గుతూ వెళుతుంది. ఉదాహరణకు ఏదైనా లోన్ తీసుకుని, దానికి రక్షణ కోసం టర్మ్ ప్లాన్ తీసుకున్నారని అనుకుందాం. కొంత కాలానికి రుణ భారం తగ్గిపోతుంది. దీనికి అనుగుణంగా బీమా రక్షణ తగ్గేలా ఈ ప్లాన్ ఉపయోగపడుతుంది.

కన్వర్టబుల్ టర్మ్ ఇన్సూరెన్స్: ఇందులో టర్మ్ ప్లాన్‌ను ఎండోమెంట్ లేదా హోల్‌లైఫ్ పాలసీగా మార్చుకోవచ్చు.

హోల్ లైఫ్ ఇన్సూరెన్స్: నూరేళ్ల కాలానికి ఈ ప్లాన్‌లో రక్షణ లభిస్తుంది.

నోట్: టర్మ్ ప్లాన్‌లో ఎన్ని రకాలున్నా.. అచ్చమైన టర్మ్ ప్లాన్ (లెవల్ టర్మ్‌ఇన్సూరెన్స్) సులభమైనది. మిగిలిన వాటిల్లో తమకు ఏదైనా మరింత ప్రయోజనం అనిపిస్తే దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. లెవల్ టర్మ్ ప్లాన్‌లో కాల వ్యవధి ముగిసే వరకు ప్రీమియం మారదు. ఇంక్రీజింగ్ టర్మ్ ప్లాన్‌లో, కన్వర్టబుల్, హోల్‌లైఫ్ ప్లాన్లలో ప్రీమియం అధికంగా ఉంటుంది. సాధారణ లెవల్ టర్మ్ ప్లాన్‌తో పోల్చితే రిటర్న్ ఆఫ్ ప్రీమియం ప్లాన్‌లోనూ ప్రీమియం చాలా ఎక్కువగా ఉంటుంది.

రైడర్లు..

టర్మ్ ప్లాన్‌కు అనుబంధంగా పలు రైడర్లను బీమా సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్: కేన్సర్, కాలేయ వైఫల్యం తదితర 20 నుంచి 64 వరకు తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడినప్పుడు ఈ రైడర్ నుంచి ఏక మొత్తంలో పరిహారం లభిస్తుంది. ఈ రైడర్‌లో ఎన్నింటికి కవరేజీ అన్నది బీమా సంస్థలను బట్టి మారుతూ ఉంటుంది.

వేవర్ ఆఫ్ ప్రీమియం: ప్రమాదంలో అంగవైకల్యం పాలైనా లేక తీవ్ర వ్యాధుల బారిన పడినా ఇక అక్కడి నుంచి పాలసీదారు ప్రీమియం చెల్లించే అవసరాన్ని ఇది తప్పిస్తుంది. బీమా సంస్థే మిగిలి ఉన్న కాలానికి ప్రీమియం చెల్లిస్తుంది.

యాక్సిడెంటల్ డెత్, టోటల్, పర్మనెంట్ డిజేబిలిటీ రైడర్: ప్రమాదంలో మరణించినా లేదా అంగవైకల్యం పాలైనా ఈ రైడర్‌లో ఎంపిక చేసుకున్న మేర పరిహారం పొందొచ్చు.



పరిహారం చెల్లింపు ఎలా..?

పాలసీదారు మరణించినప్పుడు పరిహారం చెల్లింపులో పలు ఆప్షన్లను టర్మ్ ప్లాన్లు ఆఫర్ చేస్తుంటాయి.

- ఎంపిక చేసుకున్న సమ్ అష్యూర్డ్ మొత్తాన్ని ఒకే విడత చెల్లించడం ఇందులో ఒకటి.
- సమ్ అష్యూర్డ్‌లో 50 శాతాన్ని ఏకమొత్తంగా చెల్లించి, మిగిలిన 50 శాతాన్ని సమాన వాయిదాల్లో కొన్ని సంవత్సరాల పాటు చెల్లించడం మరో ఆప్షన్.
- సమ్ అష్యూర్డ్‌లో కొంత మొత్తాన్ని ఒకే విడత చెల్లించి, మిగిలిన మొత్తాన్ని నెలవారీగా పెంచుతూ చెల్లించడం మూడో ఆప్షన్.



చిట్కాలు

- తగినంత కవరేజీ ఎంపిక చేసుకున్న తర్వాత.. అందుకు ఏటా చెల్లించే ప్రీమియం తమ సామర్థ్యం మేరకే ఉండేలా చూసుకోవాలి. ప్రీమియం చెల్లించలేనంత భారంగా మారకూడదు. ప్రీమియం చెల్లించలేక పాలసీ మధ్యలో లాప్స్ అయ్యే రిస్క్ ఉంటుంది. అందుకని తగినంత బీమా రక్షణ ఒక్కటే కాదు, తమ చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి.
- ఏదో ఒక కంపెనీ నుంచి పాలసీ తీసుకోవడం కాకుండా, వివిధ కంపెనీల మధ్య ఫీచర్లు, ప్రీమియం రేట్లను పరిశీలించి చూసుకోవాలి.
- టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌కు అనుబంధంగా వచ్చే రైడర్లు, యాడాన్‌లను తప్పకుండా పరిశీలించాలి. ముఖ్యంగా యాక్సిడెంటల్ డిజేబిలిటీ రైడర్‌ను తీసుకోవడం ఎంతో అవసరం.
- ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌లో పాలసీ తీసుకుంటే ప్రీమియంలో కొంత తగ్గింపు లభిస్తుంది.
- పెరుగుతున్న జీవన అవసరాలకు అనుగుణంగా, అదనపు రుణం తీసుకున్న ప్రతి సందర్భంలో ఆ మేరకు బీమా కవరేజీని పెంచుకోవాలి.
- ఎంపిక చేసుకునే బీమా సంస్థ, క్లెయిమ్‌లను ఏ మేరకు ఆమోదిస్తుందో తప్పకుండా పరిశీలించాలి. దీర్ఘకాలంలో మెరుగైన చెల్లింపుల చరిత్ర ఉన్న సంస్థను ఎంపిక చేసుకోవాలి.

ఫండ్ స్ట్రీట్

బరోడా బీఎన్‌పీ పారిబా నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్

ఈ న్యూ ఫండ్ ఆఫర్‌ను బరోడా బీఎస్‌పీ పారిబా మ్యుచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఇది అక్టోబర్ 24న ముగుస్తుంది. అధిక వృద్ధి అవకాశాలున్న మిడ్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఇన్వెస్టర్లకు ఇది ఉపయోగపడుతుంది. దీనికి నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 టోటల్ రిటర్న్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. క్యాపిటల్ గూడ్స్, కెమికల్స్, రియల్ ఎస్టేట్, టెక్స్‌టైల్స్ తదితర రంగాల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను అందిస్తుంది. గత పదిహేనేళ్లుగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 టీఆర్ఐలో నెలవారీగా రూ. 10,000 సిప్ చేస్తే దాని విలువ ప్రస్తుతం రూ. 1 కోటికి పైగా ఉంటుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

శ్రీరామ్ లిక్విడ్ ఫండ్

ఈ ఓపెన్ ఎండెడ్ లిక్విడ్ స్కీమ్‌ను శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నవంబర్ 4న ప్రారంభిస్తోంది. ఇది నవంబర్ 8న ముగుస్తుంది. కనీస పెట్టుబడి మొత్తం రూ. 1,000గా ఉంటుంది. తక్కువ నుంచి ఒక మోస్తరు స్థాయి రిస్కులతో అధిక లిక్విడిటీ ఉండే డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందించడం ఈ ఫండ్ లక్ష్యం. ఇది ఏ1 ప్లస్ రేటెడ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్, కమర్షియల్ పేపర్స్, టీ–బిల్స్, గవర్నమెంట్ సెక్యూరిటీస్, మనీ మార్కెట్ ఎస్‌సీడీల్లో ఒడిదుడుకులు తక్కువగా ఉంటాయని, పెట్టుబడికి భద్రత ఉంటుందని సంస్థ ఎండీ కార్తీక్ ఎల్ జైన్ తెలిపారు. స్థిరత్వం, లిక్విడిటీ, అధిక రాబడుల అవకాశాల మేళవింపుతో ఈ ఫండ్ ఉంటుందని వివరించారు. సేవింగ్స్ అకౌంట్ల కన్నా మెరుగైన రాబడులు పొందేందుకు ఇది ఉపయోగపడగలదని పేర్కొన్నారు.

సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 588
టార్గెట్: రూ. 720

ఎందుకంటే: దేశీయంగా బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ(ఎన్‌బీఎఫ్‌సీ)లు, ఈకామర్స్, రిటైల్ రంగ కంపెనీలకు ప్రధానమైన భాగస్వామిగా సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ ఆవిర్భవించింది. ఏడు బిజినెస్ విభాగాలలో కీలకమైన సర్వీసులు, సొల్యూషన్లను సమకూర్చుతోంది. గత మూడేళ్లుగా(2021–24) ఆర్థిక ఫలితాల్లో పటిష్ట వృద్ధిని సాధిస్తోంది. వార్షిక ప్రాతిపదికన ఆదాయంలో 20 శాతం, నికర లాభాల్లో 27 శాతం చొప్పున పురోగతిని అందుకుంది. ఇందుకు 26.5 శాతం నిర్వహణ లాభ(ఇబిటా), 15.3 శాతం నికర లాభ మార్జిన్లు దోహదం చేశాయి. వెరసి గతేడాది ఆర్‌వోఐసీ 24 శాతాన్ని అధిగమించింది. క్లిష్టతర సర్వీసులు అందించడం ద్వారా ప్రత్యర్థుల కంటే మెరుగైన పరిస్థితిలో నిలుస్తోంది. దీనికితోడు.. ఇతర సంస్థలు ప్రవేశించేందుకు పలు సవాళ్లు ఎదురయ్యే విభాగంలో సేవలు అందిస్తుండటం ద్వారా బీటూబీ ప్లాట్‌ఫామ్‌గా ఆధిపత్యం వహించే లక్ష్యంతో సాగుతోంది. ఏటీఎం ఎకోసిస్టమ్(వ్యవస్థ)కు వెలుపల విభాగాలలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. దీంతో కంపెనీ మరింత మరింత వృద్ధి బాటలో సాగడం ద్వారా షేరుకి డిమాండ్ పెరిగే అవకాశముంది. రానున్న మూడేళ్లలో కంపెనీ ఆదాయం 14 శాతం, సర్దుబాట్ల తదుపరి నికర లాభం 13 శాతం చొప్పున వార్షిక పురోగతి సాధించగలవని భావిస్తున్నాం.



మెడ్‌ప్లస్ హెల్త్ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 682
టార్గెట్: రూ. 820

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2023–24) వార్షిక నివేదికలో మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ కీలక వృద్ధి విభాగాలను ప్రత్యేకంగా వివరించింది. ప్రధాన మార్కెట్లలో మరింత లోతుగా విస్తరించడం, టైర్–2 పట్టణాలకు అవతల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టడం, నిర్వహణ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, నిల్వల(ఇన్వెంటరీ) నిర్వహణను పటిష్టపరచడం వంటి అంశాలను ప్రస్తావించింది. కంపెనీ స్టోర్లలో 50 శాతంవరకూ ముందు ప్రస్తావించిన మార్కెట్లలోనే విస్తరించి ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో 600కుపైగా కొత్త స్టోర్లను జత కలుపుకోవాలని ప్రణాళికలు వేసింది. మరిన్ని ప్రొడక్టులు, కార్యకలాపాల విస్తరణ ద్వారా ప్రయివేట్ లేబుల్ విక్రయాల వాటాను పెంచుకోవాలని చూస్తోంది. మెడ్‌ప్లస్ బ్రాండుతో సొంత బ్రాండెడ్ జనరిక్ ఔషధాల మార్కెటింగ్‌ను పెంచుకునే యోచనలో ఉంది. గతేడాది(2023–24) స్థూల మెర్కండైజ్(అమ్మకాలు) విలువ రూ. 747 కోట్లను తాకింది. దీనిలో జీఎంవీ ప్రాతిపదికగా చూస్తే ఫార్మసీ అమ్మకాల వాటా 10.7 శాతానికి చేరింది. నికర అమ్మకాలలో ఈ వాటా 8.3 శాతంగా నమోదైంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
స్టాక్ మార్కెట్లను నిర్దేశించనున్న కార్పొరేట్ ఫలితాలు
మళ్లీ భారత మార్కెట్లోకి అమెరికన్ హోమ్ కేర్ బ్రాండ్... బిసెల్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-10-2024

విశాఖ	510-00
చిత్తూరు	548-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఏ సాధనంలో ఇన్వెస్ట్ చేయాలి?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

నా వద్ద రూ.12 లక్షలు ఉన్నాయి. ఐదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఈ మొత్తాన్ని ఎక్కడ, ఏ విధంగా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు?

– సుర్జిత్ సింగ్

ఇప్పటి వరకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయకపోతే అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి 65 శాతం వరకు ఈక్విటీల్లో, మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మూడింట ఒక వంతు డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల రాబడుల్లో స్థిరత్వం ఉంటుంది.

మార్కెట్ల పతనాల్లో అచ్చమైన ఈక్విటీ పథకాల మాదిరి, ఈ ఫండ్స్ మరీ అంత నష్టాలను నమోదు చేయవు. ఇక మీ వద్దనున్న రూ.12లక్షలను ఈ ఫండ్స్‌లో ఒకే విడతలో పెట్టేయకూడదు. 12 నెలసరి సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు వ్యయం సగటుగా మారుతుంది. ఈక్విటీ ఆటుపోట్లను తట్టుకునేందుకు సాయపడుతుంది. ఒకే విడత రూ.12 లక్షలు ఇన్వెస్ట్ చేశారనుకోండి.. ఆ తర్వాత ఈక్విటీలు 20 శాతం పడిపోయినా నష్టం ఎక్కువగా ఉంటుంది. దాంతో ఆందోళనకు గురికావొచ్చు. ఏడాది కాలం పాటు సిప్ రూపంలో రూ.12 లక్షలను ఇన్వెస్ట్ చేయడం వల్ల విశ్వాసం కూడా పెరుగుతుంది.

ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో లార్జ్‌క్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ విభాగంలో ఏ పథకాలను ఎంపిక చేసుకోవాలి.

– శిల్పారామన్

దీర్ఘకాలంలో ఏ విభాగం మంచి పనితీరు చూపిస్తుందన్నది ఊహించడం కష్టం. ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నప్పుడు కాల వ్యవధి కనీసం ఐదేళ్లకు తగ్గకుండా ఉండాలి. కొన్ని సందర్భాల్లో లార్జ్‌క్యాప్ కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయి. కొన్ని సందర్భాల్లో మిడ్‌క్యాప్ స్టాక్స్ మంచి ప్రదర్శన చేస్తాయి. కొన్ని సందర్భాల్లో స్మాల్‌క్యాప్ ఇంకా మంచి రాబడులను ఇస్తుంటాయి. కనుక అన్నింటిలో ఇన్వెస్ట్ చేసే ఫ్లెక్సీక్యాప్ ఫండ్ ఎంపిక చేసుకోవడం మంచిది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు ఏ విభాగంలో అయినా ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఉంటుంది. మార్కెట్ సైకిల్‌లో ఒక విభాగం మంచి పనితీరు, మరో విభాగం బలహీన పనితీరు చూపిస్తున్న సందర్భాల్లో ఫ్లెక్సీక్యాప్ పథకం తో ఆ సైకిల్‌ను అధిగమించగలరు.



చర్లపల్లి టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన చిత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

త్వరలో చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం

ఆధునిక సదుపాయాలతో సేవలు: కిషన్‌రెడ్డి • టెర్మినల్‌ను సందర్శించిన కిషన్‌రెడ్డి, ఈటల

సాక్షి, హైదరాబాద్/కుషాయిగూడ: హైదరాబాద్‌లో నాలుగో టెర్మినల్‌గా అభివృద్ధి చేసిన చర్లపల్లి టెర్మినల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. టెర్మినల్‌కు ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రహదారులతో అనుసంధానం చేయాల్సి ఉందని చెప్పారు. రోడ్ల నిర్మాణం, విస్తరణ పనుల్లో జాప్యం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన ఆదివారం చర్లపల్లి టెర్మినల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రూ.430 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో ప్రాజెక్టును పూర్తిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాళ్లు, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియాలు, రెస్టారెంట్లు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లు, ఈవీ చార్జింగ్ పాయింట్లు తదితర అన్ని సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. 98 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూ.715 కోట్ల వ్యయంతో 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. విమానాశ్రయాన్ని తలపించేలా చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసినందుకు ప్రధాని మోదీకి, రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, నిర్మాణ విభాగ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్య, సికింద్రాబాద్ డివిజన్ డివిజినల్ రైల్వే మేనేజర్ భరతేశ్ కుమార్ జైన్ పాల్గొన్నారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

'శ్రీశైలం' బిరబిరా



దోమలపెంట: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ఆదివారం శ్రీశైలం ఆనకట్ట వద్ద ఆరు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. రాత్రి 7 గంటల సమయంలో జూరాల గేట్ల ద్వారా 94,554 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 33,814, సుంకేశుల నుంచి 67,312, హంద్రీ నుంచి 250 మొత్తం 1,95,929 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఆరు గేట్లు 10 మీటర్ల మేర ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,67,898 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,698 అదనంగా మరో 66,013 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 884.8 అడుగుల వద్ద 214.8450 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

'సాగర్' గలగల



నాగార్జునసాగర్: ఎగువ నుంచి సాగర్ జలాశయానికి వరద పెరగడంతో 20 రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 2,47,182 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయిలో ఉంది. వచ్చిన నీటిని వచ్చినట్లే సాగర్ జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. 14 గేట్లు 5 అడుగుల మేర, 6 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి స్పిల్‌వే మీదుగా 2,02,404 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 28,826 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా 15,952 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'మూసీ' తొణికిస



కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు నాలుగు క్రస్టు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఆదివారం 1,429 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్ ప్రస్తుతం 643.60 అడుగుల వద్ద ఉంది. మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలో ఉండటంతో అధికారులు నాలుగు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 2,604 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటు కుడి కాల్వ ద్వారా 96 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 120 క్యూసెక్కులు మొత్తం 2,873 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.210 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్ తెలిపారు.



సమిధలవుతున్న సమరాంగనలు

ఆపరేషన్ కగార్‌తో నేలకొరుగుతున్న ఆదివాసీ మహిళలు

- బస్తర్‌లో పెరిగిన ఎదురుకాల్పులు
- ఎన్‌కౌంటర్లలో భారీగా సాయుధ మహిళల మరణం
- వెనుకబాటుతనంతో ఉద్యమం వైపు ఆదివాసీ స్త్రీలు
- ఇరవై ఏళ్లలో సాయుధ దళాల్లో భారీగా చేరిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులను నిర్మూలించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఆపరేషన్ కగార్ అమల్లో.. ఈ ఏడాది ఆరంభం నుంచి కేంద్ర ప్రభుత్వం వేగం పెంచింది. దీంతో బస్తర్ అడవుల్లో ఎన్‌కౌంటర్లు నిత్యకృత్యంగా మారాయి. అయితే, ఈ ఎదురు కాల్పుల్లో మహిళా మావోయిస్టులు ఎక్కువగా చనిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ప్రభుత్వ వ్యతిరేకతతోనే దళాల్లోకి..

ఆది నుంచీ విప్లవ పోరాటాలు మహిళలకు ప్రాధాన్యమిస్తూనే వచ్చాయి. సాధారణ మహిళల సమస్యలకు తోడు.. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా ఎదుర్కొనే ఇబ్బందులపై మార్క్సిస్టు పార్టీలు గళం విప్పాయి, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇదే విధానాన్ని నాటి నక్సలైట్లు, నేటి మావోయిస్టులు అనుసరించారు. అయితే మార్క్సిస్టు విధానం చెప్పే సామాజిక మార్పులపై ఆకర్షితులైన మహిళలు ఆరంభంలో చేతన నాట్యమంచ్ (సీఎన్‌ఎం), దండకారణ్య క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘాల్లోనే ఎక్కువగా ఉండేవారు. కానీ 2006లో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఛత్తీస్‌గఢ్ సర్కారు నెలకొల్పిన సల్వాజుడుం, అందులోని కొందరు స్పెషల్ పోలీస్ అధికారులు (ఎస్పీవోలు) అడవుల్లోని ఆదివాసీ గూడేలపై దాడి చేసి గ్రామాలను తగులబెట్టడం, అక్కడ కనిపించిన మహిళలపై అకృత్యాలకు పాల్పడటం వంటివి చేశారు. దీంతో ప్రభుత్వ బలగాలపై ఆదివాసీ మహిళల్లో వ్యతిరేకత పెరిగింది. ఫలితంగా ఆదివాసీ స్త్రీలలో దళాల్లోకి చేరాలన్న ఆసక్తి పెరగడంతో.. మావోయిస్టు సాయుధ దళాల్లో మహిళల సంఖ్య ఎక్కువైంది.



40 శాతం మహిళలు

ఇరవై ఏళ్ల చరిత్ర కలిగి మావోయిస్టు పార్టీ సాయుధ దళాల్లో ప్రస్తుతం 40 శాతం మేర మహిళలున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆపరేషన్ కగార్ ప్రారంభించడానికి ముందు ఛత్తీస్‌గఢ్ పోలీసులు వివిధ సందర్భాల్లో వెల్లడించిన వివరాల ప్రకారం సుమారు 2,500 మంది సాయుధ మావోయిస్టులు ఉండగా.. ఇందులో మహిళల సంఖ్య సుమారు వెయ్యికి పైగానే ఉన్నట్టు సమాచారం. ఇందులో దక్షిణ బస్తర్ డివిజన్ ప్రాంతంలో 300కు పైగా, పశ్చిమ బస్తర్‌లో 150 మందికి పైగా, ఉత్తర బస్తర్ డివిజన్‌లో 100 మందికి పైగా మహిళా మావోయిస్టులున్నట్టు సమాచారం. ఇక మావోయిస్టుల షెల్టర్ జోన్‌గా పరిగణించే మాడ్ డివిజన్‌లో 350 మంది వరకు మహిళా మావోయిస్టులున్నట్టు పోలీసుల వర్గాల అంచనా. మిగిలిన మహారాష్ట్ర, ఒడిశా, ఝార్ఖండ్, ఏవోబీల్లో తక్కువ సంఖ్యలోనే ఉన్నట్టు భావిస్తున్నారు.

మృతుల్లో పెరుగుతున్న మహిళలు

సాధారణంగా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగిన సందర్భాల్లో.. సాయుధులైన పురుష మావోయిస్టులే ఎక్కువగా చనిపోతుంటారు. కానీ ఈ ఏడాది జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో మహిళా మావోయిస్టులు భారీగా చనిపోతుండటం మానవతావాదులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఈనెల 4న జరిగిన తుల్‌తులీ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు చనిపోగా.. వారిలో 14 మంది మహిళలు ఉన్నారు. అంతకుముందు ఏప్రిల్ 16న కాంకేర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు చనిపోతే.. అందులో 15 మంది మహిళలున్నారు. వీటితో పాటు సెప్టెంబర్ 3న బీజాపూర్/దంతెవాడల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 9 మంది చనిపోతే.. వారిలో ఆరుగురు మహిళలున్నారు. సెప్టెంబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు నేలకొరిగిపోతే.. వారిలో ఇద్దరు మహిళలున్నారు.

వెనుకబాటులో ఆదివాసీలే అధికం

సామాజికంగా, ఆర్థికంగా, విద్య, వైద్యం తదితర అనేక అంశాల్లో దేశంలో ఆదివాసీలే ఎక్కువగా వెనుకబాటుకు గురయ్యారు. అందులో ఆదివాసీ స్త్రీల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. దుర్భర పరిస్థితుల మధ్య విప్లవ బాట పట్టి దళాల్లో చేరిన మహిళలపై పారా మిలిటరీ బలగాలతో దాడులు చేయించడం, నలువైపులా చుట్టుముట్టి ఎదురుకాల్పుల్లో మట్టుబెట్టడం సరికాదనే అభిప్రాయాన్ని ప్రజాస్వామికవాదులు వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో ఆదివాసీ మహిళలు చనిపోతుండడాన్ని దేశ అంతర్గత భద్రత సమస్యగా కాకుండా.. సామాజిక వెనుకబాటు సమస్యగా ప్రభుత్వం పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. అత్యంత వెనుకబడిన ఆదివాసీ స్త్రీలపై కర్కశంగా ఉక్కుపాదం మోపడం సరికాదంటున్నారు. ఎన్‌కౌంటర్లలో ఆదివాసీ స్త్రీల మరణాలు ఎక్కువగా ఉంటున్న నేపథ్యాన.. ఆయుధం పట్టిన ఆదివాసీ మహిళల భద్రత, ప్రాణ రక్షణ, వారి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చ మొదలైంది.



నల్లగొండ జిల్లా హాలియాలో నిర్మాణం పూర్తయిన యోగా కేంద్రం, వినియోగం లేకపోవడంతో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆరోగ్య 'యోగ'ం ఎప్పుడో ?

- రాష్ట్రానికి 421 యోగా కేంద్రాలు మంజూరు
- రూ.25.26 కోట్ల నిధుల కేటాయింపు
- ఇప్పటి వరకు 289 నిర్మాణాలు పూర్తి
- కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలంటూ వినతులు

సాక్షి, సిద్దిపేట: ఆయుష్ ఆస్పత్రులకు అనుబంధంగా యోగా కేంద్రాల నిర్మాణం జరిగినా, అవి ప్రారంభానికి నోచుకోలేదు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 421 ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య,ఆరోగ్య కేంద్రాలకు యోగా కేంద్రాలను మంజూరు చేశారు. పలు చోట్ల నిర్మాణాలు పూర్తయినా, శిక్షకులను నియమించకపోవడంతో అవి స్టోర్ రూంలను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి యోగా శిక్షకులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షలు

ప్రస్తుత సమాజంలో మనుషులు ఉరుకులు..పరుగుల జీవితం గడుపుతున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు తీరిక లేకుండా బిజీగా ఉంటున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదు. దీంతో అనారోగ్యం పాలై ఆస్పత్రి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. శారీరక శ్రమ లేకపోవడంతో చాలామంది షుగర్, బీపీలతో బాధపడుతున్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని పట్టణాలు, పల్లెల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు వీలుగా యోగాను ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో యోగా కేంద్రం షెడ్ నిర్మాణానికి రూ.6 లక్షల చొప్పున రూ 25.26 కోట్ల నిధులు విడుదల చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్మాణ బాధ్యతలను ఆర్అండ్‌బీ, పీఆర్, టీఎస్ఎంఐడీసీలకు అప్పగించారు. తెలంగాణవ్యాప్తంగా 421 కేంద్రాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 289 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇంకా 42 కేంద్రాల నిర్మాణం జరుగుతుండగా, మరో 90 కేంద్రాలకు స్థల కొరత ఏర్పడింది.

త్వరలో ప్రారంభిస్తాం

త్వరలో యోగా కేంద్రాలను ప్రారంభిస్తాం. కమిషనర్ ఆదేశాల మేరకు శిక్షకుల ఎంపికకు గత నెలలో ఆయా జిల్లాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించాం. త్వరలో శిక్షకులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తాం.

– రవినాయక్, ఆర్‌డీడీ, హైదరాబాద్, ఆయుష్

నిర్మాణాలు పూర్తయినా..

యోగా శిక్షణకు షెడ్‌ల నిర్మాణాలు పలు చోట్ల పూర్తయినా, అవి ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని జిల్లాల్లో ఏడాదిన్నర క్రితం నిర్మాణాలు పూర్తయినప్పటికీ యోగా శిక్షకులను నియమించకపోవడంతో అవి తెరుచుకోలేదు. ఈ షెడ్‌లు వినియోగంలో లేకపోవడంతో పలు చోట్ల స్టోర్ రూంలుగా, మరికొన్ని చోట్ల అపరిశుభ్రంగా తయారవుతున్నాయి.

శిక్షకుల నియామకం ఎప్పుడు?

రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో యోగా శిక్షణ కేంద్రానికి ఇద్దరు శిక్షకుల చొప్పున నియమించాలని నిర్ణయించారు. అందులో ఒక పురుషుడు, ఒక స్త్రీ ఉండే విధంగా ప్రణాళిక రూపొందించారు. గత నెలలో యోగా శిక్షకుల కోసం ఉమ్మడి జిల్లాల వారీగా దరఖాస్తులు ఆహ్వానించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. పురుషులకు నెలకు రూ.8 వేలు, మహిళకు రూ.5 వేలు వేతనం ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యోగా శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



సిద్దిపేట పట్టణంలో నిర్మించిన యోగా కేంద్రం





'ఉదయ'ం 'సముద్ర' అందాలు

ఆదివారం సూర్యోదయం వేళ ఆకాశమంతా అరుణ వర్ణాన్ని పులుముకోగా.. నల్లగొండ సమీపంలోని పానగల్ ఉదయ సముద్రం ఇలా కనిపించింది. పూర్తిగా తెల్లవారిన తరువాత చెరువులో చేపల వేట దృశ్యం.. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సాయంలో సవతి తల్లి ప్రేమ!

- గల్ఫ్‌యేతర దేశాల్లో మరణించిన వారికి అందని ఎక్స్‌గ్రేషియా
- ఉత్తర్వులను సవరించాలని కోరుతున్న ప్రవాసీలు
- ఏ దేశంలో మరణించినా సాయం అందించాలని వినతి

మోర్తాడ్ (బాల్కొండ): స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలామంది పనుల కోసం ఇతర దేశాలకు వలస వెళుతున్నారు. తెలంగాణకు చెందిన వారు ఎక్కువగా గల్ఫ్ దేశాలతోపాటు మలేషియా, సింగపూర్, యూరప్ దేశాలకూ వెళుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణవారి సంఖ్య 13 లక్షల వరకు ఉంటే, ఇతర దేశాల్లో పనిచేస్తున్న వారు మరో ఐదారు లక్షల మంది ఉంటారని అంచనా. అలా వలస వెళ్లినవారిలో పలువురు మృత్యువాత పడుతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇతర దేశాలకు వలస వెళ్లినవారి కుటుంబాలను ఆదుకోవాలని చాలా ఏళ్లుగా కోరుతూ వస్తున్నారు. వారి డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ దేశాల్లో మరణించినవారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఖతార్, ఒమన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) దేశాలకు వలస వెళ్లి మరణించిన వారి కుటుంబాలకే పరిహారం అని స్పష్టంగా ఉంది. సర్కారు నిర్ణయంపై ఇతర దేశాల్లో పని చేస్తున్న వలస కార్మికులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం తమ విషయంలో సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రవాసీ విధానం అమలు చేయాలని వలస కార్మికుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఎన్ఆర్ఐ పాలసీ అమలైతే గల్ఫ్ దేశాల్లోనే కాకుండా ఇతర దేశాల్లో పని చేస్తున్న వలస కార్మికులకూ ప్రయోజనం కలుగుతుందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మాత్రం ఎన్ఆర్ఐ పాలసీ అమలు చేయకుండా తాత్కాలిక చర్యలతో సరిపెడుతోందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వలస కార్మికులందరికీ ప్రయోజనం చేకూరేలా ఉత్తర్వులను సవరించాలని పలువురు కోరుతున్నారు.



నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన బైరగోని అరవింద్‌గౌడ్(23) ఉపాధి కోసం మలేషియాకు వెళ్లాడు. అక్కడ పని చేస్తూ 20 రోజుల క్రితం మరణించాడు. అతడు వెళ్లింది గల్ఫ్ దేశం కాకపోవడంతో అతడి కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందే అవకాశం లేదు. – బైరగోని అరవింద్‌గౌడ్, ఉప్లూర్(మలేషియా)

ఎన్ఆర్ఐ పాలసీనే కోరాం



మేం మొదటి నుంచి ఎన్ఆర్ఐ పాలసీనే కోరుతున్నాం. గల్ఫ్‌యేతర దేశాల్లో పని చేస్తున్న వలస కార్మికులకు కూడా మంచి జరగాలనే ఉద్దేశంతో కేరళ, రాజస్తాన్ రాష్ట్రాల తరహాలో ఎన్ఆర్ఐ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కేవలం గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్నవారి కోసమే ఉత్తర్వులను జారీ చేసింది. దీనిపై పునరాలోచన చేసి అందరికీ ప్రయోజనం కలిగించేలా నిర్ణయం తీసుకోవాలి. – కృష్ణ దొనికెన, ఎన్ఆర్ఐ పాలసీ సాధన ఉద్యమకారుడు

ఆదివారం.. ఆటవిడుపు



వారాంతాల్లో సేదతీరేందుకు విశాఖ నగరవాసులు ఎక్కువగా సముద్ర తీరానికి చేరుకుంటారు. వారం రోజుల పని వత్తిడి సముద్రపు గాలి, కెరటాల హోరుకు దూదిపింజలా కరిగిపోతుంది. సందర్శకులు పోటెత్తడంతో ఆదివారం ఆర్కేబీచ్ కిటకిటలాడిన దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - ఎండీ నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆనందమానందమాయే..



ఇటీవల కురిసిన వర్షాలకు చెయ్యేరు నదిలో మోకాలు లోతు నీరు ప్రవహిస్తుండటంతో అన్నమయ్య జిల్లా రాజంపేట, నందలూరు ప్రజల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. ఆదివారం కావడంతో చిన్నా పెద్ద తరలివచ్చి నదిలో సంతోషంగా స్నానాలు చేస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - ఎస్.కె మొహమ్మద్ రఫీ సాక్షి ఫొటోగ్రాఫర్ కడప

దొరికితే జాగా.. వేసేయ్ పాగా



గుంటూరులో ఫుట్‌పాత్ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. లాడ్జిసెంటర్ ఏఎల్ కాలేజీ కాంపౌండ్ పరిసరాల్లో కొత్తగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇటువంటి వ్యాపారుల నుంచి కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు నెలవారీ వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. - గజ్జల రామగోపాల్‌రెడ్డి, సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

క్లుప్తంగా...

టీచర్ల ఓటు నమోదుకు గడువు పెంచండి: ఎన్‌టీఏ

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ పశ్చిమ): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు గడువు పొడిగించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేసినట్టు ఓ ప్రకటనలో తెలిపారు.

30 శాతం తాత్కాలిక భృతి ఇవ్వాలి: పీఆర్టీయూ

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దీపావళి కానుకగా 12 వేతన సవరణ వచ్చేలోగా 30 శాతం తాత్కాలిక భృతి మంజూరు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గిరి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 23న జరిగే కేబినెట్ భేటీలో పీఆర్సీ పునర్వ్యవస్థీకరణ, ఐఆర్, సీపీఎస్ రద్దు అంశాలను చర్చించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వి.ప్రసాద్, రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

డిసెంబర్ 29న ప్రపంచ మాదిగ సదస్సు



మట్టా విద్యార్థి

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): ఈ ఏడాది డిసెంబర్ 29న కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, హనుమాన్‌జంక్షన్ వేదికగా ఏడో ప్రపంచ మాదిగ సదస్సు నిర్వహించనున్నట్లు ఇంటెలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్ (ఇన్ఫామ్) రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ మట్టా విద్యార్థి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 'ఇంటర్నేషనల్ మాదిగ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ'ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

పెన్షనర్ల సమస్యలను ఏపీ ప్రభుత్వం పరిష్కరించాలి

అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ వినతి

చిక్కడపల్లి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పెన్షనర్ల సమస్యలను ఏపీ ప్రభుత్వం పరిష్కరించాలని అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ప్రతినిధులు కోరారు. ఆదివారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో సంఘం వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్–అమరావతి అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం సామాజిక సేవల్లో భాగంగా గాంధీ ఆసుపత్రి మెటర్నిటీ వార్డులోని వారికి 400 చీరలు, వరద బాధితులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. సామాజిక భద్రతలో భాగంగా ప్రతినెలా రూ.4,000 చెల్లిస్తూ వృద్ధులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వీలైనంత తొందరగా చెల్లించాలని కోరారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను ఇవ్వాలన్నారు. అసోసియేషన్ అసోసియేట్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మేరం శెట్టి, ఆర్. అనురాధ, కె.రామారావు, ఆంజనేయలు, లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

ఏపీ దూదేకుల పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు దస్తగిరి



సాక్షి, అమరావతి: ప్రేమోన్మాది ఘాతుకానికి బలైపోయిన కడప బాలిక ఘటనలో న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ ముస్లిం దూదేకుల పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు గాలి కొదిలేశారని, బాలికలు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పవన్ కళ్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని గొప్పలు చెప్పిన పవన్, ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బాలికలు, మహిళల రక్షణ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక పటిష్ట చర్యలు చేపట్టిందని చెప్పారు.

ఇంట్లోనే వెండితెర

పెరుగుతున్న హోమ్ థియేటర్ కల్చర్ | ఇంటి వద్దనే నచ్చిన సినిమా చూసే వెసులుబాటు | ఆసక్తి చూపిస్తున్న సంపన్న వర్గాలు | యువతకు ఉపాధి మార్గంగా పట్టణాల్లో వెలుస్తున్న ప్రైవేట్ థియేటర్లు | గంటకు రూ.1,500 నుంచి రూ.3,000 వరకు అద్దె



సాక్షి, భీమవరం: వెండితెర వినోదం కొత్త పుంతలు తొక్కుతోంది. టూరింగ్ టాకీస్ రోజుల్లో కొత్త సినిమాలు పట్టణాల్లో మాత్రమే విడుదలయ్యేవి. అప్పట్లో ఎడ్ల బళ్లు కట్టుకుని మరీ ఇంటిల్లిపాది వెళ్లి చూసి వచ్చేవారు. కాలం మారింది. ఇప్పుడు ఎంత పెద్ద హీరో సినిమా అయినా నెలరోజుల్లోనే ఓవర్ ది టాప్ (ఓటీటీ)లో వస్తుంటే ఆధునిక పరిజ్ఞానం హోమ్ థియేటర్ల రూపంలో వెండితెరను ఇంటికే తెస్తోంది. థియేటర్‌లో చూసిన అనుభూతిని అందిస్తోంది. కొన్నాళ్లు నగరాలకే పరిమితమైన ఈ హోమ్ థియేటర్ కల్చర్ ఇప్పుడు అన్నిప్రాంతాలకూ విస్తరిస్తోంది. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో థియేటర్లు మూతపడగా ఇళ్లకే పరిమితమైన జనానికి ఓటీటీనే ఏకైక వినోద సాధనమైంది. సినిమాలు నేరుగా అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, డిస్నీహాట్‌స్టార్, ఆహా, జీ5 తదితర ఓటీటీ ప్లాట్‌ఫాంలలో రిలీజ్ కావడం మొదలైంది. చౌక ప్లాన్లు, ఇంటిల్లిపాది చూసే అవకాశం ఉండటంతో కొద్ది రోజుల్లోనే వీటికి ఆదరణ అమాంతం పెరిగిపోయింది.

ఇంట్లోనే థియేటర్ అనుభూతి

గతంలో చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో మాత్రమే కనిపించే హోమ్ థియేటర్ కల్చర్ ఇప్పుడు అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సంపన్న వర్గాలతో పాటు కాస్తోకూస్తో డబ్బున్న వారు కూడా వీటి ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తున్నారు. హోం థియేటర్ సెట్ చేయడానికి కనీసం 10 గీ 15 అడుగుల విస్తీర్ణం కలిగిన హాల్ ఉండాలి. నాణ్యమైన సౌండ్ సిస్టమ్, స్క్రీన్, అభిరుచికి తగ్గట్టుగా సిట్టింగ్, ఇంటీరియర్ డెకరేషన్‌ను బట్టి హోం థియేటర్‌కు రూ.5 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చవుతుంది. స్క్రీన్, ప్రొజెక్టర్, యాంప్లిఫయర్, స్పీకర్స్, సౌండ్ ప్రూఫింగ్ తదితరాలను అమర్చుతారు. అధికశాతం మంది రూ.5 లక్షల వరకు వెచ్చిస్తుండగా, కొందరు రూ.10 లక్షల వరకు వెచ్చిస్తున్నట్టు టెక్నీషియన్స్ చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో 300కు పైగా హోమ్ థియేటర్లు ఉన్నాయంటున్నారు. తాజాగా ఏలూరు సమీపంలోని 150 విల్లాల్లో కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా హోం థియేటర్లు సిద్ధం చేస్తున్నట్టు హైదరాబాద్‌కు చెందిన ఒక హోం థియేటర్స్ అధినేత ఆర్‌ఎస్‌ఎస్ మూర్తి తెలిపారు.

ఆదరణ బాగుంది



ఈవెంట్ల కోసం ఇటీవల కాలంలో ప్రైవేట్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. భీమవరంలోని మా మ్యాజిక్ పిక్చర్ ల్యాండ్‌లో ఏర్పాటుచేసిన మినీ థియేటర్‌కు ఆదరణ బాగుంది. గంటల చొప్పున థియేటర్‌ను రెంట్‌కు ఇస్తుంటాం.

–జి.కృష్ణంరాజు, మ్యాజిక్ పిక్చర్ ల్యాండ్, భీమవరం



భీమవరంలోని ప్రైవేట్ థియేటర్

ప్రైవేట్ థియేటర్లకు పెరుగుతున్న ఆదరణ

వినోదానికి ప్రాధాన్యం పెరుగుతున్న తరుణంలో సినిమాలు చూసేందుకు, ఈవెంట్స్, ప్రత్యేక వేడుకల కోసం మినీ థియేటర్లకు ఆదరణ పెరుగుతోంది. పది మంది లేదా కుటుంబ సభ్యులతో నిర్వహించే బర్త్‌డే పార్టీలు, ఇతర వేడుకలకు ఇవి అనువుగా ఉంటున్నాయి. ప్రస్తుతం పట్టణాల్లో ఇవి ట్రెండింగ్‌గా మారాయి. స్క్రీన్, సరౌండింగ్ సౌండ్ సిస్టమ్, పది మంది కూర్చునేందుకు వీలుగా సిట్టింగ్, ఇంటీరియర్‌తో ఆకర్షణీయంగా వీటిని తయారుచేస్తున్నారు. 30 గీ 20 చ.అడుగులు మొదలుకొని కొంత స్థలంలో మినీ హోం థియేటర్లు నిర్మించి అద్దెకు ఇవ్వడం ద్వారా ఔత్సాహిక యువత ఉపాధి పొందుతున్నారు. ఇటీవల ఈ తరహా మినీ థియేటర్లు భీమవరంలో ఐదు వరకు వచ్చాయి. సీజన్‌ను బట్టి గంటకు రూ.1,500 నుంచి రూ.3,000 వరకు వీటికి అద్దె ఉంటుంది. మరో పక్క యువతను ఆకర్షించేందుకు జ్యూస్, ఐస్‌క్రీం పార్లర్లు, హోటళ్లలోను హోం థియేటర్ల ఏర్పాటుకు వ్యాపారులు ప్రాధాన్యమిస్తున్నారు.

సాయంకాలం.. చదువుల తీరం!

విశాఖలోని 'గైస్'లో డిప్లమో కోర్సులకు అవకాశం

- మరోరెండు ప్రయివేటు కాలేజీలకూ సాయంకాలం కోర్సులకు అనుమతి
- పదోన్నతులు పొందాలనుకున్న వారికి అరుదైన అవకాశం



కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (కంచరపాలెం)

మురళీనగర్(విశాఖ ఉత్తర): పరిశ్రమలు, ఇతర రంగాల్లో పని చేస్తున్న వారు పదోన్నతులు పొందేందుకు గాను తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశం లభిస్తే.. భలే ఉంటుంది కదూ. డిప్లమో కోర్సులను సాయం కాలం చదివే అరుదైన అవకాశం విశాఖ నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్) అందిస్తోంది. రాష్ట్రంలో 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా సాయంకాలం కోర్సులు నిర్వహణకు విశాఖలోని గైస్‌ను ఏఐసీటీఈ ఎంపిక చేయడం విశేషం. అలాగే మరో రెండు ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలు.. బెహరా(నరవ), ప్రశాంతి(అచ్యుతాపురం)లలోనూ సాయంత్రం కోర్సుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతిచ్చింది.

వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు

కెమికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్స్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగాల్లో వర్కింగ్ ప్రొఫెషనల్స్‌గా 2024–25 విద్యా సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు కోర్సులను నవంబర్ 1న ప్రారంభిస్తారు. ప్రతి కోర్సులోనూ 33 సీట్లుండగా.. వీటిలో 3 ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ఉంటాయి. వీరు ఈ నెల 21 నుంచి 26వ వరకు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే బెహరా పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ(అచ్యుతాపురం)లో సివిల్ , మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

టైమింగ్స్: రోజూ సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు, ఆదివారం, సెలవు దినాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకూ తరగతులు నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పరిశ్రమల్లో, లేదా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంటర్ ఎంపీసీ/ బైపీసీ/ఐపీసీ/లేదా ఐటీఐ సర్టిఫికెట్‌తో కెమికల్ ప్లాంట్ మెయింటెనెన్స్ మెకానిక్/అటెండెంట్ ఆపరేటర్, లేబొరేటరీ అసిస్టెంట్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర విభాగాల్లో ఏడాది రెగ్యులర్ ఉద్యోగిగా పనిచేస్తూ.. పై 3 కళాశాలకు 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

ఇదొక సదావకాశం



సాయంకాలం కోర్సుల్లో చేరడం గొప్ప సదావకాశంగా భావించాలి. పరిశ్రమలు, ఇతర రంగాల్లో పని చేస్తున్నవారు ఈ కోర్సుల్లో చేరి పదోన్నతులు పొందొచ్చు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీల్లో గైస్‌కు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.

– డాక్టర్ కె.వెంకరమణ, ప్రిన్సిపాల్, గైస్, కంచరపాలెం

లద్దిగం చెరువు.. 'తమ్ముళ్ల' కల్పతరువు

పగలు ట్రాక్టర్లు.. రాత్రి టిప్పర్లతో భారీగా ఇసుక అక్రమ రవాణా

- కర్ణాటకకు తరలిస్తూ లక్షల్లో వ్యాపారం
- జేసీబీలు, టిప్పర్లను ఆదివారం అడ్డుకున్న రైతులు

పుంగనూరు: లద్దిగం చెరుకు ఇసుకాసురుల అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారింది. అధిక సంఖ్యలో తుమ్మచెట్లు ఉండటం 'తమ్ముళ్ల'కు బాగా కలిసొచ్చింది. ఇక్కడ ఇసుక తరలిస్తున్నా ఎవరికీ కనీసం అనుమానం కూడా రావడం లేదు. దీంతో తమ్ముళ్ల వ్యాపారం మూడు ట్రిప్పులు... ఆరు ట్రక్కులుగా మారింది. ఇప్పటి వరకూ చెరువులో ఆరు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర కాలువలు తీసి ఇసుకను తినేశారు. వివరాల్లోకి వెళితే... చౌడేపల్లె మండలం, లద్దిగం గ్రామ పరిధిలో పెద్ద చెరువు ఉంది. ఇది సుమారు 750 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పుంగనూరు, చౌడేపల్లెకు సంబంధించిన లద్దిగం, చదళ్ల, పుదిపట్ల, తిరుమణపల్లె, అంకుతోటపల్లె, ఎ.కొత్తకోట, బండ్లపల్లె, నల్లూరిపల్లె, కొత్తపల్లె, ఏతూరు, పెంచుపల్లె గ్రామాల్లోని సుమారు సుమారు 1,500 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తోంది.

ఇసుక అక్రమరవాణాకు అడ్డాగా..

రైతులు ట్రాక్టర్లలో తమ అవసరాల నిమిత్తం ఇసుక తరలించుకోవచ్చన్న ప్రభుత్వ ప్రకటన తమ్ముళ్లపాలిట వరంగా మారింది. దీన్ని ఆసరాగా మలచుకొని ఎవరికీ అనుమానం రాకుండా పగటిపూట ట్రాక్టర్లలో స్థానికులకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ఆపై రాత్రిపూట టిప్పర్లతో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి తరలించేస్తున్నారు. అయితే చెరువులో ఇసుక తోడేందుకు నీరు అడ్డు రావడంతో పనులు సాగడం లేదు. దీంతో పైపులు వేసి నీటిని వృథాగా బయటకు పంపేస్తున్నారు. వాహనాల రాకపోకలకు వీలుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి ఏకంగా చెరువు రూపురేఖలే మార్చేశారు. ఇక ఇసుక ట్రాక్టర్‌కు లోడింగ్ చేసినందుకు రూ.2వేలు, టిప్పరుకు రూ.13వేలు వసూలు చేస్తున్నారు. అలాగే రాత్రి సమయాల్లో టిప్పర్లను కర్ణాటకకు తరలించి ఇసుక ఒక్కో టిప్పర్‌కు రూ.వేలు వసూలు చేస్తున్నారు.

నెల్లూరి వాసి కీలకం

ఇసుక అక్రమ రవాణాకు మూల సూత్రధారి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రసాద్‌రెడ్డి అని తెలిసింది. ఇతనికి స్థానిక టీడీపీ నేతలు సహకరిస్తున్నారని, ఇసుక వ్యాపారం సజావుగా సాగేందుకు కూటమి నేతలకు ప్రతి నెలా లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

లద్దిగం పెద్ద చెరువులో టీడీపీ నాయకులు, వ్యాపారి ప్రసాద్‌రెడ్డితో కలిసి చెరువును తోడి ఇసుక తరలించడంపై రైతులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. చెరువును పూడ్చి యథాస్థితిలో ఉంచేంత వరకు జేసీబీలు, టిప్పర్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 అడుగుల లోతు, కిలోమీటర్ల పొడవుతో కాలువలు తీశారని, దీని కారణంగా నీటి నిల్వలు లేక భూగర్భజలాలు అడుగంటిపోయాయని వాపోయారు. రోజుకు 200 వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు రాజశేఖర్‌రెడ్డి, అగస్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై మంత్రులు, జిల్లా కలెక్టర్, రూరల్ సీఐకి ఫిర్యాదు చేశామని, తక్షణమే కేసు నమోదు చేయాలని, జేసీబీలు, టిప్పర్లు సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



చౌడేపల్లె మండలం లద్దిగం చెరువులో ఇసుక తవ్వకాలను అడ్డుకున్న రైతులు



పుంగనూరు లద్దిగం చెరువులో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

ఆధ్యాత్మిక సమాచారం

వైభవంగా వసంతోత్సవం




ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఆదివారం జరిగిన చూర్ణోత్సవం, వసంతోత్సవం, శ్రీపుష్పయాగోత్సవంతో ఘనంగా ముగిశాయి. ఉదయం ఆలయ కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు, పండితులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం అర్చనాది కార్యక్రమాలు జరిపారు.

అప్పన్నకు విశేషంగా స్వర్ణపుష్పార్చన



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణపుష్పార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళిపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లె: చిత్తూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీతో పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి.

31న పెంచలకోనలో దీపావళి వేడుకలు

రాపూరు: నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో 31వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా పెంచలకోనలో రథోత్సవం, ఆర్టీసీ బస్టాండు వద్ద నరకాసుర వధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి అమ్మవార్లలను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి, సత్యభామగా అలంకరించి రథంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం, నరకాసుని వధ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

యానాం: స్థానిక శ్రీత్యాగరాజ సంగీత విద్యాపీఠం ఆధ్వర్యంలో చింతావారి వీధిలోని రామాలయంలో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆరాధనోత్సవంలో భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని గాయకులు ఆలపించారు.

విద్యా సమాచారం

నేటితో ముగియనున్న స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ వంటి పీజీ కోర్సుల్లో మిగిలున్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. ఇప్పటికే ఆయా వర్సిటీల డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించి, 2 విడతల్లో జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో సీట్లు పొందని విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏయూ ప్రొఫెసర్ వెంకటస్వామికి అబ్దుల్ కలాం పురస్కారం

మద్దిలపాలెం: దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికిచ్చే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ఏయూ తెలుగు విభాగ ఆచార్యుడు డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. గుంటూరు ఏసీ కళాశాల ఆడిటోరియంలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రదానం చేశారు.

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూలైలో జరిగిన ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ మైక్రో బయాలజీ నాల్గోవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.


బీబీ కా మఖ్బారా

0000



దక్కనీ తాజ్


అది తాజ్ మహల్‌ను తలపించే నిర్మాణం. పేరు బీబీ కా మఖ్బారా. దక్కనులో తాజ్ మహల్ వంటి నిర్మాణం కావడంతో దీనిని దక్కనీ తాజ్ అంటారు. ఆగ్రా తాజ్‌మహల్‌ను చూసిన కళ్లకు పెద్ద సంతృప్తినివ్వదు. కానీ చూడాల్సిన నిర్మాణమే. షాజహాన్ మనుమడు, ఔరంగజేబ్ కొడుకు అజమ్‌షా తన తల్లి కోసం నిర్మించిన మాన్యుమెంట్. ఔరంగజేబు తన భార్య దిల్‌రాస్ బానో బేగం స్మారక నిర్మాణం చేయమని తన కొడుక్కి ఆదేశించి, ఈ నిర్మాణానికి ఏడు లక్షలు కేటాయించాడు. ఆ మొత్తంలో నిర్మాణాన్ని పూర్తి చేయడానికి చేసిన ప్రయత్నం కూడా కనిపిస్తుంది. అయితే పాలరాతి గోడలో జాలీ చెక్కడం వంటి సునిశితమైన పనితనంలో మాత్రం ఎక్కడా రాజీపడలేదు. అజమ్ షా తాను స్వయంగా అధికారం చేపట్టిన తర్వాత మరికొన్ని మెరుగులు దిద్దాడు. ఈ మాన్యుమెంట్ మహారాష్ట్ర, ఔరంగాబాద్ పట్టణంలో ఉంది.



మఖ్బారా ఆవరణలో అష్టభుజి నిర్మాణం



పాలరాయిలో చెక్కిన పైకప్పు



గాలి వెలుతురు ప్రసరించడానికి పాలరాతి జాలీ

పర్షియాలో పుట్టింది

దిల్‌రాస్ బానో బేగం ఇరాన్ ఆడపడుచు. మొఘల్ పాలకుడు ఔరంగజేబ్ మొదటి భార్య. ఐదవ బిడ్డను ప్రసవించిన తర్వాత నెల రోజులకు ప్రాణం వదిలింది. షాజహాన్ భార్య ముంతాజ్ బేగం మరణించినట్లే ప్రసవానంతర మరణం కావడంతో స్మారకం కూడా తాజ్‌మహల్‌లాగ చిరస్థాయిగా నిలిచి ఉండాలనుకున్నాడు అజమ్ షా. అదే డిజైన్ కోసం ప్రయత్నించాడు. మఖ్బారా పై అంతస్థు నుంచి నాలుగు వైపులా విస్తరించిన చార్ బాగ్‌లు తాజ్‌మహల్ ఆవరణని తలపిస్తాయి. బాదాదరీలు, విశాలమైన వరండాలు, ఎత్తైన పెవిలియన్, నాలుగు పిల్లర్‌లు, డోమ్, దర్వాజాలు, ముందు ఫౌంటెయిన్ అన్నింట్లోనూ తాజ్ మహల్ రూపం కోసం చేసిన ప్రయత్నం కనిపిస్తుంది. ప్రధాన ద్వారం తలుపులో కార్వింగ్ అద్భుతంగా ఉంటుంది. పర్షియన్ శైలి షట్‌భుజి, అష్టభుజి నిర్మాణం ఇది. బీబీ కా మఖ్బారా కోసం అజమ్ షా... రాజస్థాన్ రాష్ట్రం, జైపూర్ నుంచి మూడు వందల బండ్ల మీద పాలరాతిని తెప్పించాడు. బీబీ కా మఖ్బారాతోపాటు ఔరంగజేబ్ సమాధి కూడా ఔరంగాబాద్‌కు సమీపంలోనే ఉంది. ఇదంతా చదువుతున్నప్పుడు మొఘలుల రాజధాని ఢిల్లీ అయినప్పుడు వీరి సమాధులు ఇక్కడెందుకున్నాయి అనే సందేహం వస్తుంది. ఔరంగజేబు దక్కన్ మీద ఆధిపత్యం కోసం యుద్ధాలు చేసి చేసి 27 సంవత్సరాలు దక్కనులోనే ఉండిపోయాడు. దక్కను కోసం పోరాడుతూ దక్కన్‌లోనే సమాధి అయ్యాడని చెబుతారు చరిత్రకారులు.

తుగ్లక్ పాలించిన కోటనూ చూడండి!

ఔరంగాబాద్‌లో తప్పకుండా చూడాల్సిన వాటిలో శివాజీ మ్యూజియం ఒకటి. అజంతా, ఎల్లోరా టూర్‌లో ఔరంగాబాద్‌ను కలుపుకోవచ్చు. షిరిడీ నుంచి ఔరంగాబాద్‌కు వెళ్లే దారిలో దౌలతాబాద్ కోట ఉంటుంది. దీనిని కూడా తప్పనిసరిగా చూడాలి. ఈ కోటకు ప్రత్యేకమైన చరిత్ర ఉంది. దీని అసలు పేరు దేవగిరి కోట. తుగ్లక్ తన రాజధానిని ఢిల్లీ నుంచి దేవగిరికి తరలించి దౌలతాబాద్ అని పేరు పెట్టాడు. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం రాజధానిని మార్చడం కాదు, ఢిల్లీ ప్రజలందరినీ దేవగిరి బాట పట్టించాడు తుగ్లక్. వృద్ధులు, పిల్లలు దారిలోనే ప్రాణాలు వదిలారు. దేవగిరి చేరిన తరవాత కొంతమంది ఇక్కడి వాతావరణానికి అనారోగ్యం పాలయ్యారు. షిరిడీ టూర్ ఆపరేటర్‌ల జాబితాలో ఈ కోట ఉంటుంది. కానీ కోట పైకి తీసుకెళ్లకుండా రోడ్డు మీద నుంచి చూపిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా ప్యాకేజ్ మాట్లాడుకోవాలి.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హనీమూన్ డెస్టినేషన్

అలెప్పీ





కేరళ ప్రకృతి సౌందర్యానికి నెలవు అని తెలిసిందే. ఈ సంగతిని గ్రహించిన కేరళ వాళ్లు గాడ్స్ ఓన్ కంట్రీ అనే విశేషణంతో పర్యాటకరంగాన్ని తమ వైపు తిప్పుకున్నారు. టూరిజమే ప్రధాన ఉపాధి మార్గంగా ఉన్న ఉత్తరాఖండ్ వాళ్లు కూడా తమది దేవభూమి అని చెప్పుకుంటారు. ప్రకృతి వాళ్లకిచ్చిన ప్రివిలేజ్ అది. ఈ సీజన్‌లో కేరళలో చూడాల్సిన ప్రదేశం అలెప్పీ... అదే అళప్పుజ.

పడవింట్లో విహారం

హౌస్‌బోట్ విహారం అళప్పుజ ప్రత్యేకం. హనీమూన్ కపుల్ కోసం అందమైన హౌస్‌బోట్‌లుంటాయి. అరేబియా సముద్రంతోపాటు నదులు, చిన్న చిన్న నీటి పాయల్లో విహారం, భోజనం, రాత్రి బస కూడా హౌస్‌బోట్‌లోనే. కేరళ ఆహారం చేప లేకుండా ఉండదు. శాకాహారం కావాలంటే ముందుగా చెప్పాలి. కొబ్బరి నూనెతో వండిన వంటలు తేలిగ్గా జీర్ణమవుతాయి. కేరళలో సంతృప్తిగా భోజనం చేసినప్పటికీ మళ్లీ త్వరగా ఆకలి వేస్తుంది. జర్నీలో చిరుతిండి దగ్గరుంచుకోక తప్పదు. ఇక్కడ కొబ్బరి హల్వా, అరటి కాయ చిప్స్ రుచిగా ఉంటాయి. పర్యాటకులు కేరళలో కొబ్బరి నీటిని అమృతంలాగ తాగుతుంటే స్థానికులు మాత్రం థమ్స్ అప్, స్ప్రైట్ తాగుతుంటారు. ఇక్కడ మార్కెట్‌లో రకరకాల అరటిపండ్లు ఉంటాయి. తప్పకుండా రుచి చూడాలి.

ఏటా పుష్కరమే!

పుష్కర్







బ్రహ్మదేవుడంటే... ఈ సమస్త భూమండలంలో ఆలయం లేని దేవుడనే అసంతృప్తిని రాజస్థాన్ రాష్ట్రంలోని పుష్కర్ తీర్చింది. అజ్మీర్‌కి 11 కి.మీల దూరంలో పుష్కర్ సరస్సు ఒడ్డున బ్రహ్మదేవుడికి ఆలయం ఉంది. పుష్కర్ సరస్సు చుట్టూ విస్తరించిన పట్టణం కావడంతో ఈ పట్టణానికి కూడా అదే పేరు స్థిరపడింది. రాజస్థాన్ అంటేనే ఎడారులు, ఒంటెలు. ఇక్కడ ఏటా జరిగే క్యామెల్ ఫెయిర్ ప్రపంచ ప్రసిద్ధి. కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే వేడుకకు విదేశీయులు కూడా పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ ప్రదేశం పేరు పుష్కరే కానీ వేడుకలు పుష్కరానికొకసారి కాదు ఏటా జరుగుతాయి.

పుష్కర్ మేళా

ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేడుక కావడంతో ఇది క్యామెల్ ఫెయిర్‌గా వాడుకలోకి వచ్చింది. పుష్కర్‌మేళా సమయంలో ఈ సరస్సులో స్నానం చేయడానికి వచ్చే భక్తులు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ వారోత్సవాల్లో రాజస్థాన్ సంప్రదాయ సంగీత ప్రదర్శనలను, నాట్య ప్రదర్శనలతో పాటు సాముగారడీలు, పాములనాడించేవాళ్లు కూడా వస్తారు. స్థానిక హస్తకళలు, దుస్తుల దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఈ సీజన్‌లో పుష్కర్ వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. పగలు ఏదో ఒక సమయంలో 22 డిగ్రీలకు చేరుతుంది, కానీ సూర్యకిరణాలు మబ్బును చీల్చుకుని మనిషిని తాకి వెచ్చదనాన్నివ్వడం కష్టమే. రాత్రి టెంపరేచర్ ఎనిమిది డిగ్రీలకు పడిపోతుంది. పాశ్చాత్యదేశీయులకు అనువుగా ఉంటుంది. ఈ ఏడాది వేడుకలు నవంబర్ 9 నుంచి మొదలై 15 వరకు కొనసాగుతాయి.

బెంగాల్‌లో గ్రామీణ వారసత్వం – సంస్కృతిని అన్వేషించే అవకాశం ఈ అక్టోబర్ నెలలోనే లభిస్తోంది. మొన్నటి దసరా వేడుకల్లో దుర్గా మాత పూజలు, దాండియా నృత్యాల ఆనందాన్ని పొందాం. ఆ ఆస్వాదనకు కొనసాగింపుగా రంగుల కళతో నిండిన మరో ప్రపంచం ఆహ్వానిస్తుంటే... ఎలా మిస్ అవగలం..

ఇష్టమైన హస్తకళల నుండి నోరూరించే వంటకాల వరకు అక్కడ ప్రతిదీ గొప్పగా జరుపుకుంటారు. బెంగాల్ గ్రామాల్లోని వారి గొప్ప వారసత్వం, కనుల విందు చేసే వారి సంస్కృతిలో మనమూ ఇట్టే లీనమైపోతాం. దీనిని గుర్తించిన కోల్ ఇండియా లిమిటెడ్, బంగ్లానాటక్ డాట్ కామ్‌తో పాటు ఎక్స్‌ప్లోర్ రూరల్ బెంగాల్ పండుగలు, జాతరల శ్రేణిని మన ముందుకు తీసుకువస్తోంది.

బెంగాల్ గ్రామీణ సంస్కృతి

జానపద సంబరం



దీని ద్వారా బీర్భూమ్, పురూలియా బంకురా, నదియా ప్రాంతాలతో పాటు దక్షిణ బెంగాల్‌లో గల 16 గ్రామాలలో ప్రయాణించవచ్చు. ఇక్కడి జానపద సంగీతం, నృత్యం, తోలుబొమ్మలాటలు, హస్తకళల ద్వారా వారి సాంస్కృతిక వారసత్వంలో మనమూ పాల్గొనవచ్చు. అక్టోబర్‌లో చివరి వారాంతాల్లో ఇక్కడ పండుగ, జాతరలు ఘనంగా నిర్వహిస్తారు. బీర్భూమ్‌లోని అత్యంత అట్టహాసంగా జరిగే కాంత మేళా, శాంతినికేతన్ మేళాను సందర్శించవచ్చు. పురూలియాలో చౌ ఉత్సవ్, పాత చిత్రాల మేళాను సందర్శించి, వారి కళను ఆస్వాదించవచ్చు. బురాద్వన్‌లోని డోక్రా మేళా, చెక్క బొమ్మల మేళాలో షాపింగ్ చేయవచ్చు. ఈ గ్రామీణ జాతర అక్టోబర్ 25 నుంచి 27 వరకు జరుగుతుంది.



ఆర్ట్

నీనా జాకబ్, దిపాలి గుప్తా, మానికా శ్రీవాస్తవ్... ఈ ముగ్గురు కళాకారులు వారి కళాత్మక ప్రయాణాలు, సృజనాత్మక ప్రక్రియల గురించి తెలుసుకోవాలంటే బెంగుళూరు ఇంటర్నేషనల్ సెంటర్ ను సందర్శించాలి. సమాజంలో కళాభిమానాన్ని మెరుగుపరచడానికి ఔత్సాహిక కళాకారులకు సలహాలనూ అందిస్తున్నారు. వీరి కళలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న సంస్కృతులు ప్రతిబింబిస్తాయి.

ప్రయాణం, ప్రయత్నం... ముగ్గురు మహిళా కళాకారుల విజయం



కళాత్మక ప్రయాణం... మానికా శ్రీవాస్తవ్

ఢిల్లీ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నప్పుడు స్నేహితులు, బంధువుల కోసం ఆర్ట్‌వర్క్‌లను ప్రారంభించింది మానికా శ్రీవాస్తవ్. 'పెళ్లయ్యాక కూడా ఈ కళా ప్రయాణం ఏమీ ఆగిపోలేదు. క్లబ్బులు, కాఫీ షాపుల వంటి చోట్ల నా పనితనాన్ని చూపడం మొదలుపెట్టాను. 1990 ప్రారంభంలో ఢిల్లీలో నా మొదటి పెయింటింగ్ ప్రదర్శన జరిగింది. ఎక్కడ ఉన్నా, ప్రయాణాల్లోనూ, నా గది మూలల్లోనూ నా కళకు ఊపిరిపోస్తూనే ఉంటాను. ఆ ప్రయత్నం విదేశాల్లోనూ సోలో, గ్రూప్ షోలకు దారితీసింది. హ్యూస్టన్, దుబాయ్, బెంగళూరులోనూ ప్రదర్శనలు ఇచ్చాను. ఇన్నేళ్లలో ఏ రోజూ నా నుంచి సృజనాత్మక పని ఆగలేదు. 30ఏళ్లుగా ఈ పనిని కొనసాగిస్తూనే ఉన్నాను' అని గర్వంగా చెబుతుంది శ్రీవాస్తవ్.







ప్రత్యేకమైన శైలి.. దిపాలి గుప్తా

సింగపూర్‌లోని ప్రఖ్యాత ఇరానియన్ మాస్టర్ అలీ ఎస్మాయిల్ వద్ద శిక్షణ పొందింది దిపాలి గుప్తా. 16 ఏళ్లుగా అక్కడే ఉంది. 'చాలా ప్రయోగాల తర్వాత, నాదైన ప్రత్యేకమైన శైలిని అభివృద్ధి చేశాను. ఇది బోల్డ్, అసాధారణమైనది. చాలా వరకు సంప్రదాయ పెయింటింగ్ నియమాలను ఉల్లంఘిస్తారు. నేను కొల్లాజ్ టెక్నిక్‌ని ఇష్టపడతాను. అశాంతిగా ఉండే, చెదిరిన ప్రపంచాన్ని వివరించే వార్తాపత్రికలలోని సారాంశానికి ఒక రూపాన్ని తీసుకువస్తాను. నా పనిలో ఎప్పుడూ ఒక అంతర్లీన సూక్ష్మ సందేశం ఉంటుంది' అని వివరిస్తారు గుప్తా.





కేరళకు చెందిన నీనా జాకబ్ తనను తాను సెమీ–అబ్‌స్ట్రాక్ట్ ఫిగ్రేటివ్ ఆర్టిస్ట్‌గా అభివర్ణించుకుంటుంది. 'నా చిత్రణలో చాలా వరకు కాంతి, నీడల దోబూచులాట ఉంటుంది. సామాజిక మార్పుకు నడిపించే కళ అత్యంత శక్తిమంతమైనదని నమ్ముతాను. డ్రాయింగ్, స్కెచింగ్, ఫోటోలు తీయడం, గమనించడం నా పరిశోధనలో ఉంటాయి. ఒక్కోసారి నా కళలో ఎంబ్రాయిడరీని వాడాలనుకుంటాను. అలాంటప్పుడు దారాన్ని ఉపయోగిస్తాను. ప్రేక్షకులు కేవలం అందమైన చిత్రాన్ని ఆరాధించడం మాత్రమే కాదు. కళాకారుడి కథలో నిమగ్నమవ్వాలి. నా కుంచె రంగులను అద్దడానికే కాదు రాయడానికి కూడా ఉపయోగిస్తాను. ధ్యాన పదాలు, కవిత్వం కూడా నా కుంచె రాస్తుంటుంది. ఈ పని ద్వారా ఆధ్యాత్మికతకు చేరువవుతాను. నా సొంత శైలిని అభివృద్ధి చేయడానికి దారితీసే దశలు ఇవి' అని శ్రీవాస్తవ్ జతచేస్తుంది.

దేశ, విదేశాల్లో జరిగే ప్రదర్శనలలో వీరి ఆర్ట్ ఫ్రేమ్స్‌కు ధర రూ. 10,000 నుండి లక్షల రూపాయల వరకు పలుకుతాయి. ఆ మొత్తాలను స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకూ అందజేస్తుంటారు. కళ ద్వారా తమ మహోన్నతమైన మనసునూ చాటుకుంటున్నారు.

కళ ద్వారా ఆరోగ్య అక్షరాస్యత

వైద్య సంరక్షణలో కళను నింపడం ద్వారా ప్రజలలో ఆరోగ్య అక్షరాస్యతను పెంచడానికి ఓ కొత్త ఒరవడిని సృష్టించారు కళాకారులు. తమ సృజనాత్మక ఆలోచనల ద్వారా ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించారు. పుణెలో జరిగిన ఈ హెల్త్ ఆర్ట్ కార్యక్రమం ఎంతో మందిని విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తుంది.



నియోనేటల్ హోమ్ కేర్ (ఎడమ)లో సూరజ్ కాంబ్లే కళాకృతితో డాక్టర్ అమీ షా. తేలు కుట్టడం (కుడివైపు)పై డాక్టర్ బావస్కర్ చేసిన పనిని వర్ణించే సాగర్ కాంబ్లే కళాఖండం.

'పాయిజన్ అండ్ యాంటి డోట్' పెయింటింగ్ ద్వారా కళాకారుడు సాగర్ కాంబ్లే కొంకణ్ ప్రాంతంలోని కఠినమైన వాస్తవాలను చిత్రించాడు. ఈ ప్రాంతంలో వైద్య సంరక్షణ చాలా తక్కువగా ఉండటం, తేలు కుట్టిన చికిత్సపై పరిశోధనలో ప్రసిద్ధి చెందిన వైద్యుడు, పద్మశ్రీ డాక్టర్ హిమ్మత్రావు బావస్కర్ ఎలా ప్రసిద్ధి చెందాడు, ప్రాణాలను ఎలా కాపాడారు? అనేది పెయింటింగ్స్ ద్వారా చూపారు.

పోషకాహార లోపం... ఓ చిత్రణ

'ఎ టేల్ ఆఫ్ డ్యూయల్ బర్డెన్' అనే తన కళాకృతిలో జరా షేక్ ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్ యాజ్నిక్ పరిశోధనను దృశ్యంగా చూపారు. ఇది 'పోషకాహార లోపం– రెట్టింపు భారం' గురించి నొక్కి చెబుతుంది. పోషకాహార లోపం చక్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి, ఊబకాయం, మధుమేహం పెరగకుండా నిరోధించడానికి, పునరుత్పత్తి సమయాలలో మహిళలకు సాధికారత, మద్దతు అవసరం గురించి తెలియజేస్తుంది. 'రంగ్ దే నీలా' అనే ఈ వినూత్న ప్రాజెక్ట్ 'హీలింగ్ జర్నీస్'లో ఒక ప్రత్యేక భాగం. ఆర్ట్ మీట్స్ హెల్త్ అనే క్యాప్షన్‌తో ఆరోగ్య విద్యలో చొరవ చూపుతుంది. రంగ్ దే నీలా వ్యవస్థాపకుడు అమీ షా వైద్య నిపుణుల సహకారంతో 100 కళాకృతుల సేకరణ ద్వారా ఈ కథలకు జీవం పోయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

వర్క్‌షాప్స్

కళ ద్వారా ఆరోగ్య అక్షరాస్యత, శ్రేయస్సు భావాన్ని పెంపొందించడానికి అమి షా 'రంగ్ దే నీలా' కార్యక్రమాన్ని 2022లో ప్రారంభించారు. మొదట 'రంగ్ దే నీలా' గ్రామీణ వర్క్‌షాప్‌లతో ప్రారంభమైంది. ఇక్కడ కళాకారులు, వైద్యులు కళను రూపొందించడానికి సహకరించారు. వర్క్‌షాప్‌లలో పాల్గొన్న కళాకారులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులతో చర్చించారు. వైద్య నిపుణులు మాత్రం భావోద్వేగాలు నింపుకున్న కళాకారులుగా కొత్త ప్రశంసలను పొందారు.



ర్యాంప్‌పై నడక

ఈ సందర్భంగా నిర్వహించిన 'వాక్ ఆఫ్ కాన్ఫిడెన్స్'లో మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకున్న రోగులు వైద్యులతో పాటు ర్యాంప్‌పై నడిచారు. చీర సంప్రదాయాన్ని హైలైట్ చేయడమే కాకుండా ఒక ముఖ్యమైన ఆరోగ్య సందేశాన్ని కూడా అందించారు. మధుమేహాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, సమస్యలను నివారించడం, వైకల్యాలు ఉన్నప్పటికీ బాగా జీవించడం, ఆరోగ్య సమాచారాన్ని తెలియజేయడానికి తోలుబొమ్మలాటనూ ప్రదర్శించారు.

వైద్యులను ప్రోత్సహించడానికి...

హీలింగ్ జర్నీ ద్వారా వివిధ రోగాల నుంచి కోలుకున్న 100 స్ఫూర్తిదాయకమైన కథనాల సమాహారాన్ని అందించారు. 'గుండె జబ్బులు, క్యాన్సర్, స్ట్రోక్, ఇతర అనారోగ్యాలతో పోరాడిన వ్యక్తులు నొప్పి నుండి ఎలా నయం అయ్యారనే దాని గురించి వారి కథనాలను పంచుకున్నారు. ఈ కథలను తీసుకొని వాటిని అద్భుతమైన కళాఖండాలుగా మార్చడమే మా లక్ష్యం' అని షా అన్నారు. ప్రస్తుతం పూణేలో ఈ ప్రాజెక్ట్‌కు మద్దతు ఇవ్వడానికి, వైద్యులను ప్రోత్సహించడానికి, షా మాట్లాడుతూ 'ఇప్పటివరకు 40 కథలు రికార్డ్ చేశాం, 28 కాన్వాస్‌లు పూర్తయ్యాయి. 'ప్రజలు, కమ్యూనిటీలు మరింత ఆరోగ్య–అక్షరాస్యులుగా మారడానికి ఆరోగ్యం పట్ల వారి వైఖరిని మార్చడానికి కళలను కమ్యూనికేషన్ మాధ్యమంగా ఉపయోగించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం' అని షా చెప్పారు.



నీ వ్యాపారం ఎలా ఉందన్న విషయాన్ని
భావోద్వేగాలు కాకుండా.. గణాంకాలే చెబుతాయి...
- సీన్ రాడ్, అడ్లీ అండ్ టిండర్ వ్యవస్థాపకుడు

క్యూ2 ఫలితాలదే పైచేయి



- జాబితాలో ఐటీసీ, హెచ్‌యూఎల్
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కీలకం
- గ్లోబల్ మార్కెట్ల ట్రెండ్‌కు ప్రాధాన్యం
- ఈ వారం స్టాక్ మార్కెట్ నడకపై విశ్లేషకుల అంచనాలు

సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం ప్రధానంగా కార్పొరేట్ ఫలితాలు నిర్దేశించనున్నాయి. గత వారాంతాన పలు దిగ్గజాలు జులై–సెప్టెంబర్(క్యూ2) ఫలితాలు వెల్లడించాయి. బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రాసహా ఆర్‌బీఎల్ బ్యాంక్, యుకో బ్యాంక్, ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికం పనితీరు ప్రకటించాయి. దీంతో సోమవారం ప్రధానంగా ఈ కౌంటర్లలో యాక్టివిటీ కనిపించనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. కాగా.. ఈ వారం మరిన్ని రంగాలకు చెందిన బ్లూచిప్ కంపెనీలు క్యూ2 ఫలితాలు వెల్లడించనున్నాయి. జాబితాలో ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలు ఐటీసీ, హెచ్‌యూఎల్, రిఫైనరీ దిగ్గజాలు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, సిమెంట్ దిగ్గజం అల్ట్రాటెక్ తదితరాలున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. ఇదేవిధంగా ఫైనాన్స్ దిగ్గజాలు బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇటీవలే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తోపాటు.. అదానీ గ్రీన్ ఎనర్జీ, వన్97 కమ్యూనికేషన్స్(పేటీఎమ్), జొమాటో, బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) సైతం ఫలితాలు ప్రకటించనున్నాయి.

చమురు ధరలు సైతం

ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ముదిరిన వివాదాలతో ఇటీవల ముడిచమురు ధరలకు రెక్కలొస్తున్నాయి. వారాంతాన బ్రెంట్ చమురు బ్యారల్ 75 డాలర్లకు చేరింది. దీనికిజతగా అన్నట్లు విదేశీ మార్కెట్లో పసిడి ఔన్స్(31.1 గ్రాములు) 2,730 డాలర్ల ఆల్‌టైమ్ గరిష్టాన్ని దాటింది. చమురు, పసిడి ధరల పెరుగుదల వాణిజ్యలోటును పెంచే వీలుంది. దీనికితోడు ఇటీవల డాలరుతో మారకంలో రూపాయి బలహీనపడుతోంది. చరిత్రాత్మక కనిష్టం 84కు బలహీనపడి కదులుతోంది. ఇవి ప్రతికూల అంశాలుగా మార్కెట్ విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ భయాలు, చమురు ధరల సెగ మార్కెట్లలో ఆటుపోట్లకు కారణమయ్యే అవకాశమున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ అనలిస్ట్ ప్రవేష్ గౌర్ తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు కార్పొరేట్ ఫలితాలను నిశితంగా గమనిస్తారని మిశ్రా చెబుతున్నారు.

గత వారమిలా

పలు ఆటుపోట్ల మధ్య గత వారం దేశీ స్టాక్ మార్కెట్లు స్వల్ప వెనకడుగు వేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ నికరంగా 157 పాయింట్లు(0.2 శాతం) క్షీణించి 81,225 వద్ద ముగిసింది. నిఫ్టీ కొంత అధికంగా 110 పాయింట్లు(0.4 శాతం) నీరసించి 24,854 వద్ద నిలిచింది. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.2 శాతమే నష్టపోగా.. స్మాల్ క్యాప్ 1 శాతం పైగా క్షీణించింది.

ఎఫ్‌పీఐ అమ్మకాలు


భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం కారణంగా సెంటిమెంటు బలహీనపడినట్లు మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్(రీసెర్చ్) ప్రశాంత్ తాప్సే పేర్కొన్నారు. మరోపక్క దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) నిరవధిక అమ్మకాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలకు తెరతీస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్స్‌లో నికరంగా రూ. 74,700 కోట్ల విలువైన అమ్మకాలు చేట్టారు. అయితే ఇందుకు ధీటుగా దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(డీఐఐలు) కొనుగోళ్లు చేపడుతుండటం గమనార్హం! ఈ ట్రెండ్ సమీపకాలంలో కొనసాగవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. చైనా స్టాక్స్ చౌకగా లభిస్తుండటం, దేశీ మార్కెట్లు అధిక విలువలకు చేరుకోవడం ఎఫ్‌పీఐలపై ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషించారు. కాగా.. క్యూ2లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 6 శాతం వృద్ధితో రూ. 17,286 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కొటక్ బ్యాంక్ 13 శాతం అధికంగా రూ. 5,044 కోట్ల నికర లాభం ఆర్జించింది. టెక్ మహీంద్రా 60.3 కోట్ల డాలర్ల(రూ. కోట్లు) విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకుంది. ఈ వివరాలు శనివారం(19న) వెల్లడయ్యాయి. వీటి ప్రభావం నేడు(21న) ఆయా స్టాక్స్‌పై కనిపించనున్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు.

బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ షేర్ల విభజన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సొల్యూషన్స్ అందించే బ్లూ క్లౌడ్ సాఫ్టెక్ సంస్థ తమ షేర్లను 2:1 నిష్పత్తిలో విభజించనుంది. ఈ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపినట్లు వివరించింది. దీని ప్రకారం రూ. 2 ముఖ విలువ ఉండే ఒక్కో షేరును రూ. 1 ముఖ విలువ ఉండే షేరుగా విభజిస్తారు. కంపెనీ ఇటీవలే బ్లూహెల్త్ అప్లికేషన్, బ్లూరా, ఎడ్యుజీనీ, బయోస్టర్ పేరిట నాలుగు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఉత్పత్తులను ఆవిష్కరించింది.

చిన్నషేర్ల ఫండ్స్‌కు భారీ పెట్టుబడులు



6 నెలల్లో రూ. 30,352 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి ఆరు నెలల్లో మధ్య, చిన్నతరహా షేర్ల ఫండ్స్‌కు మరోసారి పెట్టుబడులు భారీగా తరలివచ్చాయి. వెరసి ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు రూ. 30,352 కోట్లు ప్రవహించాయి. మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్(యాంఫీ) వివరాల ప్రకారం మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ. 14,756 కోట్లు, స్మాల్‌క్యాప్ ఫండ్స్ రూ. 15,586 కోట్లు చొప్పున పెట్టుబడులను ఆకట్టుకున్నాయి. ఇందుకు మధ్య, చిన్నతరహా షేర్ల విభాగాలు ఆకట్టుకునే స్థాయిలో రిటర్నులు సాధించడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) తొలి ఆరు నెలల్లోనూ మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు రూ. 32,924 కోట్ల పెట్టుబడులు లభించాయి. ఓవైపు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఈ అంశంపై ఆందోళనలు వ్యక్తం చేసినప్పటికీ ఈ ఏడాది పెట్టుబడులు కొనసాగడం గమనార్హం!

అధిక రిటర్నులు

మిడ్, స్మాల్ క్యాప్స్ అత్యధిక లాభాలు అందించగలవన్న ఇన్వెస్టర్ల విశ్వాసమే ఇందుకు కారణమని ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్(ఎంఎఫ్) సీఈవో సందీప్ బాగ్లా, ట్రేడ్‌జినీ సీవోవో త్రివేష్ పేర్కొన్నారు. ఇకపైన కూడా చిన్న షేర్లు వేగవంతంగా వృద్ధి చెందనున్నట్లు అభిప్రాయపడ్డారు. అధిక వృద్ధిగల రంగాలలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. వెరసి స్మాల్ క్యాప్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియో కేటాయింపుల్లో భాగమైపోయినట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకూ మిడ్ క్యాప్ ఇండెక్స్ 20 శాతం, స్మాల్ క్యాప్ 24 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. తద్వారా నిఫ్టీ, లార్జ్‌క్యాప్ ఇండెక్సులను అధిగమించాయి. 2024 మార్చిలో స్ట్రెస్ టెస్ట్ సైతం ఇందుకు కీలకపాత్ర పోషించినట్లు ఆనంద్ రాఠీ వెల్త్ డిప్యూటీ సీఈవో ఫిరోజ్ అజీజ్ తెలియజేశారు. దీంతో ఫండ్ మేనేజర్లు మార్కెట్ ఆటుపోట్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధపడినట్లు వివరించారు.

నవంబర్ 1న ముహూరత్ ట్రేడింగ్

దీపావళి సందర్భంగా బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ రెడీ



స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ దీపావళి పండుగ సందర్భంగా యథావిధిగా ముహూరత్(మూరత్) ట్రేడింగ్‌ను చేపట్టనున్నాయి. ఇందుకు నవంబర్ 1న(శుక్రవారం) సాయంత్రం 6 నుంచి 7వరకూ గంటపాటు ప్రత్యేక ట్రేడింగ్‌కు తెరతీయనున్నాయి. తద్వారా స్టాక్ మార్కెట్‌కు కొత్త ఏడాది సంవత్ 2081 ప్రారంభం కానున్నట్లు ఎక్స్ఛేంజీలు ఒక ప్రకటనలో తెలియజేశాయి. హిందువుల క్యాలెండర్ ప్రకారం దీపావళికి ప్రారంభమయ్యే కొత్త ఏడాది తొలి రోజు చేపట్టే ముహూరత్ ట్రేడింగ్ ఆర్థికంగా శుభాన్ని, లాభాన్ని కలగజేస్తుందని స్టాక్ మార్కెట్ వర్గాలు భావిస్తుంటాయి. కాగా.. దీపావళి రోజు మార్కెట్లలో సాధారణ ట్రేడింగ్ ఉండదు. దీని స్థానే సాయంత్రం గంటపాటు ప్రత్యేక ట్రేడింగ్‌ను నిర్వహిస్తారు. 5.45కల్లా ప్రీఓపెనింగ్ సెషన్ ప్రారంభమవుతుంది. ఈక్విటీ, ఎఫ్అండ్‌వో, కమోడిటీ, కరెన్సీ డెరివేటివ్స్ ట్రేడింగ్‌కు వీలుంటుంది.

పీఎస్‌యూలలో ట్రేడింగ్‌కు నో

ప్రభుత్వ అధికారులకు దీపమ్ ఆదేశాలు



ప్రభుత్వ రంగ కంపెనీ(పీఎస్‌యూ)ల షేర్లలో ట్రేడింగ్ చేపట్టవద్దంటూ ఆర్థిక శాఖ నిర్వహణలోని దీపమ్ అంతర్గత ఆదేశాలు జారీ చేసింది. ఆయా కంపెనీలకు సంబంధించిన మార్కెట్లపై ప్రభావం చూపగల రహస్య సమాచారం అందుబాటులో ఉంటుందన్న యోచనతో దీపమ్ తాజా నిర్ణయం తీసుకుంది. ఆయా శాఖలలో చేరేందుకు ఎంపికయ్యే వ్యక్తులు పీఎస్‌యూలలో షేర్లను కలిగి ఉంటే ముందుగానే వెల్లడించవలసిందిగా తెలియజేసింది. అధికారిక అనుమతులు పొందాక మాత్రమే వీటిని విక్రయించేందుకు వీలుంటుందని వివరించింది. పీఎస్‌యూలలో ప్రభుత్వ ఈక్విటీని దీపమ్ మేనేజ్ చేస్తుంటుంది. అంతేకాకుండా పీఎస్‌యూలలో ప్రభుత్వానికి చెందిన మైనారిటీ వాటా లేదా వ్యూహాత్మక వాటాల విక్రయం, ఎంపిక చేసిన కంపెనీల ప్రయివేటైజేషన్ తదితరాలను చేపట్టే సంగతి తెలిసిందే. వెరసి షేర్ల ధరలను ప్రభావితం చేయగల సమాచారం అందుబాటులో ఉంటుందన్న కారణంతో పీఎస్‌యూలలో ట్రేడింగ్ చేపట్టవద్దంటూ ప్రభుత్వ అధికారులకు అంతర్గత ఆదేశాల ద్వారా దీపమ్ స్పష్టం చేసింది. డిజిన్వెస్ట్‌మెంట్‌లో భాగంగా ప్రభుత్వం గతేడాది(2023–24) రూ. 16,507 కోట్ల విలువైన సీపీఎస్‌ఈ షేర్లను విక్రయించిన విషయం విదితమే. అంతక్రితం ఏడాది(2022–23)లోనూ రూ. 35,294 కోట్లు సమీకరించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) జీఐసీ, కొచిన్ షిప్‌యార్డ్‌లలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 5,160 కోట్లు అందుకుంది.

రిలయన్స్ ఇన్‌ఫ్రాకు గ్రీన్‌సిగ్నల్




నిధుల సమీకరణకు వాటాదారులు ఓకే

న్యూఢిల్లీ: మౌలికసదుపాయాల కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధుల సమీకరణ ప్రతిపాదనకు వాటాదారులు అనుమతించారు. షేర్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ. 6,000 కోట్లు సమీకరించేందుకు కంపెనీ బోర్డు సెప్టెంబర్ 19న గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా నిధులు సమకూర్చుకోనుంది. ఇందుకు పోస్టల్ బ్యాలట్ ద్వారా 98 శాతం మంది వాటాదారుల నుంచి అనుమతి పొందినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. నిధుల్లో షేర్ల ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా రూ. 3,000 కోట్లు, మార్పిడికి వీలయ్యే వారంట్ల జారీ(క్విప్) ద్వారా మరో రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. తొలి దశలో భాగంగా షేరుకి రూ. 240 ధరలో 12.56 కోట్ల ఈక్విటీ షేర్లు లేదా మార్పిడికి వీలయ్యే వారంట్లను ప్రిఫరెన్షియల్ పద్ధతిలో జారీ చేయనుంది. తద్వారా రూ. 3,014 కోట్లు అందుకోనుంది. వీటిలో 4.6 కోట్ల షేర్ల(రూ. 1,104 కోట్ల విలువ)లో ప్రమోటర్ సంస్థ రైజీ ఇనిఫినిటీ ప్రయివేట్ ఇన్వెస్ట్ చేయనుంది.

ఈపీఎఫ్‌వోలో కొత్త సభ్యులు 9 శాతం అప్

ఆగస్టులో 18 లక్షల మంది చేరిక



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో (ఈపీఎఫ్‌వో) ఆగస్టులో నికరంగా 18.53 లక్షల మంది కొత్త సభ్యులు జతయ్యారు. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఇది 9.07 శాతం అధికం. ఉద్యోగావకాశాలు, ఉద్యోగులకు లభించే ప్రయోజనాలపై అవగాహన పెరుగుతుండటం, ఈపీఎఫ్‌వో ప్రచార కార్యక్రమాలు మొదలైనవి ఇందుకు దోహదపడినట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్తగా చేరిన వారిలో 18–25 ఏళ్ల వయస్సు వారి వాటా గణనీయంగా ఉన్నట్లు పేర్కొంది. ఉద్యోగాల్లో తొలిసారి చేరేవారు, యువత సంఖ్య పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోందని వివరించింది. దాదాపు 13.54 లక్షల మంది ఉద్యోగాలు మారి, తిరిగి ఈపీఎఫ్‌లో చేరినట్లు పేర్కొంది. రాష్ట్రాలవారీగా చూస్తే నికరంగా కొత్తగా చేరిన సభ్యుల సంఖ్యను బట్టి మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉంది. కర్ణాటక, తమిళనాడు, హర్యానా, ఢిల్లీ, గుజరాత్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి చేరిన వారి సంఖ్య తలో అయిదు శాతం పైగా ఉంది.

దివ్యాంగులకు ఆరోగ్య బీమా రక్షణ

సరైన ఆరోగ్య బీమా పథకమనేది దివ్యాంగులకు రక్షణ కవచంగానే కాకుండా సాధికారత కూడా కల్పించే శక్తిమంతమైన సాధనంగా కూడా పనిచేస్తుంది. అయితే, బీమా అవసరాలు ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా ఉంటాయి కాబట్టి .. ఎలాంటి పాలసీని ఎంచుకోవాలనే విషయం కాస్త సంక్లిష్టమైనదిగా, ఒక పజిల్‌లాగా అనిపించవచ్చు. ఈ క్రమంలో అర్థం కాని పరిభాష, పైకి కనిపించని నిబంధనలు, అనేకానేక ఆప్షన్లు మొదలైన వాటితో బీమా పథకాన్ని ఎంచుకోవడమనేది చాలా గందరగోళమైన వ్యవహారంగా అనిపించవచ్చు. ఒక్క చిన్న తప్పటడుగు వేసినా సరైన కవరేజీ లేకుండా పోవడమో, ఊహించని ఖర్చులు పెట్టుకోవాల్సి రావడమో లేక అత్యవసర పరిస్థితుల్లో ఆటంకాలు ఎదురుకావడమో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే దివ్యాంగులు ఆరోగ్య బీమాను ఎంచుకునేటప్పుడు నివారించతగిన అయిదు కీలక తప్పిదాలపై అవగాహన కల్పించడం ఈ కథనం ఉద్దేశం.





హిమాన్షు వాలియా
చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్

కీలక వివరాలను పట్టించుకోకపోవడం: ఆరోగ్య బీమాను ఎంచుకునేటప్పుడు స్పష్టంగా కనిపించే కీలక విషయాలను అంతగా పట్టించుకోకపోవడమనేది సాధారణంగా చేసే తప్పిదాల్లో ఒకటిగా ఉంటుంది. దివ్యాంగుల విషయానికొస్తే, పాలసీలోని ప్రతి చిన్న అంశమూ ఎంతో ప్రభావం చూపేదిగా ఉంటుంది. కాబట్టి అన్ని నియమ నిబంధనలు, షరతులు, మినహాయింపులు, పరిమితులు మొదలైన వాటి గురించి జాగ్రత్తగా చదువుకోవాలి. నిర్దిష్ట అనారోగ్యాలు, చికిత్సలకు బీమా వర్తించకుండా మినహాయింపుల్లాంటివేమైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇలాంటి వివరాలను పట్టించుకోకపోతే ఊహించని ఖర్చులు పెట్టుకోవాల్సి రావచ్చు లేదా క్లెయిమ్ పూర్తి మొత్తం చేతికి రాకపోవచ్చు. దీంతో ఆర్థిక సమస్యలు ఎదురుకావచ్చు.

కేవలం ప్రీమియమే ప్రాతిపదికగా ఎంచుకోవడం: ప్రీమియం ఎంతనేది ముఖ్యమైన అంశమే అయినప్పటికీ కేవలం ప్రీమియం తక్కువగా ఉందనే ఆలోచనతో పథకాన్ని ఎంచుకుంటే చాలా ఖరీదైన మూల్యం చెల్లించుకోవాల్సి రావచ్చు. సాధారణంగా ప్రీమియంలు తక్కువగా ఉంటే మన జేబు నుంచి ఎక్కువగా ఖర్చు పెట్టుకోవాల్సి రావచ్చు. కవరేజీ పరిమితంగానే ఉండొచ్చు లేదా దివ్యాంగుల నిర్దిష్ట అవసరాలకు బీమా ఉపయోగపడని విధంగా పరిమితుల్లాంటివి ఉండొచ్చు. ప్రీమియం కాస్త ఎక్కువైనప్పటికీ గణనీయంగా కవరేజీని ఇచ్చే పథకాన్ని ఎంచుకుంటే మంచిది. దీనివల్ల దీర్ఘకాలంలో డబ్బు ఆదా కావడంతో పాటు ఆరోగ్య సంరక్షణ కూడా మెరుగ్గా ఉంటుంది.

కో–పే, సబ్–లిమిట్స్: క్లెయిమ్ చేసేటప్పుడు చేతికి వచ్చే మొత్తంపై కో–పే మరియు సబ్–లిమిట్స్ అనే కీలకాంశాలు చాలా ప్రభావం చూపుతాయి. కో–పే అనేది క్లెయిమ్ సమయంలో పాలసీదారు తాను భరించేందుకు అంగీకరించే నిర్దిష్ట శాతాన్ని తెలియజేస్తుంది. కో–పే పరిమితులు ఎంత ఎక్కువగా ఉంటే బీమా కంపెనీ చెల్లించే క్లెయిమ్ పేఅవుట్ అంత తక్కువవుతుంది. అలాగే, సబ్–లిమిట్స్ అనేవి నిర్దిష్ట అనారోగ్యాలు లేక చికిత్సలు, అంటే ఉదాహరణకు క్యాటరాక్ట్, మోకాలి మార్పిడి మొదలైన వాటికి వర్తించే కవరేజీ మొత్తాన్ని ఒక స్థాయికి పరిమితం చేస్తాయి. ఈ పరిమితులను చూసుకోకపోతే జేబుకు గణనీయంగా చిల్లు పడే అవకాశం ఉంటుంది.

భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం: కాలం గడిచే కొద్దీ ఆరోగ్య అవసరాలు మారుతుంటాయి. కాబట్టి భవిష్యత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకునే ప్లాన్‌ను ఎంచుకోవడం కీలకం. దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు వస్తుంటాయి కాబట్టి అదనపు సంరక్షణ లేక విభిన్నమైన చికిత్సలు అవసరమవుతాయి. ఆరోగ్య బీమా పథకాన్ని ఎంచుకునేటప్పుడు, కేవలం ప్రస్తుత అవసరాలు మాత్రమే కాకుండా భవిష్యత్‌లో తలెత్తే అవకాశమున్న వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సమగ్రంగా కవరేజీనిచ్చేవి అలాగే మారే అవసరాలను బట్టి మార్చుకునే వీలు కల్పించే పథకాలను పరిశీలించాలి. ఈ ముందు చూపు ఉంటే తర్వాత రోజుల్లో ప్లాన్లను మార్చుకోవాల్సిన అవసరం కావచ్చు లేదా కవరేజీలో అంతరాలు కావచ్చు .. అలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తపడొచ్చు.

వివిధ ఆప్షన్లను పరిశీలించకపోవడం: ఆరోగ్య బీమా పథకాన్ని ఎంచుకునేటప్పుడు కనిపించిన మొదటి పథకాన్ని తీసేసుకోకుండా వివిధ ప్లాన్లను పరిశీలించి చూసుకోవాలి. కవరేజీ, ఖర్చులు, ప్రొవైడర్ నెట్‌వర్క్‌లు, అదనపు ప్రయోజనాలపరంగా వివిధ పథకాల్లో మార్పులు ఉంటాయి. పలు ప్లాన్లను పోల్చి చూసుకునేందుకు కాస్త సమయం వెచ్చించాలి. దివ్యాంగులకు సంబంధించి ఒక్కో ప్లాన్‌లో కవరేజీ ఏ విధంగా ఉందనేది పరిశీలించి చూసుకోవాలి. కంపారిజన్ వెబ్‌సైట్ల వంటి సాధనాలను ఉపయోగించుకోవచ్చు. అవసరమైతే బీమా అడ్వైజర్ల సలహా తీసుకోవాలి. ప్లాన్ వివరాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఇలాంటి విధానాన్ని పాటిస్తే అవసరాలకు తగినట్లుగా ఉండే సమగ్రమైన, చౌకైన పథకాన్ని ఎంచుకోవడానికి వీలవుతుంది.

సరైన ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోవడం దివ్యాంగులకు చాలా కీలకం. సాధారణంగా జరిగే ఈ అయిదు తప్పిదాలను నివారించగలిగితే, అన్ని వివరాలపై అవగాహనతో, మీ అవసరాలకు తగ్గట్లుగా నిర్ణయం తీసుకోవడం వీలవుతుంది. కాబట్టి పాలసీ తీసుకునేటప్పుడు ప్రతి చిన్న అంశాన్ని క్షుణ్నంగా చదువుకోవాలి. ప్రీమియం మాత్రమే చూసుకోవద్దు. కవరేజీ పరిమితులను పరిశీలించుకోవాలి. భవిష్యత్ అవసరాల కోసం ప్లాన్ చేసుకోవాలి. వివిధ ఆప్షన్లను పోల్చి చూసుకోవాలి. ఇవన్నీ గుర్తుంచుకోవాలి. ఇందుకోసం కాస్త సమయం వెచ్చించాలి. క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. అవసరమైతే సందేహించకుండా నిపుణుల సలహాను తీసుకోవాలి. అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత మీకు సమగ్రమైన కవరేజీ, ఆర్థిక భద్రత, నిశ్చింతనిచ్చే ప్లాన్‌ను ఎంచుకోవడానికి వీలవుతుంది.

భారత్ మార్కెట్లోకి బిసెల్ రీఎంట్రీ

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన హోమ్‌కేర్ సొల్యూషన్స్ సంస్థ బిస్సెల్ ఆరేళ్ల తర్వాత భారత మార్కెట్లోకి తిరిగి ప్రవేశించింది. ఈసారి భారత్‌లో ఉత్పత్తుల పంపిణీ కోసం కావిటాక్ గ్లోబల్ కామర్స్ సంస్థతో జట్టు కట్టింది. స్పాట్‌క్లీన్ హైడ్రోస్టీమ్, స్పాట్‌క్లీన్ ప్రోహీట్ పేరిట పోర్టబుల్ వెట్, డ్రై వేక్యూమ్ క్లీనింగ్ సిస్టమ్‌ల విక్రయాలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు బిసెల్ ప్రెసిడెంట్ (గ్లోబల్ మార్కెట్స్) మ్యాక్స్ బిసెల్ తెలిపారు. ప్రస్తుతం ఫ్లోర్ సంరక్షణ ఉత్పత్తులకు సంబంధించి భారత్‌లో మార్కెట్ పరిమాణం చిన్నగానే ఉన్నప్పటికీ భవిష్యత్‌లో గణనీయంగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముందుగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి భాగస్వాములతో ఆన్‌లైన్‌లో అమ్మకాలతో ప్రారంభించి, విక్రయాల పరిమాణాన్ని బట్టి క్రమంగా ఆఫ్‌లైన్‌లో కూడా కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉందని మ్యాక్స్ వివరించారు. అమెరికా, చైనా తదితర దేశాల్లో గణనీయంగా వ్యాపారం ఉన్న బిసెల్ సంస్థ 2018లో దేశీ మార్కెట్ కోసం యురేకా ఫోర్బ్స్‌తో జట్టు కట్టింది. కానీ, ఆ తర్వాత భారత్ మార్కెట్ నుంచి నిష్క్రమించింది.

రిటర్న్‌ని రివైజ్ చేసుకోవచ్చు ..

ఒరిజినల్ రిటర్ను వేశారు. వెరిఫై కూడా అయింది. కానీ మీరు ఆ రిటర్నుని చెక్ చేసుకుంటే, ఏవైనా పొరపాట్లు జరిగి ఉండొచ్చు. వాటిని సరిదిద్దుకుని రివైజ్డ్ రిటర్న్ దాఖలు చేయడానికి మీకు అవకాశం ఉంటుంది. సాధారణంగా ఎటువంటి పొరపాట్లు జరుగుతాయంటే ..

- కూడిక, తీసివేతల్లో తప్పులు
- ఆదాయం మర్చిపోవడం.. పరిగణనలోకి తీసుకోకపోవడం
- ఆదాయం లెక్కించడంలో పొరపాటు జరగడం
- మినహాయింపులు, తగ్గింపులు మొదలైనవి మర్చిపోవడం
- ట్యాక్స్ లెక్కింపులో తప్పులు
- టీడీఎస్‌లో పొరపాట్లు
- అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించినవి మర్చిపోవడం
- మినహాయింపు మొదలైనవాటిని తప్పుగా, ఎక్కువగా క్లెయిమ్ చేయడం
- బ్యాంకు అకౌంటు వివరాలు తప్పుగా ఇవ్వడం
- ఒక ఫారంనకు బదులుగా మరొక ఫారం వేయడం

సెక్షన్ 139(5) ప్రకారం మీరు మీ ఒరిజినల్ రిటర్నుని రివైజ్ చేసుకోవచ్చు. రివైజ్డ్ రిటర్న్ అంటేనే ఒరిజినల్ రిటర్న్‌కి బదులుగా అని .. మరొక రకంగా 'రిప్లేస్‌మెంట్' అని చెప్పవచ్చు. ఇలా వేయడంలో గతవారం చెప్పినట్లుగా రూ. 1,000/5,000 చెల్లించనవసరం లేదు. మీరు సకాలంలో వేసినట్లే. అయితే, పన్ను కట్టాల్సి ఉంటే పన్నుతో పాటు వడ్డీ చెల్లించాలి.

ఎప్పటిలోగా ఈ రిటర్ను వేయొచ్చు..

మీరు వేసిన ఒరిజినల్ రిటర్నుకి సంబంధించి అసెస్‌మెంట్ ఆర్డర్లు వచ్చేలోగా లేదా 2024 డిసెంబర్ 12లోగా .. (ఈ రెండింటిలో ఏది ముందు అయితే అది). గడువుతేదీ తర్వాత రిటర్ను వేసిన వాళ్లు కూడా రివైజ్డ్ రిటర్ను వేయొచ్చు. ఇలా ఎన్నిసార్లు రివైజ్ చేయొచ్చు .. అంటే ఎన్నిసార్లయినా రివైజ్ చేయొచ్చు. ఎటువంటి ఆంక్షలు, పరిమితులు లేవు. అలా అని మాటిమాటికీ చేయకండి.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

రివైజ్ చేయాల్సిన అవసరం వస్తే ఈ కింది జాగ్రత్తలు తీసుకోండి సుమా..

- మళ్లీ పొరపాటు జరగకుండా జాగ్రత్త తీసుకోండి
- సమగ్రంగా అన్ని వివరాలు సేకరించండి
- రివైజ్ రిటర్న్ ఆప్షన్‌ను ఎంచుకోండి
- సరైన ఐటీఆర్‌ను ఎంచుకోండి
- ఒరిజినల్ రిటర్ను వివరాలన్నీ ఇవ్వాలి లేదా అప్‌లోడ్ చేయాలి
- మిగతా పద్ధతంతా షరా మామూలే

మనంతట మనమే రివైజ్ చేస్తున్నాం. మళ్లీ మళ్లీ చేయడం సబబు కాదు. సమంజసం కాదు. రివైజ్ చేయడానికి కారణాలు సాంకేతికపరమైనవి, చిన్న చిన్నవైతే ఫర్వాలేదు. కానీ పెద్దవి అయితే మాత్రం మీ రివైజ్డ్ రిటర్నుని స్క్రూటినీ కోసం సెలెక్ట్ చేసే అవకాశం ఉంది. కాబట్టి తగిన జాగ్రత్త తీసుకోండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.



చాంప్ హర్ష కార్తీక

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ జే30 టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఓరుగంటి హర్ష కార్తీక చాంపియన్‌గా అవతరించింది. ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో హర్ష తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకుండా టైటిల్ సాధించడం విశేషం. లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న హర్ష ఫైనల్లో 6-4, 7-6 (7/4)తో బ్రెజిల్ ప్లేయర్ బ్రునా లియోటో కర్వాలోపై విజయం సాధించింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన 13 ఏళ్ల హర్ష రెండో రౌండ్‌లో 6-0, 6-2తో బెథ్లెహామ్ అండార్గా డుచె (ఇథియోపియా)పై, క్వార్టర్ ఫైనల్లో 6-0, 6-0తో టాప్ సీడ్ ఫెయిత్ ఉరాసా (కెన్యా)పై, సెమీఫైనల్లో 6-2, 6-1తో గుర్లీన్ కౌర్ (భారత్)పై గెలిచింది.

ఆంధ్ర ఫాలోఆన్

రెండో ఇన్నింగ్స్‌లో 203/4 | రాణించిన అభిషేక్, మహీప్ | పోరాడుతున్న భరత్, విహారి

అహ్మదాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా మాజీ చాంపియన్ గుజరాత్‌తో జరుగుతున్న గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఫాలోఆన్‌లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో టాపార్డర్ వైఫల్యంతో తక్కువ స్కోరుకే ఆలౌటైన ఆంధ్ర జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరుగుతున్న ఈ పోరులో ఆదివారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడుతూ 66 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (113 బంతుల్లో 81; 12 ఫోర్లు, 2 సిక్సర్లు), మహీప్ కుమార్ (55; 5 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలతో సత్తా చాటారు. కెప్టెన్ రికీ భుయ్ (0), షేక్ రషీద్ (3) విఫలం కాగా... వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (31 బ్యాటింగ్; ఒక ఫోర్, ఒక సిక్సర్), హనుమ విహారి (24 బ్యాటింగ్; 3 ఫోర్లు) పోరాడుతున్నారు. గుజరాత్ బౌలర్లలో టీమిండియా స్పిన్నర్ రవి బిష్ణోయ్ 3 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 137/5తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు చివరకు 51.3 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. టాపార్డర్ చేతులెత్తేసిన చోట శ్రీకర్ భరత్ (96 బంతుల్లో 98; 15 ఫోర్లు, 2 సిక్సర్లు) ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. భారీ షాట్లతో చెలరేగిన భరత్ త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టి20 సిరీస్‌లో మెరుపులు మెరిపించిన నితీశ్ కుమార్ రెడ్డి (47; 7 ఫోర్లు, ఒక సిక్సర్), విజయ్ (36; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. గుజరాత్ బౌలర్లలో కెప్టెన్ చింతన్ గాజా 4 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 154 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న గుజరాత్ జట్టు ఆంధ్రను ఫాలోఆన్ ఆడించగా... రెండో ఇన్నింగ్స్‌లో టాపార్డర్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... చేతిలో 6 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు 49 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. భరత్, విహారి క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

గుజరాత్ తొలి ఇన్నింగ్స్ 367; ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 213; ఆంధ్ర రెండో ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (ఎల్బీ) రవి బిష్ణోయ్ 81; మహీప్ కుమార్ (బి) రవి బిష్ణోయ్ 55; రికీ భుయ్ (సి అండ్ బి) అర్జాన్ 0; షేక్ రషీద్ (ఎల్బీ) రవి బిష్ణోయ్ 3; శ్రీకర్ భరత్ (బ్యాటింగ్) 31; హనుమ విహారి (బ్యాటింగ్) 24; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (66 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి) 203. వికెట్ల పతనం:** 1-130, 2-131, 3-138, 4-145, **బౌలింగ్:** చింతన్ గాజా 6-2-21-0; అర్జాన్ 11-3-20-1; సిద్ధార్థ్ దేశాయ్ 22-4-55-0; రవి బిష్ణోయ్ 17-2-67-3; జయ్‌మీత్ పటేల్ 6-2-8-0; మనన్ హింగ్రాజియా 4-0-24-0.


శ్రీకర్ భరత్

హైదరాబాద్ 292 ఆలౌట్

ఉత్తరాఖండ్‌తో రంజీ మ్యాచ్

డెహ్రాడూన్: రంజీ ట్రోఫీలో భాగంగా ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఆకట్టుకోలేకపోయింది. హైదరాబాద్ జట్టు ప్రత్యర్థికి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కట్టబెట్టింది. సొంతగడ్డపై జరుగుతున్న మ్యాచ్‌లో ఆదివారం ఆట ముగిసే సమయానికి ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (57; 4 ఫోర్లు), కునాల్ చండేలా (57 బ్యాటింగ్; 4 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు రెండు వికెట్లు పడగొట్టగా... మిలింద్, కార్తికేయ, అనికేత్ రెడ్డి తలా ఒక వికెట్ పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు 97 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ రాధేశ్ (94; 10 ఫోర్లు), హిమతేజ (78; 8 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలతో రాణించారు. సెంచరీ చేసేలా కనిపించిన రాహుల్ రాధేశ్ ఆరు పరుగుల దూరంలో వికెట్ కీపర్ ఆదిత్య తారెకు క్యాచ్ ఇచ్చి వెనుదిరగగా... తనయ్ త్యాగరాజన్ (30) ఫర్వాలేదనిపించాడు. ఉత్తరాఖండ్ బౌలర్లలో దీపక్ ధాపోలా 5, ఆకాశ్ మధ్వాల్ రెండు వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 33 పరుగులు కలుపుకొని ఓవరాల్‌గా ఉత్తరాఖండ్ 222 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతుంది. కునాల్ చండేలాతో పాటు స్వప్నిల్ సింగ్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్ 325; హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 292; ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్: అవనీశ్ (సి) రక్షణ్ రెడ్డి (బి) మిలింద్ 14; వైభవ్ (సి) రాహుల్ రాధేశ్ (బి) కార్తికేయ 17; రవికుమార్ సమర్థ్ (సి) తనయ్ (బి) అనికేత్ రెడ్డి 57; కునాల్ చండేలా (బ్యాటింగ్) 57; యువరాజ్ (సి) తనయ్ (బి) రోహిత్ రాయుడు 21; ఆదిత్య తారె (బి) రోహిత్ రాయుడు 1; స్వప్నిల్ సింగ్ (బ్యాటింగ్) 21; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్లకు) 189. వికెట్ల పతనం:** 1-22, 2-39, 3-123, 4-147, 5-149. **బౌలింగ్:** మిలింద్ 10-3-29-1; కార్తికేయ 9-0-24-1; రక్షణ్ రెడ్డి 7-1-21-0; తనయ్ త్యాగరాజన్ 13-4-38-0; అనికేత్ రెడ్డి 17-1-56-1; రోహిత్ రాయుడు 5-0-20-2.

హుమేరా-పూజా జోడీకి టైటిల్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి హుమేరా బహార్మస్ డబుల్స్ టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. బెంగళూరులో ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో హుమేరా భారత్‌కే చెందిన పూజా ఇంగాలెతో కలిసి డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో టాప్ సీడ్ హుమేరా-పూజా ద్వయం 3-6, 6-0, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో ఆకాంక్ష-సోహా సాదిక్ (భారత్) జోడీపై గెలిచింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో హుమేరా-పూజా రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను రెండుసార్లు చేజార్చుకొని, ప్రత్యర్థి జోడీ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు. హుమేరా కెరీర్‌లో ఇది రెండో ఐటీఎఫ్ డబుల్స్ టైటిల్. 2022లో హైదరాబాద్‌కే చెందిన శ్రీవల్లి రష్మికతో కలిసి హుమేరా గుర్‌గ్రామ్‌లో జరిగిన ఐటీఎఫ్ టోర్నీలో తొలిసారి డబుల్స్ టైటిల్‌ను సాధించింది.



ధీరజ్, సురేఖలకు నిరాశ

వరల్డ్‌కప్ ఆర్చరీ ఫైనల్స్ టోర్నీ

ట్లాక్స్‌కాలా (మెక్సికో): ఆర్చరీ సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత స్టార్ ప్లేయర్లు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్, వెన్నం జ్యోతి సురేఖ నిరాశపరిచారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోని టాప్-8 ప్లేయర్లకు వరల్డ్‌కప్ ఫైనల్స్ టోర్నీలో పాల్గొనే అవకాశం లభిస్తుంది. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడ్డ ధీరజ్ పురుషుల రికర్వ్ విభాగంలో ఆడిన తొలి మ్యాచ్‌లోనే (క్వార్టర్ ఫైనల్) ఓడిపోయాడు. మరోవైపు మహిళల కాంపౌండ్ విభాగంలో జ్యోతి సురేఖ కూడా ఆడిన తొలి మ్యాచ్‌లోనే (క్వార్టర్ ఫైనల్) పరాజయం పాలైంది. పురుషుల కాంపౌండ్ విభాగంలో భారత ప్లేయర్ ప్రథమేశ్ కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయి నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడు. మెర్రీ మార్గా పాస్ (ఎస్తోనియా)తో జరిగిన మ్యాచ్‌లో జ్యోతి సురేఖ 145-147 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. ప్రథమేశ్ క్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన ప్రియాంశ్‌పై 147-146తో గెలిచాడు. సెమీఫైనల్లో ప్రథమేశ్ డెన్మార్క్ ప్లేయర్ మథియాస్ ఫుల్లర్టన్ చేతిలో ఓటమి చవిచూశాడు. కాంస్య పతక మ్యాచ్‌లో ప్రథమేశ్ 146-150తో మైక్ ష్లోసెర్ (నెదర్లాండ్స్) చేతిలో ఓడిపోయాడు. రికర్వ్ క్వార్టర్ ఫైనల్లో ధీరజ్ 4-6 (28-28, 29-26, 28-28, 26-30, 28-29)తో లీ వూ సియోక్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమి చవిచూశాడు.





పోరాడి ఓడిన సుమిత్ నగాల్

స్విస్ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీ



బాసెల్: భారత నంబర్‌వన్ ర్యాంకర్ సుమిత్ నగాల్ స్విస్ ఇండోర్స్ బాసెల్ ఓపెన్-500 ఏటీపీ టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించలేకపోయాడు. ఆదివారం స్విట్జర్లాండ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ పోరాడి ఓడిపోయాడు. ప్రపంచ 63వ ర్యాంకర్ జేమ్స్ డక్‌వర్త్ (ఆస్ట్రేలియా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 78వ ర్యాంకర్ సుమిత్ నగాల్ 4-6, 6-7 (2/7)తో ఓటమి చవిచూశాడు. గంటా 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఒక ఏస్ సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 16 సార్లు దూసుకొచ్చి 8 సార్లు పాయింట్లు గెలిచాడు. 24 అనవసర తప్పిదాలు చేసిన నగాల్ 11 విన్నర్స్ కొట్టాడు. మరోవైపు జేమ్స్ డక్‌వర్త్ పది ఏస్‌లు సంధించాడు. నెట్‌వద్దకు 15 సార్లు దూసుకొచ్చి 14 సార్లు పాయింట్లు నెగ్గాడు. 40 అనవసర తప్పిదాలు చేసిన డక్‌వర్త్ 36 విన్నర్స్ కొట్టాడు. సుమిత్‌కు 9,535 యూరోల (రూ. 8 లక్షల 70 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 13 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

వరుణ్ పునరాగమనం

జర్మనీతో హాకీ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: లైంగిక దాడి ఆరోపణలతో పారిస్ ఒలింపిక్స్‌తోపాటు ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన భారత హాకీ ప్లేయర్ వరుణ్ కుమార్ తిరిగి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 23, 24వ తేదీల్లో జర్మనీతో జరగనున్న రెండు మ్యాచ్‌ల సిరీస్ కోసం హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఆదివారం జట్టును ప్రకటించింది. జూనియర్ వాలీబాల్ ప్లేయర్‌ను లైంగికంగా వేధించిన కేసులో బెంగళూరు పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరిలో వరుణ్ కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం వరుణ్ నిర్దోషి అని తేలడంతో హాకీ ఇండియా అతడిని జట్టు ఎంపికకు పరిగణించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు సారథ్యం వహించనుండగా... వివేక్ సాగర్ ప్రసాద్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసియా చాంపియన్స్ ట్రోఫీకి విశ్రాంతినిచ్చిన మన్‌దీప్ సింగ్ తిరిగి జట్టులోకి వచ్చాడు.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), క్రిషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కెరా (గోల్ కీపర్లు), జర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, వరుణ్ కుమార్, సంజయ్, సుమిత్, నీలమ్ సంజీప్ (డిఫెండర్స్), మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, విష్ణుకాంత్ సింగ్, నీలకంఠ శర్మ, షంషేర్ సింగ్, మొహమ్మద్ రాహీల్, రాజిందర్ సింగ్ (మిడ్‌ఫీల్డర్స్), మన్‌దీప్ సింగ్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, ఆదిత్య అర్జున్, దిల్‌ప్రీత్ సింగ్, శైలేంద్ర లక్రా (ఫార్వర్డ్స్).



భారత టెస్టు జట్టులో వాషింగ్టన్ సుందర్



బెంగళూరు: న్యూజిలాండ్ జట్టుతో జరిగే తర్వాతి రెండు టెస్టుల్లో పాల్గొనే భారత జట్టులో అదనంగా ఒక ప్లేయర్‌ను జోడించారు. తమిళనాడు స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను భారత టెస్టు జట్టులోకి ఎంపిక చేశారు. 25 ఏళ్ల వాషింగ్టన్ ఢిల్లీతో ఇటీవల జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో 152 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా సుందర్ తన కెరీర్‌లో నాలుగు టెస్టులు, 22 వన్డేలు, 52 టి20 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

భారత టెస్టు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, కోహ్లి, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషభ్ పంత్, ధ్రువ్ జురేల్, అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ **పటేల్, కుల్దీప్ యాదవ్, సిరాజ్, ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్.**

గుజరాత్ జెయింట్స్ బోణీ



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టు శుభారంభం చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 36-32 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్ జట్టును ఓడించింది. గుజరాత్ జెయింట్స్‌లో ప్రతీక్ దహియా 8, హిమాన్షు 7 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 39-34తో బెంగాల్ వారియర్స్ జట్టుపై విజయం సాధించింది. **జైపూర్ జట్టు తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 15** పాయింట్లతో సత్తా చాటాడు. 12 రెయిడింగ్ పాయింట్లతో సూపర్-10 ఖాతాలో వేసుకున్న అర్జున్ జట్టుకు కీలక సమయాల్లో ఆధిక్యం అందించాడు. అభిజీత్ మలిక్ 7 పాయింట్లు సాధించాడు. బెంగాల్ వారియర్స్ జట్టు తరఫున అత్యధికంగా నితిన్ కుమార్ 13 పాయింట్లు సాధించాడు. మణీందర్ సింగ్ 8 పాయింట్లు సాధించాడు. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8:00 గంటల నుంచి), పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్ (రాత్రి 9:00 గంటల నుంచి) తలపడతాయి.




యువ భారత్‌కు రెండో విజయం

జోహర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జోహర్ కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పోరులో భారత కుర్రాళ్లు 6-4 గోల్స్ తేడాతో బ్రిటన్ జట్టును కంగుతినిపించారు. మ్యాచ్ ఆరంభమైన కొన్ని నిమిషాలకే ఆటగాళ్ల దాడులు మొదలయ్యాయి. ఈ క్రమంలో బోణీ బ్రిటన్ 2వ నిమిషంలో కొడితే... ఆఖరుదాకా భారత్ అదరగొట్టింది. మొహమ్మద్ కొనయిన్ దాద్ ఏడో నిమిషంలో భారత్ ఖాతా తెరిచాడు. మొదటి పది నిమిషాల్లోపే ఒకసారి 1-1తో... తర్వాత 20వ నిమిషంలో రెండో సారి 2-2తో స్కోరు సమమైంది. ఇక అక్కడి నుంచి భారత్ ప్రతాపానికి పైమెట్టుగా సాగింది. దిల్‌రాజ్ సింగ్ (17వ, 50వ నిమిషాల్లో), శారదానంద్ తివారీ (20వ, 50వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయడంతో బ్రిటన్ ఇక మ్యాచ్‌లో తేరుకోలేకపోయింది. మధ్యలో మన్‌మీత్ సింగ్ (26వ ని.లో) గోల్ సాధించడంతో ఒక దశలో భారత్ 4-2తో ఆధిక్యాన్ని అమాంతం పెంచుకుంది. ప్రత్యర్థి జట్టులో రోరి పెన్‌రోజ్ (2వ, 15వ ని.లో), మైకేల్ రాయ్‌డెన్ (46వ, 59వ ని.లో) చెరో రెండు గోల్స్‌లో చేసి అంతరాన్ని అయితే తగ్గించగలిగారు కానీ... భారత్ ధాటి నుంచి పరాజయాన్ని తప్పించలేకపోయారు. ఆరంభంలోనే బ్రిటన్ శిబిరం గోల్ చేయడంతో భారత రక్షణ పంక్తి తమ లోపాలను వెంటనే సరిదిద్దుకుంది. దీనికితోడు స్ట్రయికర్లు కూడా క్రమం తప్పకుండా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై విజయవంతంగా లక్ష్యంపై గురిపెట్టడంతో భారత్ విజయం సులువైంది. తొలిమ్యాచ్‌లో భారత్ 4-2తో జపాన్‌ను చిత్తు చేసింది.

విజేత తనీషా



బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన తనీషా కశ్యప్ విజేతగా నిలిచిది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో అస్సాంకు చెందిన 22 ఏళ్ల తనీషా మూడు సెట్‌ల పోరాటంలో విజయాన్ని అందుకుంది. భారత్‌కే చెందిన ఆకాంక్ష నిట్టూరేతో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో తనీషా 6-7 (5/7), 6-1, 6-1తో గెలుపొందింది. తద్వారా తన కెరీర్‌లో తొలి ఐటీఎఫ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ తుది పోరులో తనీషా 10 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో చేజార్చుకున్న తనీషా ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుంది. కేవలం రెండు గేమ్‌లను మాత్రమే కోల్పోయి మ్యాచ్‌ను దక్కించుకుంది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన తనీషా ప్రత్యర్థి సర్వీస్‌ను తొమ్మిదిసార్లు బ్రేక్ చేసింది. చాంపియన్ తనీషాకు 2,352 డాలర్లు (రూ. 1 లక్షా 97 వేలు), రన్నరప్ ఆకాంక్షకు 1,470 డాలర్లు (రూ. 1 లక్షా 23 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.



నువ్వా నేనా!?

హోరాహోరీగా ట్రంప్, హారిస్ ప్రచారం • రెండు వారాల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు శరవేగంగా సమీపిస్తున్నాయి. కమలా హారిస్ రూపంలో దేశ చరిత్రలోనే తొలిసారిగా ఓ మహిళ పీఠమెక్కుతారా, లేక పాత కాపు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విజయఢంకా మోగిస్తారా అన్నది ఆసక్తకరంగా మారింది. రెండు వారాల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో వారి విజయావకాశాలపై అమెరికా అంతటా జోరుగా చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించి సర్వేలు ఏం చెబుతున్నాయనే అంశాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ తెలుసుకుంటూ ఓటర్లు తలమునకలుగా ఉన్నారు.

జాతీయ పోలింగ్ సగటులో హారిస్ ముందంజ

జాతీయ పోలింగ్ సగటులో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి హారిసే ముందంజలో ఉన్నారు. ఏబీసీ న్యూస్, వెబ్‌సైట్ 538 గణాంకాల ప్రకారం రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌కు దేశవ్యాప్తంగా 46 శాతం మంది ఓటర్లు మద్దతు పలుకుతున్నారు. హారిస్‌కు కాస్త ఎక్కువగా 48 శాతం మంది మద్దతుండటం విశేషం. అధ్యక్షుడు జో బైడెన్‌ను కాదని హారిస్‌ను డెమొక్రటిక్ పార్టీ బరిలో దింపడం తెలిసిందే. అనంతరం ఆమెకు ఫాలోయింగ్ అనూహ్యంగా పెరిగింది. సెప్టెంబర్ నుంచి హారిస్ ఆధిక్యత స్థిరంగా కొనసాగుతోంది. 7 కోట్ల మంది వీక్షించిన సెప్టెంబర్ పది నాటి హారిస్–ట్రంప్ బిగ్ డిబేట్ తర్వాత కూడా ఇందులో మార్పేమీ లేదు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థి కాకుండా ఎక్కువ ఎలక్టోరల్ కాలేజ్ ఓట్లను సాధించిన వారే విజేతగా నిలుస్తారు. ప్రతి రాష్ట్రానికీ జనాభాను బట్టి నిర్దిష్ట సంఖ్యలో ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు కేటాయిస్తారు. ఇలా మొత్తంగా అమెరికాలో 538 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్నాయి. గెలుపు కోసం కనీసం 270 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లను గెల్చుకోవాల్సి ఉంటుంది.

స్వింగ్ రాష్ట్రాల్లోనూ హారిసే

అమెరికా ఓటర్లు చాలావరకు తాము ఏ పార్టీని అభిమానిస్తామో, ఏ పార్టీకి మద్దతు పలుకుతామో బహిరంగంగానే చెబుతారు. అంతమాత్రాన వారు పార్టీకి ఓటేస్తారన్న గ్యారెంటీ లేదు. ఏ పార్టీకీ మద్దతు తెలపని తటస్థ ఓటర్లుంటారు. ఇలాంటి వాళ్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలనే స్వింగ్ స్టేట్స్ అంటారు. వీళ్ల మద్దతు దక్కిన అభ్యర్థే గెలవడం పరిపాటి. ఈసారి అందరి కళ్లూ ఏడు స్వింగ్ రాష్ట్రాలపైనే ఉన్నాయి! స్వింగ్ స్టేట్స్‌లో అత్యధికంగా 19 ఎలక్టోరల్ ఓట్లున్న పెన్సిల్వేనియాతో పాటు , 10 ఓట్లున్న విస్కాన్సిన్‌లో ట్రంప్, హారిస్ సమవుజ్జీలుగా నిలవడం విశేషం! 15 ఓట్లున్న మిషిగన్, ఆరు ఓట్లున్న నెవడాల్లో హారిస్‌కు స్వల్ప మొగ్గుంది. 16 ఓట్ల చొప్పున ఉన్న నార్త్ కరోలినా, జార్జియాల్లో, 11 ఓట్లున్న అరిజోనాలో ట్రంప్ స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారు. అయితే స్వింగ్ రాష్ట్రాలన్నింటిలో కలిపి చూస్తే హారిసే సగటున 5 శాతం ఆధిక్యంలో ఉన్నట్టు గణాంకాలు చాటుతున్నాయి.

సగటు ఎలా లెక్కిస్తారు?

రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో వేర్వేరు సంస్థలు చేసిన పోల్ సర్వేలను మదించి అభ్యర్థుల ఆదరణ తాలూకు సగటును లెక్కిస్తారు. అమెరికాలో ఏబీసీ న్యూస్‌లో భాగమైన పోలింగ్ విశ్లేషణ సంస్థ వెబ్‌సైట్ 538 దీన్ని లెక్కిస్తోంది. సర్వేలో ఎంతమంది పాల్గొన్నారు, ఏ రోజున పోల్ చేపట్టారు, ఫోన్, టెక్స్ట్ మెసేజ్, ఆన్‌లైన్... వీటిలో ఓటర్ల నుంచి ఎలా సమాచారం రాబట్టారు వంటి అంశాలను పారదర్శకంగా, నిజాయతీగా బేరీజు వేసి డేటాను సేకరిస్తారు. ఆ మీదట సగటును లెక్కిస్తారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



హస్తినలో 'అమర' ప్రేమికుడు!

క్షణికావేశంలో చేయి కోసుకున్న ప్రియురాలు

ఆమెకు ఏమవుతుందోనన్న ఆందోళనతో తనువు చాలించిన వైనం

ఏడాది కింద మొదలైన ఆన్‌లైన్ పరిచయం ప్రేమకు దారితీసింది. కానీ చిన్న వివాదం ఈ ప్రేమ కథలో అంతులేని విషాదం మిగిల్చింది. రోమియో, జూలియట్ తరహా ఉదంతానికి ఢిల్లీ వేదికగా నిలిచింది. పట్టరాని ఆగ్రహంతో ప్రాణాలు తీసుకోబోయిన ప్రేమికురాలిని కాపాడబోయి ప్రేమికుడు ప్రాణాలు కోల్పోయాడు. తూర్పు ఢిల్లీలోని జగత్‌పురీలో 23 ఏళ్ల అరుణ్ నందాకు ఏడాది క్రితం ఆన్‌లైన్‌లో ఒకమ్మాయి పరిచయమైంది. లా స్టూడెంటైన ఆ అమ్మాయికి చదువంటే ప్రాణం. నిత్యం పార్టీలు, స్నేహితులంటూ తిరిగే అరుణ్‌కు, ఆమెకు ఇటీవల చిన్నపాటి మనస్పర్థలొచ్చాయి. శుక్రవారం రాత్రి అరుణ్ బంధువుల్లో ఒకరు ఆ అమ్మాయితో గొడవకు దిగారు. దీన్ని అవమానంగా భావించి ఆమె ఇంటికెళ్లి కత్తితో మణికట్టు కోసేసుకుంది. అందులోంచి చిమ్ముతున్న రక్త ధారలను వీడియో తీసి వాట్సాప్‌లో అరుణ్‌కు షేర్ చేసింది. అది చూసి అరుణ్ హుతాశుడయ్యాడు. ప్రేమికురాలు రక్తపుమడుగులో పడుంటంతో ఆమె తల్లికి ఫోన్ చేసి అప్రమత్తంచేశాడు. వెంటనే వాళ్ల ఇంటికెళ్లి ఆమెను హుటాహుటిన ఆస్పత్రిలో చేర్చాడు. వైద్యులు, నర్సులకు విషయం చెప్పి ఆమెనెలాగైనా బతికించాలంటూ ప్రాధేయపడ్డాడు. ఈ క్రమంలో నర్సుతో మాట్లాడుతూనే ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. వైద్యులు స్పృహలోకి తెచ్చే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. దాంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వాళ్లు వచ్చేలోపే అరుణ్ చనిపోయాడని వైద్యులు ప్రకటించారు. మధ్యలో స్పృహలోకి వచ్చి కూడా, 'ఆమెను కాపాడండి. లేదంటే చనిపోతుంది' అంటూ ప్రాధేయపడ్డట్టు సిబ్బంది చెప్పారు! గుండెపోటుతోనే అతను మరణించి ఉంటారని భావిస్తున్నారు. ప్రేమికురాలు ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటోంది. - న్యూఢిల్లీ



పిరమిడ్‌పై పక్షుల వేట

అలవోకగా ఎక్కి దిగిన వీధి శునకం • పారా గ్లైడర్ వీడియోతో వెలుగులోకి

వీధి శునకాలు ఆహారం కోసం ఊరంతా తిరుగుతాయి. కానీ ఒక వీధికుక్క ఏకంగా ఈజిప్ట్ పిరమిడ్‌నే ఎక్కేసింది. మార్షల్ మోషెర్ అనే అమెరికా పారా గ్లైడర్ ఈ ఉదంతాన్ని తన మొబైల్ కెమెరాలో బంధించాడు. ఆయన ఇటీవల తోటి పారాగ్లైడర్లతో కలిసి ప్రపంచ ప్రఖ్యాత గిజా పిరమిడ్ల మీదుగా సూర్యోదయ అందాలను చూసేందుకు బయల్దేరాడు. వినీలాకాశంలో చక్కర్లు కొడుతుండగా ఖఫ్రే పిరమిడ్ శిఖరంపై ఒక జీవి కనిపించింది. తొలుత దాన్ని పర్వత ప్రాంతాల్లో తిరిగే బుల్లి సింహంగా భావించారు. కానీ మొబైల్ కెమెరాను జూమ్ చేసి చూస్తే సాధారణ వీధి కుక్క అని అర్థమైంది. ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన పిరమిడ్‌పై అదేం చేస్తోందబ్బా అని పరిశీలిస్తే, పిరమిడ్ శిఖరాగ్రంపై వాలే పిట్టలను పట్టుకునేందుకు పరుగులు పెడుతూ కన్పించింది. వీధి కుక్కలు ఇలా 130 మీటర్లకు పై చిలుకు ఎత్తుకు ఎక్కిరావడం అరుదు. దారి తప్పి వచ్చిందేమో, కిందకు ఎలా వెళ్లాలో తెలీక పైనే తచ్చాడుతోందేమో అని వారు భావించారు. మర్నాడు దాన్ని కిందకు దించాలని నిర్ణయించుకున్నారు. అది పిరమిడ్‌పై తిరుగుతున్న వీడియోను మోషెర్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేస్తే రాత్రికి రాత్రే కోట్ల మంది చూశారు. తీరా మర్నాడు వెళ్లి చూస్తే కుక్క పిరమిడ్‌పై లేదు! ఒక శునకం పిరమిడ్ పై నుంచి తాపీగా కిందకు దిగొస్తున్న వీడియోను మరో సాహస యాత్రికుడు తర్వాతి రోజే నెట్‌లో షేర్‌చేశాడు. దాంతో అదే ఇదని నిర్ధారణకు వచ్చారు. ఈ వీడియో చూసిన కొందరు ఈజిప్షియన్లు మాత్రం శునకాన్ని ఏదో అతీంద్రియ శక్తి పైకి తీసుకెళ్లిందని కామెంట్లు చేశారు. ఈజిప్ట్ పురాణాల ప్రకారం ఆ ప్రాంతంలో అనూబిస్ అనే దైవం ఉండేది. మనిషి శరీరం, నక్క ముఖంతో ఉండే ఆ దేవున్ని శుభాలకు ప్రతిరూపంగా భావిస్తారు. - కైరో

భూమి చుట్టూ 30 వేల ఉపగ్రహాలు

స్పేస్‌ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ భారీ ప్రణాళిక

భూమి చుట్టూ సుమారు 30 వేల స్టార్‌లింక్ ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని స్పేస్‌ఎక్స్ సీఈవో, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తలపోశారు. ఈ మేరకు భారీ ప్రణాళికను సిద్ధంచేశారు. అధునాతన, భారీ, బరువైన రెండో తరం ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టాలంటే స్టార్‌షిప్ రాకెట్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. అదనంగా రేడియో స్పెక్ట్రమ్‌ను ఉపయోగించుకోవడంతో పాటు, దిగువ కక్ష్యల్లో కూడా ఉపగ్రహాల్ని ప్రవేశపెడితే సిగ్నల్ ఆలస్యాన్ని బాగా తగ్గించుకోవచ్చని ఎలాన్ మస్క్ కంపెనీ భావిస్తోంది. స్టార్‌లింక్ శాటిలైట్ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని గణనీయంగా విస్తరించే ప్రణాళికలో భాగంగా ఇలా కొత్తగా ఏకంగా 29,988 ఉపగ్రహాలను కక్ష్యల్లోకి ప్రవేశపెట్టాలని మస్క్ సంస్థ యోచిస్తోంది. ఈ మేరకు తమ ప్రతిపాదనలను స్పేస్‌ఎక్స్ సంస్థ తాజాగా ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్(ఎఫ్‌సీసీ)కు సమర్పించింది. స్టార్‌షిప్ ద్వారా పంపబోయే నూతన ఉపగ్రహాలతో బ్యాండ్‌విడ్త్ 10 రెట్లు పెరుగుతుందని మస్క్ చెబుతున్నారు. భూమి నుంచి 480 నుంచి 530 కిలోమీటర్ల ఎత్తులో స్థిర కక్ష్యలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. ఈ–బ్రాండ్ ఫ్రీక్వెన్సీను సమర్థంగా వాడుకోవచ్చని మస్క్ వ్యూహం. అంతకంటే తక్కువగా 340 కిలోమీటర్ల నుంచి 365 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యల్లోకి ఉపగ్రహాలను ప్రవేశపెడితే స్టార్‌లింగ్ సిగ్నల్ ఆలస్యం కేవలం 20 మిల్లీసెకన్ల లోపునకు తగ్గుతుందని, దీంతో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవల్లో విప్లవాత్మకమైన మార్పులు సాధ్యమని కంపెనీ చెబుతోంది. అయితే, ఈ ప్రతిపాదనలపై రెగ్యులేటర్లు, వ్యోమగాములు, ఇతర ఉపగ్రహాల కంపెనీల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావచ్చని భావిస్తున్నారు. కక్ష్యలో ఉపగ్రహాలు ఎక్కువైపోవడం, ఖగోళ శాస్త్రవేత్తల ఇతర అధ్యయనాలకు అడ్డంకిగా మారతాయనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. మస్క్ ప్రతిపాదనలకు ఎఫ్‌సీసీ అనుమతిస్తే ప్రపంచవ్యాప్త కమ్యూనికేషన్ వ్యవస్థ నిజంగానే కొత్త పుంతలు తొక్కుతుంది. ప్రపంచంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు సైతం హై–స్పీడ్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తాయి. - వాషింగ్టన్

కెనడా పోలీసుల వాచాలత్వం

'నేరగాళ్ల' నుంచి తమ ప్రజలకు ముప్పు లేదంటూ వ్యాఖ్యలు

టొరంటో: భారత్‌పై విద్వేషం వెళ్లగక్కే విషయంలో కెనడా పోలీసులు కూడా ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో బాటలోనే సాగుతున్నారు. 'నేరగాళ్ల నుంచి కెనడా ప్రజలకు ఎలాంటి ముప్పు లేదు' అని భారత్‌ను ఉద్దేశించి వారు ఆదివారం లెక్కలేనితనంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యోదంతం దర్యాప్తులో భాగంగా కెనడాలో ఎనిమిది మందిపై హత్యానేరం, 22 మందిపై దోపిడీ అభియోగాలు మోపినట్లు పోలీసు ఉన్నతాధికారి బ్రిగిట్ గౌవిన్ తెలిపారు. భారతీయ ఏజెంట్లు వేధింపులకు, బెదిరింపులకు పాల్పడవచ్చని 13 మంది కెనడియన్లను తాము హెచ్చరించినట్లు చెప్పుకొచ్చారు. వారిలో కొందరికి ఇప్పటికే బెదిరింపులు వచ్చాయన్నారు. కెనడాలో క్రియాశీలంగా ఉన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు భారత ప్రభుత్వ ఏజెంట్లతో సంబంధాలున్నాయని కూడా ఆరోపించారు. మరోవైపు పారిపోయిన ఉగ్రవాదుల జాబితాలో సందీప్ సింగ్ సిద్ధూ అనే కెనడియన్ బోర్డర్ సర్వీస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) అధికారి పేరును భారత్ చేర్చింది. ద్వైపాక్షిక సంబంధాలను ట్రూడో తన ప్రవర్తనతో సర్వనాశం చేస్తున్నారని కెనడాలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ ఆరోపించారు.

కెనడా మాజీ రాయబారి నోటిదురుసు

న్యూఢిల్లీ: భారత్‌లో కెనడా మాజీ రాయబారి కామెరాన్ మెక్‌కే కూడా తాజాగా వాచాలత్వంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. ''నిజ్జర్ హత్య, అమెరికాలో గురుపత్వంత్ సింగ్ పన్నూపై హత్యాయత్నం ఒకే కుట్రలో భాగం. కెనడా, అమెరికా భూభాగాలపై నేరాలకు పాల్పడి తప్పించుకోవచ్చునని భావించి భారత్ తప్పు చేసింది'' అని సీబీసీ న్యూస్ ఇంటర్వ్యూలో నోటి దురుసు ప్రదర్శించారు.

అచ్యుతానందన్ @ 101



తిరువనంతపురం: కురువృద్ధ కమ్యూనిస్ట్ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ ఆదివారం 101వ జన్మదినం జరుపుకున్నారు. ఆయన్ను అందరూ 'విప్లవ సూర్యుడు', కామ్రేడ్ వీఎస్ అంటూ పిలుచుకుంటారు. తిరువనంతపురంలోని తన నివాసంలో శేష జీవితం గడుపుతున్న అచ్యుతానందన్ ఎప్పటిలాగానే ఆదివారం నిరాడంబరంగా బర్త్‌డే వేడుక చేసుకున్నారు. సీఎం పినరయి విజయన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ తదితరులు ఈ వేడుకలో పాల్గొని, ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయం ప్రకారం, పాయసం, కేక్ పంచామని ఆయన కుమారుడు వీఏ అరుణ్ కుమార్ చెప్పారు. ఇతర వేడుకలేవీ లేవన్నారు. అలప్పుజ జిల్లా పున్నప్రలో 1923 అక్టోబర్ 20న అచ్యుతానందన్ జన్మించారు. అప్పటి ట్రావెన్‌కోర్ సంస్థానంలో కార్మిక సంఘాల కార్యకలాపాలాల్లో మొదట్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం 1939లో కాంగ్రెస్‌లో చేరారు. 1940లో కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడయ్యారు. 1964లో సీపీఐను వీడి, సీపీఎంను స్థాపించిన 32 మంది నేతల్లో అచ్యుతానందన్ కూడా ఉన్నారు. కేరళ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా 1980–92 సంవత్సరాల మధ్య పనిచేశారు. 2006లో కేరళ 20వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

జొమాటో, ఉబర్‌లపై కర్ణాటక సెస్

బెంగళూరు: సమయం, కాలానికి తగ్గట్లు వేర్వేరు స్వల్పకాలిక తాత్కాలిక ఉద్యోగాలు చేసే గిగ్ వర్కర్ల సామాజిక భద్రత కోసం జొమాటో, ఉబర్, ఓలా, స్విగ్గీ వంటి అగ్రిగేటివ్ సంస్థలపై సెస్ విధించనున్నట్లు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్ణాటక కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ మీడియాతో మాట్లాడారు. ''సెస్ విధింపు ద్వారా సమకూరే ఆదాయాన్ని ప్రభుత్వం కేవలం గిగ్ కార్మికుల కోసమే ఖర్చుచేయనుంది. ఈ సంస్థల ఉత్పత్తులు, సేవలపై రాష్ట్ర ప్రభుత్వం సెస్ విధించబోదు. కేవలం రవాణాపై మాత్రమే సెస్ వసూలుచేస్తుంది. జొమాటో, ఓలా, ఉబర్, స్విగ్గీలో పనిచేసే కార్మికులు రోజంతా రోడ్లపైనే తిరుగుతుంటారు. కాలుష్యమయ గాలి పీల్చి తరచూ వ్యాధులబారిన పడుతున్నారు. వీరి ఆరోగ్య బీమా, వీరి పిల్లల చదువు కోసమే సెస్‌ను ఖర్చుచేస్తాం'అని వివరించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి గిగ్ వర్కర్ల కోసం ముసాయిదా బిల్లును రూపొందించిన విషయం విదితమే. గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, ఆరోగ్యం, రక్షణ, పారదర్శకత లక్ష్యంగా ఈ ముసాయిదా బిల్లుకు తుది రూపునిచ్చారు. బిల్లును డిసెంబర్‌లో శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. గిగ్ వర్కర్లకు జీవిత బీమా, పెన్షన్ ప్రయోజనాలు కల్పించడంపై గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంఘాలతో కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమావేశమైన మరుసటి రోజే కర్ణాటక ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

'గాంధీ'లకు వయనాడ్ సెకండ్ ఆప్షనే: నవ్య



తిరువనంతపురం: గాంధీ కుటుంబానికి వయనాడ్ సెకండ్ ఆప్షన్ మాత్రమేనని ఎన్డీఏ అభ్యర్థి నవ్య హరిదాస్ విమర్శించారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక ప్రజలు ఎన్నికల్లో వారికి బుద్ధి చెబుతారన్నారు. ఆదివారం కోజీకోడ్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ సమస్యలను పరిష్కరించే నాయకుడిని వయనాడ్ ప్రజలు కోరుకుంటున్నారని నవ్య తెలిపారు. పార్లమెంటులో వయనాడ్ గొంతును వినిపించడంలో విఫలమైన గాంధీ కుటుంబ ప్రతినిధిగా ప్రియాంకా గాంధీ వస్తున్నారని ఆమె విమర్శించారు. నమ్మి గెలిపిస్తే రాహుల్‌గాంధీ వయనాడ్‌ను వదిలేసి రాయ్‌బరేలీని ఎంచుకున్నారని, ప్రజలు మరోసారి ఆ కుటుంబాన్ని నమ్మే అవకాశమే లేదని నవ్య ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో 8 మంది చిన్నారులు సహా కుటుంబంలో 12 మంది దుర్మరణం

జైపూర్: రాజస్తాన్ రాష్ట్రంలోని ధోల్‌పూర్ పరిధిలో శనివారం రాత్రి ఘోర రోడ్డు విషాదం చోటుచేసుకుంది. సునీపూర్ పట్టణం వద్ద ఒక బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది చిన్నారులు సహా ఒకే కుటుంబంలోని 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో గాయాలపాలైన ఒక చిన్నారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. కరీం గుమ్మత్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందిన వారంతా బరౌలిలో జరిగిన వివాహ వేడుకకు హాజరై వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలిలోనే 11 మంది చనిపోగా, మరొకరు ఆస్పత్రిలో ప్రాణాలొదిలారని పోలీసులు తెలిపారు. ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు తలో రూ.2 లక్షల చొప్పున సాయం ప్రకటించారు.



ఆదివారం జార్ఖండ్ ఎన్నికల ప్రచార సభలో సెల్ఫీ తీసుకుంటున్న జేఎంఎం నాయకురాలు కల్పనా సోరెన్

సరోగసీ టూరిజం నేరం

మిలియన్ డాలర్ల జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష • ఇటలీలో అమల్లోకి కొత్త చట్టం



సరోగసీ చట్టానికి వ్యతిరేకంగా రోమ్‌లో ప్రదర్శనలు

సరోగసీపై చట్టాన్ని ఇటలీ విస్తృతం చేసింది. సరోగసీ టూరిజాన్ని నేరంగా పరిగణిస్తూ చట్టం చేసింది. బ్రదర్స్ ఆఫ్ ఇటలీ పార్టీ ప్రతిపాదించిన బిల్లును సెనేట్ 58–84 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఈ చట్టం 2004 నుంచే ఇటలీలో అమలులో ఉన్న సరోగసీ నిషేధాన్ని యునైటెడ్ స్టేట్స్, కెనడా వంటి దేశాలకు వెళ్లేవారికి వర్తింపజేస్తుంది. దీనిని ఉల్లంఘించిన వారికి ఒక మిలియన్ డాలర్ల వరకు జరిమానా, రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే సరోగసీ ద్వారా జన్మించిన పిల్లలను ఇప్పటికే దేశంలో నమోదు చేసుకున్న తల్లిదండ్రులను ఈ చట్టం ప్రభావితం చేయబోదు. అయితే తమ పిల్లలు పాఠశాలలో చేర్పించే సమయంలో సమస్యల పాలవుతామని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సెనేట్ నిర్ణయాన్ని ప్రధానమంత్రి జార్జియా మెలోని స్వాగతించారు. కాగా, కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ సెనేట్ దగ్గర కొందరు నిరసన ప్రదర్శనలు చేశారు. ఎల్జీబీటీక్యూ జంటలను తల్లిదండ్రులుగా మారకుండా చేసే ఈ చట్టాలు మధ్యయుగాల నాటివని విమర్శించారు. మెలోనీ 2022లో పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అత్యంత సాంప్రదాయిక సామాజిక ఎజెండాను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. స్వలింగ సంఘాలను చట్టబద్ధం చేసిన చివరి యురోపియన్ దేశాల్లో ఇటలీ ఒకటి. ఇటాలియన్ కేథలిక్ చర్చి ఒత్తిడితో స్వలింగ వివాహాలకు మాత్రం ఇంకా చట్టబద్ధత ఇవ్వలేదు. పోప్ ఫ్రాన్సిస్ సరోగసీపై ఈ సంవత్సరం ప్రారంభంలో ప్రపంచ నిషేధానికి పిలుపునిచ్చారు. పిల్లలు దేవుడు ఇచ్చే బహుమతి అని, వాణిజ్య ఒప్పందం కాదని నొక్కి చెప్పారు. ఎల్జీబీటీక్యూ వ్యక్తులను చర్చికి స్వాగతిస్తూ ఫ్రాన్సిస్ చర్చి విధానాలను మార్చారు. అబార్షన్, సరోగసీలను మాత్రం బలంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ కొత్త చట్టం రాజకీయంగా మెలోనికి సవాలుగా మారవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

రోజుకో ఓటర్‌కు రూ.8.4 కోట్లు!

అమెరికన్లకు మస్క్ తాయిలం



పెన్సిల్వేనియా: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్‌ను ట్రంప్‌కు అనుకూలంగా మార్చేందుకు ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ తాయిలాలు ప్రకటిస్తున్నారు. వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ హక్కులపై తాము రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసే స్వింగ్ స్టేట్లలో రిజిస్టరయిన ప్రతి ఓటరుకు 47 డాలర్లు ఇస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. తాజాగా ఆయన మరో ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. పెన్సిల్వేనియాలో శనివారం నుంచి రిజిస్టర్డ్ ఓటర్ల నుంచి రోజూ డ్రా తీసి ఎంపికైన ఓటరుకు దాదాపు రూ.8.4 కోట్లు అందజేస్తామని చెప్పారు. నవంబర్ 5 ఈ లాటరీ కొనసాగుతుందన్నారు. కమలా హారిస్, ట్రంప్ మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగుతుండటం తెలిసిందే. అమెరికా ఎన్నికల చట్టం ప్రకారం ఇలా తాయిలాలు ప్రకటించడం చట్టబద్ధమేనని స్లేట్ మేగజీన్ తెలిపింది. ఇది ట్రంప్‌కు ఓటేసే వారిని గుర్తించేందుకు జరిగే ప్రయత్నమే తప్ప, ఓటేయడానికి అభ్యర్థికి నేరుగా డబ్బు చెల్లించడం కిందకు రాదని పేర్కొంది. ఇదే నిబంధనను అవకాశంగా తీసుకుని బెన్ అండ్ జెర్రీస్ సంస్థ 2008లో ఎన్నికల రోజున ఓటేసిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఐస్‌క్రీం అందజేస్తామని ప్రకటించింది.

ఆరోగ్య సిబ్బందికి పనిచేసే చోట... అభద్రతాభావం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సగానికిపైగా ఆరోగ్యసంరక్షణా సిబ్బందిలో పనిచేసే చోట తమకు రక్షణ కరువైందని భయపడుతున్నారని తాజాగా జరిపిన ఒక సర్వేలో తేలింది. భారత ఆరోగ్యరంగంలో భద్రతా వ్యవస్థలో లోటుపాట్లను ఈ సర్వేలో ఎత్తిచూపిందని ఇందులో పాల్గొన్న వర్ధమాన్ మహావీర్ వైద్యకళాశాల, సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఢిల్లీలోని ఎయిమ్స్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సర్వే వివరాలు ఎపిడెమోలజీ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పనిచేసే చోట తమకు భద్రత లేదని సర్వేలో పాల్గొన్న హెల్త్‌కేర్ వర్కర్లలో 58.2 శాతం మంది చెప్పారు. పనిచేసే చోట బెదిరింపులను ఎదుర్కొన్నామని 78.4 శాతం మంది చెప్పారు. పనిచేసే చోట సెక్యూరిటీ భద్రతా ఏర్పాట్లు అత్యంత పేలవంగా ఉన్నాయని మెజారిటీ సిబ్బంది వెల్లడించారు. సెక్యూరిటీ వాళ్లు ఉన్నా సరిగా పనిచేయరని 70శాతానికిపైగా చెప్పారు. సరైన అప్రమత్త వ్యవస్థ లేదని 62 శాతం మంది తెలిపారు. ఐసీయూ, మానసిక రోగుల వార్డుల్లో నిఘా, సెక్యూరిటీ అధ్వానంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లోకి ఎవరైనా ఆయుధాలతో వచ్చారా లేదా అని తనిఖీచేసే వ్యవస్థ లేదని 90 శాతానికిపైగా చెప్పారు. సర్వేలో పాల్గొన్న వారిలో 55.5 శాతం మంది మహిళా సిబ్బంది, 44.5 శాతం మంది పురుషులు ఉన్నారు. ఆరోగ్య సంరక్షణా రంగంలో క్షేత్రస్థాయి పరిస్థితులు సిబ్బందిని, రుగ్మతలతో బాధపడుతున్న రోగులను ఎంతటి ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టేస్తోందో సర్వే కళ్లకు కడుతోంది.

పసిపిల్లల మాంసం తినిపించారు

ఐసిస్ చెర నుంచి బయటపడ్డ మహిళ వెల్లడి

ఐసిస్ చెర నుంచి బయటపడ్డ ఫాజియా సిడో అనే మహిళ భయంకరమైన విషయాలు వెల్లడించింది. తనతో పాటు ఇతర ఖైదీలతో పసి పిల్లల మాంసం తినిపించారని తెలిపింది! 2014లో ఇరాక్‌లోని సింజార్‌లో దాడి చేసిన ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిడోను ఆమె ఇంటి నుంచి ఎత్తుకెళ్లారు. అప్పటికి ఆమెకు 11 ఏళ్లు. ''తీసుకెళ్లాక మమ్మల్ని రోజుల తరబడి ఆకలితో ఉంచారు. తర్వాత అన్నం, మాంసంతో కూడిన భోజనం ఇచ్చారు. చాలా ఆకలితో ఉన్నందున వింత రుచి ఉన్నప్పటికీ తిన్నాం. తర్వాత అంతా అస్వస్థతకు గురయ్యాం. మేం తిన్నది పసి పిల్లల మాంసమని ఆ తర్వాత ఐఎస్ ఉగ్రవాదులు బయటపెట్టారు. యజిదీ పిల్లల మాంసమని చెప్పారు. తలలు నరికిన చిన్నారుల ఫొటోలు చూపించి, 'ఇప్పుడు మీరు తిన్న మాంసం ఈ పిల్లలదే' అని చెప్పారు. అది విని మాకు మతిపోయింది. ఓ మహిళ హార్ట్ ఫెయిల్యూర్‌తో మృతి చెందారు. ఓ తల్లి ఆ ఫొటోల్లో తన బిడ్డను గుర్తించి గుండె పగిలేలా ఏడ్చారు'' అంటూ ఆ భయానక క్షణాలను గుర్తు చేసుకున్నారు. ఐసిస్ తమ బందీలకు మనుషుల మాంసం తినిపించిందని గతంలో వచ్చిన ఆరోపణలను సిడో కథనం ధ్రువీకరించింది. ఈ విషయాన్ని 2017లో యాజిదీ పార్లమెంటేరియన్ వియాన్ దఖిల్ తొలిసారి వెలుగులోకి తెచ్చారు.

ఇంకా ఐసిస్ చెరలోనే...

2014లో ఉత్తర ఇరాక్‌లో మైనారిటీలైన వేలాదిమంది యాజిదీ మహిళలు, చిన్నారులను ఐసిస్ కిడ్నాప్ చేసింది. వారిలో సిడో ఒకరు. మరో 200 మంది యాజిదీ మహిళలు, పిల్లలతో కలిసి అండర్ గ్రౌండ్ జైలులో తొమ్మిది నెలల పాటు బందీగా ఉన్నారు. కలుషిత నీటితో కొందరు చిన్నారులు మృతి చెందారు. సిడోను అబూ అమర్ అల్–మక్దీసీతో సహా అనేక మంది జిహాదీ ఫైటర్లకు విక్రయించారు. ఆమెతోపాటు చాలా మందిని బానిసలుగా అమ్మారు. ఏళ్ల తరబడి హింస, దోపిడీ తర్వాత ఇజ్రాయెల్, అమెరికా, ఇరాక్ రహస్య మిషన్ వల్ల ఆమె చెర నుంచి సిడో బయటపడ్డారు. తరువాత ఆమెను ఇజ్రాయెల్‌లోని కెరెమ్ షాలోమ్ క్రాసింగ్‌కు పంపారు. అక్కడినుంచి జోర్డాన్‌కు ప్రయాణించి చివరికి ఇరాక్‌లోని తన కుటుంబాన్ని తిరిగి కలుసుకున్నారు. సిడో ప్రస్తుతం సురక్షితంగా ఉన్నప్పటికీ దశాబ్ద కాలం బందీగా ఉన్నప్పటి మానసిక గాయాలు తీవ్రంగా ఉన్నాయని ఆమె న్యాయవాది తెలిపారు. 2014 యాజిదీ మారణహోమం నుంచి 3,500 మందికి పైగా యాజిదీలను రక్షించారు. సుమారు 2,600 మంది గల్లంతయ్యారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఫాజియా సిడో



బహమనీ సుల్తాన్లతో పద్మనాయకుల వైరం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

బహమనీ సుల్తాన్లు

కాకతీయ రాజ్య పతనం తర్వాత దక్షిణాపథమంతా ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ ఆధీనంలోకి వచ్చింది. తర్వాత కొద్ది కాలానికే ఆంధ్ర దేశంలో స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి. తుగ్లక్ మీద తిరుగుబాటు చేసిన అనేక మంది సర్దారుల్లో హసన్ గంగూ అబ్దుల్ ముజఫర్ ఒకడు. తెలంగాణకు పశ్చిమోత్తర ప్రాంతంలో బహమనీ షా వంశీయుడైన హసన్‌గంగూ ఢిల్లీ చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేశాడు. 1341లో దౌలతాబాద్ రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఆ సమయంలో ఉత్తర తెలంగాణను ముసునూరి వంశానికి చెందిన కాపయ నాయకుడు పాలిస్తున్నాడు. తిరుగుబాటు సమయంలో కాపయ హసన్ గంగూకు సహాయపడ్డాడు. తర్వాతి కాలంలో ఇది నష్టానికి దారి తీసింది. బహమనీ రాజ్యం సుదీర్ఘ కాలంపాటు తెలంగాణకు పక్కలో బల్లెంలా తయారైంది.

బహమనీలు అనేకసార్లు తెలంగాణపై దండయాత్ర చేశారు. 1350లో హసన్ గంగూ కౌలాస్(నిజామాబాద్ జిల్లా) దుర్గాన్ని ఆక్రమించాడు. పానగల్లు కోటను స్వాధీనం చేసుకొని, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. అప్పటి నుంచే నీలగిరి నల్లగొండగా మారింది. ఇరు రాజ్యాలకు గోల్కొండ సరిహద్దుగా ఉండేలా కాపయ సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ తుంగభద్ర వరకు పురోగమించి విజయనగర రాజ్యభాగాలను, పశ్చిమాన కొంకణ్ రాజ్యాన్ని ఆక్రమించాడు. 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని ఆక్రమించాడు. హసన్ గంగూ తన రాజధానిని దౌలతాబాద్ నుంచి గుల్బర్గాకు మార్చాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు రాష్ట్రాలుగా విభజించాడు. ఇతడి రాజ్యానికి ఉత్తరాన మాండు, దక్షిణాన రాయచూర్, పశ్చిమాన గోవా, తూర్పున భువనగిరి (కొంతకాలం) సరిహద్దులుగా ఉండేవి.

బహమనీ పాలకులు..

హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా (1358–75), ముజాహిద్‌షా (1375–78), రెండో మహమ్మద్ షా (1378–97), ఫిరోజ్‌షా (1397–1422), అహ్మద్‌షా (1422–36), రెండో అల్లావుద్దీన్ అహ్మద్‌షా (1436–58), హుమాయూన్ (1458–61), నిజాంషా (1461–63), మూడో మహమ్మద్‌షా (1463–82),మహమూద్‌షా (1482–1518) బహమనీ రాజ్యాన్ని పాలించారు.

హసన్ గంగూ తర్వాత కూడా బహమనీలు అనేక సార్లు తెలంగాణ సహ ఇతర తెలుగు ప్రాంతాలపై దండెత్తారు. ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఇతడు భారతదేశంలోనే మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

> హసన్ గంగూ 1350లో కౌలాస్ దుర్గంపై దండెత్తాడు. పానగల్లు కోటను ఆక్రమించి, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. ఇతడు 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఒకటో మహమ్మద్‌షా భారతదేశంలో మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

పద్మనాయకులతో మైత్రి

1366లో పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల అనపోత నాయకుడి చేతిలో కాపయ మరణించాడు. తెలంగాణ పద్మనాయకుల వశమైంది. వీరి కాలంలో బహమనీ సుల్తాన్లు కొంతకాలం మిత్రులుగా మరి కొంతకాలం శత్రువులుగా మెలిగారు. రెండో హరిహరరాయలు పద్మనాయక రాజ్యంపై రెండో బుక్కరాయలను దండయాత్రకు పంపాడు. ఈ సమయంలో బహమనీలు పద్మనాయకులకు అండగా నిలిచారు. విజయనగర రాజుల ఆధీనంలోని కొత్తకొండ (మహబూబ్‌నగర్ జిల్లా)ను పద్మనాయకులు స్వాధీనం చేసుకోవడానికి తోడ్పడ్డారు. బుక్కరాయలు మరోసారి ఓరుగల్లు, మెదక్, పానుగల్లును ముట్టడించాడు. ఈ సమయంలోనూ బహమనీలు పద్మనాయకులకు తోడుగా నిలిచారు.

సామంతులుగా పద్మనాయకులు


ఫిరోజ్‌షా 1417–19లో పానగల్లును ముట్టడించాడు. విజయనగర రాజుల సహాయంతో పద్మనాయకులు అతణ్ని ఓడించారు. దీంతో విజయనగర, పద్మనాయక రాజ్యాలు సన్నిహితమయ్యాయి. ఇదే సమయంలో బహమనీలతో పద్మనాయకుల వైరం తీవ్రమైంది. ఫలితంగా తర్వాతి కాలంలో పద్మనాయకుల రాజ్యానికి నష్టం వాటిల్లింది. అహ్మద్‌షా రెండో దేవరాయలతో యుద్ధం చేశాడు. ఈ సమయంలో రేచర్ల మాదానాయుడు విజయనగర పక్షం వహించాడు. ఇది బహమనీ సుల్తాన్ల ఆగ్రహానికి కారణమైంది. 1425లో బహమనీలు ఓరుగల్లు సహా అనేక దుర్గాలను ఆక్రమించారు. దీంతో పద్మనాయక రాజ్యం విచ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. అహ్మద్‌షా 1432లో తెలంగాణ మీద దండయాత్ర చేసి రాయగిరి, భువనగిరి దుర్గాలను ఆక్రమించాడు. తెలంగాణలో అధిక భాగం బహమనీ రాజ్యంలో కలిసిపోయింది. పద్మనాయకులు కొంతకాలం సామంతులుగా రాజ్యాన్ని పాలించారు. అహ్మద్‌షా తన రాజధానిని గుల్బర్గా నుంచి బీదర్‌కు మార్చాడు.

అహ్మద్‌షా గుజరాత్, మాళవ ప్రాంతాలపై దండయాత్ర చేశాడు. ఇదే అదనుగా పద్మనాయకులు కోల్పోయిన తమ ప్రాంతాలను తిరిగి ఆక్రమించారు. కానీ ఆ యుద్ధాలు ముగిశాక అహ్మద్‌షా తెలంగాణపై దండెత్తాడు. ఓరుగల్లు, రామగిరి (కరీంనగర్) మొదలైన దుర్గాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాడు. 1435 నాటికి (దేవరకొండ మినహా) రాచకొండ సహా తెలంగాణలో అధిక భాగం తిరిగి బహమనీల వశమైంది. బహమనీ రాకుమారుడైన దాసూర్‌ఖాన్ రాచకొండ రాజప్రతినిధి అయ్యాడు.

1444లో సింగమనాయుడు,కపిలేశ్వర గజపతి సాయంతో తన రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. సుల్తాన్ తమ్ముడైన మహమూద్ ఖాన్ రాచకొండలో సామంత రాజయ్యాడు.

హుమాయూన్ రాజైన తర్వాత బహమనీ రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. వీటిని ఆసరా చేసుకొని తెలంగాణను తిరిగి జయించడానికి పద్మనాయకులు ప్రయత్నించారు. జలాల్‌ఖాన్, సికిందర్ బాలకొండలో స్వతంత్రం ప్రకటించుకున్నారు. వీరు పద్మనాయకులతో స్నేహం చేశారు. హుమాయూన్ తిరుగుబాట్లను అణచివేసి, దేవరకొండను ముట్టడించాడు. పద్మనాయకులు 1461లో బహమనీ సైన్యాలను పారదోలి రాచకొండ, భువనగిరి, ఓరుగల్లు మొదలైన దుర్గాలను తిరిగి పొందగలిగారు. పద్మనాయకులకు కపిలేశ్వర గజపతి కుమారుడైన హంవీరుడు సహాయం చేశాడు. తెలంగాణలో బహమనీలకు స్థానం లేకుండా చేశారు. హుమాయూన్‌షా తర్వాత నిజాంషా కాలంలో బహమనీలు తెలంగాణను తిరిగి ఆక్రమించే ప్రయత్నం చేశారు. కపిలేశ్వరుని సాయంతో పద్మనాయకులు వారిని ప్రతిఘటించారు.

కొంత కాలానికి గజపతుల్లో అంతఃకలహాలు తలెత్తాయి. ఇదే అదనుగా తెలంగాణను జయించడానికి మూడో మహమ్మద్‌షా తన సేనాని అయిన నిజాం ఉల్‌ముల్క్ ఇబ్రహీంను పంపాడు. 1475 నాటికి తెలంగాణ మొత్తం బహమనీల వశమైంది. పద్మనాయక రాజ్యం అంతరించింది. అనంతరం బహమనీలు తెలుగు దేశాన్నంతా జయించి రెండు భాగాలుగా విభజించారు. తెలంగాణకు ఓరుగల్లు రాజధాని కాగా, రెండో భాగానికి రాజధాని రాజమహేంద్రవరం. మూడో మహమ్మద్‌షా 1481లో కంచి మీద దాడి చేసే నాటికి రాజమహేంద్రవరం, తెలంగాణ తరఫున బహ్రీ నిజాం ఉల్‌ముల్క్, ఆజంఖాన్‌ల ఆధీనంలో ఉంచాడు.



బహమనీ రాజ్య విచ్ఛిన్నం

మూడో మహమ్మద్‌షా 1482లో మరణించడంతో బహమనీ రాజ్యం విచ్ఛిన్నం కావడం మొదలైంది. ఇతడి తర్వాత రాజైన మహమూద్ షా కాలంలో ఓరుగల్లు పాలకుడైన ఆదిల్‌ఖాన్ మరణించాడు. రాజమహేంద్ర పాలకుడైన కివామ్ ఉల్‌ముల్క్ తన రాజ్యాన్ని కోల్పోయి ఓరుగల్లును ఆక్రమించాడు. సుల్తాన్ అతణ్ని పారదోలాడు. సుల్తాన్ నలుగురు కుమారుల్లో చివరి వాడైన కలీముల్లా 1537లో మరణించాడు. దీంతో బహమనీ వంశం అంతరించింది. 1500ప్రాంతంలో బహమనీ సామ్రాజ్యం నుంచి అయిదు స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి.

రాజ్యాలు	-	స్థాపకులు
అహ్మద్‌నగర్	-	నిజాం ఉల్ ముల్క్
బీజాపూర్	-	ఆదిల్ షా
గోల్కొండ	-	కుతుబ్ ఉల్ ముల్క్
బీరారు	-	ఇమాదుల్ ముల్క్
బీదర్	-	బరీద్ ఇమమాలిక్

వీటిలో గోల్కొండ రాజ్యం తెలంగాణ భూభాగంలో ఏర్పడింది.

పద్మనాయకుల పాలనా విశేషాలు

పాలనా విధానం

పద్మనాయకులు పాలనలో కాకతీయులను అనుసరించారు.పాలనా వ్యవహారాల్లో ప్రధానులు, సేనానులు, పురోహితులు రాజుకు సలహా ఇచ్చేవారు. పద్మనాయక రాజ్యంలో రాచకొండ, దేవరకొండ, అనుముల, పాడిచేడు, ఆమనగల్లు, అనంతగిరి, ఉర్లుకొండ, ఉండ్రుగొండ, స్తంభగిరి, ఓరుగల్లు, భువనగిరి, జల్లపల్లి, పానగల్లు మొదలైన దుర్గాలు ఉండేవి. వీటికి దుర్గాధ్యక్షులు ఉండేవారు. వీరు సైన్యాన్ని పోషించి పద్మనాయకులకు యుద్ధాల్లో తోడ్పడేవారు. రాజ్య విభాగాల్లో ముఖ్యమైంది 'సీమ'. గ్రామం రాజ్యానికి పునాది. గ్రామాల్లో పన్నెండు రకాల వృత్తి పనివాళ్లు ఉండేవారు.

పన్నులు: రాజ్యానికి భూమి మీద వచ్చే పన్నులే ప్రధాన ఆదాయం. పంటలో 1/6వ వంతు శిస్తు రూపంలో వసూలు చేసేవారు. పద్మనాయకులు పొరుగు రాజ్యాలైన విజయనగర, రెడ్డి, గజపతులు, బహమనీ సుల్తాన్లతో నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల ప్రజల మీద పన్నుల భారం ఎక్కువగా పడింది.

ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం

పద్మనాయకులు కాకతీయుల వ్యవసాయ విధానాన్నే అనుసరించారు. అనపోత సముద్రం, రాయసముద్రం, నాగ సముద్రం, పర్వతరావు తటాకం, వేదగిరి తటాకం మొదలైన తటాకాలను తవ్వించారు. ఏతాము, రాట్నాల ద్వారా కూడా పొలాలకు నీటి వసతి కల్పించేవారు.

'కాలమెడసేసిన / ఏతములెత్తి కాల్వలున్
పాయలు, కోర్లు, నూతులను / బావులు రాట్నములున్ బలార్థమై'

అన్న కొరవి గోపరాజు పద్యం తరీ (పొలం) సేద్యంలో వచ్చిన కొత్త మార్పును తెలుపుతుంది. గ్రావిటీ పద్ధతిలో నీరందించే చెరువులతోపాటు నూతన నీటి పారుదల పద్ధతులు వచ్చినట్లు తెలుస్తోంది. కరవు సమయాల్లో గ్రావిటీ పద్ధతిలో నీరందని పొలాలకు కూడా నీరందించే కొత్త పద్ధతులు, సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అవి.. ఏతాము, పరికాల్వలు, కోల్ (కోర్లు) బావులు (వాగుల నుంచి వచ్చే నీళ్లను గుంతలకు మళ్లించి వాటి నుంచి మోట ద్వారా తరలించే పద్ధతి), నూతులు, రాట్నాలు, మోటలు. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. పోతన కూడా వ్యవసాయం చేయడమే దీనికి నిదర్శనం. వరి, జొన్న, సజ్జ, చెరకు, నువ్వులు, పత్తి మొదలైనవి నాటి ముఖ్య పంటలు, అరటి, ద్రాక్ష తోటలు కూడా ఉండేవి.

పరిశ్రమలు

నాటి పరిశ్రమల్లో నేత పరిశ్రమదే అగ్రస్థానం. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రంగుల పరిశ్రమ ఉండేది. 'సింహాసన ద్వాత్రింశిక' అనే గ్రంథంలో పలు రకాల పట్టువస్త్రాల ప్రస్తావన కనిపిస్తుంది. ఓరుగల్లు, దేవరకొండ, గోల్కొండ ప్రాంతాలు వస్త్ర పరిశ్రమ కేంద్రాలుగా ఉండేవి. నిర్మల్ కత్తులు విదేశాల్లో కూడా ప్రసిద్ధి చెందాయి.

వ్యాపారం

ఈ కాలంలో ఉక్కు, గాజు, అద్దాలు, కాగితం వాడుకలోకి వచ్చాయి. వైశ్య, తెలగ, బలిజలు వ్యాపారం చేసేవారు. కృష్ణానది పక్కన ఉన్న వాడపల్లి పద్మనాయకుల వ్యాపార కేంద్రం.

సాంఘిక పరిస్థితులు

వర్ణాశ్రమ ధర్మం స్థూలంగా అమల్లో ఉండేది. బ్రాహ్మణుల్లో వైదిక, నియోగి భేదాలు ఏర్పడ్డాయి. వెలమ, రెడ్డి కులాలకు చెందిన కొందరు వ్యవసాయాన్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. మిగిలిన శూద్ర కులాల వారు వ్యవసాయం, వృత్తి పనులను అవలంబించారు. వైష్ణవ భక్తి ఉద్యమం వల్ల అన్ని కులాల్లో భక్తిభావం పెరిగింది. విద్యాభిలాష మొలకెత్తింది. ప్రజలు అధిక వడ్డీలు చెల్లించాల్సి వచ్చేది. నాటి పురుషులు ధోతి, అంగీ, ఉత్తరీయం, తలపాగ ధరించేవారు. స్త్రీలు రవిక, కాసెకట్టు, రంగుల చీరలు ధరించేవారు. ప్రజలు భజనలు, కోలాటాలు, వీధి నాటకాలు, కోడి పందేలు, ఓమన గుంటలాట, గచ్చకాయలాట, పుంజీతం లాంటి క్రీడలతో వినోదించేవారు. సామాన్య ప్రజలు పేదరికం కారణంగా చదువుకోలేకపోయేవారు.

తెలంగాణలో ఇప్పటికీ 'సాకబోయడం' అనే ఆచారం ఉంది. ఇది పూర్వం నుంచే ఉందని సింహాసన ద్వాత్రింశిక ఆధారంగా తెలుస్తోంది. కొరవి గోపరాజు ఏకశిలా నగరాన్ని ఓరుగల్లుకు పర్యాయపదంగా వాడటాన్ని బట్టి వరంగల్లుకే ఏకశిలానగర మనే మరో పేరు ఉందని తెలుస్తోంది. కొరవి గోపరాజు 'దివ్వెల పండుగ' అనే పదప్రయోగం చేశారు. దీన్ని బట్టి తెలంగాణలో దీపావళిని 'దివిలి పండుగ' అని కూడా పిలిచే అలవాటు ఆ కాలం నుంచే ఉందని తెలుస్తోంది.

పార్శీ భాష ప్రభావం మొదలైంది. తెలుగు ప్రజల వేషధారణపై కూడా పార్శీ ప్రభావం పడింది. దూదేకుల(పింజారులు) కులం ఉనికిలోకి వచ్చింది. ముస్లింల దండయాత్రల వల్ల ఉత్తర భారతంలోని సతీసహగమనం తెలంగాణలోనూ అక్కడక్కడా కొన్ని ఉన్నత వర్గాల్లో కనిపించేది. తెలంగాణ సాంఘిక జీవితానికి ప్రతిబింబం సింహాసన ద్వాత్రింశిక. బతుకమ్మ, కోలాటం, హోళీ తదితర పండగలు ప్రాచుర్యం పొందాయి.

తెలుగు బోధన పద్ధతులు

డింగ్ డాంగ్ వాదాన్ని ప్రతిపాదించినవారెవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ/తెలుగు పండిట్స్ ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. భాష అనే పదం ఏ ధాతువు నుంచి వచ్చింది?
   1) భాస్ 2) భాష్
   3) భాశ్ 4) భాష్యతి
2. భాష్యత ఇతిభాషా అంటే అర్థమేమిటి?
   1) భావ వినిమయ సాధనం భాష
   2) భావ గ్రహణ సాధనం భాష
   3) భాషించేది భాష
   4) భావ ప్రకటన చేసేది భాష
3. 'మానవులు తమ అభిప్రాయాలను ఎదుటి వారికి తెలుపుతూ పరస్పరం సహకరించుకోవడానికి తోడ్పడే మౌఖిక ధ్వనుల స్వతంత్ర వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
   1) హాకెట్ 2) సైమన్ పాటర్
   3) ఎస్.కృష్ణస్వామి 4) రామచంద్రవర్మ
4. 'పలు భాషణ అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
   1) హాకెట్ 2) రామచంద్రవర్మ
   3) ఎస్.కె.వర్మ 4) రామచంద్ర శుక్లా
5. మనసులోని భావ పరంపరను ఏ పదాలు, ఏ వాక్యాలు ఎదుటివారికి అందిస్తాయో, ఆ పదాలు, ఆ వాక్యాలే భాష అని నిర్వచించింది?
   1) హాకెట్ 2) సైమన్ పాటర్
   3) రామచంద్ర శుక్లా 4) రామచంద్ర వర్మ
6. బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తే భాష అని ఎవరన్నారు?
   1) ఐజ్లర్ 2) రామచంద్రవర్మ
   3) హాకెట్ 4) సైమన్ పాటర్
7. క్రియా పదాల నుంచి భాష పుట్టిందన్న ధాతు వాదాన్ని సమర్థించిన భారతీయ భాషావేత్త?
   1) కాత్యాయనుడు 2) యాస్కాచార్యుడు
   3) ఋష్యశృంగుడు 4) మాక్స్‌ముల్లర్
8. ప్రకంపన వాదమని ఏ వాదాన్ని అంటారు?
   1) పూ–పూ వాదం 2) యోహిహో వాదం
   3) డింగ్–డాంగ్ వాదం
   4) భౌవౌ వాదం
9. డింగ్–డాంగ్ వాదాన్ని ఎవరు ప్రతి పాదించారు?
   1) యాస్కాచార్యుడు 2) మాక్స్‌ముల్లర్
   3) చామ్‌స్కీ 4) కాత్యాయనుడు
10. ఆనందం, దుఃఖం, ఆశ్చర్యం వంటి ఉద్వేగాల ప్రకటనాభిలాషే భాషకు మూలమని చెప్పిన వాదం?
    1) ప్రకంపన వాదం
    2) యొహిహో వాదం
    3) పూ–పూ వాదం
    4) వివక్షా ప్రేరణ వాదం
11. చామ్‌స్కీ అనే హేతువాది ప్రతిపాదించిన వాదం?
    1) సంపాదన వాదం 2) స్వతస్సిద్ధ వాదం
    3) సాంకేతిక వాదం 4) ధాతు వాదం
12. తత్వశాస్త్రంలోని అనుభవవాదం ఆధారంగా ప్రతిపాదించిన వాదం?
    1) సంపాదన వాదం 2) సాంకేతిక వాదం
    3) స్వతస్సిద్ధ వాదం 4) ధాతు వాదం
13. సంపాదన వాదాన్ని ఇలా కూడా వ్యవహరిస్తారు?
    1) ప్రకృతి వాదం 2) సాంకేతిక వాదం
    3) అనుభవ వాదం
    4) క్రమ పరిణామ వికాస వాదం
14. 'మనిషి పుట్టుకతో భాష రాదు. శిశువు పెరిగే కొద్దీ పరిసరాలతో తాను పొందే అనుభవాల నుంచి భాషాభివృద్ధి జరుగు తుంది' అని చెప్పిన వాదం?
    1) సాంకేతిక వాదం 2) సంపాదన వాదం
    3) స్వతస్సిద్ధ వాదం 4) డింగ్–డాంగ్ వాదం
15. ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుందనే నానుడి ఏ భాషావాదాన్ని సమర్థిస్తుంది?
    1) స్వతస్సిద్ధవాదం
    2) క్రమ పరిణామ వికాస వాదం
    3) సాంకేతిక వాదం
    4) సంపాదన వాదం
16. ఏ శాస్త్రంలోని ప్రవృత్తివాదం సంపాదన వాదాన్ని బలపరుస్తుంది?
    1) తత్వశాస్త్రం 2) మనస్తత్వశాస్త్రం
    3) భాషాశాస్త్రం 4) జంతుశాస్త్రం
17. ఎవరు తన ప్రయోగాల ద్వారా సంపాదన వాదాన్ని నిరూపించారు?
    1) పావ్‌లోవ్ 2) మాక్స్‌ముల్లర్
    3) బి.ఎఫ్.స్కిన్నర్ 4) థార్న్‌డైక్
18. 'భాష ఒక తరం నుంచి తర్వాతి తరాలకు ప్రసరిస్తుంది. అంటే సంస్కృతి వలే భాష కూడా తర్వాత తరతరాలకు సంక్రమిస్తుం ది'. ఇది భాష ఏ లక్షణం?
    1) ప్రత్యేకత 2) ప్రేరణ దూరత
    3) ద్వివిధ నిర్మాణం
    4) సాంస్కృతిక ప్రసరణం
19. లిపి అనే పదం ఏ భాషలోని డిపి నుంచి పుట్టింది?
    1) లాటిన్ 2) గ్రీకు
    3) పార్శీ 4) సంస్కృతం
20. ఎక్కడ లభించిన అశోకుని శిలాశాసనం ఆధారంగా 1వ శతాబ్దం నాటికే ఆంధ్ర దేశంలో లిపి ఉన్నట్లు తెలుస్తుంది?
    1) అద్దంకి 2) అమరావతి
    3) ఎర్రగుడిపాడు 4) పొట్లదుర్తి
21. తెలుగు లిపి ఏ లిపికి సన్నిహితంగా ఉన్నట్లు అశోకుని శిలాశాసనం వల్ల తెలుస్తుంది?
    1) వంగలకర లిపి 2) కన్నడ లిపి
    3) బ్రాహ్మీ లిపి 4) దేవనాగరి లిపి
22. తెలుగు లిపి ఏ లిపి నుంచి ఉద్భవించిందని అంటున్నారు?
    1) కన్నడ లిపి 2) మౌర్య లిపి
    3) దేవనాగరి లిపి 4) దక్షిణ బ్రాహ్మీ లిపి
23. ఎవరి కాలంలో ద్రావిడ భాషకు సంబంధించిన 'ఱ' అనే అక్షరం శాసనాల్లో కనిపి స్తుంది?
    1) శాతవాహనులు 2) శాలంకాయనులు
    3) చాళుక్యులు 4) విష్ణుకుండినులు
24. లిపి పరిణామ క్రమాన్ని తెలుగు భాషా చరిత్ర అనే గ్రంథంలో చక్కగా వివరించినవారు?
    1) జి.యన్. రెడ్డి
    2) భద్రిరాజు కృష్ణమూర్తి
    3) పి.ఎస్. సుబ్రహ్మణ్యం
    4) తూమాటి దోణప్ప
25. చాళుక్య వంశానికి చెందిన ఎరికల్ ముత్తురాజు వేయించిన తొలి తెలుగు శాసనం ఎక్కడ లభిస్తుంది?
    1) కలమండలపాడు 2) అద్దంకి
    3) ఎర్రగుడిపాడు
    4) పొట్లదుర్తి- మాలెపాడు
26. నన్నయ ఏ లిపిలో భారతం రాశాడు?
    1) దేవనాగరి లిపి 2) వేంగి చాళుక్య లిపి
    3) బ్రాహ్మీ లిపి 4) మూలద్రావిడ లిపి
27. ఏ కవి కాలం నాటి లిపికి, నేటి తెలుగు లిపికి సన్నిహిత సంబంధం ఉంది?
    1) నన్నయ 2) తిక్కన
    3) పాల్కురికి సోమనాథుడు
    4) శ్రీనాథుడు
28. తెలుగు వర్ణమాలలోని చ, జ అక్షరాల్లో దంత్యోచ్ఛారణ కోసం '౼' గుర్తును ఎవరు చేర్పించినట్లు గుర్తించారు?
    1) సి.పి. బ్రౌన్ 2) చిన్నయసూరి
    3) బిషప్ కాల్డ్వెల్
    4) వేటూరి ప్రభాకరశాస్త్రి
29. తెలుగు భాషకు చిన్నయసూరి రాసిన అత్యంత ప్రామాణిక వ్యాకరణ గ్రంథం?
    1) ప్రౌఢ వ్యాకరణం
    2) సూత్రాంధ్ర వ్యాకరణం
    3) ఆంధ్రశబ్ద లక్షణ సంగ్రహం
    4) బాల వ్యాకరణం
30. 'తెలుగునకు వర్ణములు ముప్పదియారు' అని ఎవరు ఏ గ్రంథంలో చెప్పారు?
    1) ప్రౌఢ వ్యాకరణం- బహుజనపల్లి సీతారామాచార్యులు
    2) బాల వ్యాకరణం- చిన్నయసూరి
    3) ఆంధ్రశబ్ద చింతామణి- నన్నయ
    4) శబ్దరత్నాకరం- బహుజనపల్లి సీతారామాచార్యులు
31. మనకు గాలి, నీరు, ఆహారం ఎంత ముఖ్యమో ఇది కూడా అంతే ముఖ్యం?
    1) ధ్వని 2) వాక్యం
    3) భావ ప్రకటన 4) భాష
32. తనకు తానే మాట్లాడుకోవడం లేదా తనకే పరిమితమైన లేఖనాన్ని ఏమంటారు?
    1) గ్రహణం 2) అభివ్యక్తి
    3) ఆత్మగతం 4) ప్రకాశం
33. భాషోపాధ్యాయుడు తరగతి గదిని ఎలా భావించి, కృత్రిమ సన్నివేశాలు, ఘట్టాలు, సృష్టించి విద్యార్థులకు అనుభవపూర్వకమైన భాషా వినియోగం కలిగించాలి?
    1) ఒక ప్రయోగశాలగా
    2) సొరకుటుంబంలా
    3) ఒక సూక్ష్మ సమాజంగా
    4) వసుధైక కుటుంబంగా
34. భాషాధ్వనులకు పుట్టుక, పలకడంలో ముఖయంత్ర వినియోగం, ధ్వనితరంగాల లక్షణం వివరించేది?
    1) వ్యాకరణ శాస్త్రం 2) భాషాశాస్త్రం
    3) మనోవిజ్ఞాన శాస్త్రం 4) ధ్వని విజ్ఞానం
35. వాగుత్పత్తిలో కంఠం, తాలువు, మూర్ధం, దంతమూలం, పై పెదవి వీటిని ఏమంటారు?
    1) కంఠధ్వనులు 2) స్థానాలు
    3) కరణాలు 4) ప్రయత్నాలు
36. వాగుత్పత్తిలో జిహ్వ, ఓష్ఠం, గళగర్తం లను ఏమంటారు?
    1) కరణాలు 2) స్థానాలు
    3) ప్రయత్నాలు 4) ధ్వని వర్ణాలు
37. నన్నయ నుంచి పరవస్తు చిన్నయసూరి వరకు వెల్లివిరిసిన సాహిత్యమంతా ఏ భాష లో నిక్షిప్తమైంది?
    1) ప్రామాణిక భాష 2) సరళగ్రాంథిక భాష
    3) గ్రాంథిక భాష 4) మాండలిక భాష
38. ప్రామాణిక భాషనే ఇలా వ్యవహరిస్తారు?
    1) మాండలికం 2) గ్రాంథికం
    3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
39. వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేపట్టినవారు?
    1) వేదం వెంకటరాయశాస్త్రి
    2) గిడుగు సీతారామశాస్త్రి
    3) గిడుగు రామమూర్తి
    4) గురజాడ అప్పారావు
40. ఉపభాష, ప్రాదేశిక భాష అని ఏ భాషను పిలుస్తారు?
    1) వ్యవహారికం 2) గ్రాంథికం
    3) మాండలికం 4) ప్రామాణికం
41. ఏ మండలంలో సొమ్ములు అంటే ఆవులు అని అర్థం?
    1) పూర్వ మండలం
    2) మధ్య మండలం
    3) దక్షిణ మండలం
    4) ఉత్తర మండలం
42. నాగలిని మడక అని ఏ ప్రాంతంలో పిలుస్తారు?
    1) గోదావరి 2) కోస్తాంధ్ర
    3) తెలంగాణ 4) రాయలసీమ
43. మూలభాష నుంచి లక్ష్యభాషలోకి భాషాంతరీకరణం చేసే నేర్పును ఏమంటారు?
    1) అనుకరణశక్తి
    2) భాషాంతరీకరణ సామర్థ్యం
    3) లక్ష్యాధారిత సామర్థ్యం
    4) భాషా వినియోగం
44. 'మూల భాషా రచనాశైలి లక్ష్యభాషలో కూడా ఉంటూ, మూలానికి కట్టుబడి చేసే అనువాదం ' ఏది?
    1) మూలానువాదం
    2) మూల విధేయానువాదం
    3) స్వేచ్ఛానువాదం
    4) పదానువాదం
45. అనువాదకుడు లక్ష్యభాషకు తగిన, తనదైన శైలిని, స్వతంత్రతను ప్రదర్శిస్తే దానిని ఏమంటారు?
    1) స్వేచ్ఛానువాదం
    2) భావానువాదం
    3) పదానువాదం
    4) మూల విధేయానువాదం
46. దినచర్య రహస్యలేఖలు దేనికి ఉదా హరణలు?
    1) ప్రకాశం 2) అభివ్యక్తం
    3) గ్రహణం 4) ఆత్మగతం

సమాధానాలు

1) 2	2) 3	3) 2	4) 1	5) 4
6) 1	7) 2	8) 1	9) 2	10) 4
11) 2	12) 1	13) 3	14) 2	15) 4
16) 2	17) 3	18) 4	19) 3	20) 2
21) 3	22) 4	23) 4	24) 2	25) 3
26) 2	27) 4	28) 1	29) 4	30) 3
31) 4	32) 3	33) 3	34) 4	35) 2
36) 1	37) 3	38) 4	39) 3	40) 3
41) 1	42) 4	43) 2	44) 2	45) 1
46) 4				

గత టెట్, డీఎస్సీ ప్రశ్నలు

1. భాషకు మూలం?
   1) వాక్యం 2) ధ్వని
   3) భావం 4) ఆలోచన
2. భాషకు మూలం కొన్ని ధాతువులే అని ప్రతిపాదించినవారు?
   1) నోమ్‌చామ్‌స్కీ 2) బ్లూమ్‌ఫీల్డ్
   3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు
3. ఆంధ్రభాషా బోధన సర్వస్వం పుస్తక రచయిత?
   1) శ్రీరామచంద్రుని వేంకట శేషయ్య
   2) పావులూరి కామేశ్వరరావు
   3) గొడవర్తి సూర్యనారాయణ
   4) కె.వి.వి.యల్. నరసింహారావు
4. మాక్స్‌ముల్లర్ ప్రతిపాదించిన భాషావాదం?
   1) ధ్వన్యనుకరణ సిద్ధాంతం
   2) ధాతు జన్యువాదం
   3) డింగ్ డాంగ్ వాదం
   4) భగవదత్తం
5. 'ఉందుద్ది, వచ్చుద్ది' మొదలైన క్రియా పదాలు వాడుకలో ఉన్న జిల్లా?
   1) తూర్పుగోదావరి 2) పశ్చిమగోదావరి
   3) కృష్ణా 4) గుంటూరు
6. బిందుపూర్వక 'బ' కారం ఏ భాషలో కన్పిస్తుంది?
   1) మాండలిక 2) గ్రాంథిక
   3) ప్రామాణిక 4) వ్యవహారిక
7. ప, ఫ, బ, భ, మ అనే వర్ణాలు?
   1) దంత్యాలు 2) దంత్యోష్ఠ్యాలు
   3) ఓష్ఠ్యాలు 4) తాలవ్యాలు
8. వ్యవహారంలో ఉణ్యాధి క్రియారూపం కనిపించే జిల్లా?
   1) శ్రీకాకుళం 2) నెల్లూరు
   3) ఆదిలాబాద్ 4) తూర్పుగోదావరి

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 3	5) 4
6) 2	7) 3	8) 2		

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే... ?

హైడ్రోజన్ - దాని సమ్మేళనాలు

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. సాధారణ హైడ్రోజన్ పరమాణు సంఖ్య ఒకటి, పరమాణు భారం ఒకటి. న్యూట్రాన్లు లేని ఒకే ఒక కేంద్రకం హైడ్రోజన్. దీన్నే ప్రోటియం అని కూడా అంటారు. దీని సమస్థానీయాలు (ఐసోటోపులు) డ్యుటీరియం, ట్రిటియం.

- డ్యుటీరియంనే భార హైడ్రోజన్ అంటారు. ట్రిటియం రేడియోధార్మిక కేంద్రకం.
- హైడ్రోజన్ అత్యంత శ్రేష్ఠమైన ఇంధనం. దీన్ని మండించినప్పుడు నీటి ఆవిరి (H_2O) మాత్రమే విడుదలవుతుంది. కాబట్టి వాతావరణ కాలుష్యం ఉండదు.
- నక్షత్రాల్లోని శక్తికి మూలాధారం హైడ్రోజన్. హైడ్రోజన్‌కు చెందిన ఐసోటోపులు 'కేంద్రక సంలీన' చర్య ద్వారా అత్యధిక శక్తిని విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలోనే వివిధ మూలకాలు ఏర్పడతాయి.
- కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్‌ల మిశ్రమాన్నే ($CO+H_2$) 'వాటర్ గ్యాస్' అంటారు. దీన్నే నీలిగ్యాస్ అని కూడా అంటారు.
- హైడ్రోజన్‌ను ఇంధన ఘటాల్లో ఉపయోగిస్తారు. హైడ్రోజన్ లేదా కార్బన్ మోనాక్సైడ్ లేదా మీథేన్ లాంటి ఇంధనాలను దహనం చేయడం ద్వారా వచ్చే శక్తిని సరళరీతిలో విద్యుత్ శక్తిగా మార్చే ఘటాలే ఇంధన ఘటాలు. వీటిలో 'ఆక్సిజన్' వాయువు 'ఆక్సీకరణి'గా పనిచేస్తుంది.
- ఇది నూనెలను 'హైడ్రోజనీకరణం' చేసి 'కొవ్వులు'గా మార్చడానికి ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియలో ఉత్ప్రేరకం 'నికెల్' లోహం. డాల్డాను ఈ విధానంలోనే రూ పొందిస్తారు.
- 'ఫిషర్ - ట్రాప్స్' పద్ధతిలో కృత్రిమంగా పెట్రోల్ తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో 'వాటర్ గ్యాస్' ను దానిలో సగం పరిమాణం ఉన్న 'హైడ్రోజన్'తో కలిపి ఐరన్ ఆక్సైడ్, కోబాల్ట్ ఉత్ప్రేరకాల సమక్షంలో 200°C వద్ద వేడిచేస్తే హైడ్రోకార్బన్ల మిశ్రమం (కృత్రిమ గ్యాసోలిన్) వస్తుంది.
- ఆవక్షాల్లో ఒక ముఖ్యమైన అనుఘటకం హైడ్రోజన్.
- లోహ సంగ్రహణలో.. లోహ ఆక్సైడ్‌ల నుంచి క్షయకరణ పద్ధతిలో లోహాల్ని నిష్కర్షించడానికి హైడ్రోజన్‌ను ఉపయోగిస్తారు.

నదీజలం కంటే సముద్ర జలాల్లో లవణాలు ఎక్కువ కాబట్టి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల అత్యంత లవణమయమైన 'డెడ్ సీ' నీటిపై నడవవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే మినరల్ వాటర్‌ను 'తిరోగామి ద్రవాభిసరణ' (రివర్స్ ఆస్మాసిస్) ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఇదే ఆర్.ఒ. ప్రక్రియగా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రక్రియలో 'మెంబ్రేన్' (అతి సూక్ష్మ రంధ్రాలున్న పలుచని పొర) ద్వారా ఉప్పు (కఠిన) నీటిని అధిక పీడనాన్ని ఉపయోగించి పంపిస్తారు. మెంబ్రేన్ నుంచి స్వాదుజలం బయటకు వస్తుంది. దీనిలో అయాన్‌లన్నీ తొలగిపోతాయి. కాబట్టి 'డీ అయొనైజ్డ్ వాటర్' అని కూడా అంటారు.



నీరు

గాలి తర్వాత అత్యంత అవసరమైంది నీరే. ప్రకృతిలో లభ్యమయ్యే నీటిలో అత్యంత శుద్ధమైంది 'వర్షపు నీరు'. తాగడానికి పనికివచ్చే నీటిని 'పోటబుల్ నీరు' అంటారు. నాలుగింట మూడు వంతుల నీరు సముద్రాల్లోనే ఉంది. సముద్ర జలాల్లో అనేక రకాల లవణాలుంటాయి. ఈ నీరు తాగడానికి పనికి రాదు. సబ్బుతో నురగనివ్వదు. ఇలాంటి నీటిని కఠిన జలం అంటారు. ప్రధానంగా కాల్షియం, మెగ్నీషియం బైకార్బొనేట్లు; క్లోరైడ్‌లు; సల్ఫేట్లు ఉండటం వల్ల నీటికి కఠినత్వం వస్తుంది. నీటి కాఠిన్యత రెండు రకాలు. ఒకటి తాత్కాలిక కాఠిన్యత, రెండోది శాశ్వత కాఠిన్యత.

తాత్కాలిక కాఠిన్యత:

కాల్షియం బై కార్బొనేట్, మెగ్నీషియం బై కార్బొనేట్ లవణాల కారణంగా నీటికి తాత్కాలిక కాఠిన్యం వస్తుంది.

- నీటిని మరిగించడం ద్వారా తాత్కాలిక కాఠిన్యతను పూర్తిగా తొలగించవచ్చు. మరిగిస్తే బైకార్బొనేట్లు కార్బొనేట్లుగా అవక్షేపితమవుతాయి. నీటిని మరిగించినప్పుడు పాత్ర అడుగు భాగంలో తెల్లని పొలుసులను గమనించవచ్చు. ఈ పొలుసుల్లో ఉండేది కాల్షియం, మెగ్నీషియం కార్బొనేట్‌లు. ఈ ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ కూడా విడుదలవుతుంది. దీని కారణంగానే నీటిని మరిగిస్తున్నప్పుడు బుడగలు వస్తాయి.
- తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించడానికి తోడ్పడే మరో విధానం 'క్లార్క్ పద్ధతి'. కఠిన జలానికి సున్నపు నీరు లేదా మిల్క్ ఆఫ్ లైమ్ (కాల్షియం హైడ్రాక్సైడ్) కలపడం ద్వారా నీటి తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించవచ్చు.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
కెమిస్ట్రీ

నీటి శాశ్వత కాఠిన్యత:

కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్‌లు, సల్ఫేట్లు నీటికి శాశ్వత కాఠిన్యాన్ని కలుగజేస్తాయి. అంటే నీటిలో కాల్షియం క్లోరైడ్, కాల్షియం సల్ఫేటు, మెగ్నీషియం క్లోరైడ్, మెగ్నీషియం సల్ఫేట్లు కరిగి ఉంటాయి.

- సాధారణంగా పెర్ముటిట్ (సోడియం అల్యూమినియం ఆర్థోసిలికేట్) లేదా కాల్గన్ (సోడియం హెక్సామెటా ఫాస్ఫేట్) ద్వారా కఠిన జలాన్ని పంపిస్తే అందులోని కాల్షియం, మెగ్నీషియం అయాన్‌లు తొలగిపోతాయి.
- అయాన్ మార్పిడి రెజిన్‌లు కూడా కఠిన జలాన్ని స్వాదుజలంగా మారుస్తాయి.
- 'స్వేదన' (డిస్టిలేషన్) ప్రక్రియ ద్వారా కూడా నీటి కఠినత్వాన్ని తొలగించవచ్చు. నీటిని మరిగించినప్పుడు ఆవిరవుతుంది. ఆవిరిని చల్లారిస్తే పరిశుద్ధ జలం (100% పరిశుద్ధమైంది) వస్తుంది.
- సముద్ర జలాన్ని 'ఆవిరి చేయడం' వల్ల చివరగా ఉప్పు మిగులుతుంది.
- నీటి రసాయన నామం హైడ్రోజన్ ఆక్సైడ్ (H_2O)
- నీటికి అనేక పదార్థాలను కరిగించుకునే స్వభావం ఉంటుంది. కాబట్టి దీన్ని సార్వత్రిక ద్రావణి అంటారు.
- 4°C వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది. అందుకే నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేసినప్పుడు ఉష్ణోగ్రత - ఘనపరిమాణానికి వక్రాన్ని గీస్తే 'హాకీ స్టిక్'లా ఉంటుంది. ఘనపరిమాణం మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.

	పరమాణు సంఖ్య	పరమాణు భారం	ప్రోటాన్ల సంఖ్య	న్యూట్రాన్లు
ప్రోటియం (H)	1	1	1	0
డ్యుటీరియం (D)	1	2	1	1
ట్రిటియం (T)	1	3	1	2

- నీరు 0°C (273K) వద్ద ఘనీభవిస్తుంది. 100°C (373K) వద్ద మరుగుతుంది.
- లవణాలు ఎక్కువగా ఉండటం వల్ల సముద్ర నీటి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల ఏదైనా వస్తువు నది నీటి నుంచి సముద్రం నీటిలోకి ప్రవేశిస్తే కొంచెం పైకి తేలుతుంది.
- నీటిని విద్యుద్విశ్లేషణ చేస్తే విఘటనం చెం ది హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడిపోతుంది.
- నీటిని క్రిమిరహితం చేయడానికి విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) లేదా క్లోరిన్ వాయువు లేదా అతి నీలలోహిత (UV) కిరణాలను ఉపయోగిస్తారు.
- పాత్రలో నీటిని వేడిచేసినప్పుడు పై నుంచి మరుగుతుంది.
- పొడిగాలి కంటే తడిగాలిలో ధ్వని వేగం ఎక్కువ.

భారజలం

రసాయనికంగా భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ (D_2O) అంటారు. దీన్ని హెచ్‌సీ యురే కనుగొన్నాడు. భారజలం ఘనీభవన స్థానం 3.82°C, బాష్పీభవన స్థానం 101.42°C. దీన్ని న్యూక్లియర్ రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారిగా వాడతారు.

మాదిరి ప్రశ్నలు

1. హైడ్రోజన్ ఇంధన వాహనాలు కిందివాటిలో దేని 'ఎగ్జాస్ట్'ను ఉత్పత్తి చేస్తాయి? (సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-2010)
   1) NH_3 2) CH_4
   3) H_2O 4) H_2O_2
2. రసాయనికంగా నీరు అనేది?
   1) ఆక్సిజన్ హైడ్రైడ్
   2) హైడ్రోజన్ ఆక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) నైట్రోజన్ హైడ్రైడ్
3. కిందివాటిలో స్వచ్ఛమైన జలం ఏది?
   1) నది నీరు 2) సముద్రపు నీరు
   3) భూమిని చేరకముందు వర్షపునీరు
   4) బావి నీరు
4. కిందివాటిలో రాకెట్ ఇంధనంగా ఉపయోగపడేది?
   1) ద్రవ హైడ్రోజన్
   2) ద్రవ అమ్మోనియా
   3) భారజలం 4) నీటి ఆవిరి
5. కిందివాటిలో దేనిలో హైడ్రోజన్ ఉండదు?
   1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
   3) అమ్మోనియా 4) కార్బన్ డై ఆక్సైడ్
6. నీరు అనేది ఒక?
   1) మిశ్రమం 2) మూలకం
   3) సంయోగ పదార్థం 4) పరమాణువు
7. ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే..?
   1)అది సముద్ర నీటిలో పైకి తేలుతుంది
   2) నీటిలోకి మరింతగా మునుగుతుంది
   3) ఎలాంటి మార్పూ ఉండదు
   4) ఓడలోని సరుకుపై ఆధారపడి ఉంటుంది
8. నీటిపై తేలుతున్న ఐస్ కరిగినప్పుడు బీకర్‌లోని నీటి స్థాయి?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) యథావిధిగా ఉంటుంది
   4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
9. నీటికి శాశ్వత కాఠిన్యత కిందివాటిలో దేని వల్ల ఏర్పడుతుంది? (గ్రూప్-I, 2010)
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం బై కార్బొనేట్
   3) సోడియం బై కార్బొనేట్
   4) మెగ్నీషియం బై కార్బొనేట్
10. కృత్రిమ వర్షం కురిపించడానికి ఉపయోగించే సమ్మేళనం?
    1) సిల్వర్ అయోడైడ్
    2) సోడియం నైట్రేట్
    3) సోడియం క్లోరైడ్
    4) హైడ్రోజన్ పెరాక్సైడ్
11. గాయాలను క్రిమిరహితం చేయడానికి ఉపయోగించే హైడ్రోజన్ సమ్మేళనం ఏది?
    1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
    3) భారజలం 4) అమ్మోనియా
12. నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) అయానిక బంధం
    2) సమయోజనీయ బంధం
    3) లోహబంధం 4) హైడ్రోజన్ బంధం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 3; 9) 1; 10) 1; 11) 2; 12) 4.

Pronoun must be in subject form

Sentence correction section is one of the important areas in many competitive examinations. Eight types of errors pertaining to the following broad areas are generally given. Candidates who wish to secure good scores need to enhance their knowledge on these areas.

They are:

1. Collocation
2. Idioms and Phrases
3. Pronoun agreement
4. Concord
5. Modifiers
6. Verb sequences
7. Comparisons
8. Parts of speech

Out of these we have studied the first two topics collocation and idioms and phrases in the last sessions. Let us learn about pronoun agreement in this session.

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing. Take a look at the following tips:

1. A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
2. When two singular nouns are joined by and and refer to the same person the pronoun used in their place should be singular in form.
3. A singular pronoun should be used when two singular nouns are joined by either or neither nor.
4. A pronoun in the plural form should be used when two nouns of different members are joined by 'or' or 'nor'.
5. The distributive pronouns 'either, neither, none, any, no one are used with singular verbs.
6. The indefinite pronoun 'one' should be used as 'one's for its possessive case.
7. The verbs such as cheat, prostrate, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of are followed by either an object or a reflexive pronoun.
8. The word 'who' as a relative pronoun in the nominative case takes a verb.
9. If a pronoun is to be placed after 'to be', the pronoun in the subjective case is used. A very important point to be noted is that we should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.

Pronoun Subject Vs Pronoun Object

Once you've found a pronoun in a Sentence Correction question, check whether it's acting as the SUBJECT or the OBJECT of the sentence or phrase. Is the following sentence correct or incorrect?

How could she blame you and he for the accident?

The first step is to identify the pronoun(s). There are three in this sentence: "she," "you," and "he". Next, try to define whether each pronoun is acting as a subject or object. Here, "she" is the subject, and the pronouns "you" and "he" are acting as the objects of the sentence.

How do we know this? Because "she" is doing the action (blaming) and "you" and "he" are receiving it (getting blamed). However, "he" does not seem to be in the correct form. "Who did she blame?", which is "him" not "he." ("Who did she blame? She blamed him")

The pronouns acting as objects must be in the objective case; "him" is objective - while "he," used in the sentence, is subjective, and therefore incorrect.

Incorrect: How could she blame you and he for the accident?
Correct: How could she blame you and him for the accident?

Who Vs Whom

If the pronoun is acting as a subject, use who. If it is acting as an object, use whom.

I don't know whom Kavitha married.

Why is "whom" correct? Because Kavitha is the subject of this sentence - not the person she married.



BANK EXAMS
ENGLISH

Singular and Plural Pronouns

Pronouns also act like nouns in the realm of verb agreement. For some pronoun questions, you also need to check if the pronoun and its verb agree in number.

Here's an example:

Incorrect: Everyone on the project have to come to the meeting.
Correct: Everyone on the project has to come to the meeting.

The pronoun "everyone" is singular. Its verb must therefore be singular as well: "has" is correct, not "have".

Possessive Pronoun Agreement

When you come across possessive pronouns such as your, their, his, and hers, check to see whether they agree with other pronouns in the sentence. Most possessive pronouns are used messily in spoken language, so be careful to take special note when you see two pronouns in a sentence.

Incorrect: Some of you will have to bring their own bags.
Correct: Some of you will have to bring your own bags.

In this sentence, the possessive pronoun towards the end of the sentence should match the pronoun following "Some of". Because the first pronoun is "you", the possessive pronoun must be your, not their.

Objects of to be verbs are in the subject form.

Watch for pronouns following "to be" verbs such "It should have been," "It is," "It could have been," "It was", and make sure they are in subject form.

Incorrect: It must have been her who called.
Correct: It must have been she who called.

"It must have been" is a "to be" verb, so the pronoun must be in subject form: "she," not "her".

Relative Pronouns

Which, that and who are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position. Which introduces non-essential clauses; that introduces essential clauses. Who refers to individuals; that refers to a group of persons, class, type, or species.

Incorrect: The person whom draws the winning number hits the jackpot.
Correct: The person who draws the winning number hits the jackpot.

Here the relative pronoun 'who' is the correct form as it is the subject of the verb draws and also introduces the clause draws winning number.

Impersonal Pronouns

We can use impersonal pronouns to talk about people in general or unspecified objects. The pronouns "one" and "you," which are included in a class of pronouns called "impersonal pronouns," are often improperly matched with their respective possessive pronouns.

Incorrect: One should have their teeth checked every six months.
Correct: One should have one's teeth checked every six months.

PRACTICE TEST

1. Her was better suited for the job.
2. Johnny and me drank a bottle of champagne.
3. The dinner was eaten by Smith and I.
4. Whom took out the trash?
5. Neither his bodyguards nor he were there.
6. Neither he nor his bodyguards was there.
7. If anyone comes over, take their name.
8. One should take your responsibilities seriously.
9. This test is for students which native language is not English.
10. My pencil is broken. Can I borrow its?

Answers and explanation:

1. She was better suited for the job.
   Here, the pronoun is the subject of the sentence, as "the job" is clearly not the subject, and there are no other nouns in the sentence. Because the pronoun stands in for "the woman", the pronoun should be the subject form of the her/she pronoun meaning, "she".
2. Johnny and I drank a bottle of champagne.
   Because it's confused so often in spoken language, it can be difficult to tell when the pronoun in the phrase "someone else and me/I" is used incorrectly. But it's actually quite easy to remember when to use "me" and when to use "I": cross out everything in the "someone else and me/I" phrase except the pronoun - and then read it aloud. How does it sound? If it sounds fine, the pronoun is correct; if it sounds really odd, the pronoun is incorrect.
   "Me drank a bottle of wine" sounds odd, so the proper pronoun is clearly "I".
3. The dinner was eaten by Smith and me.
   "I/me" is acting as the object, so the proper pronoun is "me."
4. Who took out the trash?
   You wouldn't say "him took out the trash," so the pronoun in the original sentence must match the form of the pronoun "he," which is a subject pronoun: who is correct.
5. Neither his bodyguards nor he was there.
6. Neither he nor his bodyguards were there.
   The constructions "either... or" and "neither... nor" always take the verb form that matches the noun that is closer to the verb. Thus, "were" is incorrect in the fifth sentence because "he," a singular pronoun, is closer to the verb than "bodyguards," a plural noun; but "were" is correct in the sixth sentence because the order of the subjects is reversed, so that the plural noun "bodyguards" is closer to the verb.
7. If anyone comes over, take his or her name.
   The subject is anyone, which is singular, and therefore requires a singular pronoun such as "his" or "her".
8. One should take one's responsibilities seriously.
   The subject is one, which is singular, and therefore requires a singular pronoun.
9. This test is for students whose native language is not English.
   The correct relative pronoun to be used in this sentence is 'whose'.
10. My pencil is broken, can I borrow yours?
    The correct possessive pronoun is 'yours'.